
AN02A144

C_I

A





1 AN00A144

కవి సార్వభౌముడు

ఐతిహాసిక నవల

కవి సమ్రాట్

నోరి నరసింహశాస్త్రి

నోరివారు, రేపల్లె.

గుంటూరు జిల్లా.

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి

ప్రథమ ముద్రణము
1962

మూల్యము : ఐదు రూపాయలు

రసతరంగిణీ ముద్రాశాల, విజయవాడ–2.

కృతజ్ఞతా వచనము

"కవిద్వ్యయము" అని శ్రీనాథుని పోతనను కలిపి ఒకే నవలలో చిత్రింపవలె ననుప్రయత్నముఁగో సతమత మవ్వచున్న సమయములో సరిగా శ్రీ శంభుప్రసాద్‌గారి సూచన వచ్చినది. వెంటనే కవి సార్వభౌముడు—సహజపాండిత్యుడు అనే రెండు నవలలుగా వ్రాయుట ఉచితమని స్ఫురించినది. ఈ విధముగా ఈ నవల రూపొందుటకు వారి యాదేశమే నిమిత్తకారణమైనది. అందుకు ముఖ్యముగా వారికి నా కృతజ్ఞత తెలుపుచున్నాను.

ఈ నవలలో శాస్త్రివాదములు వచ్చు ప్రకరణములు నేను వినిపింపగా, శ్రద్ధగా నాలకించి, మంచి సూచనలు చేసిన మిత్ర నవ్యులు వేదాంత పారీణ, వ్యాకరణ శిరోమణి శ్రీ ఓరుగంటి నీలకంఠశాస్త్రిగారికి నా కృతజ్ఞతాభివందనములు.

దీనిని ప్రథమములో ప్రకటించిన ఆంధ్ర సచిత్రవారపత్రికా సంపాదకులకును. శ్రద్ధగా పఠించిన పాఠకలోకమునకు, దీని నగ్గించుచు లేఖాదికముగా తెలిపిన శతాధికులగు సహృదయులకును కృతజ్ఞుడను.


ప్రేమపూర్వకముగా శ్రద్ధతో చక్కగా ఈ గ్రంథము ముద్రించిన రసతరంగిణీ ముద్రాశాల నిర్వాహకులు శ్రీ విశ్వనాథ వేంకటేశ్వరులు గారికి నా యాశీర్వచన పూర్వక కృతజ్ఞత తెలుపుచున్నాను.

తేదీ 2-8-62

ఓరి నరసింహశాస్త్రి.

శ్రీ విద్యానగరము

క్రీ శ. 1420



౬

కవి పార్వభౌముడు

౧

"అక్కా-, అక్కా-, శుభవార్త!" .

నుండువాదగ్గర కూర్చుండి తన చిన్నతమ్ముడగు దుగ్గన్న శిఖలో మల్లెపూలచెండు తురుముచు పరధ్యానముగానున్న శ్రీదేవికి ఆకంఠ మెనరిదో గుర్తుకు రాలేదు. స్వతంత్రులైన వాని స్వాతంత్ర్యముతోపాటు వృద్ధులైనవారల గాంభీర్యము కూడ ఆకంఠధ్వనిలో మిళితమై యున్నది. ఆ కెండింటికి పొంతన కుదురలేదు. ఆమె కాశ్చర్యమై, 'ఆ గొంతు ఎవరిదిరా?' అన్నది.

"ఎవరిదో నాకు తెలియడము లేదక్కా-మన లోపలి వాకిలి అరుగు మీదినుంచి వినిపిస్తున్న ట్లున్నది. వెళ్ళి చూచి వస్తాను" అనుచు దుగ్గన్న వాకిటిలోనికి పోయి కొద్ది క్షణములలోనే సంతోషము వెల్లివిరిసిన ముఖముతో తిరిగివచ్చి నవ్వుచు, "ఆ గొంతు ఎవరిదో పోల్చుకోలేవా అక్కా, అసలు ఎటువైపునుంచి వస్తున్నదో చెప్పగలవా? పోనీ," అనుచు దేవ మందిరమునంక జూచెను. శ్రీదేవి దృష్టి యప్రయత్నముగా ఎనుకగానున్న గృహదేవతామందిరమునంకకు ప్రసరించినది.

"శుభవార్త! శుభవార్త!"

మరల వెనుకటికంఠమే ఈ మాటలు పలికినది. ఈమాకుమాత్ర మవి తమ దేవమందిరమునుండియే విన

నచ్చుచున్నట్లయినది. ఆనందముతో నామె సర్వాంగములు పులకరించినవి. చేదగిరేకులవంటి ఆమె చెక్కిళ్ళు ఎర్రవారినవి.

"దుగ్గా, అది సాక్షాత్తుగా శంకుని కంఠమువలె నున్నదిరా!"

అక్కమాటలు విని దుగ్గన్న పకపక నవ్వసాగెను. ఆ నవ్వుతో నాతని దేహమంతయు నెగుళ్ళాడుచున్నది. 'మన తిమ్మరాజు గొంతు అక్కా!'

విభ్రమానందములనుండి శ్రీదేవి యింకను / కోలుకొనకయే, 'తిమ్మరా జెనరు తమ్ముడూ?' అన్నది.

ఇంకను విరగబడి నవ్వుచునే దుగ్గన్న "తిండికి తిమ్మరాజు, పనికి—" అని మధ్యలో నాగినాడు.

శ్రీదేవి గ్రహించుకొని నవ్వుచు, 'మన పోతరాజు వచ్చినాడా, నాయనా! లోపలికి ఎందుకు తీసుకొని రాలేదు? వాని గొంతువలె లేదే!' అన్నది.

"వాడు పదిగొంతులతో మాట్లాడగల డక్కా! ఈ వైపున నిలుచుండి అటువైపునుండి వినబడునట్లుకూడా మాట్లాడగలడు. ఎంతవా డనుకొన్నావు, దొంగటక్కరు!"

చప్పున పోతరాజు అప్పు డింటిలోనికి వచ్చి తన నిజ కంఠముతో "అక్కా! వీడు నన్నేదో అంటున్నట్లున్నాడే. నామీద పితూరీలు చెబుతున్నాడా? తర్వాత వీని వీపు పగ లేస్తాను" అన్నాడు.

"శుభవార్త యేమిటి నాయనా!"

"నీకు త్వరలో పెండ్లి ప్రయాణము తగలబోతున్నది. జ్యోతిష్కులు లగ్నాలు పెడుతున్నారు. నేనీమాట చెప్పడానికే ముందు వచ్చాను."

"పెండి ఎవరిది?"

"బహుశః పెండ్లికొడుకే ఇప్పుడు వచ్చి నీకు చెబుతా డనుకుంటాను, నా కెందుకులే."

దుగ్గన్న అనుకొని, "మాడు అక్కయ్యా! వీడు మనని ఊడికించడానికి అసలు సంగతి చెప్పక దాస్తున్నాడు" అనెను.

పోతన దుగ్గనశిఖలో మల్లెపూలచెండు చూచెను. "అక్కయ్యా, నాకుకూడా తలలో పూలచెండు పెట్టవూ?"

"రా నాయనా, నీకు మల్లెచెండు పెట్టేదా? గొజ్జంగి చెండు కానలెనా?"

'రెండూనూ' అనుచు వాడు శ్రీదేనిముందు కూర్చుండెను. ఆమె వాని జులపాలు సరిచేసి కుదురుగా లేనిసిగ ఊడదీసి, ఘుమఘుమ లాడుచున్న సుగంధతైలము రాచి దువ్వి జడవేయుచుండెను.

"అక్కయ్యా! నీవు జడ వేస్తుంటే అచ్చముగా మా అమ్మ వేస్తున్నట్లుగానే ఉంటుంది. ఒకటే భేదము-"

"ఏమి టది?"

"మానాన్న మనుష్యులకు రాయడానికి మా అమ్మను సుగంధద్రవ్యాలు ముట్టనీయడు. అందువల్ల మా కక్కడ మా అమ్మ పుణ్యవాసనే కాని, ఇటువంటి కమ్మని తైల వాసనలు ప్రాప్తము కావు."

"నాయనా, ఇన్నాళ్ళూ అడగడమే మరచిపోయినాను, మీ అమ్మ పుణ్యనామ మేమిటో?"

వాడు వెంటనే ప్రేమార్ద్రమైన కంఠముతో కన్నులు చెమరించుచుండగా నోరార "లక్ష్మమ్మ- లక్ష్మీదేవి. నీ పేరన్నమాట. అక్కయ్యా!" అనుచు కన్నులు మూసికొనెను.

"ఆమె ఎటూ ఉంటుంది నాయనా?"

"సరిగ్గా నీవలెనే ఉంటుంది, అక్కయ్యా! ఇంకా కొన్నాళ్ళు పోతే నీవు అచ్చుగా మా అన్ననలెనే ఉంటావు."

జడవేయడమైపది. ముడివేసినది. మల్లెచెండొకటియు, గులాబిచెండొకటియు చేతులతో పట్టుకొని ఏది ఎక్కడ పెట్టుదునా యని యాలోచించుచున్నది. అది చూచి వాడు "ఆగు, కాస్త ఆగు, అక్కయ్యా! ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పి ఆ చెండు పెట్టు!" అనెను.

శ్రీదేవి ఆగినది. వాడు ఏదో పరధ్యానములో ఉన్నట్లుగా ప్రశ్నించెను. "సరేకాని అక్కయ్యా! నాకు జ్ఞాపకము రావడము లేదు. నీవు చాలా పురాణాలు చదివినావు, విన్నావు గదా! శ్రీకృష్ణుడు సత్యభామను వివాహమాడబోయేటప్పుడు రుక్మిణీదేవికూడా వెంట వెళ్ళినదా?"

'నీవు అడుగుకుంటే నాకూ ఎక్కడా చదివినట్లూ విన్నట్లూ జ్ఞాపికి తగలడము లేదు. ఏమీ, తప్పక వెళ్ళి ఉంటుంది. నీ తలలో ఈ రెండు చెండూ పెడితే రుక్మిణీ సత్యభామల యోగమువలెనే ఉన్నదిరా'

'ఎంతదాన వక్కయ్యా! ఏమో అనుకొన్నాను- ఎందుకు, అదిగో పెండ్లికొడుకు పల్లకిలో వస్తున్నాడు.'

ఆతఁడప్పట్లుగానే వీథి చివర పల్లకి బోయీల ఓహోం బీబీం నాదము వినవచ్చినది. అది మామెకు చిరపరిచితమైన తన భర్త పల్లకి బోయీలధ్వని. ప్రఫుల్లమైన ముఖముతో నామె వెంటనే లేచి భర్తకు పాద్యాదులు సిద్ధముచేసినది. పల్లకి వాకిట నాగినది. శ్రీనాథుడందులో రాలేదు. ఖాళీగా వచ్చిన పల్లకిని బోయీలు దాని పంచలోనికి చేర్చి దానిపై నలంకారాదులకు అవి మాసిపోకుండుటకు వస్త్రములు మెట్టు చున్నారు. శ్రీదేవి యించుక యుత్కంఠతో చూచు చుండగానే దుగ్గన్న వీథిలోనికి పోయి మాచి పసుగున నింటి లోనికి వచ్చి 'అక్కా, అక్కా! బావతో పాటచాకులై చాలామంది వస్తున్నారు. విద్వాంసులు మహానుభావులు ఇంకా ఎవరో ఎనకో చాలామంది వస్తున్నారు" అనుచు నతడు తన బావగారు గోష్ఠి సలుపు శాలలోనికి పోయి, అక్కడనున్న రత్నకంబళములు, ఆసనములు, బాలీసులు, దిండ్లు, అన్నియు, సరిచేసి పెట్టెను. ఆ గదిలో అగురుధూపము వాసింప జేసెను. త్వరితగతిని శ్రీదేవి సిద్ధపరపించిన పన్నీటి వాసనగల శుద్ధోదక భాండములను పోతన తోడుతో, ఇంటిముంగిట నుంచెను.

శ్రీనాథభట్టు తనతో వచ్చిన పెద్దలందరికి పాద్యోదక మిప్పించి తాను పాదప్రక్షాళనము చేసికొనెను. వారి పాణి పాదములతడి లోనుండి శ్రీదేవి పంపిన భాతవస్త్రములతో దుగ్గనయు, పోతనయు నొత్తిరి. శ్రీనాథభట్టు పాదములతడి పోతనయే స్వయముగా నొత్తెను. ఆ స్పర్శలో ఆ కుర్రవానికి గల భక్తియో, మాధుర్యమో, మార్దవమో, ఏదో అని

ర్వాచ్యమైనది, శ్రీనాథుని పాదములకు స్మరించినది. తనువు పులకరింపగా నాతని కన్నులలమోడ్చి తన వెనుక దూరముగా నిలిచియున్న వెలుక విప్రునింక చూచి, "తిప్పనార్యా, నీ తమ్ముని నింక చూచినావా ? వీనిది అమృత హస్తము. వీడు సన్న ఎప్పుడు తాకినా ఇంతే, నాకు పరనశ్యాము కలిగించుచున్నాడయ్యా"! అనెను.

తిప్పన చేతులు జోడించి, 'ఏమో, తన యనుగ్రహము' అనెను.

అప్పటి దచ్చట చేరినవారిలో కొండవీటిలోని ప్రముఖులెందరో కలరు. శృంగారనైషధ మహాకావ్యకర్తయు, సోమసిద్ధాంత వ్యాఖ్యాతయు నగు మామిడి సింగన సుహృత్ప్రధాని వారిలో నగ్రగణ్యుడు. కొండవీటి యాస్థానకవి అనేక గద్య పద్య కావ్య నాటకకర్త, శ్రీనాథుని ప్రాణమిత్రము నగు వానమభట్టబాణుడున్నాడు. రాజుకొండ యాస్థాన విద్వచ్చిరోమణి యగు పిన్వేశ్వరపండితుని సోదరుడును, స్వయముగా శబ్దశాస్త్ర పారంగతుడును, కాదంబరీ నాటక కర్తయు నగు నృసింహ విద్వన్మణి యున్నాడు. ప్రాకృతభాషా పండితుడగు లక్కనసూరి కలడు. వైనజ్ఞ శిఖామణియు, ప్రభువుచే నీ పికారి సంవత్సరమార్గశీర్ష మాసమునలో ధనుస్సంక్రమణ పర్వ సమయమున నుద్రవనరాగ్రహారము ప్రతిగ్రహించిన రామచంద్ర జ్యోతిషికుడును, అతని తమ్ముడు గంగాధర జ్యోతిషికుడును నుండిరి. పరహితవైద్యశిఖామణియు, కొండవీటి ప్రాణాచార్యులును, పొన్నపల్లి అగ్రహార ప్రతిగ్రహీతయు నగు

భూలోకధన్వంతరి సింగనామ్యుడున్నాడు. ఇంకను న్యాయవైశే షిక మీమాంసా వేదాంతశాస్త్రములలో ఉద్దండ పండితులు, సాంగవేదవిదులు, అధ్వరప్రయోగకుశలు రగుమహాశ్రోత్రులు, శైవవైష్ణవాగమసిద్ధాంతులు కలరు.

ఆనామ వారందరు ఏదో ఘనకార్యము సాధింప నుద్యోగించు చున్నవారివలె ప్రసంగించుచుండిరి. సింగన ప్రధాని యొక్కడే ఎక్కడ మాటాడక అందరి పలుకులు శ్రద్ధగా నాలకించుచు నాలోచనాపరుడై యుండెను. వామనభట్ట భాణుడు పూర్వము బహుకాలము శ్రీవిద్యానగరమున నివాసముచేసి వచ్చినవా డగుటచే, సక్కడి విద్వదతిశయమును డిండిమభట్ట బిరుదాంకితుడగు అరుణగిరినాథుని ప్రాగల్భ్యమును నరించుచుండెను.

గృహాభ్యంతరమునకుండి శ్రీగంధము పుష్పమాలికలు రాగా, ముందుగా వానిచే శ్రీనాథు డతిథుల నందర నలంకరింప జేసెను. ఇంతలో నందరికిని బంగారుపూత పెట్టిన వెండి పళ్ళెరములలో ఫలాహారములు వచ్చినవి. కర్పూర వాసనగల కొమ్మ్ల అరటి పండ్లు, గింజలు తీసిన పనసతొనలు. కాశ్మీర పరిమళముగల దానిమ్మగింజలు—మొదలైన వెన్నో వచ్చినవి. అవి వారు సేవించునంతలోనన్నే, వెండిపాత్రలతో మిరియములు లవంగములు ఏలకులు ఘుమఘుమలాడుచున్న నిమ్మరసము కలిపిన చెఱకుపానీయము వచ్చినది. వానిరుచిని ఒండొరుల కవిత్వపాకముతోడనో పలుకులతోడనోరూపములతోడనో ఉపమించుచు చమత్కరించుచుండిరి. వామనభట్టబాణుడు ఆపానీ

యను న్యాసింహకవి రచించిన కాదంబరీ నాటకమునలె నున్న దనెను. అంచుగోగూడ నీనిటియనుల ఘాటుకూడగలదాయని ప్రాణాచార్యులు ప్రశ్నించిరి. 'అయ్యో! లేకేమి? అదే ఎక్కువ పాలు, అనుచు నంచుగోనుండి సామాన్యులకు నోరుతిరుగని కఠిన శ్లోకములు నానునుచు గబగబ చదివి వినిపించి యందర నవ్వించెను.

ఆ ఫలహారానంతరమునకు ముందే శ్రీనాథుడు పోతనను తన దగ్గర కూర్చుండబెట్టుకొని. 'నాయనా! నీవు తినుటకు సిగ్గు పడెదవు? రామయమంత్రిని మించి తినకపోయినచో నేను ఊరుకోను సుమా!' అని నుడినుడి పెట్టించి తినిపించుచుండెను.

'ఆ రామయ మంత్రి ఎనకు? ఆయన భోజనపరాక్రమ మెట్టిది?' అని ప్రాణాచార్యులు ప్రశ్నించిరి.

'ఆయనా, ఆనుష్య నేను గురజాలసీమ వెళ్ళినప్పుడు చూచిన కరణము. ఆయనపరాక్రమ మిప్పుడు కాదు. పనికి పోతరాజు పిండికి తిన్నరాజు అని మా యిగ్గ పరిహాసము చేయుచున్నాను. నేను పోతరాజు తిండి చూచిన తర్వాత చెప్పెదను' అని శ్రీనాథుడు పోతనను తిండిలో ప్రోత్సహించెను. పోతనయు అతని పనునాలుగేళ్ళ యీడుకు మించి పోతరాజు వలెనే ఆరగించెను.

పానీయము లైనసిన్నాట కస్తూరి కుంకుమపువ్వు పచ్చ కర్పూరము జాజి ఇత్యాదులు పరిమళించుచున్న తాంబూలము లందను సేవించుచున్న సమయమున రామయమంత్రి భోజన పరాక్రమము నర్ణించుట శ్రీనాథునకు తప్పలేదు. అతడు చిరు

నవ్వు నవ్వెను. అతని ఎర్రని ముఖమునందలి తాంబూల రాగమున కానవ్వు తోడై అది మరింత యెర్రనై కోకసదను వలె భాసించెను.

'రామయకు పోతన ఏమాత్రము సాటిరాడు. ఆయన భోజన పరాక్రమము చూచి తీరవలసినదే!' అనుచు నెమ్మదిగా నచనమునలెనే ఈ పద్యము చదివెను.

'గ్రామము చేతనుండి పరికల్పిత ధాన్యము లింటనుండి శ్రీ రామకటాక్ష వీక్షణ పరంపరచే గడతేరె గాక, యా రామయ మంత్రి భోజన పరాక్రమ మేమని చెప్పనచ్చు, నా స్వామియెఱుంగు దత్కబళచాతురి తాలఫలప్రమాణమున'

మరల శ్రీవిద్యానగరమునుండి పండితులయు, కవులయు ప్రశంసలే వడచినవి. శ్రీ మాధవ విద్యారణ్య భారతీస్వామి వారు శృంగేరినుండి శ్రీ విరూపాక్షక్షేత్రమునకు తమ శ్రీ పీఠాస్థానమును మార్చిన దాదిగా, అక్కడ ద్రావిడ కర్ణాట మహారాష్ట్ర ఘూర్జరాంధ్ర పండితులు చేర నారంభించిరి. కాకతీయులనాడు ఏకశిలానగరమున రాజగురువులగు విశ్వేశ్వర శంభువుల యాస్థానవిద్వాంసులుగా నుండిన గౌడ విద్వాంసుల వంశములవారును, అక్కడ నెలవు లేర్పఱచుకొని రాజాస్థానమునందు గౌరవపదము లలంకరించుచుండిరి. ఇంతియకాదు. దూరభూములగు కశ్మీరము, కాశి, నవద్వీపము మొదలగు విద్యాస్థానములలోని విద్వాంసులును ఎందరో విదేశ ప్రభువుల యొత్తిడులకు నిలువజాలక నెమ్మది నెమ్మదిగా

నకర్ణాటకి చేకుకొనుచుండిరి. ఎందరు విద్వాంసులు వచ్చినను వారి కందరికి శ్రీకృష్ణరాయల రాజాస్థానమునను సామంతమండలేశ్వరులకతనను సంపన్ననాగరకుల నెమ్మదిను సుఖమును నాశ్రయము లభించుచుండెను. అందుచే శ్రీ విద్యా నగరము శీఘ్రకాలమునను సర్వవిద్యానిలయమై నిజలనగర మను సార్థకనామము సంపాదించుకొనినది. అక్కడి పండితుల నందరిని ఎంతవాడైనను ఏకాకిగా జయించి రాగలుగుట కలలోని మాట! — వారి గోష్ఠి తాత్పర్యమిది!

ఈ ప్రసంగములు ఇట్లు జరుగుచుండగా దైవజ్ఞసోదరు లివువుకు వేరుగా కూర్చుండి సంప్రతించుచు నొక చెక్క-పలకపై రాతి బలపముతో లెక్కలు వేయుచుండిరి. తుదకు వా రొక నిర్ణయమునకు వచ్చిరి. జ్యేష్ఠుడగు రామచంద్రుడు తాళపత్రము గ్రహించి ఘంటము గలగలలాడుచుండ దానిపై దైవజ్ఞనిర్ణయము లిఖించి యక్కడ సమావిష్టు లైనవారికి వినిపించెను. శ్రీకస్తు విజయోస్తులతో ప్రారంభమైన ఆ పత్రిక సారాంశ మిం విధముగా నుండెను:

'కవి సార్వభౌము శ్రీనాథభట్టారకులకు నింతకాలము వరకు వారి జన్మనుంతటిలో మహోన్నతకీర్తి విజయలక్ష్ములు అనుభవింపగల సూచనలున్నవి. ఉత్తను యోగకాలము! అట్టి యంతర్దశ ఈనుధ్యనే ప్రారంభమైనది. గ్రహాదు లేమియు ఎట్టి దోషస్థానములందును లేవు. అందువలన శాంతు లేమియు చేయ నవసరము కనబడదు. మహాకార్యమునకు వా యుక్తు లైనందున కార్యసిద్ధికై పౌష్టిక క్రియలు సూచించు

చున్నాము. ఏకాదశాహదీక్షగా సావిత్రీమంత్రపునశ్చరణము, నిత్యము మహారుద్రాభిషేకములు – మొత్తము ఏకాదశ సంఖ్యాక వేదపారాయణములు – గ్రహనక్షత్ర జపములు– సూర్య నమస్కారములు! పీసపాటి ప్రాతఃకాల జపాదులు, మధ్యాహ్న వేళ అభిషేకములు, ఆ పిమ్మట వేదపారాయణములు చేయుచున్నచో పదునొకండుమంది బ్రుత్విక్కుల సాహాయ్యముతో సర్వము సుసంపన్నము కాగలదు. ఆ తర్వాత రెండు మూడు దినములలో తదంగ హోమ తర్పణ మార్జన బ్రాహ్మణ భోజనాదులు పూర్తి చేయనచ్చును. సంకల్పము రేపటి యుదయమునకే. యాత్రాలగ్నము నేటి నుండి పదునారవనాటి శన్యుషస్సున. విద్యావిజయమునకు వైశాఖ బహుళమును కొంతవరకు జ్యేష్ఠశుద్ధమును ఉత్తమ కాలములు. ఇది మాఘారంభము కాపున యాత్రకును విజయ సభా ప్రయత్నములకును తగినంత శ్రద్ధ తీసికొన్నచో కాల వ్యవస్థ సరిపోవును. ఎట్టి సందర్భములందును జ్యేష్ఠము దాటిన తరువాత వాదసభ మేము సూచింపను. ఈ జాతకునికి అటు పిమ్మట గూడ బహుకాలమువరకు విజయపరంపరలు కనబడు చున్నవి కాని అవి స్పర్ధ్రోగాక, కొంతలో నర్థిత్వముతో కూడుకొన్నవి.'

అందరు పత్రికను శ్రద్ధాభక్తులతో నాలకించిరి. జ్యోతిష్కు డాపత్రమును శ్రీగంధ కుంకుమ పుష్పములతో నలంకరించి ఈయబోగా, శ్రీనాథుడు వినయముతో లేచి యంజలిత్తో గ్రహించి కన్నుల కద్దుకొని ప్రక్కనున్న వ్యాసపీఠముపై

నుంచి తానును దానిని గంధపుష్పాక్షతలతో నర్చించి, సభ్యుల యనుమతితో వ్యాసపీఠమును లోని దేవాయతనమునకు గొంపోయి యచ్చట నుంచెను. తిరిగి వచ్చుచు నెండి పళ్ళెరములో నూట యెనిమిది సువర్ణములును, వేసువేసుగా రెండు దుశ్శాలువలను తెచ్చెను. కవిసార్వభౌముడు ముందు రాను చంద్రుని, తర్వాత గంగాధరుని, గంధపుష్పతాంబూలాదులతో పూజించి, చెరి రెండు శాలువలు వారికి కప్పి సువర్ణపాత్ర రామచంద్రుని పాదములముందుంచి సమర్పించి, యాపైనజుల కిదరికి పాదాభివందన మాచరించెను. వాసు 'నిజమేయోస్తు! కవి సార్వభౌమ, విజయోస్తు!' అని యాశీర్వదింప నక్కడి వేదవిదులును పెద్దలును తథాస్తు వచనములతో స్వస్తి వాచనము కావించిరి.

అక్కడివారిలో వామనభట్టబాణుడు కవి సార్వభౌము బికుదాంచిత్తుడు. ఈ గోష్ఠిముందే ఆనాడు సర్వజ్ఞ చక్రవర్తి బికుదాంచిత్తుడగు కొండవీటి ప్రభువు పెదకోమటి వేమారెడ్డి గృహరాజసౌధములో మహాసభచేసి, విద్వత్సమక్షమున వారి యనుమతితో తన విద్యాధికారియగు శ్రీనాథభట్టును కవి సార్వభౌమ బికుద పట్టముతో నలంకరించి శ్రీ విద్యానగరమునకు విద్యావిజయ ప్రస్థానముచేయ నర్థించియుండెను.

వామనభట్టు శ్రీనాథునికంటె నయస్సులో పెద్దవాడైనను మొదటినుండియు నాతని సోదరప్రేమతో గారవించుచుండెను. అత్తడి జ్యోతిషిక సమ్మానము చూచి రోమాంచకంచుకితాంగుడై, 'శ్రీనాథా, నే డింతకుముందే నీవు కవి సార్వ

భాగుడవైనను అప్పుడే ఎన్ని జన్మములనుండియో కవి సార్వభౌమత్వము కలవానివలెనే ప్రవర్తించితిగోయి. నేనును కవి సార్వభౌము బిరుదాంకితుడనైనను, దైనజ్ఞులను సార్వభౌమోచితముగా నిట్లు సమ్మానించు తలంపుకూడ నాకెన్నడు కలుగలేదోయీ!' అనెను. ఆ మాటల కందము హారించి. పైకి అనకున్నను సింగన ప్రధాని శ్రీనాథుని వితరణోన్నతికి సంతరంగముస నెంతయు సంప్రీతుడై శ్రీనాథుని విద్యానగర యాత్రకు తా నెట్టి సన్నాహములు చేయవలెనో నిర్ధారణ చేసికొనెను.

అంతట నక్కడ గోష్ఠికి భూషియున్న వారిలో నుండియే ఆ మరునాటినుండి సాగింపపలసిన కర్మకాండకు బుస్వికుల నిర్ణయించిరి. ఇంటిలో సంధ్యాదీపము వెలిగించినప్పుడు, సేవకులు ఇల్లంతటను దీపములు వెలిగించిరి. 'జయ కవిసార్వభౌమ'ఘోషత్తో నందరు బయలుదేరిరి. శ్రీనాథుడు వారి నందర వీడుకొలుపునరకు వేచియుండి, తిప్పనామ్యుడు ఏకాంతముగా శ్రీనాథునితో నిట్లు ప్రసంగించెను.

'భట్టాచార్యా, మీరు రేపటినుండి దీక్షలో నుండెదరు గనుక నేడే సెలవు తీసికొనుచున్నాను. శ్రీ విఘ్నేశ్వర దేశికులు పంపిన వారి 'చమత్కార చంద్రిక' శ్రద్ధగా చూడ వలసినదని మీకు విన్నవింపుమని మరి మరి సెలవిచ్చిరి. సెలవు తీసికొందును. రేపు సుభ్యాహ్నమే నేను రాచకొండకు బయలుదేరుచున్నాను. సెలవు ! మా తమ్ముడు పోతన ఏడీ?- పోతన్నా, పోతన్నా!-'

'పోతన రాలేదు. దుగ్గన పరుగున వచ్చి 'పోతన రానంటున్నాడు. ఇక్కడే ఉంటాడట' అనెను.

తిప్పన కొంత చిరాకుతో వాడెక్కడ నున్నాడని యడిగెను.

'మాశ్రీదేవి అక్కయ్యదగ్గర బిక్కమొగముతో నిలిచి నేను రాజుకొండ పోను. మీతో శ్రీవిద్యానగరము వత్తును అనుచున్నాడు'

'మీ అక్కయ్య ఏ మనుచున్నది?' అని శ్రీనాథుడు చిరునవ్వు నవ్వుచు నడిగెను.

'అక్క తప్పక రమ్మనుచున్నది.'

శ్రీనాథుడు మరింత వికసించిన ముఖముతో 'తిప్పనార్యా, వింటివా? గృహామహారాజ్ఞి యాజ్ఞ?' అనెను.

తన తమ్ముడు చిన్నవాడనియు, అతనికై తమ తల్లిదండ్రులు బెంగపెట్టుకొందు రనియు, తండ్రికి కోపముకూడ రావచ్చుననియు, తిప్పన పరిపరి విధముల చెప్పి చూచెను. శ్రీనాథుడు సందీయలేదు.

'తిప్పనార్యా! మీ తమ్మునికి ఎక్కడను భయ మెంత మాత్రము లేదు. బాలకృష్ణుని నందయశోదలు కాపాడినట్లు మేము వేయి కన్నులతో వానిని కనిపెట్టి యుందుము. నేనే రాచకొండ నచ్చి నీకు వాని నప్పజెప్పెదనులే. వాడు నీకు తమ్ముడుగానే కనిపించును గాని, మాకు బాలకృష్ణుడుగా భాసించుచున్నాడు. పోయిరమ్మ. శ్రీ విశ్వేశ్వర దేశికులకు నా అభివాదనములు తెలుపుము. మంచిది."

అంతట్లోనో గూడ తిప్పన వెడలక తమ్ముని తనవెంట గొంపోవుట కింకేమో చెప్పబోవుచు నిలిచెను. శ్రీనాథుడు చప్పున అడ్డు తగిలి, కొంచెము తీవ్రమైన కంఠముతో 'తిప్పనార్యా, మా విజయయాత్రలో వాడు నాతో తప్పక ఉండవలె. యత్ర యోగీశ్వరః కృష్ణో...తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతి ర్మతి ర్మమ!' అనెను.

ఆపై నెదురు చెప్పలేక తిప్పనార్యుడు చిత్తమని యంగీకరించెను. అంతనడకు కనబడకున్న పోతన యప్పుడు పసుగున బయటికి నచ్చి అన్నను కౌగిలించుకొని, 'అన్నా, ఏమీ అనుకోకు! నాన్నను కోపింపవద్దని చెప్పు. అమ్మ పాదాలకు గోజూ నమస్కరిస్తున్నానని చెప్పు!' అనెను. ప్రేమాతిరేకమున తిప్పన వాని శిరస్సు మూర్కొని పెద్దలకడ జాగ్రత్తగా మసలుకోవలెనని బుద్ధులు చెప్పి శ్రీనాథున కప్పగించి తమ్ముని యవసరములకై పణము లిచ్చుటకు ఉత్తరీయపు కొంగుపూట విప్పుచుండెను. శ్రీనాథు డాతని వారించి 'నీ వద్దకు చేర్చువరకు నేనే వానికి రాజభోగముగా నడిపించెదనులే' అనుచు సెలవిచ్చి పంపివేసెను.

7

దైవజ్ఞులు నిర్ణయించిన ప్రకారముగా ఆమరునాటి ప్రాతఃకాలమునకే శ్రీనాథుడు బ్రాహ్మీదీక్ష ప్రారంభించెను. నలయుభారములు పుష్కలముగా తెల్లవారకముందే సింగనప్రధాని

యాజ్ఞచే శ్రీనాథుని యింటికి చేర్పబడెను. వంశపురోహితు
డును. బుత్విక్కులును తెల్లవారుసరికే చేరిరి. వెదుళ్ళ చెరు
వుకు సమీపమునందే బ్రాహ్మణవీథిలో మధ్యభాగమున
శ్రీనాథుని గృహమున్నది. గృహద్వారములను పచ్చని తోర
ణములతో దుగనయు పోతనయు ఇతర పరిజనులతో గలసి
యలంకరించుచుండిరి.

దీక్షాంగముగా ఆయుష్కర్మయు, సూక్ష్మముగా
ప్రాయశ్చిత్తాదులు నైనవి. అంతట దీక్షాసంకల్పు మొనర్చి
బుత్విగ్వరణముకావించి విఘ్నేశ్వరపూజ,పుణ్యాహవాచనము,
మండపారాధనము నిర్వర్తించిరి.

అంతట నిర్ణీతమైన విధానమున ఎవరి జపములకు వారు
కూర్చుండిరి. ఒకను సూర్యనమస్కారములు చేయుచుండ
తక్కినపదిమందియు గ్రహనక్షత్రాదికజపములు చేయుచుండిరి.
సావిత్రీజపమును శ్రీనాథుడే స్వయముగా చేయుచుండెను.
కులపురోహితుడు పైనుండి ఏకైన్యమెప్పుడు కావలసియుండునో
సిద్ధము చేయించుచు సన్నాహము చేయుచుండెను.

మధ్యాహ్నవేళకు కొంచెము ముందుగా జపము లర్పణ
మొనర్చి సంధ్యావందనాదిక మొనర్చి వెంటనే యందరు
కలసి మహాన్యాస పురస్సరముగా రుద్రాభిషేకము కావింతురు.
అప్పుడు మూడు గడియల పాటు అందరు విశ్రమింతురు.
ఆ వ్యవధానమంలో నేకలములో గోష్ఠీరమ లో ఎవరికి కావల
సినది వారు గ్రహింతురు. విశ్రాంతియైన పిమ్మట అందరు

కలసి కృష్ణయజుర్వేద పారాయణము నొనర్తురు. సాయం సంధ్యా వేళకు ముందుగా పారాయణము చాలింతురు.

అంతట శ్రీనాథుడు సాయంవిధు లాచరించి గృహదేవతార్చన మొనరించును. అప్పుడందరు సుష్ఠుగా పంచభక్ష్య పరమాన్నములు ఆనంద సల్లాపము లొనర్చుచు భోజనములు చేసి తాంబూలములు సేవించి విశ్రమింతురు. మధ్యాహ్న వేళ నుండి సాయంవేళ వరకు శ్రీనాథ మందిరము మంజుల వేదఘోషత్రో నాపూర్యమాణమై కేవలము బ్రహ్మహృదయము నలె భాసించుచుండెను. నిరంతరసావిత్రీధ్యానముత్రో శ్రీనాథుని మూర్తి మూర్తిమంతమైన బ్రాహ్మస్వరూపముగా తేజరిల్లుచు దినదినమున కతిశయకాంతిత్రో విరాజిల్లుచుండెను.

దుగ్గన్న తనభావనలోనాటు పగలు గోక్షీరమే గ్రహించి రాత్రి భుజించుచు, ఏకభుక్తినియమము పాటించు చుండెను. పోతనయు నట్లే చేయుదు నన్నను, శ్రీనాథుని నిషేధించి 'మా కృష్ణపోతరాజు బ్రాహ్మణ బాలపంక్తిలోను, రాత్రి మా యందరితో నృత్తపంక్తిలోను, భుజింపనలసినదే' యని భాసించుటచే నట్లే చేయుచుండెను.

ఏకాదశాహ దీక్ష పూర్తియైనది. సంకల్పించిన జపములు పూర్తియైనవి. పదునొకండుగురు ఋత్విక్కులు రుద్రసంఖ్యా కముగా శతరుద్రీయముతో నభిషేకించుచుండుటచే నిత్యము నొక మహారుద్రము (121) చొప్పున దీక్షపూర్తియగునప్పటికి అతిరుద్రము (1331) పూర్తియయ్యెను. వారివి కాక శ్రీనాథుడు

చేయు నభిషేకములే నుషోకుద్రమైనది. శ్రీనాథుని పారాయణముతో కలసి పండ్రెండు వేద పారాయణము లైనవి.

పండ్రెండవనాడు దీక్షాంగహోమము లైనవి. ఆ మరునాడు జాము ప్రొద్దెక్కు నప్పటికే తర్పణమార్జనములు పూర్తి కావించిరి. ఆ మధ్యాహ్నమునవే మహావైభవముగా బ్రాహ్మణ సంతర్పణము జరిగినది. ఆ విందుకు గొండపేటి ప్రభుని మామిడి సింగనకూడ విచ్చేసెను.

అతిథులు విందు కుడుచుచున్న సమయములో శ్రీనాథుడు పంక్తులలో తిరుగుచు మరికొంచెము పుచ్చుకొనుడనుచు బలవంతపెట్టుచుండెను. తనివి తీర భుజించి లక్కన సూరి ఈ చాటువు చెప్పెను.

"తినలేమో కవిసార్వభౌమ యిక 'సంతృప్తా నయం' నీదు క
మ్మనిపణ్యారముతోడ బూరెగమితో మండెంగతండంబుతో
ననుగుంబాసెమునతోడ బొండుకలమాహారంబుతో నేతితో
ఘనరంభాఫలఖండశర్కరలతో గల్పింపవయ్యా దధుల్"

లక్కనసూరి కోరుకొన్న మీగడ పెరుగులతో విందు పూర్తి యైనది.

ఆ పిమ్మట గృహాంగణమున వేసియున్న పెద్దపందిరిలో శ్రీనాథ కవిసార్వభౌముడు మహదాశీర్వచనమునకై విద్వత్సభ కావించెను. అప్పుడు శ్రీనాథభట్టు మూర్తిలో వ్యక్తమైన తేజస్సును శివయు దర్శనీయమై యొప్పారెను. దానికి సింగన ప్రధాని ముగ్ధుడయ్యెను. అప్పు డా సభలో నామహాప్రధాని

కవిసార్వభౌముని మహాస్థానములోని ప్రధాని యయినట్లు గోచరించెను.

వేదవిదులు దిగ్విజయసూచకములగు వేదమంత్ర ములతో బహు విధముల శ్రీనాథు నాశీర్వదించిరి. ఋత్విక్కు లను భూరిదక్షిణలతోడను, వేదవిదులను, పండితులను యథోచితసంభావనలతోడను అర్చించెను. జయనచనములతో సభ ముగిసినది.

ఆ మహనాడు శ్రీనాథుడు విశ్రాంతి తీసికొనెను. పదునైదవనా డాతడు అప్పటికి జరిగిన యాత్రాసన్నా హాములు సరిచూచి లోపములు సవరింప నేర్పాట్లు చేసెను. ఆనాటి యపరాహ్ణవేళ నాతడు సర్వజ్ఞచక్రవర్తియగు పెద కోమటివేమభూపాలుని దర్శించి, సెలవు తీసికొనెను. వీరనారాయణాపరాంకుడగు వేమభూపాలుడు, అప్పటికే వృద్ధుడై యున్నందువలననో, కాక మరల నీ జన్మలో ఈ మహాకవిని దర్శించు భాగ్య మబ్బునా యను సంశయము మెరపు మెరసినట్లు క్షణకాలము భాసించుటవలననో, మరి యెందువలననో గాని, దృఢమై స్వచ్ఛమగు నా ప్రభువు కంఠములో ఈషత్కంపమో గాద్గద్యలేశమో గోచరించినది. శ్రీనాథు డది తన విజయయాత్రాపర్యవసానమును గూర్చిన భయావేగముచే కలిగియుండునని యూహించి సరిపెట్టుకొనెను.

అక్కడనుండి బయలుదేరి సింగనప్రధాని మందిరమున కేగెను. మహాప్రధాని యాతని నేకాంత గహాస్య మందిరము లోనికి గొంపోయి చాల ప్రొద్దు ముచ్చటించెను. అంతసేపును

ఆతడు శ్రీనాథునకు విద్యానగర యాత్రా సన్నాహమునకు తాను కావించిన యేర్పాట్లు వివరించి, అక్కడి కొండపీటి రాజ్యస్థానాపతికి సర్వసౌకర్యములు శ్రీనాథునకు సమకూర్చ నలసిన దని రాజముద్రాంకితమైన యాజ్ఞాపత్రిక యాతని హస్తములలోనుంచి, దాని ప్రతి యప్పటికే స్థానాపతికి పంపి యుంటినని తెలియజేసెను. తిథినక్షత్రముల లెక్కను శ్రీనాథు డెప్పు డెక్కడికి జేరనలెనో, ఎప్పు డేమి చేయనలెనో డిండి ముని బల మెందున్నదో, అతని బలహీనపు తావు లేమో, ఎట్లు చేసినచో శ్రీనాథునకు పైచేయి లభించునో – ఇత్యాది వివరములన్నియు లిఖించియున్న పొడుగుపాటి కాగిత మొకటి, చీనాపట్టాంశుకమున కంటించియున్నదానిని, చుట్టగా చుట్టి శ్రీనాథున కందిచ్చి, దానిని జేనతార్చన సంపుటముతోపాటు భద్రముగా నుంచుకొనుమని యాదేశించెను. శ్రీనాథు డగి విప్పి చదువుకొని మొత్తముమీద తా నాలోచించి యున్న దానినే అదియు ఎక్కువ భాగము పోలియున్నదని చెప్పెను భేదించినవిషయములలో నాము సంప్రదించుకొని ఎవరి యాలోచన మేలుగా నున్నదో నిర్ధారించుకొనిరి. కొన్ని యెడల అప్పటి యవసరములనుబట్టి యుక్తమార్గము నిర్ణయించుకొన నగునని వైకల్పికపక్షములుగా గుర్తుపెట్టు కొనిరి. తుదకు ప్రధాని దిగ్విజయయాత్ర చేసి క్షేమముగా తిరిగి రమ్మని శ్రీనాథు డాశీర్వదించి పంపుచు, 'ఈ యాత్రలో మీకు ఎక్కడ ఎంత ధనము కావలసినను ఇచ్చినట్లు బరాతములు వెళ్ళినవి. కొండపీటిప్రభువుల ధనకోశ మంతయు ఈ

యాత్రావిజయముపకై పుష్కలముగా తెరచియుండునని గుర్తించుగో!' అని గట్టిగా చెప్పెను.

ఆ పిమ్మట శ్రీనాథుడు తన ప్రాణమిత్రమగు వామన భట్టబాణుని కలసికొనెను. వామనుడు ప్రత్యక్షముగా ప్రకటించుకొనకుండినను, ఆతడు డిండిమునిచేతులలో పరాభవము గుచి చూచినవాడని ఆప్తులు చూచాయగా నెరుగుదురు. ఆతడు డిండిముని శాస్త్రపాటవమును లోపములనే కాక, ఆతని శత్రుమిత్రులను నిర్దేశించి శత్రువులకు పరిచయపత్రిక లిచ్చి ప్రేమపూర్వకముగా నాశీర్వదించి, 'నీవు డిండిముని జయించినట్లు వినువంతవరకు క్షీణించుచున్న యీ దేహములో ప్రాణములు ధరించియుందుననుమా!' అని వీడ్కొలిపెను.

అంతట శ్రీనాథుడు అప్పుడు తనపై నెంతభారమున్నదో పరిగణించుకొనుచు సాయాహ్నవిధులు శీఘ్రగతి నిర్వర్తించి భుజించి విశ్రమించి సుఖనిద్ర చేసెను.

శ్రీనాథునితో యాత్ర చేయనలసినవాకు వాహనాదికము లంతో ఆ రాత్రికే శ్రీనాథుని మందిరసమీపమునకు చేరికొని ప్రస్థానభేరికై ఎదురుచూచుచు, సర్వసన్నద్ధులై యుండి దొరికిన తావుల విశ్రమించిరి.

తెల్లనారినచో శనివారము. సూర్యోదయాదిగా నాలుగు గడియలవరకు మున్మహూర్తము. యాత్రారంభము అంతకు ముందే ఉషఃకాలములో కానలెను. ఈవిజయయాత్రారంభము ఎట్లు సాగునో తన రాణివాసముతోగూడ కన్నులార చూడ నిచ్చగించు'చుంటినని వేమభూనాథు లాసతిచ్చి యుండిరి.

దుష్ప్రహూర్తము దాటిన గడియకుగాని యూరేగింపు ప్రభువుల కంటబడరాదని శ్రీనాథభట్టు శాసించెను.

ఆ రాత్రి మూడు జాములవేళ దాటిన కొలదిసేపటికే భేరీనినాద మొకటి ధీరమనోజ్ఞ గంభీరముగా ఎగువ కొండపీటి నగరగిరిగహ్వరాంతరములలో ప్రతిధ్వనించినది. యాత్రచేయు వారందరు రెండుగడియలలో సాయత్తులైరి. శక్రుని విజయ యాత్రను గీర్తించు మంగళగీతమును జోడుసన్నాయిలు శ్రావ్యగంభీరముగా గానము చేయుచుండ, రెండు ఢోళ్ళు తథాస్తు తథాస్తు అనుచున్నట్లు మొరయుచుండెను.

సేవకులు సామానులు బండ్లకెత్తించిరి. ఆశ్వికులశ్వము లధిరోహించిరి. భటులు తమతమ యాయుధములతో బాసులు తీరిరి. కొన్ని సామానులు కంచర గాడిదలపైనను కొన్ని యెడ్లపై పెరికె సంచులలోనను ఎత్తబడినవి. పలువురు యాత్రికులు బండ్లలో నెక్కి కూర్చుండిరి. పల్లకియు మేనాయు శ్రీనాథుని గృహద్వారమున కెదురుగా నిలిచి యున్నవి. అవి ఖాళీగా నున్నవి. శ్రీనాథుడు స్నానసంధ్యాదులాచరించి దేవసదనము వద్ద సిద్ధముగా కూర్చుండెను.

ప్రయాణవేళ సూచించు మనోజ్ఞఘంటారావము శ్రవణపర్వ మయ్యెను. శ్రీనాథుడు లేచి పరమేశ్వరునకు నమస్కరించి దేవసంపుటము భార్య చేతులలో నుంచి సర్వమంగలా ధ్యానపురస్సరముగా యాత్రాకాలమున చేయు స్తోత్రములు పఠించుచు, ముందు నలుగురు వేదవిదులు స్వస్తి చెప్పుచుండగా బయలుదేరి వీథిలో నడుగిడెను.

శ్రీదేవి దేవసంపుటమును మేనాలో పీఠముపై నుంచెను. నిదానంసుల సెలవు తీసికొని శ్రీనాథుడు పల్లకిలో గూరు చుండెను. దుగ్గనయు, పోతనయు వెంటనుండి ప్రీతివచనములు పలుకుచుండగా శ్రీదేవి మేనాలో నుపవిష్టయయ్యెను.

'అక్కా--, ఇప్పుడు బావ వెడలుచున్న విజయలక్ష్మి స్వయంవరయాత్రకు బయలుదేరుచున్న నీవు, సరిగా సత్యా వివాహమునకు శ్రీకృష్ణునివెంట బయలుదేరిన రుక్మిణీదేవివలెనే కనబడుచున్నావు!' అని పోతన పలికి, అక్కడనే నిలిపియున్న విజయధ్వజము చేతఁబట్టి, మరియొక ధ్వజము చేతఁబట్టిన దుగ్గనతో కలసి బయలుదేరెను. వా రిద్దరు తమ కాయత్తము లైయున్న హయము లారోహించిరి. జయఘోషలమధ్య పల్లకిని మేనాను బోయీ లెత్తుకొనిరి.

మధుర మంగళనాదముతో ముందు బాజాలు సాగినవి. సెమ్మల్ల చెరువులోనుండి నీరు తెచ్చుచున్న బ్రాహ్మణసువాసినులు పూర్ణజలకుంభములతో శ్రీదేవి శ్రీనాథుల కెదురైరి.

మంగళతూర్యములవెనుక రెండు ఆట గుర్రములను చిత్రచిత్రముగా కదను తొక్కించి యాడించుచు, ఒయ్యారముగా గుర్రముల యాటగాండ్రు సాగుచుండిరి. వారివెనుక నైదు వరుసలలో చీనాంబరాలంకృతములగు నిసునది యుత్త మాశ్వములపై ఆశ్వికయోధులు ఖడ్గకోలాద్యాయుధములతో సాగిరి. ఆ వెనుక పర్వతమల్లు తన భీమకాయము ప్రదర్శించుచు జెట్టివేషము ధరించి విన్యాసములు దువ్వుచు, తొడలు చరచుచు నడచెను. అతనివెంట అట్టి వేషముతోడనే

ఆతని శిష్యులు నలువురును, వారివెనుక సర్వాయుధహస్తులగు పదినంది కాలిబంట్లును నడచుచుండిరి.

ఆ తరువాత వందిమాగధులగు నిద్దరు భట్టులు శ్రీనాథ కవిసార్వభౌమునకు వీచోపు లిచ్చుచు పల్లకి కభిముఖులై వెనుక వెనుకకు నడచుచుండిరి.

ఆవెనుక విజయధ్వజములతో పోతన దుగ్గనంబును, ఆ పిన్నాట స్వస్తివాచకులగు వేదవిదులును, తర్వాత శ్రీనాథుని పల్లకియు, శ్రీదేవి మేనాయును, అంతట బండ్లు నిత్యాదులును, అందరికి వెనుక నలుగురు రౌతులును నలుగురు భటులును సర్వమును కాపుచేయుచు సాగుచుండిరి.

ఈవిధముగా పెండ్లినడకతో పల్లకియు, మేనాయు పచ్చని యాకుల తోరణముతో నలంకృతమైన ప్రక్కయింటికి చేరినవి. ఇంటిలోనుండి సువాసినులు కలకలలాడుచు వచ్చి, కర్పూరహారతి యిచ్చి శ్రీదేవీశ్రీనాథుల కన్నుల కద్ది దీవించిరి. ఇట్లు ఇంటింటియొద్ద నాగుచు, ఇంటింట నారతులు గొనుచు, నా యుత్సవము సాగుచుండెను. చత్వారములలో నెక్కువసే పాగుచుండెను.

సూర్యోదయ మైనది. దుర్ముహూర్తము దాటిన మరి రెండు గడియలకు ఆ యూరేగింపు కొండపేటి ప్రభువుల గృహ రాజసౌధము చేరికొనెను.

ఆ సౌధతలమున సుఖోపవిష్టుడై సర్వజ్ఞచక్రవర్తి యానందబాష్పములతో తిలకించుచుండెను. రాణివాసస్త్రీలు కొందరు సోరణగండ్లనుండి చూచుచుండిరి. వారిలో కొందరు

బాగుగా చూడవలెనను నుత్కంఠతో అంతఃపురవాద్యధ్వనులు జడిగించి అట్టాలికమునకునచ్చి నిలిచిరి. ఆనాడు మహోత్సవము ప్రకటించి వేనుభూపాలుడు వారి కట్టి స్వేచ్ఛ కనుజ్ఞ యిచ్చి యుండెను.

రాజద్వారమున నుంగళికలశహస్తమైన దాసీకన్యకా జనము నిలిచియుండెను.

ముందు ఉత్సవములోని సన్నాయి రాజద్వారము నెదుట నిలిచినది. శ్రీరాగమున మహేంద్రవిజయకీర్తన పాడి, ఝంఝ మీద లయను ప్రస్తరించి మేళము ముందుకు కదలెను. రెండు ఆటగుజ్జములు వచ్చి తలలు వంచి ప్రభువులకు వందన మాచరించినవి. వాని యాట ప్రదర్శించుటకు వీధిలో దూరమునరకు నడ్డులేకుండ భటులు సర్దించిరి. రెండు గుర్రములును క్షణకాలము శృంగారనృత్యము కావించినవి. ఆ యుత్తరక్షణమున ఆట నాయకుడు వీరణముగొని వీరాంగము వాదింపజొచ్చెను. వెంటనే గుర్రములు రెండును రోషముతో వేరైనవి. ఒకటి రోషముత్రోసుచు తీవిగా నిలిచినది. రెండవది ముందుకు పోయి గిరుక్కున వెనుదిరిగి రోషముత్రో మొదటిదాని కెదురు వచ్చినది. ఇప్పు డా గుర్రములు ఇద్దరు వీరుల ద్వంద్వయుద్ధము ననుకరించుచు వీరనృత్యము చేసినవి. ఒకదాని నొకటి నొరసి కొనుటలో వానిసడకలలో చిందులలో తలవిసరులలో చూపులలో జూళ్ళ త్రోకల విదలింపులలో వీరావేశముత్రో నొకదాని నొకటి మట్టగింప యత్నించుచున్నట్లే అవి నృత్యము చేసినవి. ఆ యపూర్వనృత్యమును కొండవీటిజనులు ఉత్కం

శితులై రోమాంచములతో తిలకించుచుండిరి. ఆ వీరవిహారము చావుగడియకంటె పట్టలేదు. ఆ చావుగడియయే జామునలె చూచువారికి తోచెను.

ఆకస్మికముగా ఎదురు వచ్చిన యశ్వము వినీతమై మొదటియశ్వముముందు నిలిచినది. మొదటియశ్వము విజయా వేశముతో తన రెండు ముంగాళ్లు పైకెత్తి ఎదురు వచ్చిన హయశిరస్సుపై పెట్టుచున్నదానివలె క్షణకాలము వెనుక కాళ్ళపై నిలిచినది. అంతే! వీరణ మాగినది. రెండు హయములు ముఖము ముఖము రాచుకొన్నవి. యథాప్రకారము సాధునృత్యము చేయుచు రెండును ప్రభువున్న మేడపైకి తలలు రిక్కించినవి. వేమప్రభువు ఆ ప్రదర్శనమున కుప్పొంగి సౌధాట్టాలకము నుండియే గుప్పెడునరహాలు అశ్వశిక్షకుని యొడిలో పోసెను.

ఆటగుఱ్ఱములు సాగిపోయినవి. ఆశ్వికభటులు అశ్వశిరస్సులతో బాటు తమ శిరస్సులును వంచి ప్రభువుకు వందనము చేసి ముందుకు సాగిపోయిరి.

అంతట ఏకాంగవీరుడగు పర్వతమల్లు తన మహోన్నతమూర్తితో రాజవీథిని నిండించుచు గజగమనముతో వచ్చి నిలిచి వేమప్రభువులకు వంగి వందన మాచరించెను. వెంటనే యాతడు మెరపు మెరసినట్టు ఎగిరి తన దక్షిణభుజ దండముపై మోండా కొట్టెను. ఆ దెబ్బకు భూమియంతయు కంపించినది. గజాస్యుని వప్రక్రీడలకు కైలాసము వలెనే గృహరాజసౌధమును అదరినది. ఆతడు ఆ వెంటనే లేచి

వానభుజదండమాత్రోన్మోండాకొట్టెను. ఇట్లు నిలువు మోండాల తర్వాత పీపు మోండా ప్రదర్శించెను. నలుగురు శిష్యులు కష్టముత్రోసికొని తెచ్చిన రెండు మహాగద లనలీలగా నందుకొని గిరగిర త్రిప్పెను. అంతట తన దేహము కుంచించుకొని మహారజ్జువులత్రో గట్టిగా బిగింపజేసికొని, ఉత్తరక్షణమున తన యంగములు విదలించుకొని, రజ్జువు లెక్కడి నక్కడ ఖండఖండములుగా తునియజేసెను. పదిమంది మోసి తెచ్చిన దృఢమగు నాయసపరిఘను తన మోకాళ్ళపై నుంచి చేతులత్రో లాగిపట్టి దాని నర్ధచంద్రాకారముగా వంచివేసెను.

ఆ పిమ్మట తన వజ్రకాయము ప్రదర్శించుటకై తన శిష్యులకు నలుగురికి చేవగల నాలుగు పచ్చి వెదురుకర్ర లిచ్చి తన భుజదండములు, పీపు, ఊరుపార్శ్వములు చూపి చేతనైనంత బలముగా కొట్టుడని నిశ్చలపర్వతమువలె నిలుచుండెను. దెబ్బ దెబ్బకు 'జయవీరహనుమాన్!' అనుచు శీవిగా తల ఒకప్రక్కకు ఎగురవేయుచుండెను. ఆ దెబ్బలు వజ్రాఘాతములవలె, కొండ వీటినగరమునను పర్వతసానువులను ప్రతిధ్వను లీనెను. నాలుగుకర్రలు జజ్జుజజ్జు అయినవి. పర్వతమల్లు చర్మము కంద జ జ
నైన కందలేదు. అరగడియపాటు ఇట్లు మల్లప్రదర్శనముచేసి వినీతుడై ప్రభువుకు నమస్కరించెను. వేమభూపాలుడు సంతు ష్టుడై సువర్ణములసంచి పైనుంచి జారవిడువగా నా సంచిని లీలగా వంచిన తన శిరస్సుత్రో గ్రహించి చేతుల నందుకొని కన్నుల కద్దుకొని ముందుకు సాగెను.

పదాతులు లంఘించి ఖడ్గగదాములు వివిధభ్రమణములు కొలది క్షణములు ప్రదక్షించి ప్రభువుకు నమస్కరించి ముందరికి సాగిపోయిరి.

ఇప్పుడు శ్రీనాథుడెక్కినపల్లకి గృహరాజసౌధము నుండి చూడనయ్యెను. ఎంతటివారలైనను పల్లకి ఆపి దిగి పాద చారులై గాని, రాజసుందిరమును దాటిపోరాదు. కాని యా క్రిందటి సాయంకాలమునసే వేమప్రభువులు శ్రీనాథకవిసార్వ భౌములను సమస్త లాంఛనములతో సాగుచుండ చూడ నిచ్చ కలదనియు, రాజాంగణమునుండుగూడ పల్లకి మేనాలు దింపనలదనియు, శాసించుటచే బోయీలు పల్లకిని దింపలేదు.

వంది మాగధులు కైవారములు చేయుచుండిరి.

'వినమత్కాకతి సార్వభౌమ శ్రీ మత్కమలనాభపౌత్ర, మారయార్యపుత్ర! సకలవిద్యాసనాథ, శ్రీనాథ, బహుపరాక్!' అనుచు మాగధుడు కైవార మిచ్చెను.

'శ్రీ వీరనారాయణ కరుణాసార ప్రసార విశృంఖల కవితా మార్గ సంచార, సకలవిద్యాసనాథ శ్రీనాథ, జయీభవ! సర్వజ్ఞ చక్రవర్తి పెదకోమటి వేమ నృపచూడామణి ప్రసాదాసాదిత కవి సార్వభౌమాంక! విజయీభవ! కుండినపురీ విద్యాధికారపదవీ సనాథ శ్రీనాథ, జయీభవ! వామనభట్టబాణ కవీశ్వరాపర ప్రాణ! విజయీభవ!-' ఇత్యాదిగా వంది కైవారము లిచ్చుచు మాగధునితో కలసి వెనుక వెనుకకు నడచుచుండెను.

ఆ వెనుక సర్వాలంకృతములగు రెండు ఉత్తమాశ్వములపై నెక్కి విజయధ్వజములు ధరించి పాలుగారుచున్న ముఖములతో

మగ్గనయు పోతనయు కానరైరి. వారు బలరామకృష్ణులో, రామలక్ష్మణులో నరనారాయణులో అనిపింపగా వేమభూపాలు డుప్పయుత్నముగా భక్తితో చేతులు జోడించెను.

వారి వెనుక వేదవిదులు స్వస్తిచెప్పుచు నెమ్మదిగా సాగుచుండిరి. ఆవెనుక సౌధగోపురముముందు శ్రీనాథుని పల్లకియు దానికి వెనుక మూడు ధనుస్సుల దూరమున శ్రీదేవి మేనాయు నిలిచినవి. వెంటనే దాసీజనము రెండు పెద్ద తెరలు పట్టి రాజద్వారమునుండి శ్రీదేవి మేనా ముందు వెనుకల వరకు నెత్తుగా పట్టుకొని నిలిచి సిద్ధమైనదని హెచ్చరిక చేసిరి.

వేమప్రభుని యాజ్ఞతొని యువరాజగు రాచవేమారెడి రాజపురోహితప్రపుర్సరముగా సౌధమునుండి దిగివచ్చి బంగారు జలతాముతో మనోహర చిత్ర చిత్రితములైన రెండు కాశ్మీర శాలువలు పురోహితులచే కవిసార్వభౌములకు సమర్పించి నమస్కరించెను.

ఆవల వేమమహీనాథుని పట్టమహిషి సూరాంబ పురోహితపత్నిని ముంచుకొని, స్వయముగా ప్రీతి చిప్పిలు చున్న గంభీర మనోజ్ఞమూర్తితో రెండు తెరల నడుమనుండి శ్రీదేవి మేనా యొద్దకు వచ్చెను. పురోహితపత్ని శ్రీదేవి ముఖ మున కుంకుమబొట్టు పెట్టి సూరాంబాపట్టమహాదేవి పంపించిన రెండు ముత్యాల కుచ్చుల పట్టుచీరలు సమర్పింపగా, శ్రీదేవి గ్రహించి కన్నుల కద్దుకొని భక్తితాత్పర్యములతో వానిని తన మేనాలో నున్న దేవసంపుటము పాదసన్నిధి నుంచెను. మహారాజ్ఞి బహూకృతిని జూచి ఇతర రాణివాస జనములును

రంగు రంగుల చీరలు రవికలు నర్పించిరి. శ్రీదేవి యన్నిటి నొక్కొక్కటి ప్రీతిపూర్వకముగా గ్రహించి దేవసంపుటమునద్ద భక్తితో నుంచుచుండెను. ఆ పట్టు చీరలతో మేనా నిండిపోయెను. ఆ రాణివాస వనితాజనముల సంతోషకలకలము శ్రీనగరములోని వాగ్దేవతల కలకలారవమునే అనుకరించెను. అంతట ముత్యాల ముగ్గును కూర్చిన బంగరు పళ్ళెరములో పచ్చ కప్పురపు టారతి పురోహితపత్ని వెలిగించి, ముందు దేవతార్చన సంపుటమునకును, తరువాత శ్రీదేవికిని సమర్పించి ఆ జ్యోతిని శ్రీదేవి కన్నుల కద్ది తన కన్నుల కద్దుకొనెను. సూరాంబామహారాజ్ఞియు రాణివాసజనమును ఆజ్యోతి కాంతులను తమ కన్నుల కద్దుకొనిరి.

అదే సమయమున వారికి మందు దేవదాసీ కన్యకాజనము శ్రీనాథునకు బంగరు పళ్ళెరముతో పచ్చలహారతి పట్టి, మధుర కంఠములు మేళవించి విజయగీత మాలాపించుచు నృత్యపుర స్సరముగా నా కర్పూరజ్యోతిని కన్నుల కద్దిరి. వెంటనే దోసెడు సువర్ణములు ఆపళ్ళెరములో నుంచగా నా దేవదాసీజనము నృత్యపురస్సరముగా నమస్కరించి గ్రహించి గీతము ముగించుచు నిలుచుండిరి.

ఉత్సవ మిక సాగిపోవుటకు వేమప్రభువుల యనుమతి సూచించు శంఖారావము వినబడినది. క్షణములో రాణివాసజనము తెరలనడుమ నుండి యదృశ్యమైపోసది. తెరలును సేనుకకు పోయినవి. రాజపురోహితుడును యువరాజును, దేవదాసీకన్యకాపురస్సరముగా మందిరములోనికేగిరి. పల్లకియు

డానివెనుక మేనాయు, ఆవెనుకబండ్లును నెమ్మదిగా ముందుకు తరలినవి. రాజనుందిరము దాటువరకు నాయూరేగింపు నెమ్మదిగా సాగి, ఆపిమ్మట వేగము హెచ్చించెను. ఆనాటి మధ్యాహ్నమునకు వాము దిగువకొండవీడు చేరికొని మొదటి మజిలీ చేసిరి.

అక్కడినుండి మూడు జాములకు బయలుదేరి పూర్వోక్తవైభవముతో నూరేగుచు నెమ్మదిగా తరలి ఆరతులు పట్టించుకొనుచు సంధ్యావేళకు పూర్వమే నగరము దాటి, వేగము హెచ్చించి సమీపమునవే సూరాంబ కట్టించిన సంతాన సాగర నగరము * చేరి ఆ రాత్రి కక్కడ మజిలీ చేసిరి.

ఆ మరునాటి యుదయమునుండి వాని ప్రయాణవేగ మింపుక హెచ్చయ్యెను. ఆనలిమజిలీకి వారు చేరుటకు పూర్వమే, ఒక జట్టు సేవకులు నంటలవాము ముందుపోయి అక్కడ కావలసిన వసతులు సమకూర్చి యాత్రికులు వచ్చు వేళకు నంటలుచేసి స్నానపానాదులకు సమస్తము సిద్ధముచేయు చుండుటచే యాత్ర సుఖముగా నుండెను. కొండవీటిరాజ్యము సరిహద్దులు దాటిపోవునగకు రాజవైభవముగా నుత్సవము తరలింపనలెనని రాజాజ్ఞ యైనందున దినమునకు ఒకటిన్నర యోజనములుకూడ యాత్ర సాగుటలేదు. దారిలో నూరూ రను మొత్తముమీద కొండవీటికోవలెనే వారి యాత్రోత్స వము సాగుచుండెను.

---

* దీని నీకాలమునలో ఫిరంగిపుర మనుచున్నారు.

వారికి దారిలో నప్పటి గురజాలసీమలోని దక్షిణభాగము తగిలెను. కొండవీటిసీమలోకంటెను గురజాలసీమలో నీటి యెద్దడి యెక్కువ. వారు దిగిన మొదటి గ్రామములోనే నీరు లభించుట కష్టసాధ్యమయ్యెను. శ్రీనాథుని స్నానమునకు నాలుగు చెంబుల జల ముంచిరి. ఆయనతో వచ్చిన విద్వాంసులకును అట్లే నీరు కొలిచి యిచ్చిరి. ఎట్లు స్నానములు చేయగలము మహాదేవా యని వారలొకరిమొగము లొకరు చూచుకొని నవ్వుకొనుచుండిరి. వారి విడిది యా మధ్యాహ్న వేళ ఆ యయూరి శివాలయమున కెదురుగానే ఏర్పాటై యుండెను. శ్రీనాథుడును నవ్వుచు చేతిలో నుదకపాత్ర పట్టు కొని అక్కడి యీశ్వరుని దిక్కు మొగమై ఈ పద్యము చెప్పెను :

"సిరిగలవానికి జెల్లును
దనుజుల బదియారువేల దగబెండ్లాడన్
తిరిపెమున కిద్ద రాండ్రా,
పరమేశా, గంగ విడుము పార్వతి చాలున్!"

అక్కడనే చెరియొక చెంబెడు స్నానోదకము లభించిన దుగ్గనయు, పోతనయు పకపకలాడుచు నా పద్యమే చదివిరి. అప్పుడు చిత్రము జరిగినదని ఆయయూరివా రిప్పటికిని చెప్పుదురు. ఆయయూరి ప్రక్కనే వాగుకలదు. అందులో నీరు లేనందున ఎండిననీటిజాలు తావున ఇసుకతీసి గుంటలు చేయుచుండిరి. పర్వతమల్లు తపనతో నట్లే గుంట చేయుచుండెను. ఆకస్మిక ముగా నందులోనుండి నీటిబుగ్గ యొకటి పొంగి ప్రవహింప

సాగినదట. వెంటనే సేవకు ఆ శుభవార్త శ్రీనాథాదులకు తెలిపి వారి స్నానాదులకు జలము పుష్కలముగా నందించిరి.

అందరు శ్రీనాథుని వాఙ్మహత్వమును శ్లాఘించుచుండ, శ్రీనాథుడు గంభీరముగా 'కాదు, నాది కాదు. అది మా గోపాలకృష్ణుని మహత్త్వము' అనుచు పోతనను నిర్దేశించెను.

ఇట్లు కొండవీటి రాజ్యములో వారి యాత్ర రాజ భోగముగా సాగుచుండెను. గ్రామాధికారులు, గ్రామీణులు వారికి సగౌరవముగా సర్వసౌకర్యములు కల్పించుచుండిరి. రెండే సజీలీలు మిగిలియున్నవి. అందులో మొదటిది పులిపాడు.

యాత్రికులకు భోజనాదికములు సిద్ధపరచుటకు ముందుగా తరలినట్టి సేవకులకు ఆ యూరి కరణముగాని, కాపుగాని 'నేడు' కాని కనిపించలేదు. గ్రామీణు లెవ్వరు వారికి నసతి కల్పించుటకు పేరులేదనిరి. ఊరిబయట తోపులో విడియుద మన్న, నక్కడ గొడ్డు గోదలు కట్టివేసి యడ్డంకులు కల్పించిరి. నిలువనీడ దొరకక వారల్లాడుచుండిరి. అందుచే యాత్రికు లా మకాము చేసినప్పటికి ఏమియు సిద్ధముగా లేవు. అప్పటికి జాము ప్రొద్దెక్కినది.

శ్రీనాథున కీ విషయము తెలియగానే ముఖము చిటిం చెను. తమ వెంట వచ్చుచున్న కొండవీటి కరణము మాచ య్యను రాజాజ్ఞాపత్రముతో నూరిలోని కంపెను. అతడు వెళ్ళి విచారించి వచ్చి గ్రామోద్యోగులు ఇండ్లలో నుండియే ఊరిలో లేరని ముఖము తప్పించుచుండి రనియు, గ్రామీణులు కూడ యాత్రికులను దోచుకొను నభ్యాసము కలవారను

ప్రతీతి కలదనియు నివేదించెను. శ్రీనాథుడది యాలకించి పర్వతమల్లును పిలిచి వెంటనే బలవంతముగానైన వసతులు సామగ్రులు సేకరించుటు చేయుమని యాజ్ఞాపించెను.

పర్వతమల్లు శిష్యులతో బయలుదేరి కరణము నింటిలో జొరబడి చావడి ఖాళీ చేయించి, పంటకు పాత్రాదికములకై వంటయింటిలోనికి పోబోవుచుండ, నక్కడనున్న యొక స్త్రీ వ్యక్తి నడకుచు వారు కోరిన పాత్ర సామగ్రి యందించెను

ఆ యూరిలో వెచ్చములు విక్రయించుటకు బచ్చు లెవ్వరు నుండనందున పెద్దకాపే గ్రామీణులకు కావలసిన పదార్థములు తెప్పించి యమ్మచుండెను. మల్లు కాపు ఇంటిలో ప్రవేశించి కావలసిన సరకులు పట్టించి విడిదికి పంపించెను.

అంతట నాతడు నేని (గ్రామనాయకుని) దొడ్డిలో ప్రవేశించి తనతో వచ్చిన గుర్రములకు, ఎడ్లకు, కంచరగాడిదలకు అవసరమగు గ్రాసాదికము పట్టించుకొని తరలెను.

పిమ్మట ఊరిబయట తోపులో గ్రామీణులు ఆక్రమించి కల్పించిన యడ్డంకు లన్నియు తొలగించి బండ్లు మొదలగునవి దిగుట కనువు కలిగించెను. ఆతని భీమకాయమును ఉగ్ర మూర్తిని వెంటనున్న సాయుధ పరివారమును జూచి ఊరి వారెవ్వరు నోరుకదపుటకు గూడ సాహసింపలేదు. సాయుధులగు భటులు ఆశ్వికులు ఊరి నడి వీధులలోను ఊరి బయటను కాపు కాయజొచ్చిరి. ఊరు గడగడలాడి పోయినది.

మూడుజాముల వేళకు శ్రీనాథామల కానా డెట్లో భోజనాదికములైనవి. అప్పటికిని గ్రామోద్యోగులు కనబడలేదు.

కరణము నింటిలోనున్న స్త్రీ వ్యక్తి యాతడు వివాహమాడిన భార్యకాదని తెలియనచ్చినది. గ్రామకాపు గ్రామనేడు గౌరవ సంసారములు చేయువారు, కారని తెలిసినది. ఆ చుట్టుపట్టుల రెండు యోజనములనరకు గల చిటడవిలో జరుగు వృత్తాంతము లన్నియు నీ యూరినాయకు చేయునవే యని తెలిసినది.

శ్రీనాథునిక్రోడిపండితులకు భయమయ్యెను. 'ఇంతధనముతో స్త్రీలతో గూడ చిట్టడవిలో దొంగలయూరిలో క్షేమముగాదు యుక్తముకాదు' అనిరి. కరణము మాచయ్యయు 'దుష్టులకు దూరముగా నుండుట మేలుకదా!' అనెను. శ్రీనాథున కా మాటలు నచ్చినట్లు లేదు. అత డా యూరిలోనన్నే స్థిరనివాసము చేయ సంకల్పించిన వానివలె కన్పడెను. ఆవల ఇంటి పంచలో పులిజూద మాడుచున్న దుగ్గన పోతనల నాతడు పిలిచెను. వారాడుచున్న యాట మాటలే ఉత్సాహముతో పలుకుకొనుచు వచ్చిచుండిరి.

దుగ్గన : నా పులులు నీ మేకల నెన్నిటిని మింగినవో చూచావా?

పోతన : తొందరపడకు. నీ పులుల ఆట కట్టబోతున్నది. రెండే ఎత్తులు.

వారెదుటికి రాగానే శ్రీనాథుడు 'మీ కీయూరు ఎట్లున్నది?' అని ప్రశ్నించెను. పర్వతములు దర్పము చూచినందున వారుల్లాసముగా నుండిరి. ఆగ్రామాధికారులు ఎట్లా ఉంటారో చూడవలెనని కుతూహలంగా ఉన్నది' అని పోతన పలికెను.

"సరిగా నాకు నదియే స్ఫురించినది ఉపశ్రుతికై ఈ బాలుక నడిగితిని. మనకు భయములేదు. గ్రామాధికారులు కనబడు వరకు ఈ యూరనే తిష్ఠ వేసెదము."

శ్రీనాథుని యాజ్ఞా ప్రకారము పర్వతనుల్లు మూడు దిన ములకు సరిపోవు ద్రవ్యములు గ్రాసామలు గ్రామకాపు నేళ్ళ ఇండ్లనుండి తెప్పించెను. అది చలికాల మగుటచేత సుకు మాకులైన వారు రాత్రి సుఖముగా నెచ్చగా తలదాచు కొనుట కనుకూలముగా నాలుగు పెద్దయిండ్లలోని గ్రామీ ణులను వెడలగొట్టి ఖాళీ చేయించెను. ఆ రాత్రియంతయు భటులు గ్రామ మధ్యమునను వెలుపలను కాపుకాచిరి. ఎట్టి ఒడుదుడుకులు లేకుండ నా రాత్రి గడచినది.

తెల్లవారినది. గ్రామాధికారులు కనబడనంతనరకు తా మందరము గ్రామీణుల ఖుష్బాతో నక్కడనే తిష్ఠవేసెదమని శ్రీనాథుడు చాటింపు చేయించెను. శ్రీనాథుడు భోజనము చేయుచుండగనే కరణము దర్శనార్థము వచ్చెనను వార్త వచ్చినది. తాను విశ్రాంతి తీసికొన్న తర్వాతగాని మాటాడ వీలులేదని శ్రీనాథుడు ప్రతివార్త పంపెను.

శ్రీనాథుడు నెమ్మదిగా భుజించి తాంబూలను సేవించుచు పండితులతో ఇష్టాగోష్ఠి చేయుచున్నంతసేపును, ఆనల కరణము కారాడుచున్నను అతని వంక చూడనైనలేదు. సుఖనిద్రచేసి లేచి సుఖాసీనుడైన యనంతరమున మాచయ్యను పిలిచి గ్రామాధికారులు వచ్చిరేమో కనుగొను మనెను. వారు వాకిట కాచుకొని యున్నారని విన్నవించి లోనికి పిలిపించెను.

వాకు పెట్టువున్న ననుసారాములు ప్రతిగ్రహింపకయే శ్రీనాథుడు తన కరణము మాచయ్యనంక తిరిగి 'పీసు వేమ ప్రభువుల యాజ్ఞ లేల పాలింపలేదో విచారింపుము' అని పండితగోష్ఠి సాగించెను.

కాపు నేళ్ళ తనకు ప్రభువులయాజ్ఞాపత్రము సంగతి కరణము తెలుపలే దనిరి. కరణము తా నెప్పుడో హంగికి రాజాజ్ఞ తెలిపి నిన్ననే అత్యవసరముగా తాను గ్రామాంతర మేగుచు, నురి మరి, కాపు నేళ్ళకు జ్ఞాపకముచేసి నెల్లితి ననియు, వా రబద్ధమాడుచున్నారనియు పలికెను. వా రిరువురు తాము మాణ్ణాళ్ళనుండి గ్రామములోనే లేరనియు, కరణ మెప్పుడు నిట్లే యబద్ధమాడుననియు తెలిపిరి. వారి వాఙ్మూలములు గ్రాసికొనివచ్చి మాచయ్య శ్రీనాథునకు చూపించెను. ఆయన చదివి ఇట్లాజ్ఞాపించెను.

'సరే, ఇది కొండపీసు పంపించు! వెంటనే మనముంపు మకామునకు ప్రయాణము కానలె!'

రెండు గడియలలో అందరు ప్రయాణమునకు సిద్ధమైరి. తమ ఇండ్లనుండి పట్టుకొనిపోయిన సరకులకు గ్రాసమునకు మూల్య మిప్పించుమని మాచయ్యను వేడికొన, నాతడు తా నన్నియు సరిగా లెక్కగ్రాసి పంపుచున్నా ననియు, మూల్యము రాజధానినుండి తెప్పించుకొనవచ్చునని చెప్పెను.

శ్రీనాథుడు పర్వతములను పిలిచి 'ముందు మకాముకో మన కో పాత్ర సామగ్రి యవసరము. ఈ గ్రామకరణము నింటి నుండి తీసికొన్న వన్నియు బండ్లకెత్తించి రేపు ఏనుగుపాలెము

మకాముసుండి తిరిగి శ్రీసికొనిపొమ్మని చెప్పము' అని యాజ్ఞా పించి పల్లకిలో కూర్చుండెను.

గ్రామోద్యోగులు మొత్తకొనుచు నేదో శ్రీనాథునకు చెప్పుకొనబోవుచుండ వారిని పర్వతములు దగ్గరకు రానీకుండ వారించెను. కరణము మాచయ్య కాళ్లు చేతులు పట్టుకొని తము యూరిలో జరిగినది రాజధానికి వ్రాయనద్దనియు, నష్ట మంతయు తానే భరించుకొందుమనియు బ్రతిమాలుకొనెను.

'వీలులేదు. నీకు విద్యాధికారి శ్రీనాథకవిసార్వభౌముల మహత్వము తెలియదు. నేను పంపకున్న నా తల నిలువదు. నీవే ఏనుగుపాలెము వచ్చి రేపు వారికి విన్నవించుకో, దయ తలతురేమో!'

ఏనుగుపాలె మక్కడికి రెండు క్రోశములే. అడవిదారి. అక్కడ నెలుగుబంట్ల ప్రమాద మెక్కువనయని తెలిసినది. పర్వతములు ఇద్దరు మల్లరతో ముందు సాగెను. కోసుదూరము పోగా ఎలుగులజత తమ రెండు పిల్లలతో భయంకర ఘుర్ఘుర ధ్వనితో మీదికి వచ్చెను. మల్లులిద్దరు పిల్లలను తమ గదలతో మోది సంహరించిరి. అందుపై పెద్ద ఎలుగులజంట క్రోధాంధమై వారిమీది కురికెను. వాను జంకుచుండిరి. పర్వతమల్లు నవ్వుచు ఒక్కొ దుముకు దుమికి ఆ రెంటిని పిల్లులను పట్టుకొన్నట్లు మెడలపై బొచ్చు చర్మముతో కలిపి రెండు చేతులతో ఒడిసి పట్టి, బాహువులు రెండు ప్రక్కలకు జాపి ఆకాశములోని కెత్తి పట్టెను. అవి ఎన్నో విధముల గింజకొనుచు అతనిని కొట్టుటకు యత్నించెను. కాని సాధ్యపడలేదు. అవి అలసి సొమ్మసిలి

ప్రవేలాడబడువరకు నట్లే యెత్తిపట్టియుంచి క్రింద బడవైచెను. అప్పుడు శిష్యులు వానికి ముకుద్రాళ్ళు కుట్టి స్వాధీనము చేసికొని నడిపించుకొని తరలిరి.

చీకటిపడకముందే వారు ఏనుగుపాలెము చేరుకొనిరి. ఆ గ్రామము కొండవీటిరాజ్యములో చినరిది. దానిని చుట్టి వచ్చుచున్న నారివాగు శ్రీనాథునకును పరివారమునకు ఎంతయు ప్రీతిపాత్రమైనది. అప్పు డందులో మోకాలిబంటినీరే ప్రవహించుచుండెను. అది నిండుగా నచ్చినప్పుడు దాని తాండవము చూచి తీరవలసినదే. దాని వంకలు త్రిభంగిగా నిలుచున్న యువతి శరీరభంగులకంటె నందమైనవి. ఆవల వినుకొండను, ఈవల ఏనుగుపాలెమును తన పాముమెలికలతో నది చుట్టి వేసినది.

పులిపాడు దాటిన పిమ్మట ఈఏనుగుపాలెము ఆ యాత్రికుల కెంతయు సుఖమును విశ్రాంతియు నొసగూర్చెను. ఆయూరి గ్రామోద్యోగులు గ్రామవాసులు సౌమ్యులు, సరసులు. అట్టి విద్వద్వ్యక్తుల యాగమనము తమ మహాభాగ్యముగా భావించి వారిని గౌరవించిరి.

శ్రీనాథుని విడిది కరణము భవంతిలోననే ఏర్పాటయినది. పులిపాడు కరణము నింటినుండి తెచ్చిన గుండిగలు గంగాళములు నితర పాత్రసామగ్రియు బండ్లలోనుండి దింపుచుండ, నా యింటివా రాశ్చర్యముతో తిలకింపసాగిరి. కరణము వానిపైనున్న విలాసములు కూడ జూచి, 'కవి సార్వభౌమా, మా ఇంటిలో ఐదేండ్లక్రిందట దొంగలుపడి ఎత్తుకొనిపోయిన సామగ్రి యిది!' అని విన్నవించెను.

కవిసార్వభౌముడు నవ్వుచు 'బయలుదేరబోవుచు, పులిపాదు కరణమును శిక్షించు నుద్దేశముతో నివి యిక్కడికి పట్టించితిమి. దీపు వానికై యత డిక్కడికి వచ్చినపుడు తగిన యుత్తర మిమ్ము!' అనెను.

ఆ కరణము నవ్వి, 'మాపాత్రలు సరస్వతీమాస్తులైన మీకు దెప్పించిపెట్ట బుద్ధిపుట్టినది. ఆ నాగయ్య ఇక్కడికి రా సాహసించునా!' అనెను.

ఆనాడు వా రక్కడ సుఖముగా గడిపిరి. ఈ గ్రామము ప్రక్కనున్న నారివాగు చాటినచో శ్రీ విద్యానగరరాజ్య ములో నడుగుపెట్టుటను. తను రాజ్యములో మర్యాదలకు హక్కులకు, ఆ రాజ్యములో తను మర్యాదలకు, హక్కులకు భేదముండును. ఇకముందు పరరాజ్యములో ప్రవర్తించు పద్ధతి యలవరచుకొనవలెను. ఆవలి సితిగతులు తెలిసి కొనుటకై ఆ మరునాటి ప్రొద్దున గూడ శ్రీనాథుడు ఏనుగు పాలెములోనే గడుప నిశ్చయించెను.

అక్కడికి వినుకొండ పర్వతదుర్గము రెండు క్రోశముల లోపే. దుర్గాధిపతి నల్లభరాయడు కవిపండితాభిమాని యని తెలియవచ్చినది. తను ప్రయాణము నిరాటంకముగా సాగుటకు వసతులు కల్పింపవలెనని శ్రీ విద్యానగర రాజ పురుషుల యాజ్ఞ లేకాక, శ్రీ శృంగేరీ విరూపాక్ష శ్రీ పీఠాధి పతుల శ్రీముఖము కూడ నప్పటికే చేరియుండవలెను. అందు వలన తను ముందుప్రయాణము కూడ సుఖముగానే సాగ గలదని శ్రీనాథు డూహించెను.

3

చిత్రముగా, తెల్లనాము సరికి ఏనుగుపాలె మంతయు గగ్గోలుగా నుండెను. వారి వాగున కానలి యొడ్డున పెద్దసేనత్తో వినుకొండ దుర్గాధిపతి తన చిత్ర చీనాపట కుటీరములో విడిసి యుండెనను వార్త వచ్చినది. అది అపూర్వము.

నారినాగు నర్సము కురిసినప్పుడు పెద్దదిగా ప్రవహించును. దాని మధ్యనుండియే రెండు రాజ్యముల సరిహద్దు రేఖ పోవును. ఇప్పుడు నీటి జాలు కొంచెమే యున్నందున, కొంత యీ రాజ్యమున కొంత యీ రాజ్యమున బాకచున్నది. సరిహద్దు రేఖ పొడుగున నారివాగు మధ్యమున రహదారి కడ్డముగా దడినలె కర్రలు పాతి యున్నవి. అనుమతి లేకుండ ఆ దడి దాటి వచ్చు వారిని బాణములతో కొట్టుటకు విలుకాండ్రు ఆనల సిద్ధముగా నుండిరి.

ఆనల సేనలున్నను శ్రీనాథుని పరివారము లోనివారు ఆ నాటి యుదయమున వారికెదురుగానే నారివాగులో తానము లాడి నచ్చిరి. వారి కెట్టి యలజడియు నానలి సేనలు కలిగింపలేదు. ఆ నాడు భోజనాదికములు త్వరగా కానిచ్చి మధ్యాహ్నమునకు పూర్వమే బయలుదేరవలెనని శ్రీనాథు డాదేశించెను.

బండ్లకు సామాను నెత్తిరి. ఆశ్వికులు గుర్రములెక్కిరి. యథాప్రకారము సన్నాయినేళము ముందు కళ్యాణిరాగ మాలాపనము చేయుచుండ నుత్సవము బయలుదేరినది.

ఆ యుత్సవము నారినాగున కీనలిగట్టు ఎక్కినంతనే ఆనలి గట్టున సేన సన్నద్ధ మయ్యెను. విలుకాండ్రు నాకులు సారించుచు, బాణములు దమ్ణిహస్తములతో గ్రహించి సిద్ధమైరి.

అదిగమనించి శ్రీనాథుడు తనపల్లకిని ముందుకుపోనిమ్మనెను. సన్నాయిని ఆశ్వికులను, పర్వతమల్లును, భటులను, శ్రీదేవి మేనాను, బండ్లను, అక్కడనే ఆపివేసెను. తన పల్లకిముందు వేదవిములను దుగ్గన పోతనలను వందిమాగధులను, తన ప్రక్కను కొండపీటి కరణము మాచయను ఉంచుకొని ముందుకు సాగెను. వేదఘోషతో బాలకవుల జయధ్వానములతో వందిమాగధుల కైవారములతో నాతని నీటిజాలు దాటి వాగుమధ్య అడ్డువద్ద నాగెను.

మాచయ తెల్లని ధ్వజము ముమ్మారు వీచి ఆనలి నాయకుని రమ్మని సంజ్ఞచేసెను. ఆతడు రాగానే రెండు పత్రముల ప్రతులుచూపి 'ఈ పత్రముల ప్రతులు దుర్గాధిపతులకు చేరలేదా!' యని ప్రశ్నించెను. 'అది మాకు తెలియదు. అనుమతి లేకుండ అడుగుపెట్టిన వారిని నిర్మూలింపుమని మా కాజ్ఞలు కలవు. అడుగు కదలవద్దు!' అని నాయకు డాదేశించెను.

మాచయ తన్ను దుర్గాధిపతి దర్శనమునకు గొనిపోమ్మనిన నాతడు వెడలి అనుజ్ఞ గొందినచ్చి మాచయను ఒక్కని రమ్మని యనుజ్ఞ యొసదని తీసికొనిపోయెను.

మాచయ వినీతుడై దుర్గాధిపతికి నమస్కరించి తన యొద్ద నున్న పత్రములు మౌనముగా సమర్పించెను. వల్లభరాయ

డవి చూచుచునే క్రుళ్ళిపడెను. అతడు ఆశ్చర్యము సందేహము ప్రకటించు చూపుతో మాచయను ఆపాదమస్తకము తీక్ష్ణముగా పరిశీలించెను.

'పెద్దదోపిడిమూక ఆయుధములతో దేశమును కొల్లగొట్టుచు నిటు వచ్చుచున్నదని మాకు వార్త వచ్చినదే!'

'అదేమో, నే మెరుగము ప్రభూ!'

'మొన్నటి యుదయము నుండి నిన్నటి అపరాహ్ణము వరకు పులిపాడులో విడిసి యున్నది ఎవరు?'

'నేనే ప్రభూ!'

ఆ మాటలు విని వల్లభ రాయుడు కోపముతో 'అక్కడి కరణము ఇంటిలో బలవంతముగా ప్రవేశించి తిష్ఠవేసి, కాపు ఇంటినుండి ఆహార సామగ్రి తీసికొని, నేని దొడ్డి నుండి గ్రాసాదులు దోచుకొని కొన్ని యిండ్లలోని గృహస్థులను తోలివేసి ఆక్రమించు కొన్నది కూడా మీరేనా?' అని యడిగెను.

మాచయ నిశ్చలముగా 'జరిగిన విషయములు తమరు సెలవిచ్చినట్లే చాల వరకు జరిగినవి కాని, దోపిడికాదు,శిక్ష!' అనెను.

'మీతో సాయుధసేన ఎంత యున్నది?'

'సేనయా? ఏమియులేదు. మా ధనప్రాణరక్షణకై సాయుధులైన ఇరువదినాలుగు రాశ్వికులు, పదునాల్గుమంది పదాతులు, ఐదుగురు మల్లురు నున్నారు.'

అప్పుడా డేరాలోని తెరచాటునుండి పులిపాడు కరణము, కాపు, నేడు, బయటకు నచ్చి, 'దండములు ప్రభూ! ఈ కరణమే పెద్ద గజదొంగ, అబద్ధ మాడుచున్నాడు. ఐదు వందలనుండి సాయుధ భటులున్నారు—కాదు—కాదు, నేను లెక్కపెట్టినాను. తొమ్మిదివందల తొంబదియారుమంది ఉన్నారు'— అనిరి.

దుర్గాధిపతి 'మీ పరివారమెంత యున్న' దనెను.

'పండితులు, స్త్రీలు, బాలురు, వంటలవారు, మంగలులు, చాకలులు అందరు కలసి సరిగా నూటఎనమండుగురు!'

దుర్గాధిపతికి మాచయ మాటలలో పొల్లుముక్క కనపడక పోవుటచే విశ్వాసము కలిగెను. ఆలోచించి నాయకునికి ఇట్లాజ్ఞ యిచ్చెను.

'నాయకా, నీ వీ కరణముతో పోయి యాత్రికులలో ఆసుగురుని తప్ప తక్కినవారిని నిరాయుధుల గావించి సగౌరవముగా తోడుకొని రమ్ము. స్త్రీ జనమును మా స్త్రీ జనముల పటకుటీరములోనికి చేర్పించు. మన సైనికులను, ఆయుధములు దింపియుండు డని ప్రకటన చేయుము!'

నాయకుడు ముందు తమ భటులను ఆయుధములు దింపి వేయ నాజ్ఞాపించెను. అంతట కొండపేటి కరణముతో పోయి సరిహద్దున అడ్డుదడి తీయించి, అక్కడినుండి దుర్గాధిపతి పట కుటీరమువరకు తన భటులను ఐదువిండ్లదూరమున రెండు బారులు తీర్చి నిలిపెను. శ్రీనాథునిపరివారములో ఆసుగురివి

తప్ప తక్కినవారి యాయుధములు తన భటుల స్వాధీనము చేయించి, శ్రీనాథునకు నమస్కరించి 'ఇక దయచేయవచ్చు' ననెను.

ఇప్పుడు శ్రీనాథుని యాజ్ఞచే సన్నాయి ముందుకు సాగి జయగీతము పాడెను. వందిమాగధులు శ్రీనాథ కవిసార్వభౌముని బిరుదావళి ప్రకటించుచు కైవారము లొనర్చిరి. దుగ్గన్న ప్రాతనలు విజయధ్వజములతో జయఘోష లొనర్చిరి. వేదవిదుల స్వస్తివాచనపురస్సరముగా పల్లకి దుర్గాధిపతి జేరాముందు దిగినది. శ్రీదేవి నేనా దుర్గాధిపతి పత్ని పటకుటీర ద్వారమున నాగినది.

పల్లకి దింపిన సడి విన్నంతనే వల్లభరాయని ఆనందము విరిసిన ముఖముతో ఎదురునచ్చి శ్రీనాథులకు కైదండ యొసగి లోనికి గొంపోవుచు, 'ఎంతటి మహాభాగ్యము! ఇది ఎంత సుదినము!' అనుచు ముందు శ్రీనాథాదులను సుఖోపవిష్టుల గావించి, పులిపాడులో జరిగిన దేమని ప్రశ్నించెను. శ్రీనాథుడు మాచయనంక తిరిగి 'పులిపాటి వృత్తపత్రిక రాజధానికి పంపితివా?' యని యడిగెను.

'చిత్తము. తమ యాజ్ఞకొరకు పంపక వేచి యున్నాను' అని దస్త్రములోనుండి తీసి శ్రీనాథున కందిచ్చెను. శ్రీనాథుడంచుకొని మరియు తన గంటములో నిట్లు లిఖించెను.

"ఊరు వ్యాఘ్రపురవర, మారగంబు కరణంబు
కాపు కపివరుండు, కసవు నేడు

గుంపుగాగ నిచట గురజాలసీమలో
ఓగు లెల్ల గూడి రొక్కచోట.
విద్యాధికారి శ్రీనాథ''

అట్లు వ్రాసి యా పత్రమును మాచయచే నల్లభరాయల కిప్పించెను.

రాయ డది చదువుకొనుచు ముందు రోషాగ్నిణ్ణేత్రుడై. తుదకు ఆపుకొనలేక కడుపుబ్బ నవ్వసాగెను. పులిపాడు గ్రామోద్యోగులకై వెనుదిరిగి చూడగా వా రిక్కడ కనిపింప లేదు. ఇంతలో వారిని భటులు కట్టితెచ్చి డేరాక్రింది సందు నుండి పారిపోవుచుండగా పట్టుకొని తెచ్చితిమని విన్నవించిరి.

వల్లభరాయడు శ్రీనాథునితో 'ఈ పత్రము కొండపీటికి పంపవచ్చును. వా రేమిశిక్ష విధింతురో మాకు తెలియదు. మాచేత వృథాగా ఇంత సేనాసన్నాహము చేయించినందుకు విచారించి కొంచెమైనను శిక్షింపక తప్పదు' అని ఆ పత్రము నా ముగ్గురికి చూపి 'మీ రేమైన చెప్పుకొనునది ఉన్నదా?' అని యడిగెను. వారు 'చిత్తము, చిత్తము, చి...చి...చిత్తము' అనుచు వంగి దండములు పెట్టుచు నిరుత్తరులై యుండిరి.

'నాయకా, ముందు కరణమును నిలువబెట్టు!'
నాయకు డటు చేయ, 'నీవే రేమి?' అనెను.
'నాగయ్య ప్రభూ!'
'కాదు ఉరగము! శ్రీనాథభట్లు సెలవిచ్చినారు. రొమ్ములో ప్రాకు విషకీటకమవు! అక్కడినుండి రొమ్ములో ప్రాకిపోయి

వారి పాదములు పట్టుకొని: ఆతని బట్లు చేసినంతట కాపురు నిలువబెట్టిరి.

'నీ పేరేమి?'

'హనుమంతయ్య!'

'కామ కపివి. నీవు నీ పుచ్ఛము తగిలించి ఈ డేరాకు ముమ్మారు ప్రదక్షిణము చేయించు!'

అది జరిగిన తర్వాత నేకును నిలువబెట్టిరి.

'నీ పేరేమి?'

'గడ్డెయ్య!'

'సరిగా చెప్పినావు. నీనోట గడ్డి కరిపించి డేరాకు ముమ్మారు ప్రదక్షిణము చేయించు!'

అదియైన తర్వాత ఆ ముగ్గురిని నిలువ బెట్టిరి.

'మీ యూరి పేరేమి?'

'పులిపాడు ప్రభూ!'

'శ్రీనాథభట్టోపాధ్యాయులు వారి సంస్కృతభాషాభిమానముచే మీ యూరికి లేని గౌరవనామ మిచ్చి కొంచెము అనౌచిత్యమే ప్రదర్శించినారు. వ్యాఘ్ర మేమిటి? పులి—పాడే! మా సీమలోనిదైనచో లేపీపాటికి పాడు పెట్టించి పేరు సార్థకము చేయించి ఉందును. పొండి! ఒళ్ళు దగ్గర పెట్టుకొని బ్రతుకండి!'

వారు వెళ్ళినతర్వాత వల్లభరాయడు శ్రీనాథునివంక తిరిగి 'మీ సప్తశతిలోని పద్యములు శృంగారనైషధములోని గద్య

పద్యములు అన్నియు నాకు కంఠస్థములు. విద్యాధికారులు పరీక్షింపనవ్వనను!' అనెను.

శ్రీనాథుడు 'తక్కిన నక్కరలేదు కాని నా వ్యాఘ్రపురనగర నామములోనలెనే అనే చిత్యములు గుర్తించినవి మూడు సెలవిండు!' అనెను.

వల్లభరాయుడు పొంగిపోయెను. 'అది నెమ్మదిగా రాత్రికి! మందు రాజ్యావహారము మనము చూడవలెను — సరేకాని ఈ అల్పహాసమేమిటి? ఈ సన్నాయి కొండపీటికి పంపి వేయండి. ఆయుగురిని భటులనో, ఆశ్వికులనో సాయుధులను ఉంచుకొనుటకు శ్రీ విద్యానగరమునుండి యనుమతి నచ్చినది. వారి నుంచుకొని తక్కినభటులను పంపివేయండి, తక్కిన పరివారము సంగతి మీ పీలువెంట చేయవచ్చును.'

'మా వెంట పదివేల సువర్ణముల భార మున్నది. స్త్రీజన మున్నారు. ఈయడవులలో రక్షణలేనిది యాత్ర సాగు టెట్లు?'

'మీ సువర్ణ మెంతైనను భయములేదు. అది మా అచ్చు కావలి కప్పగింతును. దారిలో సెలవైనదిపోను తక్కినది మీకు విద్యానగరములో నప్పగించు నేర్పాటు చేసెదను.'

'మరి మా రక్ష?'

మా రాజ్యములో సుగ్రీవాజ్ఞ చెల్లుచున్నది. మా రాజధాని సుగ్రీవరాజధాని యగు పంపాక్షేత్రసీమగదా! మా రాజమార్గములు నిష్కంటకములు, ఐనను క్రూరమృగాదుల వలని భయము లేకుండ మా రక్షకభటులే మీ పరివారమును

రక్షచేయ నాజ్ఞలు వచ్చినవి. మీరు చేయపోవు మజిలీ లన్ని టిలో సమస్త సౌకర్యములు-వైద్య సహాయముతో సహా ఏర్పాటైనవి.'

శ్రీనాథు డంగీకరించెను. అంతట నించుక సందేహించుచు వల్లభరాయ లుపక్రమించెను.

"శ్రీనాథభట్టా, మీరు నిజముగా కవిసార్వభౌములే. మీ రిప్పటికి పొందిన యితర బిరుదములును ఉచితములైనవే, కాని యవి మీకు కొండవీటిరాజ్యములో లభ్యమైనవి. అవి మా విద్యానగరరాజ్యములో చెల్ల నేరవు?-"

శ్రీనాథుడు ఆశ్చర్యముతో తలయెత్తి ప్రశ్నించు చున్న వానివలె చూచుచుండ వల్లభరాయడు సాగించెను.

'అవును! ఆ బిరుదలాంఛనములు మా విద్యానగర రాజ్యములో ధరించుటకు అనుజ్ఞ లేదు. మరల మాప్రభువుల సమక్షములో నట్టి బిరుదములలో, అధికమైనవో, పొందినచో, మారాజ్యములో చెల్లును. కావున మీ యాబిరుదలాంఛనము లన్నియు ఇక్కడనే ఉంచి పోవలెను. మీరు తిరిగి కొండవీటి రాజ్యమునకు వెళ్ళునపుడు కొనిపోవచ్చును మా దుర్గములో నంత వరకు భద్రముగా ముద్రలు వేసి పదిలపరపించెదను.'

ఆ మాటలు మర్యాదగా నున్నను నిష్కర్షగా నున్నవి. శ్రీనాథునకు సందు దొరకలేదు. 'మీ రన్నది బాగున్నది. మా బిరుదము లీ నారివాగుకడ శ్రుతపర్వతదుర్గములో నుంచెదను. మా వందిమాగధులను గూడ పంపివేసెదను. చిగ్గనా, మన బిరుదలాంఛనము లన్నియు తీసికొనిరా!'

దుగ్గనయు, పోతనయు వడినడి నవి తెచ్చుచుండ వారిని జూచి ముచ్చటపడి నల్లభరాయడు 'ఈ కేతిగాళ్ళు ఎవరు?' అని యడిగెను.

'కేతిగాళ్ళు గారు. ఒకరు హనుమంతులవారు. సంజీవి పర్వతహర్తలు. ఒకరు జాంబవ - కాదు గయత్మంతులవారు అమృతహర్తలు!'

బిరుదలాంఛనము లన్నియు పెద్ద పెట్టెలో భద్రపరపించిన పిమ్మట వల్లభరాయడు లేచి 'తమ రిప్పుడు కేవల శ్రీనాథ భట్టోపాధ్యాయులరు. నాకు పరమపూజ్యులరు. కామకాయనస విశ్వామిత్ర గోత్రః ఆశ్వలాయనసూత్రః వల్లభరాయ శర్మా అహం భో అభివాదయే!' అనుచు భక్తితో పాదాభినందనము చేయ నాతని వైదికనిష్ఠకును ఔచిత్యమునకును ప్రీతుడై శ్రీనాథుడు మనసార నాశీర్వదించెను.

శ్రీనాథుని సపరివారముగా వల్లభరాయడు బలవంత పెట్టి వినుకొండలో తన మందిరమునకే కొంపోయి రాజ భోగముగా నాతిథ్య మొసగెను. అంతట నా రాత్రి విద్యా వినోదము సాగినది. వల్లభరాయడు సాయంకాలము వాగ్దా నము చేసినట్లు శృంగార నైషధములోనుండి మూడు పద్యములు వినిపించి మూలముతో పోల్చి అనౌచిత్యములు నిరూపిం చెను. అందులో మొదటి దిది.

"పవి సంగంబున దాపమొందిన శచీప్రాణేశు కెంగేలికిం
జివురుం గైదువుజోదువైద్య ముపదేశించెన్ రహస్యంబుగా

నవనీహార పయోమిళన్మలయజ స్నానార్ద్రిపర్యంతమై
యినతాక్షించు విదర్భరాజతనయా హృద్యస్తనద్వంద్వమున్
మూలమున స్వాగతవృత్తముఁగో పవిత్రమగు కరగ్రహో
పదేశ. ముండగా మీరు వృథాగా వేశ్యలకు చెప్పినట్లు మరొక
గ్రహణమును మత్తేభములో రెండు పాదములలో సాగించి
ఉపదేశింపఁజేసినాఁడు.' దాని మీఁదను మిగిలిన వాని మీఁదను
పండితులు కొంద ఱాను, కొందఱు కాదు, అని వినోదముగా
వాదించిరి. శ్రీనాథుడు వల్లభరాయల నిశిత పరామర్శకు
సంతసించి,

"ప్రాతఃకాలమువాయసంబు పణినాపత్రోక్తశాస్త్రంబులో
దాతజ్ఞానులు సెప్పఁడెవ్వియను చందంబొప్ప గోకాయనం
జాతుర్యం బలరాద నుత్తరము విస్పష్టంబుగా గోకిల
వ్రాతంబిచ్చెఁ తుహీఁతుహీఁయనిగృహారామప్రదేశంబులన్"

అను పద్యము చదివి 'ఇట్టిచోట్ల సంస్కృతమునకు డుము
వులు చేర్చినామని కొందరి మతము. మీ అభిప్రాయమేమి?
అని యడిగెను.

'అయ్యయ్యో! ఆ మాట లనువారు భట్టహర్షుని కవితాను
గుంభములు కొనియాడలేని సోమరిపోతులు. లేజవరాలు
చెక్కుగీటిన వసవల్చు బాలకులు డెందములం గలగంగ
నేర్తురే? ఆ పణినాపత్యమువద్ద మావైయాకరణులు చిక్కు
పెట్టుచున్నాఁడు' అని వల్లభరాయలు ఉత్తర మిచ్చెను.

ఆ రాత్రి యందరు సుఖనిద్రపోవుచుండగా పోతనకు ధను
ర్ధరులగు నిద్దరు మునివేషధారులు శోకక్లిన్నముఖములతో కని

పించిన్నెట్టి సీతే సీతే అను పిలుపువిని ఉలికిపడిలేచెను. ప్రక్కనే నిదురించుచున్న దుగ్గన్నను లేపి చెప్పగా, 'పడుకోరా, పోతనా ఇదేమీ క్రొత్తకాదు, పూర్వము రామలక్ష్మణులు ఇక్కడనే సీతాపహరణవార్త జటాయువువలన విని పలవించిరి. వారి ఆర్తధ్వని నేటికిని ఈ శ్రీశైలపర్వతకందరములు ప్రతిధ్వనులీనుచుండును. అదిగో నాకును ఆ పిలుపు వినబడుచున్నది' అని చెప్పెను. వారిద్దరు చాలసేపు రామాయణకథా ప్రసంగ స్మరణములు చేయుచు నిద్రించిరి. తెల్లవారుజామునసే శ్రీనాథుడు పయన మయ్యెను గాని నల్లభరాయడు ఆపి, తన యాస్థాననటులచే రానిపాటిత్రిపురాంతక రచితమగు ప్రేమాభిరామమను సంస్కృతపీఠిని ప్రదర్శింపజేసెను. దానిని తా నాంధ్రీకరించుచున్నానని కొన్ని పద్యములు వినిపించెను.

ఆ మధ్యాహ్నమే శ్రీనాథుడు సపరివారముగా ప్రయాణ మగుచుండ, వారిని సాగనంపుటకై వల్లభరాయడు అశ్వా రూఢుడై కొంతదవ్వుగుడెంచెను. పురద్వారముదాటగానే శ్రీశైలపర్వతారణ్యముల వైపుననుండి నలుగురు చెంచు యువతులు వారి కెదురైరి. వల్లభరాయని దృష్టి వారి యందముపై ప్రసరింపగా దుర్గాధిపుని దృష్టి ననుసరించి శ్రీనాథకవి దృష్టియు నటు మరలినది.

'శ్రీనాథ కవీంద్రా, మీకు శుభశకున మైనది, సెలవు తీసి కొందును. మీకు సమ్మతమైనచో మీ రాకకు స్మృతి చిహ్నముగా నాకొక చిన్న పద్యము ప్రసాదింతురా?'

"మీవంటి సహృదయార్థిని రిక్తహస్తములతో పోనిత్తునా?
'గిట గిటనగు నెన్నడుములు
పుటపుటనగు చన్నుగనలు పున్నమనెలతో
జిటపటలాడెడు మొగములు
కటితటముల కొమరు శబరకాంతల కమరున్.'
'మహాప్రసాదము కవీశ్వరా, సెలవు!' అనుచు శ్రీనాథుని యాశీర్వాదము పొంది వల్లభరాయడు తిరిగిపోయెను.

అతడు దూరము పోయిన తపువాత అశ్వారూఢులై యుత్సాహముతో పోవుచున్న దుగ్గన పోతనలు ఇటు బిగ్గరగా సంభాషణ మారంభించిరి.

పోతన : మీ బావ కవిత్వమంటే వినుకొండరాయలకు ఎంత యభిమానము! మా రాచకొండలో ఎందరికో శృంగార నైషధములోనివి, శాలివాహన సప్తశతిలోనివి, ఎన్నెన్నో పద్యములు నోటికి వచ్చును కాని యింత సూక్ష్మముగా అన్ని నోటికి వచ్చినవారు కొండవీటిలో గూడ కనబడలేదు.

దుగ్గన : ఇంకొక చమత్కారము గమనించావా? నేటి ఉదయమునుండి రాయడు మా బావను పిలిచేతీరు మాట్లాడబోయే నైఖరి, కూర్చుండే పద్ధతి, నడిచే విధము పద్యము చదివే ఫక్కి, అన్నీ వంకరలత్రోక్కి సహా, అనుకరిస్తున్నాడు, పరిహాస మేమో, అని మొదట నాకు కొంత కోపము రాసాగినది, తుదకు గౌరవమే అని తేల్చుకున్నాను.

పోతన : అంతేనా, నీవు గమనించినది!

దుగ్గన : ఆయన క్రీడాభిరామము పద్యాలు సరిగా మా భావ పద్యాలే అనుకొన్నాను. చెప్పకపోతే మా భావ వ్రాసినవే హరించినా డనుకొనేవాడను.

పోతన : వెర్రి దుగ్గనా, ఏమి నీ తెలివితేటలు! ఆయన పద్యాలలో మీ భావ పద్యాలలో లేని రెండు విశేషా లున్నవి.

దుగ్గన ఉలిక్కిపడి ఎర్రపడ్డముఖముతో 'ఏమిటో అవి?' అన్నాడు. అతనికి భావకంటె విశిష్టత కలవాను ఉండుట రుచింపదు.

పోతన : ఏమిటా? చెప్పమంటావా? పద్యము ధాటీగా సాగిపోతూ మధ్య నీరస నిరర్థక పదాలు పడడము ఒకటి, ఆ తీగ సాగుడులో వ్యాకరణదోషాలు దొర్లడము రెండు.

దుగ్గన పకపక నవ్వినాడు. ఈ సంభాషణము శ్రీనాథుని చెవులలో బడినది. 'వృద్ధిలోనికి రాదగినవాడే' అనుకొనెను.

వల్లభరాయడు అన్నట్లే వారి విజయనగరయాత్ర యెట్టి యెడిదొడుకులు లేకుండ సాగుచున్నది. రోజుకు సామాన్యముగా రెండు యోజనముల చొప్పున పరిక్రమించుచున్నారు. మహాశివరాత్రినాడు నిలిచినబసలోనే ఉపనసించి శ్రీశైల మల్లికార్జునుని దిక్కు మొగమై మహాశివరాత్రదీక్షానియమ ముత్తో జాగరము లెనిమిదింటను రుద్రాభిషేకములు కావించి మరునాడు విందుకుడిచి ప్రయాణమైరి.

వారి యాత్రలో మధ్యమధ్య నొక్కటే చిక్కు తటస్థించుచు వచ్చెను. వెంటదెచ్చుచున్న వరి బియ్యము తరుగుచు

వచ్చినప్పుడు మజిలీ గ్రామములలో బియ్యము దొరకనందున అప్పుడప్పుడు జొన్నన్నము, సజ్జన్నము, మొక్కజొన్నన్నము తినక తప్పుటలేదు.

అట్లు జొన్నన్నముప్రాప్తమైన మొదటిరోజున భోజనవేళలో ఎవ్వరికి ముద్ద మ్రింగుడు పడలేదు. లక్కనసూరి శ్రీనాథుడర్చించు మహేశ్వరుని సంబోధించి యిట్లనెను.

"గరళము మ్రింగితి నంచుం
బురహర, గర్వింపబోకు, పో పో పో నీ -
బిరుదిప్పుడు కాననచ్చెడి
మెరసెడి రేనాటి జొన్న మెదుకులు తినుమా!'.

శ్రీనాథుడు 'మా మహేశ్వరు డినియు హరించుకొన్నాడు. చేతకానిది మనకే!' అనెను.

అట్టి యవస్థయే కుందుగడ్డలో తటస్థించినది. గ్రామీణులాదరించి పుష్కలముగా సరకులిచ్చి భోజనార్థమై పచ్చి ముత్యములవలె మెరమెర లాడుచున్న మొక్కజొన్న లొసగిరి. జనులు మరియొక ధాన్యము ఆరగింతురని కూడ ఎరుగనట్టి అమాయికులు. ఆ కొండభూములలో కష్టపడి పనిచేయుటచే ఉన్నతకాయులై, బలిష్ఠులైయుండిరి. శ్రీ విద్యానగర ప్రభువుల సేనలో భటుల నెందరినో అక్కడినుండియే ఏరుకొనుచుండిరని గ్రామోద్యోగులు సగర్వముగా విన్నవించుకొనిరి. శ్రీనాథు డెంతయు ప్రీతుడై ఈ పద్యమును చెప్పెను:

'మందరాద్రిసములు మానవు లందరు
చందమామ కూన లిందుముఖులు
కందులేని మౌక్తికంబులు జొన్నలు
కుందనంపుబెడ్డ కుంచగడ్డ.'

కరణము వెంటనే ఊరి అగసాలిని పిలిపించి రాగిచేకుపై నా పద్యము వ్రాయించెను. ఇప్పటికిని ఆ యూరిలో రకిచేకులపై నీ పద్యమే మంత్రమువలె లిఖించుచుందురు.

మొత్తముమీద నిట్టి చమత్కారములే తప్ప ఎట్టి విపరీతములు లేకుండ ప్రయాణము సాగినది. అట్లు సాగి సింగన ప్రధాని ముందుగా నిర్ణయించిన ప్రకారమే, వారు కొండపేటి నుండి బయలుదేరిన ఇరువదియొకటవనాటి మధ్యాహ్నవేళకు శ్రీ విద్యానగర బహిఃప్రాకార ప్రాచీగోపురము సన్నిధికి చేరికొనిరి.

౪

నాటి శ్రీ విద్యానగరము మహావైభవముతో నలరారు చుండెను. ఆ మహానగరము తుంగభద్రానదికి దక్షిణతీరమున గలదు. ఒక ప్రక్క మాల్యవంతమును, నింకొకప్రక్క మతంగగిరియు, హేమకూటమును కలవు. ఆ పర్వతములను చుట్టియు దాటియు దక్షిణదిక్కుగా పెరుగుచు, పూర్వ మరణ్యప్రదేశముగా నుండిన భాగము లాక్రమించుకొని, పశ్చిమమున పంపాపురము, కృష్ణాపురము, కడిరామపురము,

నాగలాపురములను, ఆగ్నేయమున కమలాపురమును, ఈశాన్యమున నింబపురమును, ఇంకను నెన్నియో పల్లెలను తనలో కలుపుకొన్నది. దానికి ఏడు ప్రాకారములు కలవు. అన్నిటిలో వెలుపలి ప్రాకారమునకు రాజ్యములో నలుదిక్కుల నుండి నాలుగు మహారాజమార్గములు ప్రవేశించు నున్నత గోపురద్వారములు కలవు. వానిలో పశ్చిమద్వారమునుండి ఉత్తరద్వారమునకును, ఉత్తరద్వారమునుండి దక్షిణద్వారము వరకును రెండు రెండు యోజనముల దూరముకలదు.

వానిలో నుత్తరద్వారము శ్రీ విరూపాక్షేశ్వరాలయమున కొక్కించుక తూర్పుగా కలదు. ఉత్తరమున నానెగొంది వైపు నుండి వచ్చువాడు తుంగభద్రానదిపై వంతెనదాటి యీద్వార మున వత్తును. నది కుత్తరమున ఋష్యమూకము, అంజనాద్రి యున్నవి.

ఆ మహారాజ్యమునకు పశ్చిమ సముద్రతీరమున నెన్నియో రేవులు కలవు. అటునుండి వచ్చు విదేశనౌకలును, యాత్రి కులును నాగలాపురము (ప్రస్తుతము హొన్నావరము) ద్వారము నుండి వత్తురు. దక్షిణమున చోళ, పాండ్య దేశములనుండియు, అక్కడి రేవులనుండియు వచ్చువారలు కమలాపురపు సింహ ద్వారమున వచ్చుచుందురు.

ఆంధ్రదేశమునుండియు, అచ్చటి రేవులనుండియు వచ్చు వారు మాల్యవంత సమీపమున గల తూర్పుద్వారమున వచ్చుచుండిరి. శ్రీనాథభట్టు తన పరివారముతో ఆ ద్వారము నెదుటికే చేరికొనెను.

గోపురము దూరమున నుండగనే వారికి అపూర్వదృశ్యము కనబడినది. ఆ ప్రాకారము బాహున బయట విశాలమగు వాహ్యాళిప్రదేశము కలదు. దానికి వెలుపల బాహున నిలువెత్తు గల శిలాస్తంభములు నిలుపబడి యున్నవి. అవి ఒకదానిఁగో నొకటి యంటి లేకున్నను, వానినడుమనుండి మనుష్యులు దూరి పోవుట కష్టసాధ్యము. అశ్వాసులు దూరలేవు. దీనివలన వాహ్యాళి ప్రదేశము గుర్తింపబడుటయేకాక, ఈ శిలాపరం పర శత్రువులను ప్రాకార సమీపమునకు సులభముగా రానీ కుండ కొంతవర కడ్డుకొనజాలికూడ నుండెను.

గోపురద్వారము ఎత్తై బలిష్ఠమైనది. అక్కడ రక్షకభటులు రాత్రింబవళ్ళు కాపుండుదురు. క్రొత్తగా నగరప్రవేశము చేయువా రందరును తల కింత, బండి కింత, గుర్రమున కింత, పల్లకి కింత, మేనా కింత—ఇత్యాదిగా నిర్ణీతమైన నగర ప్రవేశ సుంకము చెల్లింపనిది నగరప్రవేశము చేయరాదు. వచ్చినవారి నామాదికములు వ్రాసికొనుట, తెచ్చిన వస్తువులు పరీక్షించుట మొదలగు తతంగ మెంతో జరుగవలెను. దానికే సామాన్యముగా, నొక రోజంతయు పడికా పుండవలెను. అక్కడి కొండపీటి స్థానాపతి పంపున నాతని కరణముబాచప్ప ముందు మజిలీలోనే కలసికొని అన్ని యేర్పాట్లు చేయించి యున్నందున, నాలుగు గడియలకంటె ఆలస్యము కాకుండ శ్రీనాథుడు సపరివారముగా నగర ప్రవేశము చేయగలిగెను. అక్కడి ద్వారపాలకుడు వారి అధికారపత్రాదులు పరీక్షించినను, పూర్తిగా విశ్వసింపక, వారివెంట తన యాశ్వీక

భటులను కొందరిని పంపి, వెంటనే వేగరిచే కటకపాలునకు వారల యాగమనవార్త అందజేసెను. రహస్యచరులగు నా విద్యానగరాశ్వికులు కూడ శ్రీనాథబృందమునకు రక్షక బృందమై వైభవాతిశయము కల్పించిరి.

శ్రీ విద్యానగరవైభవము ముఖ్యముగా వామనభట్టబాణుని వలన వినియున్నను, ప్రత్యక్షదర్శనము శ్రీనాథుని యూహనే అతిశయించెను. దానికి ప్రధానకారణము అప్పటి ప్రభువగు దేవరాయలు క్రొత్తగా నగరమునకు కల్పించిన నీటివసతియే. వామనుమున్నప్పు డదిలేదు. దేవరాయలు సింహాసన మధిష్ఠించిన వెంటనే తన సపత్నులచే దూరమున నున్నత ప్రదేశమున తుంగభద్రకు ఆనకట్ట కట్టించి, ఖనకులచే నక్కడినుండి నలు మూలలకు కాలువలు త్రవ్వించి, శిల్పులచే వానిని మనోహరముగా శిలానిర్మితకుల్యలుగా కట్టించెను. అందువలన నగరమున జలసమృద్ధి కలిగినది. నగరము ఉద్యానములతోడను పుష్పఫలవృక్షములతోడను, వెలుపలి ప్రాకారములు సస్యక్షేత్రములతోడను నేత్రపర్వ మొనర్చుచుండెను. జనబాహుళ్యము అతిశయించినది. సుందరమందిరములును విరివిగా వెలయ జొచ్చినవి.

శ్రీనాథునికి వసతి గృహము శ్రీ విరూపాక్షేశ్వరాలయమునకు తుంగభద్రానదికిని సమీపమునను, మతంగగిరికి ఈశాన్యముగను స్థానాపతి సేర్పరచెను. అక్కడికి చేరుటకు అన్ని ప్రాకారములు చాట నక్కరలేదు. మొదటి రెండుప్రాకారములకు మధ్య కోసి కుప్పలు వేసియున్న శాలిక్షేత్రములు చూచి

శ్రీనాథు డానందించెను. రెండవ ప్రాకారము దాటగానే మాల్యవంతమును వారు సమీపించిరి, వారు దానికి అర్ధ ప్రదక్షిణము చేయ వలెను.

వెంటనే శ్రీనాథుడు పల్లకి యాపి దిగెను. నేనా నుండి శ్రీదేవి దిగెను. దుగ్గన పోతనలు గుర్రములనుండియు బండ్లలోని వారును వారి వారి వాహనముల నుండి యవతీర్ణులైరి. విద్యా నగరాశ్వికులుకూడ నర్థము కాకున్నను దిగిరి. శ్రీనాథు డిట్లు వారల ప్రబోధించెను.

"ఇదుగో మాల్యవంతము! శ్రీరామలక్ష్మణుల శ్రీపాదవిన్యా సములచే పవిత్రమైన దీ క్షేత్రము. సుగ్రీవ హనుమ జ్జాంబవ దంగదాది మహాకపివీరుల సింహనాదములతో ప్రతి ధ్వనించిన దీ మాల్యవంతము. రాఘవుడు విజయయాత్రకు రణభేరి వేయించిన దీ మాల్యవంతము గిరిపృష్ఠమునదే.* దీనిపై రఘునాథస్వామి వెలసి యున్నాడు."

ఇట్లనుచు నాతడు వెంటనున్న బంగరుకొమ్మ్రిచెంబులోని యుదకము గ్రహించి ఆచమించి ఆత్మప్రదక్షిణ మొనర్చి మాల్యవద్గిరిపృష్ఠమునకును అందుపై వెలసిన రఘునాథ స్వామికిని సాష్టాంగ దండప్రణామ మాచరించెను. శ్రీదేవియు

---

* స తదా వాలినం హత్వా సుగ్రీవ మభిషిచ్యచ
వస న్మాల్యవతః పృష్ఠే రామో లక్ష్మణ మబ్రవీత్.
రామా. కి. కాం. అ. 28. 1. శ్లో.

యాత్రిక బృందమును శ్రీనాథు ననుకరించిరి. దుగ్గనకు పోతనకు ఆనందబాష్పములు ధారలుకట్టెను. నిత్యదర్శననుచే నిన్నాళ్లు మహత్వము గ్రహింపకుండిన విద్యానగరాశ్వికు లది కాంచి యాశ్చర్యచకితులై గిరినందన మొనర్చిరి. మాల్యనంతము దాటి పాన్సుపారీబజారు* చేరునంతవరకు వారు అందరు పాద చారులై పరిక్రమించి అక్కడ ఎవరి వాహనములు వా రధిష్ఠించిరి. వా రుత్తరముగా సాగిరి.

ఆ రాజవీథివైభవము వర్ణనాతీతము. అది దీర్ఘమై ముందు వెనుకల కనుచూపు మేర దాటి వ్యాపించి యుండెను. అది సువిశాలమైనది. రెండుప్రక్కల వర్తకులు సుగంధద్రవ్యములు, తములపాకులు, పోకలు విక్రయించుకొనుటకు తమ యంగళ్ళ ముందు రమ్యముగా మంచెలు కట్టుకొనిరి. వాని ముందా రాజమార్గము పొడవునను అసంఖ్యాకముగా పుష్పలావి కలు పరిమళభరితములగు వివిధజాతులపుష్పములను మాల లను విక్రయించుచు నాకర్షించుచుండిరి. వా రట్లాకర్షించి నను ఆ వీథిలో పాదచారులే కాక అశ్వములు, ఏనుగులు, బండ్లు, పల్లకీలు మున్నగు వాహనముల మీద వెళ్ళువారు కూడ గుంపులుగుంపులుగా రాకపోకలు సలుపుచున్నను అందరు నొత్తిడి లేకుండ జనుటకు చాలినంత విశాలముగా నా వీథి యుండెను. ఆ యశేషజనసమూహములో స్త్రీలేమి, పురుషులేమి, పూవులు సిగలలో ముడువ కుండను మాల్యము లలంకరింపకుండను పోవువాడు లేదు. అన్నిటిలో

---

* ఆ తర్వాత 24 సం. లకు దర్శించిన అబ్దుల్ రజాక్ భాష.

వారికి గొజ్జంగిపూలన్న నధికప్రీతి. ఆ వీధియంతయు గులాబిపూల యామోదముతో గుబాళించుచుండెను.

శ్రీదేవి గులాబిదండ తీసికొని మేనాలోని దేవసంపుటము నలంకరించెను. శ్రీనాథుడు పల్లకి నాపి కరణముచే నందరికిని పూలదండలు గులాబివి, మల్లెలవి, మొల్లలవి, జాజులవి, విరజాజులవి, చేమంతులవి, శేఫాలికలపి, పొగడలవి, ఎవరి కిష్టమైనవి వారికి కొనిపించి, పరివారజన మందరికే కాక శ్రీ విద్యానగర రక్షకులకును ఇప్పించి యలంకరింపజేసెను. వారు శ్రీనాథుని రాజవీధికిని వితరణకును ముగ్ధులైరి.

ఆ రాజవీధి నుండి ఇరువైపులకును పెద్దపెద్ద వాడలు వ్యాపించి యుండెను. ఒకొక్కవాడలో ఒకొక్క దినుసు వస్తువులే విక్రయించుచుండిరి. రత్నాలవాడలో వజ్రవైడూర్యములు, మాణిక్యములు, పచ్చలు, పడగములు, నీలములు, పద్మరాగములు, ముత్యములు విచ్చలవిడిగా రాసులుగాబోసి నిర్భయముగా విక్రయించుచుండిరి.

వారు కొంచెము సాగినంతనే కుడివైపున నింబపురమును దాని కానల తలనరిగట్టును తగిలినవి. ఆ గట్టు నానియు గట్టుపైనను విద్యానగర రక్షకుల గృహములును ఉద్యోగుల సౌధములును వరుసలు తీరి యుండెను. పై యుద్యోగులు కాక పడికావలికాండ్రే ఆ నగరమున పండ్రెండు వేలమంది కలరు. వారికి ఒకొక్కనికి రోజు కొక పణము జీతము. ఆ మహానగరములోని వేశ్య వాటికలపై వసూలగు సుంకము

వలననే నగరరక్షకుల జీతభత్తెములు చెల్లుచుండెనని వెంట నున్న రక్షకులు తెలిపిరి.

వారు కొంతవడి ఉత్తరముగా సాగి పశ్చిమమునకు తిరిగిరి, వారి కప్పుడు కుడిప్రక్కను శ్రీ విరూపాక్షేశ్వరుని ఆలయ గోపురమును వామపార్శ్వమున హేమకూట మతంగగిరి శిఖరములును సౌధాగ్రములనుండి కానవచ్చినవి. మరల శ్రీనాథుడును, పరివారమును, వాహనములు దిగి శ్రీ విరూపాక్షేశ్వర స్వామికిని మతంగగిరి హేమకూటములకు ప్రణమిల్లిరి, అంతట నందరు పాదచారులై నడచి ఆ సమీపమునకే స్థానాపతి తమకు ఏర్పరచిన విడిదికి చేరిరి. అది చక్కని యుద్యాన మధ్యమున నున్న విశాలచతుశ్శాలభవనము, అక్కడ స్థానాపతి వారిని సపరివారముగా నెదుర్కొని ఆదరించి భవనములో ప్రవేశపెట్టి కొండపీటివార్త లడిగి తన గృహమున కేగెను.

అంతవరకు వెంట వచ్చుచున్న నగర రక్షకులు పల్లకిలో వచ్చుచున్న శ్రీనాథు డొక్కడే విద్వాంసుడును, విద్యాధికారియు నని భావించిరి. బండ్లలోనుండి ఒక్కొక్కరే దిగుచుండగా వారిని స్థానాపతి పూజించుచున్నవిధము చూడగా వారు విద్వాంసులో, ఉద్యోగులో ఐ ఉండవలెనని నిశ్చయించిరి. ఆ దిగుచున్నవారిలో గొందరయెడ శ్రీనాథుడు ప్రదర్శించిన వినయగౌరవములచే పలువురు మహావిద్వాంసులై యుండవలెనని స్పష్టమైనది. ఏమి, ఈ కొండపీటి పండితులు శ్రీవిద్యానగరముపై దండువచ్చినారా యని

పించినది. వాగి నాయకు డా రాత్రియే కటకపాలుని దర్శించి భయసంభ్రమములతో 'ప్రభూ, ప్రభూ, కొండపేటి విద్వాంసులు, కవులు మన నగరముపై దండువచ్చి శ్రీవిరూపాక్షేశ్వర స్వామి యాలయసమీపమున బ్రాహ్మణవాడలో పెద్దభవంతిలో విడిసినారు' అని విన్నవించెను.

స్వయముగా విద్వాంసినోది యగు కటకపాలుడు నవ్వి, 'విద్వాంసులా దండెత్తి వచ్చినది? వారి వద్ద ఆయుధము లేమున్నవి?' అని ప్రశ్నించెను.

'ఆయుధములా ప్రభూ! అనుమతి పొందిన ఆయుధపాణులు ఆసుగుదే వారివెంట నున్నారని తను దివాణమునకు ద్వార పాలకులు వార్త పంపినాడు. వారి వెంట నున్నవారిలో ఒకడు మనిషిగా లేడు. రాక్షసుడో, యక్షుడో వలె ఉన్నాడు. వాని చేతిలో గద మూబోంట్లము పదిమందిమి పట్టినగాని మోయ లేము.'

'అతడు కూడ విద్వాంసుడేనా?'

'ఐ యుండవలె. వాడు పర్వతమువలె మహాకాయుడు. అంత శరీరమున్నా, లేడివలె చురుకుగా గంతులు వేయును. అడుగడుగునకు ఏనుగు అడుగుపెట్టినట్లు భూమి దద్దరిల్లు చున్నది. అతడు మల్లవిద్యలో సాటిలేనివా డని తోచును.'

'తక్కిన విద్వాంసులవద్ద ఏ మాయుధము లున్నవి?'

'వారి బండ్లలోనుండి ఎన్నెన్నో సుందరకోశములు దిగినవి. వారి వాక్కులే ఆయుధములుగా తోచినవి. కొందరు

వేదఘోష చేయుచుండిరి. కొందరు ఏనేమో శాస్త్రములు చర్చించుచున్నట్లున్నారు. కొందరు సంస్కృతాంధ్రముల లోనేకాక, 'శౌరసేని' మొదలగు ప్రాకృత భాషలలో గూడ ధారాళముగా శ్లోకములు గాథలు చదువుచు, ఆనందముతో తర్క విమర్శనములు సలుపుచున్నారు. వారి నాయకుడు రాత్రి నేళ దేవతార్చన చేయుచుండగా కొందరు ఉచ్చైఃస్వరముతో శాస్త్రములు చెప్పినారు.'

'అప్పు డేమైనది?'

'ప్రభూ, నా రా శస్త్రములు చెప్పుచుండగా ఈవల మాల్యవంతము, మతంగపర్వతము, హేమకూటములనుండియే కాక, తుంగభద్ర కావల బుశ్యమూకను, అంజనాచలముల నుండి కూడ ముక్కోటిదేవతలు తమ దివ్యదేహములతో దిగి వస్తున్నట్లు తోచినది, ప్రభూ!'

ఆ మరునాడుదయమున శ్రీనాథుడు సంధ్యావందనము జపోపాసనము ముగించుకొని, 'నగరము చూచివచ్చుటకు బయలుదేరుచున్నాను, నాతో రాదలచినవారు గడియలో సిద్ధముకావలె!' అనుచు తన ఏకాంతమందిరములోనికి వెళ్లెను. దుగ్గన, పోతన, నృసింహభట్టు, సుబ్రహ్మణ్యకౌతి, మరి కొందరు తాము కూడ వత్తు మనిరి.

ఏకాంతమందిరములోనుండి బయటికి నచ్చిన శ్రీనాథుని హఠాత్తుగా చూచి, గోష్ఠిశాలలో నున్నవారు గుర్తింపలేక పోయిరి. అతని శ్రోత్రియవేష మిప్పుడులేదు. ఆ క్రిందటి సాయంకాల మాతడు దారిలో చూచిన నాగరకుల వేష మిప్పుడు ధరించెను.

ధరించిన జరీ ధోవతి వెనుకకు దోపి ద్రింపుగా బిగించి నందున, .అది జరీ అంచుల చల్లడమువలెనే యుండెను. దానిపై చిత్ర విచిత్రములుగా ముత్యములు కూర్చిన పసపు పచ్చని మహాకూగ్వాసము తొడుగుకొనెను. దానిమీద నడుముకు ఎర్రని పట్టుకోక చుట్టెను. దానిపై నాభిస్థానమున పచ్చల కాంచనపదక ముండెను. శిరస్సుపై ఆకుపచ్చ రంగు ప్రధానమై యున్న రంగు రంగుల పట్టు కుళ్ళాయి ధరించెను. దాని అగ్రభాగమున తురాయిలో పద్మరాగమణి అరుణ కాంతు లీనుచుండెను. చెవులకు రత్నకుండలములు, చేతులకు మణిసింహతలాటములు ధరించి, కంఠమున తారహారములు వేసికొని, అవి మరుగుపడకుండ రుద్రాక్షించులు గల తెల్లని పట్టుతరీయము వేసికొనెను. ఏకాంతమందిరములో నిలువుటద్దమున పలుమారు చూచుకొని దిద్దుకొన్నను తృప్తిలేక లోపలి కరిగి శ్రీదేవికి తనవేషము చూపి, 'సరిగా ఉన్నదా? నీవు దీటు చేయవలె!' అనెను.

శ్రీదేవి నవ్వు విరియుచుండ భర్తను సమీపించి, కూర్చా సమునకు కోకకు కుల్లాయికి సన్నని వంకరలు దిద్దెను. బాహువులపై కూర్చాసపు జలతారుపోగులు చెదరగా నవియు తార

శరీరములు తన మృదుకరస్పర్శతో సరిచేసెను. ఆమె కరతల స్పర్శచే శ్రీనాథుని సర్వాంగములు నానందపులకితము లయ్యెను

ఆమె యాగు డనుచు ఆ క్రిందటి రాత్రి మహేశ్వరు నలంకరించిన గులాబిమాలిక తెచ్చి కన్నుల కద్దుకొనుచు, శ్రీనాథుని కంఠము నలంకరించెను. శ్రీనాథుని నంతట నాపాద మస్తకము పరీక్షించి. 'అయ్యో నా తెలివి!' అనుచు లోపలికి చని కస్తూరీతిలకకరండము కొనివచ్చెను. ముందామె తన పైట చెరగుతో భర్త ముఖముసగల విభూతిరేఖలు కనబడ కుండ దిద్ది, ఫాలభాగమున దోసగింజవలె కస్తూరీతిలక మలంకరించెను.

'గృహరాజ్ఞి అనుజ్ఞ యైనదా?, యని శ్రీనాథు డడుగు చుండ నామె 'ఒక్క క్షణములో' ననుచు పళ్ళెరములో ఎర్రనీళ్లు తెచ్చి దృష్టితీసి కర్పూరహారతి పట్టెను. ఆ జ్యోతి కాంతిలో దివ్యతేజస్సుతో వెలుగుచు, శ్రీనాథుడు సార్థక నామ మడనిపించెను. సమీపస్థులగు సువాసినులు పల్లవి యందుకొనుచుండ, శ్రీదేవి తన కిన్నెర కంఠముతో మంగళ గీత మాలాపించినది. శ్రీనాథుడు పదునారు సువర్ణములు పుష్పములతో కలిపి పళ్ళెరములో నుంచెను. సువాసినుల కలకలారవము శ్రవణపర్వ మొనర్చెను.

ఆత డక్కడినుండి చానడిల్లోనికి వచ్చినప్పటికి కరణము భాచప్ప సిద్ధము చేసిన నాగరకుల దుస్తులు దుగ్గన, పోతనలు సంతోషముతో ధరించియుండిరి. నృసింహభట్టును, సుబ్ర

హ్మాణ్యశ్రౌతియు ఇష్టము లేకున్నను, శ్రోత్రియ వేషములు మాచ్చుకొనిరి. లక్ష్మనసూరియు, గురులింగమును వేషధారణ మొనర్చుకొని సిద్ధపడి వెంట వత్తు మన్నను, శ్రీనాథుడు చిరునవ్వుతో వారిని వారించెను. లక్ష్మనసూరి పకపక నవ్వుచు 'మన మంటే శ్రీనాథభట్టుకు భయములే' అనెను. తక్ష్మన విద్వాంసులు వేషధారణమున కొప్పక ఆనాటికి తమ నగర సంచారము సంక్షేపించు కొనిరి.

'అక్కా, అక్కా ఎట్లా ఉన్నాము?' అనుచు దుగ్గన, పోతనలు చేర రాగా, శ్రీదేవి వారి వేషములును సరిదిద్ది మహాదేన విర్మాల్య పుష్పమాలలు వారి శిరస్సులను అలంకరించి విభూతిరేఖ లద్ది, కస్తూరితిలకములు దిద్దెను.

శ్రీనాథుడును, వారు నలుగురును, అలంకృతములైన యశ్వములపై బయలుదేరిరి. వారికి దారిచూపుచు కరణము బాచప్ప మరియొక గుర్రముపై నచ్చెను. వారి చర్యలు పర్యవేక్షణ మొనర్ప నిద్దరు విద్యానగరరక్షకులు వెంటనంటిరి. కరణము బాచప్ప వారికి విద్యానగర విశేషములు చూపి వర్ణించుచు దారితీయుచుండెను. క్రిందటి సాయంకాలము వచ్చిన పాన్సుపారి బజారుననే కొంతనడి సాగి, తా మందులో కలసిన ప్రదేశ మతిక్రమించి దక్షిణముగా నేగిరి. కుడిప్రక్కను ధన్నాయకుని సభా మండపము, టంకశాలయు, ఎడమ వైపున దూరమునుండి రాజభవనములు చూపుచు, నక్కడ మందు రమును చూపెను. అందులో పదునొకండు గజములు కలవు.

వానిలో మధ్య రాయలవారి తెల్లయేనుగు దర్శన మిచ్చెను. అది చిన్నకొండవలె నున్నత మైనది. దానికి ముప్పదియాఱు శుభకరములగు మచ్చలు కలవు. మావటీండ్రు దాని యెనుటనే అన్నము నండి నేత్రిత్రో కలిపి, పెద్ద ముద్దలు చేసి, దాని కందించుచుండిరి. మంగళప్రదమని రాయలవా రనుదినము ప్రాతఃకాలమున నీ యేనుగును దర్శింతురని బాచప్ప తెలిపెను. దానిదర్శనముచే శ్రీనాథుడును ముదితుడై ఐరావతమును ధ్యానమొనర్చి నమస్కరించెను. ముందు కుపక్రమించి ప్రధానులయు సామంత మండలేశ్వరులయు భవన ములు చూచుచు వారు ఆనల కమలాపురసమీపమున గల బ్రాహ్మణవాడలో నున్న ముమ్మకవి యింటిముందు ఆగిరి.

వాకు లోనికి పోవుచుండగనే ఆనలినుండి విచిత్రమగు నుత్సవము నచ్చుచుండుట చూచి, ఆగి, దాని నుత్కంఠత్రో తిలకింపసాగిరి.

ముందు బలిష్ఠమైన నృషభములు రెండు ప్రూన్చిన అర్ధ చంద్రాకృతిగల శకట ముండెను. దానిపై పుష్పమాలాలంకృత మగు కంచుఢక్క యుండెను. దాని కిరుపార్శ్వముల నిద్దరు కూళ్ళండి వెండి కర్రలత్రో ప్రమోగించుచుండగా, ఆ ఢక్క పైకిని, క్రిందికిని, ప్రక్కలకు ఎగుసులాడుచు, పరిభ్రమించుచు, చిత్రచిత్రగతుల తాండవించు చుండెను. అట్లది తాండవించు చుండ నా శకటము ముమ్మకవి యింటిముం దాగినది.

వెంటనే శ్రీనాథునకు వెనుకభాగమున ముమ్మకవి యింటి తలుపులును గవాక్షములును దబదబ లాడుచు మూసివేయ బడినవి. శ్రీనాథు డాశ్చర్యముతో తిలకించుచుండెను.

ఢక్కా శకటము ముందుకు సాగినది. దానివెనుక నలుగురు వందులు కైవారము లొనర్చుచు డిండిమకవి సార్వభౌముని బిరుదావళి కీర్తించుచు నడచుచుండిరి. వారి వెనుక చిత్రాలంకృతములైన చీనాపట్టాంబరధ్వజములు పూనిన యిద్దరు నాట్యమాడుచు జనుచుండిరి. ఆ వెనుక డిండిమ బిరుదావళి కూర్చిన శ్లోకములను గ్రుక్క్ త్రిప్పనొనకుండ నిద్దరు చదువుచుండిరి. వారి వెనుక రవ్వలమైన వెండి పల్లకిలో అహోబిలనాథ డిండిమభట్టారకుడు వెళ్లుచుండెను. దాని కిరుపార్శ్వముల కాశీర శాలువలు ధరించిన గౌడబ్రాహ్మణులిద్దరు పాదచారులైనెమ్మదిగా చెరియొక పాదము చొప్పున నీకింద్రి శ్లోకము పఠించుచుండిరి.

"అగ్రే డిండిమతాండవం తత ఇతో నందివ్రజోద్ఘోషణమ్
ద్వ్యక్తా శ్చిత్రపటాః కియంతి బిరుదవ్రాతాని పద్యాని నః
అస్తాం తాన దిదం మహేశ మకుటీకోటీరకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తివిభవై ర్దేవ్యాశ్చ న్విజేష్యామహే."

అది విన్న శ్రీనాథునకును నృసింహభట్టునకును రోషముగా ఒడళ్ళు మండినవి. ఒక్కసారిగా పల్లకి నడ్డగించు నావేశముతో అశ్వము లెక్కుటకు ఇద్దరి పదములు కదలినవి, యాదృచ్ఛికముగా శ్రీనాథుని దృష్టి నాతన్నపై బడినది. అత డాయుత్సనము చూచి కోపింపక విదూషకుని చేష్టలచే వినోదించునట్లే నవ్వుచుండెను. ఆకస్మికముగా శ్రీనాథుని కాళ్ళు ఆగినవి. అతనికిని నవ్వు వచ్చినది. ఇప్పుడు తాను విద్యానగరములో నున్న

నైదేశికుడ నను స్మరణకు వచ్చినాడు. ఇప్పు డాతడు పల్లకిలోని డిండిముని తీక్ష్ణదృష్టితో పరిశీలించెను.

డిండిముని మూర్తిలో పరిపూర్ణ కాంతిత్రయంతో వెలుగుచున్న విద్యాసూర్తి ప్రత్యక్ష మైనది. కేవల దాంభికుల కా తేజస్సు సిద్ధింపదు. వంశానుగతముగా సంక్రమించిన ఈడిండిను శక్తా తాండవవ్యామోహమే కాని, ఇతర దోషములు చూపట్టలేదు. తాను జయింప నుద్యోగించిన వ్యక్తి అసాధారణప్రజ్ఞా సంపన్నుడని శ్రీనాథునకు స్పష్టపడినది.

ఇట్లాలోచించుండగనే మరియొకచిత్రము జరిగినది. ఆగృహ పరిసరములను డిండిముని పల్లకి దాటిపోయిన వెంటనే, ముమ్మ కవి యింటి వాకిట్లు గవాక్షములు వడివడి బార్లగా తెరవ బడినవి. గృహాధిపతియగు ఆ యోగంత్రుకుల నెదురొక్కని ఆదరముతో లోనికి గొంపోయెను. డిండిమతాండవము వచ్చి నదే తడవుగా వాకిట్లు మూతపడుటకును, అది వెళ్ళినతోడనే అవి తెరచికొనుటకును శ్రీనాథునకు కారణ మిప్పు డవగత మైనది. ఈ ముమ్మకవియు తననలె నీ డిండిమతాండవము సహింపనివాడే. సంభాషణ మేమియు జరుగకముందే ముమ్మ కవిపై నాతనికిని స్నేహార్ద్రభావము అంకురించినది.

అప్పుడు ముమ్మకవి యింట కవితాగోష్ఠి సాగుచున్నది. ముమ్మకవి తంజాపురమండలమునుండి వేదభాష్యరచనా కాలమున వచ్చిన ద్రవిడదేశీయుల సంతతినాడు. వారి సంప్రదాయములో 'సంగము' కవుల స్మృతి నిలిచి యుండు టచే నాతడు దానిని క్రొత్తవిధముగా శ్రీ విద్యానగరమున

తన యింట ప్రతిష్ఠాపించెను. విద్యానగరమునకు నానాదేశా గతులగువారి భాషలన్నియు నాతడు భాగుగా నభ్యసిం చెను. అవి చక్కగా మాట్లాడు నేర్పరియేకాక, ఆ యా భాషలలోని కావ్యరసమును ఆస్వాదింపగల సహృదయుడు. అందుచే తమ కావ్యము లాతనికి వినిపించుటకు బహు భాషా కవులు వచ్చుచుండుదురు. ముమ్మన్నకవి స్వయముగా తమిళ సంస్కృతములలో విద్వాంసుడై, రహస్యముగా కవనము చెప్ప గలవాడు. ఆ నాడక్కడ కూడియున్న వారిలో పలువురు దావిడులు కర్ణాటులు కలరు. కొందరు మహారాష్ట్రులును, ఓడ్రకవులును ఉండిరి. అరబ్బీకవియొకడు, తురుష్కకవియొకడు, పారశీకకవు లిద్దరుకూడ చిత్రవేషములతో ప్రత్యక్షమైరి. ఆంధ్రులే ఉన్నజాడ కనుపించలేదు.

శ్రీనాథుడు తనకు వామనభట్టుబాణుడిచ్చిన పరిచయ పత్రిక దుగనచే నిప్పించెను. అదిచూచినంతనే ముమ్మన్నకవి ద్విగుణీ కృతప్రీతితో లేచి వచ్చి శ్రీనాథుని కౌగిలించుకొని, 'వామన భట్టబాణులు సౌఖ్యమా?' అని కుశలప్రశ్న మొనర్చి గోష్ఠి లోని కవుల నందరిని శ్రీనాథునకు పరిచయముచేసి శ్రీనాథు నితో వచ్చియున్న వారెవరో తెలిసికొనెను. శ్రీనాథునకు దగ్గన బావమరది యని తెలిసినంతనే ముమ్మన్నకవి 'ఓహో, ఇతడు మా బావమరది నారనప్ప.* నేము ద్వితీయము చేసికొంటిమి.

---

* నారనప్ప కర్ణాటమహాకవులలో నొకడు. తర్వాత కొంతకాలమునకు కన్నడభాషలో భారతము పదిపర్వములు రచించి 'కుమారవ్యాస' బిరుద నామముతో వారికి గౌరవపాత్రుడియ్యెను. దాని నాతడు గదగవీర నారాయణ స్వామి కంకితము చేయుటచే దానికి గదగనేభారత మని పేరు. ఆంధ్రులకు పోతన యెట్లో నారనప్ప కన్నడుల కట్లే అభిమానపాత్రు డైన కవి.

వీరిది గదగపురము. అక్కడ్డ వీరనారాయణస్వామి భక్తుడు. కన్నడభాషలో వ్యాసభారతము భామినీషట్పదీవృత్తములో వ్రాయవలెనను అభిలాషతో భారతాధ్యయనమునకు నావద్దకు వచ్చినాడు. వయసున కొంచెము ముసుకు నరకు ఆగమని చెప్పుచున్నాను. మీ దుగ్గన కూడ కవనము చెప్పునా?' అనెను.

'నీవు కవి కావలెనని శాస్త్రాధ్యయనము చేయుచున్నాడు. మా వరసభావమరది పోతన ఎప్పటికైనా మహాభాగవత మాంధ్రీకరింపవలెనని కలలు కనుచున్నాడు!' అని శ్రీనాథుడు పలికెను. నారనప్పయు, పోతనయు సిగ్గుపడుచు నొకరి నొకరు సంప్రీతితో తిలకించుకొనిరి.

ముమ్మన్నకవి సాభిప్రాయముగా నారనప్పనంక చూచినదే తడవుగా, ఆతడు లోనికి జని శ్రీనాథునికిని వెంటనున్న వారికిని వెండిపళ్ళెరములతో ద్రాక్షాఫలములును, కదళీఫలములును పాత్రలో ఏదోపానీయమును, ఛాత్రులచే తెప్పించి వారిముందు పెట్టించెను. భోజనాత్పూర్వము చిరుదిండ్లు, పానీయములు గ్రహించు నభ్యాసము లేనివారగుటచే, శ్రీనాథబృందమువారు వింతగా పాత్రలనొక చూనుచుండుట జూచి, ముమ్మన్నకవి నవ్వుచు నొంచెము ద్రావిడయాసతో నిట్లు శ్రీనాథునితో పలికెను.

'నాకు ద ఆంధ్రులే కొంచెము కొత్త. వారు ఇక్కడ అందరితో నల్లా కలియరు. మా యింటికి వచ్చిన అతిథులందరు ముందు ఫలాహార పానీయములు పుచ్చుకొని గాని, గోష్ఠిలో

చేర పీలులేదు. రోములో ఉన్నప్పుడు రోమీయులవలె ప్రవర్తింపవలె నను లోకోక్తి యువనులు చెప్పగా వింటిని. విద్యానగరములో ఈనగరవాసులవలెనే ప్రవర్తింపవలె సామీ! ముందు మేము చూచిన ఆంధ్రులవలె కాక, మీ రప్పుడే ఈ నగరవేషము వేసినారు. రొంబ సంతోషమైనది. అవి మా పెరటిలో పండిన కలసా కదళీ ఫలాలు, శ్రేష్ఠమైనవి.—'

ఆ ప్రీతివచనము లాలకించి శ్రీనాథుడు కలసాకదళీ ఫలము లారగింప తక్కినవారును ఆరగించిరి. వారికి ఆ పానీయము సేవించుటకు గొంతుపట్టినట్లైనది. వెంటనే ముమ్మకవి 'ఎన్న అవివేకులు సామీ! అయ్యో, ఈ కొండల ఊరిలో ఎంత అలసి వచ్చినారు! అదు జొన్నపిండి మోరుద-సేవించండి. దోషమాయ్' అనెను.

శ్రీనాథునితో పాటు వారు ఆ చల్లా యంబలి సేవించిరి.

ఆ పైన హృదయంగమముగా కవితాగోష్ఠి సాగినది. ద్రావిడులు తేవారములు, కర్ణాటులు షట్పదులును, మహారాష్ట్రులు అభంగములును చదివిరి. పారశీకవి కిన్నెరవంటి కంఠముతో గులాబిపూలవాసన చిందుచున్న ప్రేమగీతములు పాడెను. ఉత్కళకవి గీతికలు ఆలపించెను. అరబ్బీ, తురుష్క కవులును పాటలే పాడిరి. ఆ భాషలందరికి తెలియకున్నను ముమ్మకవి ఇతరభాషలలోనికి భావానువాదము చేయుచున్నందున, నానాభాషాభావావేశములో నందరు నిమగ్నులు కాగలుగుచుండిరి. రసప్రపంచములో సంచారము చేయుచున్నట్లు వారివారికి తోచినది. ముమ్మకవి శ్రీనాథుని శృంగార

నైషధ ప్రశస్తిని, శాలివాహన సప్తశతి మాధుర్యమును వారికి వివరించి, స్వతంత్రపద్య మొకటిచదువుమని శ్రీనాథు నర్థించెను. ఆత డీ పద్యము చదివెను.

"పంపావిరూపాక్ష బహుజటాజూటికా
రగ్వధప్రసవ సౌరభ్యములకు
తుంగభద్రాపయస్తుంగ వీచీఘటా
గంభీర ఘుసుఘుమారంభములకు
కళసాపురప్రాంత కదళీవనాంతర
ద్రాక్షాలతాఫల స్తబకములకు
కర్ణాటకామినీ కర్ణపూటక రత్న
తాటంకయుగ ధాళధళ్యములకు
నిర్ణిబంధ నిబంధమై నెనయు కవిత
తెలుగునను సంస్కృతంబున బలుక నేర్తు
వనధరింపుము దేవరాయక్షితీశ
సన్మ్నాఖంబున సంప్రీతి మున్మసుకవి!'

అక్కడ కవులలో ఆంధ్రభాష రానివారికిసూడ కొద్దిగా నైన సంస్కృతము వచ్చియుండుటచే, సంస్కృతపద జటిలమైన యీ పద్య మందరికి సర్థమైనది. కవులు బహువిధముల శ్లాఘించిరి. ఇతరభాషాకవులు అందరు పదకవిత్వమును అభిమానించుచున్నను. పూర్వాచారపరాయణులగు నాంధ్రకవులే పద్య కవిత్వమును వదలకున్నారని మున్మకవి హాస్యమాడెను.

'అయ్యో, మా కవులుకూడ కొంతకాలమునుండి ద్విపదను అభిమానించుచు, పద్యకవిత్వము ఓడ నాడి సాగించినాము. మాబోంట్ల కింకను అది తల కెక్కలేదు.' అని శ్రీనాథుడు నవ్వుచునే ఉత్తర మిచ్చెను.

శ్రీనాథుని పద్యములో ఇతరులకు లోపని విశేషార్థము స్ఫురింపగా మున్నకవి యాతనితో నిట్లనెను.

"మీరు వీథిలో డిండిమూడంబరము వినిచ్చే ఉన్నాను. ఆయన కది యొక వ్యాధి. దానికి చికిత్సచేయు వైద్యునికొరకై బహుకాలమునుండి వెదకుచున్నాను. మనమిత్రుడు వానును డిక్కడ నుండగా ప్రోత్సహించి చూచితిని. ఆయన ఎంత సమర్థుడైనను, పోకు తటస్థించినవుడు జాననలె. జారిపోవును. పూజ్యులైన విశ్వేశ్వరులకును సాధ్యపడలేదు. న్యాయ వైశేషిక వ్యాకరణ శాస్త్రములతో పాటు, సంస్కృతములో ప్రౌఢ కవిత్వము చెప్పగలిగి, సాహిత్య శాస్త్ర సిద్ధాంతముల గుట్టు తెలిసి ధైర్యముగా నిలువగలవారేగాని, ఆయనకు చికిత్స చేయలేరు."

నృసింహభట్టు అంశమై నందుకొని 'మా శ్రీనాథభట్టు తమరు సెలవిచ్చిన విద్యలేకాక ప్రాకృతభాష లభ్యసించినాడు. వైద్యశాస్త్రము కూడ కొంత నచ్చును. ఇంకా సాంఖ్యము, సంగీతశాస్త్రము వచ్చును. కృష్ణయజుర్వేదము నల్లించి, శ్రౌతప్రయోగముకూడ ఋణముగా నేర్చినాడు' అనెను.

ఆ మాటలు వినగానే మున్నకవి 'ఎన్నాళ్ళో ఎన్నాళ్ళో, ఎన్నాళ్ళకు నా కోరిక తీర నున్నది!'

అనుచు శ్రీనాథుని సర్వతోముఖపాండితీ వైభవము నాదరింతో ప్రశంసించి అద్భుతావిష్టుల గావించెను. అంతలో నాతని కేదో సందేహము కలిగి, 'మీ కేమైన బిరుదు లున్నవా?' యని యడిగెను. సిగ్గు చిమ్ముకొని వచ్చుచున్న ముఖముతో శ్రీనాథుడు శ్రావ్యకంఠముతో నిట్లు చదివెను

"తరువున గాండివం బిడరె ధర్మజు నాన గిరీటి. యేను నా
క్సరసిజనేత్ర యానతి విచారము చొప్పున గర్వహీనతన్
మరలి తెనుంగుభూమి కసమానగతిన్ గొనిపోవు వాడనై
బిరుదులు నారివాగుకడ బెట్టితి సత్కవిసార్వభౌముడన్."

మున్మకవి నోరు తెరచి 'ఎన్నాంగో! ఇంగ అరుణగిరి నాథకవి సార్వభౌమను—అంగ శ్రీనాథకవిసార్వభౌమను!—నన్నా ఇరిక! నారివాగు ఎంగ?' అనెను.

నృసింహభట్టు నారివాగు తీరమున వినుకొండ దుర్గాధిపతి యొద్ద బిరుదములు పెట్టివచ్చిన వృత్తాంతము వివరింపగా మున్మకవి పొంగిపోయెను.

అప్పటికి మధ్యాహ్నవేళ దాటినది. తక్కిన కవులకు సెల విచ్చెను గాని, మున్మకవి శ్రీనాథుని సపరివారముగా తనయింట నతిథులుగా నాపూట కుండితీరవలెనని నిర్బంధించెను. వారు సంకోచించుచుండగా, 'మీ శ్రోత్రియత్వమునకు ఏమియు భంగమురాదు. మనమంతా పంచద్రావిడులలోని వారము. మా యింట , లింగన సోమయాజులే సాపడుదురు. మా యింటిలో మా అమ్మగారు అక్కగారే వంట చేయుదురు. మీరు ఉండి తీరవలె. నిండా ప్రొద్దయినది'

అనుచు ఇంటిముంగిట కూర్చున్న రక్షకభటులను పిలిచి 'భయములేదు. వీరీ పూట మా ఇంటనే ఉందురు. నేనే కాపుందును. వీరి విడిదికి పోయి వీరీపూట అక్కడికి సాపాటుకు రారని చెప్పి మరల మూడుజాముల కిక్కడికి రండు' అని చెప్పెను. ముమ్మకవికి రాజాస్థానములో గౌరవస్థాన మున్నందున వారు మారుమాటాడక వెడలిపోయిరి. అతిథులకందరికిని పాదప్రక్షాళనమునకు ఉదకపాత్రలు పెట్టిరి. శ్రీనాథుడు ద్రావిడాచారము నెరిగినవాడగుటచే, తనకు వేరుగా మడి ధోవతులీయరని తక్కిన వారికి రహస్యముగా తెలిపి, నేటికి నోరెత్తకుండ తాను చేసినట్లే అందరు చేయవలెనని నవ్వుచు హెచ్చరించెను. ఆతడింటిలోనికి బోయి, కుల్లాయి, కోక, కూర్పాసము విడిచి, కట్టిన పుట్టము ద్రిండ్లు దిగజార్చి, పై నుత్తరీయముతో భోజనశాలలోనికేగి పీటపై గూర్చుండెను. తక్కినవా రట్లే చేసిరి.

ముమ్మకవి సంధ్యవార్చి, వారందరు సిద్ధము గాగానే సుఖాసీనులను గావించి, వడ్డన ప్రారంభింపు డనెను. ముమ్మకవి వితంతు సోదరి అందరికి వడ్డించెను. ఆ వంట ఎన్నియో క్రొత్త క్రొత్త పోపులతో ద్రావిడ కర్ణాటక మిశ్రమ పద్ధతి నంటుచి యెరిగినవారికి ఆప్యాయముగా నుండునట్లు చేయబడినది. ఒక్క పోతనకుతప్ప తక్కిన యతిథుల కది నచ్చినట్లు లేదు. వారి జిహ్వలకు అది క్రొత్తయగుటయే ప్రధాన కారణము. ఆ వడ్డించిన పదార్థములలో నువ్వు పిండితో చేసిన క్రొత్త వంటకము ముమ్మకవికి ప్రత్యేకముగా నిష్టమగుటచే, తా నది

ఎక్కువగా నారగించుచు, అతిథుల నందరిని ఎక్కువగా తినుడని బలవంతము చేయుచుండెను. అందులో ఘాటైన వాసనలు కలసి యున్నవి. వానియన్నిటితో బాటుగా నా తిలపిష్టములో వెల్లుల్లి కూడ కలసియున్నట్లు శ్రీనాథుడు ముందే గమనించి, నాలుకలు కోసికొందురేమో యను భయముతో నృసింహభట్టు వంకను సుబ్రహ్మణ్యశ్రౌతి వంకను క్రీగంటితో చూచెను. అదృష్టవశమున వారన్ని వాసనలమధ్య వెల్లుల్లి వాసన గమనింపలేదని గ్రహించి గుట్టు చప్పుడు కాకుండ భుజింపసాగెను.

భోజనసమయమున ముమ్మకవి వారికి విద్యానగర విశేషములెన్నియో తెలిపెను. అతడు బహుశాస్త్రపరిచయము కలవాడగుటచే ప్రాతఃకాలకవిగోష్ఠిపద్ధతి మార్చి యిప్పుడు పండితగోష్ఠి కుపక్రమించి శ్రీనాథాదుల శాస్త్రపరిజ్ఞానమును పరీక్ష చేయుచున్నట్లు కనబడకుండగనే సందర్భవశములైన ప్రశ్నాదులతో తెలిసికొనుచుండెను. శ్రీనాథుడును పరీక్ష చేయుచున్నది గమనింపక మాట్లాడుచున్నట్లే, ఏశాస్త్రములో నే ప్రసంగము వచ్చినను లీలాప్రాయముగా సమస్తము జిహ్వాగ్రమం దున్న వానివలె సంభాషించెను. భోజనానంతరమున తాంబూలసేవనము చేయుచు నిట్లే వారి విద్వద్గోష్ఠి సాగినది. శ్రౌతప్రయోగములోనికి రాగా, ముమ్మకవి తమ మిత్రుడు లింగన సోమయాజి శ్రౌతము కాండత్రయములో నిధి యనియు, వారు త్వరలో అతిరాత్రక్రతువు చేయు ప్రయత్నములో నున్నారనియు, వారిని తప్పక దర్శింపవలెననియు తెలిపెను.

వారి ప్రసిద్ధి విని తాను వారికి పరిచయపత్రిక తెచ్చుకొంటినని సుబ్రహ్మణ్యశాస్త్రి చెప్పెను.' వారలంతలో కలియుక ఆనల నారసప్పలతో కలసి పోతన దుగ్గనలు నాటలోనికి పోయి వ్యాసమహర్షి రచనల యతిశయమును, తమతమ భాషాకవుల విశేషములును, ప్రేమపూర్వకముగా ముచ్చటించుకొను చుండిరి. వారికి తను తమ భాషల కవిత్వములలో నూతన జీవము పోయువలెనను ఉబలాటము సువ్యక్త మయినది.

ఇంతలో నగరరక్షకులు వచ్చిరి. శ్రీనాథాదులు మున్నకవి యనుజ్ఞ గొని బయలుదేరిరి. స్థానాపతి కరణము బొచప్ప ఈ మాసు ఉదయమున వచ్చిన దారిసగాక, మరియొక దారిన వారిని విడిదికి తీసికొని పోయెను. కాచనగరు, కడిరాంపురము కృష్ణాపురము, గజయూథములు జలక్రీడలాడు సరోవరముల మీసుగా హేమకూటమును మతంగగిరిని ప్రదక్షిణించి వచ్చిరి. దారిలో వారికెన్నో దేవాలయములను, విఁతలను దర్శించిరి. వాని యన్నిటిలో మహోన్నతములైన నృసింహ స్వామిమూర్తియు సుగ్రీవసహితమూర్తియు వారిహృదయాం తరాళములలో భక్తిభావనముతోపాటు అద్భుతరసము నావేశింప జేయుచు హత్తుకొని పోయెను. ఈ విధముగా వా దానాడు శ్రీవిద్యానగర రాజ్యలక్ష్మికి ప్రదక్షిణము చేసి వచ్చినట్లయినది. విడిదిలో నందరు వారి రాకకై ఎదురుచూచుచు విశేషము లేమని ప్రశ్నింపగా, శ్రీనాథుడు 'ఈనాడు నేము కన్నడరాజ్య లక్ష్మిని ప్రదక్షిణించి వచ్చితిమి' అనుచు నీ పద్యము చదివెను.

"కుల్లాయంచితి కోక చుట్టితి మసక్కూర్వాసమున్ దొడ్డితిన్,
వెల్లులిం దిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లాయంబలి త్రావితిన్ రుచుల దోసంబంచు బోనాడితిన్
తల్లీ, కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా, నేను శ్రీనాథుడన్'

ఆ పద్యము విని సుబ్రహ్మణ్యశ్రేష్ఠి, 'అన్నీ సరేగాని, వెల్లుల్లి ఎప్పుడు తిన్నావయ్యా?' అనెను. శ్రీనాథుడు పోతన్నను పిలిచి నవ్వుచు, 'నీవు మరి మరి నువ్వుబిండి తిన్నావుగా, అందులో ఏమేమున్నవిరా?' అని యడిగెను.

పోతన పకపక నవ్వుచు, 'నువ్వుపిండా? భలే బాగున్నది. అక్కడడిగి మళ్ళీ చేయించుకుని తిననలె-అందులోనా, ఏమున్నవా?-దాచిన చెక్క-, లవంగాలు, యాలకులు, గసగసాలు కుంకుమపువ్వు, పచ్చకర్పూరము-మరే మిరియాలు, ధనియాలు, అల్లము, అసలుది మరచిపోయినాను, ఎత్తుకెత్తు వెల్లుల్లి పాయలు-'

ఆ చినరి మాటలు చెవుల బడినదే న్యనధానముగా, సుబ్రహ్మణ్య శ్రేష్ఠిను నృసింహభట్టును ఘూ ఘూ ఘూ వెల్లులా?-ఘూ, ఘూ, ఘూ!' అనుచు పకువుప లేచిపోయి వాంతిచేసికొనిరి. వాంతి యవుచున్న కొలదియు, వారి కా వెల్లుల్లి వాసన నోటిలోను, ముక్కులోను మరింత వ్యాపించుటచే వా రెన్న మ్లూకములు పుక్కిలించి యుమిసిరను అసహ్యభావము హెచ్చుచుండెను. నా రిద్దరు నా రాత్రి భోజనము చేయ నిరాకరించిరి. శ్రీనాథుడు వారిని బుజ్జగించి 'నేను ఈ రాత్రికి ఉపవసింప నిశ్చయించితిని. కేపటి యుదయమే మనము

ప్రాయశ్చిత్తముగా కూశ్మాండహోమములు చేసికొందును, అనుచు మరియు నిట్లనెను.

'మన మీనాడు ఎంత ఘోరపాటు చేసితిమి? ఇది విరూపాక్షేశ్వరుడు వెలసియున్న తుంగభద్రా తీర పంపా పుణ్యక్షేత్రము కదా! మనము ముందుగా క్షేత్రోపవాసము చేసి తీర్థవిధులు తీర్చనలసి యుండగా, అవి విస్మరించి నగరవిహార మునకు బయలుదేరితిమి. శ్రీ విరూపాక్షస్వామి మనయందు ప్రసన్నుడై యుండుటచే ముమ్మారవి యింట వెలులి వేయించి ఈ విధముగా మన విధి మనకు గుర్తుకు తెచ్చినాడు. స్వామి వాత్సల్యము అపారమైనది.'

అది విని యందరు విభ్రాంతులై, ఆరాత్రి యుపవసించి మరు నాటి నుండి పుణ్యక్షేత్రోచితవిధులు నిర్వర్తింప నిశ్చ యించిరి.

౬

ఈ కథాంశములు జరుగుచున్న కాలము దక్షిణదేశ చరిత్రలో చిరస్మరణీయ మైనది. క్రీ. శ. 1420 – ఫిబ్రవరితో ఈ కథ యారంభ మైనది. విరోధికృత్సంవత్సర మారంభము.

1323 సంవత్సరములో ప్రతాపరుద్రుడు డిల్లీ సేనలకు పట్టుపడిన పిమ్మట కాకతీయరాజ్యము ఛిన్నాభిన్నమయ్యెను, 1335 ప్రాంతములో ఆంధ్రనాయకు లందరు నొక్కమారు ఏకీభవించి ఓరుగల్లు తిరిగి పట్టుకొనిరి. ఆ పిమ్మట ఎనరికివారు స్వతంత్రులై తమ తమ రాజ్యములు పాలించుకొనిరి.

హరిహరరాయ బుక్కరాయ సోదరులను ఢిల్లీసుల్తాను చెరసాలనుండి విడిపించి, తనకు రాజప్రతినిధులనుగా కంపిలికి పంపెను. వారలు శృంగగిరి శ్రీపీఠాధిపతులైన శ్రీ విద్యారణ్య భారతీయతీంద్రుల కరుణాకటాక్షము వడసి,సుల్తాను అధికారము ధిక్కరించి, తుంగభద్రాతీరమున 1336 సంవత్సరములో శ్రీ విద్యానగరము నిర్మించి శ్రీ విద్యానగరరాజ్యమును స్థాపించిరి.

దక్కనులోనున్న ఢిల్లీసుల్తాను సేనలలోనున్న అమీరాను ఈ పడహా అను శతగ్రామాధిపతులును నాయకులును తిరుగు బాటుచేసి, తనలో తాము కలహింపగా, తుదకు అల్లా ఉద్దీన్ హసన్ షా 1347 సం. లో గుల్బర్గా రాజధానిగా బహ మనీరాజ్యము స్థాపించెను.

అప్పటినుండి దక్షిణ భారతములో మూడు రాజ్యములే ప్రబలమై విస్తరింపసాగెను. ఒకటి నరపతులగు శ్రీవిద్యా నగరప్రభువులది, రెండవది, అశ్వపతులగు బహమనీసుల్తానులది, మూడవది కటకమున గజపతులగు కాళింగులది. తక్కిన రాజ్యము లన్నియు పరస్పరము కలహించుచు, గెలుచుచు, ఓడుచు, ఈ మూడు పెద్ద రాజ్యములలో ఏదో యొకదానితో మైత్రి చేయుచు, ఇతరరాజ్యములతో కలహించుచు తుదకు క్రమక్రమముగా మూడు మహారాజ్యములలో ఏదో యొక దానిలో లీనము కాజొచ్చెను.

ఈ కథాప్రారంభమునాటికి శ్రీ విద్యానగరప్రభువు దేవ రాయలు, బహమనీసుల్తాను ఫిరోజ్ షా, కళింగప్రభువు నాల్గవ భానుదేవుడు.

ఈ కథకు సంబంధించిన చిన్న రాజ్యములు రెండు. అందులో మొదటిది పెదకోమటి వేమారెడ్డి పాలించుచున్న కొండపీటి రెడ్డిరాజ్యము. అది కృష్ణవేణానదికి దక్షిణమున నున్నది. రెండవది కృష్ణానదికి ఉత్తరమునను న్న రాజుకొండ, వెలమ రాజ్యము పూర్వము ఒకానొకప్పుడు ఆ రెండును కొంత పెద్దరాజ్యములే కాని. అవి యిప్పుడు చిన్నవై కొన యూపిరిత్తో నున్నవి.

కొండవీటి రాజ్యము పూర్వ మొకానొకప్పుడు పశ్చిమమున అహోబలమునరకు, తూర్పున తీరరేఖవెంట ఉత్తరముగా సింహాచలము దాటియు, దక్షిణమున ఉదయగిరినరకును వ్యాపించియుండెను. ఈ కథారంభమునాటికి అది రెండుగా చీలి, తూర్పున కృష్ణదాటి కొండపల్లివరకే వ్యాపించి యుండెను. దక్షిణమున చాలభాగము విద్యానగరరాజ్యములో లీనముకాగా, అక్కడ పూర్వము స్వతంత్రప్రభువులై పాలించిన పంటరెడ్లు పలువురు శ్రీ విద్యానగరరాజ్యములో ఉన్నతోద్యోగములలో నుండిరి. పశ్చిమమున వినుకొండనరకుకూడ నట్లే శ్రీ విద్యానగరరాజ్యములో కలసిపోయినది. అది నేటి వినుకొండ ఒంగోలు తాలూకాలు లేని గుంటూరుమండలమునను, కొలదిగా కృష్ణామండలమునను మాత్రమే వ్యాపించి యుండెను.

ఆవల కృష్ణ కుత్తరమున రాచకొండ రాజ్యముకూడ పూర్వము పెద్దదే యైనను, బహుకాలము క్రిందటనే సోదర రాజ్యములగు రాచకొండ దేవరకొండ రాజ్యములుగా చీలి

పోయెను. పశ్చిమభాగమును ఉత్తరభాగమును బహమనీ సుల్తానులు ఆక్రమించిరి. తూర్పున కళింగప్రభువులును రాజ మహేంద్రవర రెడ్డి ప్రభువులును కొంత కొంత గ్రసించిరి. రాచకొండ, దేవరకొండ రాజ్యములు కలసి నేటి నల్గొండ జిల్లాయు, మహబూబునగర్ జిల్లాలో తూర్పు భాగమునను మాత్రము వ్యాపించి యుండెను. ఈ కథాప్రారంభమునకు రెండు సంవత్సరముల క్రిందటివరకు వారికి మిత్రుడుగా ఉండిన బహమనీసుల్తాను తన సేనలను ఆకస్మికముగా వీరి పానగల్లు కోటమీదికి సంపుటచే, రాచకొండ దేవరకొండ ప్రభువులు బహమనీరాజ్యమునకు ప్రతికక్షులైన విద్యానగరరాజ్యముతో మైత్రికి రాయబారములు సాగించుచుండిరి.

ఇట్లు కొండపీటిరాజ్యమును రాచకొండరాజ్యమును క్షీణ దశలోనున్నను, ఆ రాజ్యప్రభువులకు బహుకాలమునుండి వచ్చుచున్న స్పర్ధమాత్రము పోలేదు. కృష్ణాతీరము నెంబడిని మధ్య లంకలలోనను వారి సేనలు తరుచుగా సోరాటములు సలుపుచునే యుండెను. మధ్యమధ్య ప్రభువులుకూడ తలలు పోగొట్టుకొనుచుండిరి. కొలది కాలము క్రిందటనే పెదకోమటి వేమారెడ్డి సోదరుడును, కొండపల్లి దుర్గాధిపతియు నగు మాచారెడ్డి తలను రాచకొండవాసు కొట్టగా, వారిప్రభువు తలను పెదకోమటివేమారెడ్డిసేనలు కొట్టించియుండెను. రాచకొండ దేవరకొండల ప్రభువులు ఇప్పుడు పెదకోమటి వేమారెడ్డి తల నెట్లు కొట్టుటా యని అనకాశమునకై కాచు కొని యున్నారు. ఈ రెడ్డి వెలమ రాజ్యముల స్పర్ధ కేనల

రాజ్యవిస్తృతికే పరిమితమై యుండినచో, చిరస్మరణీయమై యుండెడిది కాదు. ఆస్పర్ధ సర్వతోముఖమై కళలకు వాఙ్మయమునకు సంస్కృతికిగూడ వ్యాపించియుండుటచే ఇప్పటికిని స్మరణీయమై యున్నది. రాజకీయస్పర్ధ పరస్పరనాశనమునకు మాత్రమే కారణభూత మయ్యెను.

సాంస్కృతికస్పర్ధ ఉత్తమకళాకామలను, కవులను, పండితులను, కావ్యాదుల నిర్మాణమునకు ప్రోత్సహించెను. డెబ్బది సంవత్సరముల పైకాలమునుండి రాచకొండ కొండపేటి నగరముల కీ సాంస్కృతికస్పర్ధ సాగుచుండెను.

కొండపేటిదుర్గము ఆ కొండపైగల యనేకశిఖరములకు వ్యాపించి బురుజులతో ప్రాకారరేఖలతో హత్తింపబడినది. నగరము సరోవరములతో విశాలరాజమార్గములతో మనోజ్ఞ భవనములతో స్పృహణీయమై యుండి కొండదిగువననుగూడ నగరము పెరిగిపోవుచుండెను. కొండపై వేణువనమును, దాని సమీపమునగల వెదుళ్ళచెరువును, నాగరకుల నెక్కువ యాకర్షించుచుండెను. వెదుళ్ళచెరువు మధ్యను పద్మాకృతిగా చంద్రశిలా మండప మొకటి కలదు. అది చిరుతరగల తాకిడికి ఊగుచున్న సితాంభోజమువలె దోచుచుండెను.

రాచకొండయు, మొదట ఆ కొండ కుత్తరమున కొలది దూరమే వ్యాపించి, చిన్నదిగా నుండెడిది. క్రమముగా నది నాగానాయని కొండవరకు వ్యాపమై ఆ రెండుకొండలను చుట్టివేసి బలిష్ఠమగు ప్రాకారములతో, నగాధవగు పరిఖతో దుర్గమదుర్గముగా వెలసినది. శిల్పులు, స్థపతులు, ఖనకులు,

నేప్పుత్రోడ నకడ నీటియెద్దడి తీర్చి జలసమృద్ధి కల్పించుటచే, నిప్పుడది మనోహరసరోవరములత్రోడను, జలజల పాసు సెలయేళ్ళత్రోడను, ఉద్యానవనములత్రోడను, కలకలలాడు జనసమూహములత్రోడను, దివ్యభవనములత్రోడను, కన్నుల పండువుగా నున్నది. వేణువనమునకు ప్రతిగా నకడ దారు వనమును, నాగానాయనికొండప్పై విశాలవాపిమధ్యమున రత్నాల నౌకయు అవతరించినవి.

సాలీలు పన్ని రంగురంగుల నగిషీలవస్త్రములు నేయుట లోనను, చిత్రకారులు చిత్రనిర్మాణమునందును, విగ్రహశిల్పులు గంభీర మనోజ్ఞవిగ్రహములు గండరించుటకును, కంసాలులు కనకరత్నాభరణాదులు నిర్మించుటయందును, కంచరులు మహాపాత్రలు పోతపోయుటలోనను, కమ్మరులు ఉత్తమఖడ్గాదులు చేయుటయందును, సుగంధకారులు సువాసనలు కల అత్తరులు సిద్ధము చేయుటలోనను, ఒకరితో ఒకరు స్పర్ధపడు చుండిరి. ఈ స్పర్ధలో ఒక విశేషముండెను. వారు ఒకరి నొకరు మించుటకు యత్నించుచుండిరే కాని, ఆనలివారి గుణములను దోషములుగా నీసడింప యత్నించుట లేదు. ఇట్టి స్పర్ధత్రోడనే బహువిధముల నాట్యశాలలు దేవాయతనములు ఉత్సవములు వృద్ధిగాంచినవి.

తక్కిన విద్యారంగములందువలెనే ఆ రెండునగరముల ప్రభువులు వేదవిదులను, విద్వాంసులను, కవులను, గాయకు కులను ఆకర్షించి గౌరవించుచుండిరి. ఉత్కళదేశములో గ్రంథము నంకితమిచ్చుటయన్న ఆ గ్రంథకర్తృత్వమే కృతిపతి

కర్పించు నాచారమున్నది. అది చాటుగా కాక, సభాసమక్షమునే జరుగును. ఈ ఉత్కళదేశాచారము ఈ కథాకాలమున నాంధ్రదేశమునగూడ కొంతవరకు వ్యాపించినట్లూహించును. ఇక్కడను, అక్కడను ప్రభువులపేర వ్యాఖ్యాన గ్రంథములును, నాట్యసంగీత సాహిత్య గ్రంథములును, కావ్య నాటకములును విశేషసంఖ్యలో ప్రకటింపబడినవి. వానిలోనధిక భాగము వా రాదరించిన విద్వాంసులు రచించినట్టిదని అనుమానించుటకు ఆధారములున్నవి. రాచకొండలో విద్వాంసులు తను ప్రభువును సర్వజ్ఞ బిరుదముతో నలంకరింపగా కొండవీటి విద్వాంసులు పెదకోమటి వేమారెడ్డిని సర్వజ్ఞ సార్వభౌను బిరుదముతో నలంకరించిరి.

రాచకొండవిద్వాంసులలో నగ్రగణ్యుడు విశ్వేశ్వరకవి. అతడు రసమీమాంసాగ్రంథకర్తయగు కాశీశ్వరమిశ్రుల శిష్యుడు. ఆతడు తనపేరనే ప్రకటించుకొనిన గ్రంథములలో 'చమత్కారచంద్రిక' యను సాహిత్యశాస్త్రగ్రంథము* అపూర్వమైనది. దానియాధారముతోడనే తర్వాతికాలమున జగన్నాథపండితరాయలు రసగంగాధరములో వ్రాచార్యాచార్యుల మతములు ఖండించెనందురు. మరియొక రాచకొండ పండితుడు బొమ్మకంటి అప్పయాచార్యుడు. అతడు అనుభవకోశమునకు వ్యాఖ్య రచించెను.

ఇక్కడ పెదకోమటి వేమునియాస్థానములోనున్న పండితులకు లెక్కలేదు. అక్కడి విశ్వేశ్వరుని సోదరుడగు నృసింహ

---

* ఇది యముద్రితము. వ్రాతప్రతులున్నవి.

భట్టు ఇక్కడనుండి కాదంబరీకథను ఐదంకముల నాటక ముగా రచించెను. పెదతోఁటివేమని పేర నున్న సాహిత్య చింతామణి తరుచుగా ఈ కాదంబరీనాటకశ్లోకములను ఉదాహరించు చున్నది. విశ్వేశ్వరుడును నృసింహభట్టును ప్రతాపరుద్రయశోభూషణగ్రంథకర్త యగు విద్యానాథుని మేనల్లుని కుమార్తె. ఇతనికంటె ప్రసిద్ధుడైన కవి వామనభట్ట బాణుడు. గద్యకవిసార్వభౌమ, సాహిత్యచూడామణి, సాహిత్య సామ్రాజ్య ధురంధర–ఇత్యాది బిరుదము లాతనికి కలవు. వీర నారాయణచరిత మను నామాంతరముగల వేమభూపాల చరిత మను సంస్కృత గద్యకావ్యము జగత్ప్రసిద్ధి నొంది నది. అందులో నతడు పెదతోఁటివేమభూపాలుని చరిత్రమే వ్రాసెను. అతని శృంగారభూషణ భాణములో శ్రీవిద్యా నగరములోని శ్రీవిరూపాక్షేశ్వరుని చైత్రయాత్రా సమయమున విలాసశేఖరు డను శృంగారనాయకుడు నగరవేశ్యావీథిని వర్ణించెను. అతడే కనకలేఖాకల్యాణము, ఉషాపరిణయము, పార్వతీపరిణయము అను నాటకములను, నలాభ్యుదయము, రఘునాథాభ్యుదయము అను మహాకావ్యములను, హంస సందేశమును రచించెను. మిత్రుడైన శ్రీనాథకవి తన యాంధ్ర కావ్యములలో వామనుని కావ్యములనుండి పాదములకు పాద ములే కూర్చుకొనెను. ఇతడు శ్రీ విద్యారణ్యభారతీయతీంద్రుల శిష్యుడు. మరియు నా యాస్థానములో దైవజ్ఞశిఖామణి యగు పెద్దియజ్వయు, నాతనికుమార్తె రామచంద్ర గంగా ధర జ్యోతిషికులును కలరు. పరహిత వైద్యశేకాక, వ్యాక

రణ న్యాయ వైశేషికశాస్త్రనిదాన్సుడగు సింగనాచార్య డుండెను. ప్రధానియగు మాచిరాజు సింగన స్వయముగా జ్యోతిషశాస్త్రవేత్త.

పెదకోమటి వేమారెడ్డి కొండపీటికి ప్రభువు కాకముందే శ్రీనాథుడు అక్కడికి నచ్చి కొన్ని శాస్త్రము లభ్యసించి మహామేధావి యను కీర్తి సంపాదించుచుండెను. ముప్పదేండ్లు నిండకముందే క్రమాంతము వేదాధ్యయన మొనర్చి శ్రోత ప్రక్రియ నభ్యసించి సాంఖ్య న్యాయ వైశేషిక వ్యాకరణ సాహిత్య శాస్త్రములు తోడుమముగా నధిగమించి, ఇతి హాస పురాణాగమ రహస్యములు గ్రహించి సంస్కృత ప్రాకృ తాంధ్రములలో కవి తానిపుణు డని పేరు పొందెను. ఆతని యశస్సు రాజుకొండకు వ్యాపించినది. రాజుకొండ ప్రభువు ఆతనిని తమ యాస్థానమునకు రమ్మని యాహ్వాన మంపెను. ఇది తెలిసిన వెంటనే పెదకోమటి వేమభూపాలుడు మంత్రు లతో మంత్రించి, అప్పటికి నయస్సున పిన్న యని శంకింపక సగౌరవముగా శ్రీనాథుని బిలిపించి, కొండపీటి విద్యాధికారి పదవిలో ప్రతిష్ఠించెను.

తనకు శ్రీనాథు డుండుగౌరవము దక్కకపోయినను, రాజు కొండప్రభువులకును, విద్వాంసులకును నాగరకులకును ఆతని యం దభిమానము పోలేదు. ఆతని శాలివాహనసప్తశతిత్రోడనే ఆంధ్రభాషలో మహాకవి అవతరించె ననువార్త దేశమంతట ప్రాకినది. శృంగార నైషధమును సింగన్నప్రధానికి కృతిసమ ర్పణ మొనర్చి పరిచ్ఛ మహాసభకు రాజుకొండనుండి వైశ్య

కుమారులును నాగరకులును పాఠికమందికి పైగా వచ్చిరి. వారు రాజుకొండకు తిరిగి వెళ్ళి చేసిన ప్రశంసలతో రాజాచలము నాగానాయని కొండలకోనలు ఘూరి లెను. నెలరోజులు దాటక ముండే అక్కడికి ఐదువందల ప్రతులు వ్రాయించి పంపవలసి వచ్చినది. ఆ కాలమున రాజుకొండలో సప్తశతి లోనివియు శృంగారనైషధములోనివియు కొన్నిపద్యములైన నోటికి రాని నాడు విరసుడుగా పరిగణింపబడుచుండెను. శ్రీనాథకవి ప్రశస్తి కొండవీటి రాజ్యములోని అద్దంకి కొండపల్లి బెల్లముకొండ నాగార్జునకొండలందును, విద్యానగరరాజ్యములోని నెల్లూరు ఉదయగిరి కందుకూరు వినుకొండ దుర్గములందును, రాజుకొండ దేవరకొండ రాజ్యములందంతటను వ్యాప్తమొందెను. సంవత్సరము లోపల కొన్ని వేల ప్రతులు వ్రాయించవలసి వచ్చిన గౌరవము అంతకుముం దేగ్రంథమునకును లభ్యమై యుండలేదు.

ఆ కాలమే యంత కవితాభిమానము కలది. జక్కన విక్రమార్క చరిత్రము, అనంతుడు భోజరాజీయము, కొరవి గోపరాజు సింహాసనద్వాత్రింశిక, ఈ కాలమునసే వెలసినవి. గౌరన ద్విపదహరివంశము, సవనాథచరిత్ర కావ్యములును, భాస్కర రామాయణములో కొన్ని కాండములును రచింప బడిన కాల మిదే. వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామము రచించుచుండెను. శివలెంక కొమ్మన మాహేశ్వరము పూర్తి చేసి శివలీలావిలాసము రచించుచుండెను. నేటికిని ఆంధ్రులకు గౌరవపాత్రములైన ఈ కవులే కాక మరెందరో కవిలోకిలలు గానము లొనర్చిన ఈ కవితావసంతకాలమున శ్రీనాథుని

కవితాప్రౌఢి సర్వాతిశాయియై ఆంధ్రకవితకు సంస్కృత ప్రాకృతములతో సమానగౌరవము, పూర్వమెన్నడులేనిది, మొదటిసారి సంపాదించెను.

పెదకోమటి వేమారెడ్డి స్వయముగా మహావీరుడు, ఆతని సేనానాయకులు, మంత్రులు సమర్థులు. ఐన నేమి? కాలము కలసి రాలేదు. ఒకొక్కక సంవత్సరము గడచిన కొలదియు నాతని రాజ్యములోని ఒకొక్కక ఖండమే ప్రక్కరాజ్యములు కబళించుచుండెను. తాను వృద్ధుడగుచున్నాడు. తన యాయువు రాయమువలెనే కొండపేటిరాజ్యముకూడ చమురైపోయి ఆరిపోవుచున్న దీపమువలెనే ఉన్నదని విదితమగుచున్నది. మహా తపస్వియు త్రికాలవేదియు అనేక యజ్ఞయాగి, హారీతగోత్రుడు నగు పెద్దియజ్వను రావించి పూజించి ఎన్నియో మారులు తన రాజ్యమునుగూర్చి యాతడు ప్రశ్నించెను. ఆ తపస్వి నోట ఈ రాజ్యము వృద్ధి యగు ననుమాట రాలేదు.

'నాయనా, నీ యాస్థానము విద్వన్నిలయము. నీ యాస్థాన కవులకు చక్రవర్తి యాస్థానాదులలో అపూర్వగౌరవములు ప్రాప్తింపనున్నవి. నీవు విద్వత్కవిపాతివి, మహాదాతవు అను యశస్సు నీకు చిరకాల ముండగలదు. అంతకంటె నేమికావలె నాయనా! నీవంటి బుద్ధిమంతునికి వేరుగా చెప్పనలెనా? భగవంతు డనుగ్రహించినదానితో మనము తృప్తిపడవలె?—ఇవే పెద్దియజ్వ తనతోంబదవ సంవత్సరమున పరమపదించుటకు పూర్వము వేవభూజాని కుపదేశించిన చివరి వాక్యములు.

ఐనను వేమని హృదయములోని రాజ్యకాంక్ష త్రవ్వివేయ సాధ్యముకాలేదు. అది శల్యమువలె బాధించుచు, యుద్ధములకు పురికొల్పినది. ఒకొక్కక యుద్ధముతో ఒకొక్కరాజ్య ఖండము తరుగుచుండెను. ఆ బాధ విస్మరించుటకై విద్వాంసుల నాదరించుచు అగ్రహారదానములతో సత్కరించుచు, విద్వద్గోష్ఠులతో కాలక్షేపము చేయుచుండెను.

శ్రీనాథుని సర్వతోముఖప్రతిభ దిగంతవ్యాప్తి నొందుట చూచి, యాతని శ్రీవిద్యానగరమునకు పంపనలె ననుమూహ జనించినది. తన విద్యాధికారి శ్రీనాథభట్టు శ్రీవిద్యానగర విద్యాధికారి, కవి సార్వభౌమ, అరుణగిరినాథ డిండిమభట్టారకు లను జయించినచో, తాను శ్రీవిద్యానగర రాజ్యముపై రాజకీయముగా సాధింపలేకున్న విజయము, నిద్విగ్విజయరూపమున సాధింపవచ్చుననియు, దానింతో తన రాజ్య ప్రతిభ భరతలోకమం దంతట వ్యాపించు ననియు నాతడు తలంచెను. అది ఎరిగి నంతన సింగనప్రధాని ఆయమూహకు ప్రోదిచేసెను. శ్రీనాథభట్టు తాను మథించిన శాస్త్రములలో నిధులగు విద్వాంసులతో నిరంతరగోష్ఠులు కావించుచు, నైశిత్యము వృద్ధిచేసికొన సాగెను.

:: శ్రీనాథుని కప్పటికి నలుబదిమూడేండ్లు. దేహము పటువై శక్తికలది. బుద్ధి తీక్ష్ణమైనది. హృదయాంతరము ఆర్ద్రమైనది.

ఆతని మిత్రము వామనభట్టబాణుడు వయస్సులోపెద్దవాడు. ప్రతిభలో తక్కువవాడు కాడు. ఆతడు పూర్వము విద్యానగర

ములో నున్నప్పుడు అరుణగిరినాథునిచే పరాభవింప బడినవా డగుటచే మాత్సర్యముచే శ్రీనాథుని ప్రోత్సహించుచు సహాక రించుచుండెను.

ఎట్లో శ్రీనాథుని యాత్రావార్త రాజుకొండకు ప్రాకినది. అక్కడివారికి శ్రీనాథుడు తమవాడే యను నభిమానము పోలేదు. అక్కడి ప్రభువులకును, తమ రాజ్యమునకుగూడ త్వరలోనే అనసానదళ ప్రాప్తింప నున్నదని ఆంతర్యములలో తెలియకపోలేదు. వా రేకాంతమున విశ్వేశ్వరదేశికులను రావించి, శ్రీనాథుని డిండిమములను జయించుట కుపకరించు శాస్త్రరహస్యములు కొండపేటికి పంపనలెనని యర్థించిరి. విశ్వేశ్వరుడును పూర్వము అన్యాయముగా డిండిములచే నవఖీరణ చేయబడినవాడు. ఆతడు దీర్ఘముగా నాలోచించి, తనయొద్ద శాస్త్రాభ్యాసమునకై వచ్చియున్న బమ్మెర తిప్పనకు తాను రచించిన చమత్కారచంద్రిక ప్రతి యొకటిచ్చి కొండ వీటికో తన తమ్ముడగు నృసింహాభట్టు నొద్దకు పంపెను.

ఆకస్మికముగా నొకనాటి యర్ధరాత్రివేళ పెద్దియజ్ఞ చినరి మాటలు వేమప్రభువుకు నిద్రపట్టకున్న సమయమున కొట్ట వచ్చినట్లు స్మరణకు వచ్చినవి. శ్రీనాథుని విద్యానగరయాత్ర ఇక నే మాత్ర మాలసింపరా దని నిశ్చయించెను.

ఆ మరునాడే సింగన ప్రధానితో నాలోచించి పెద్దియజ్ఞ కుమారులగు రామచంద్ర, గంగాధరుల రావించెను. తన విద్యాధికారి యగు శ్రీనాథభట్టుకు విద్యావిజయయశస్సు కామించి పెదకోమటివేమారెడ్డి శా. శ. 1341 విరోధి మార్గ

శ్రీశైలమునకు ధనుస్సంక్రమణపుణ్యకాలమున బ్రహ్మసూత్రాదిసిద్ధాంతరహస్యైకవేది యగు గంగాధరజ్యోతి షికునకు రుద్రవరము అగ్రహారము కావించి దానముచేసి విద్యాధికారి శ్రీనాథునిచే శాసనశ్లోకములు వ్రాయించి తామ్ర శాసనము ప్రసాదించెను.

పెదకోమటి వేమారెడ్డి కావించినది దానశాసన మదే. ఆతని విద్యాధికారి శ్రీనాథుడు రచించిన చివరి శాసన కావ్యము అదే! వెంటనే శ్రీనాథుని విద్యానగరయాత్రకు సర్వసన్నాహములు వైభవముగా చేయుటకు ప్రభువు ప్రధాని నాజ్ఞాపించెను.

8

ముస్మకవిని శ్రీనాథాదులు దర్శించి వచ్చిన మరునాటి నుండియు నాలుగురోజులనరకు వారి విడిదిలోనను తుంగభద్రా తీరమునను హోమములు క్షేత్రవిధులు తీర్థవిధులు వైదిక వైభవముతో సాగుచుండెను.

ఒకవంక కవి యిట్లు సాగుచుండగనే, శ్రీ విద్యానగర వీధులలో ఎవరో కొండపీటినుండి ఒక కవి మహారాజవేషము ధరించినవాడు, డిండిమభట్టారకులను జయించుటకై వచ్చినాడను వార్త వ్యాపింపసాగెను. రక్షకభటులు దాని కెక్కువ వ్యాప్తి కలిగించిరి. ఎవరా రాజకవి యని చూచుటకు జనములు వారి వీధిలో మూగుచు, 'ఇతడై యుండును, ఇతడై యుండును,

అని ఎవరినో ప్రవేలుపెట్టి చూపుచుండిరి. శ్రీనాథుడప్పుడు శ్రోత్రియ వేషముతోనున్నందున. వాకు మధ్యమధ్య కొండ పీటి కరణము మాచయ్యను నిర్దేశించి, 'అదుగో రాజకవి, ఎంత దర్పముతో నున్నాడు?' అని పొగడుచుండిరి. కొందరు 'ఈతడేనా డిండిమములను జయించునది' అని మూతి విరిచి పోవుచుండిరి.

ముమ్మకవి యింటిలో జరిగినగోష్ఠి చూచినకవుల ప్రశంసల వలన విద్వత్కవిలోకములో గూడ ఈ ప్రథ వ్యాపించెను. 'మన అయణగిరినాథులనే?— వారిని జయింపగలవారు కూడ నున్నారా?—కాకున్న ఆయనకు తన యతిశయముచే నితరులు కనబడకున్నారు కాని ఆయనను జయింపగలవా రెవరు? మొదట ఆయన వాక్ప్రవాహము అవగాహనమొనర్చుకొన్నవే కదా ఖండించుట' ఇట్లొకవంక గౌరవము, అభిమానము, ఇంకొక వంక అవహేళనము, శాస్తి కావలెనను వాంఛ, వ్యక్తము చేయుచుండిరి.

డిండిముల శిష్యులకు వారి కిది తెలుపవలెనను తహతహ కలిగినది. ఐనను వారికి తెలుపు సాహసము లేదు. చివర కొక నాడు ప్రియశిష్యులు చెప్పి తీరవలెనని నిశ్చయించిరి. వారు గంగేశోపాధ్యాయులు రచించిన 'తత్త్వ చింతామణి' యను నపూర్వ న్యాయశాస్త్ర గ్రంథమును అధ్యయనము చేయుచుండిరి. నేడు నవీననాయ్య మను పేరితో ముఖ్యముగా నవద్వీపవిద్వాంసులచే ప్రచారముగన్న గ్రంథము లప్పటికి పుట్టలేదని తెలియవలెను. క్రీ. శ. 1380 లో పుట్టిన యిది

వానికి దారితీసిన మొదటి గ్రంథము. పాఠమైన పిమ్మట యథాపూర్వముగా వారు నమస్కరించి, ఆ సాయం కాలము సెలవు తీసికొనలేదు. ఏదో చెప్పదలచినారని డిండిములు గ్రహించి 'ఏమైనా విశేషమున్నదా?' అని ప్రశ్నించెను. సంభాషణ మంతయు సంస్కృత భాషయందే జరిగెను.

ఒకడు చేతులు నలుపుకొనుచు ధైర్యము తెచ్చుకొని, 'తమకు కొండవీటి విద్యాధికారి శ్రీనాథభట్టు మన నగరమునకు వచ్చినది తెలిసినదా?' అనెను.

'ఎవరో? మా దర్శనమునకు రాలేదే! అతని పక్షమున నీవేమైన విన్నవింతువా?'

'కాదు, కాదు–తనతో వివాదమునకు వచ్చినాడట.'

'అందుకు మీ గందరగోళభ్రాంతు లైనాయా? ఆతని విద్యాగంధము ఎంతకణమో తెలిసికొంటిరా?'

'గురుదేవా, హర్షనైషధ కావ్యమును శృంగారనైషధమను పేర గొప్పగా నాంధ్రీకరించినాడు. ఆ కావ్యప్రతులు ఆంధ్ర దేశమం దంతట వందలకొలది ప్రచారమైనవి'

'మాతో ఆంధ్రభాషాకవిత్వము చెప్పుటలో వివాదపడునా? అట్లైనచో జితోస్మి యంనుము. నీకు దేశభాషాభిమానము వదలినచే కాని సంస్కృతములో శాస్త్ర మర్యాదల శిఖరము లందుకొనుట అసాధ్యము. సరేనా!'

దానితో నాంధ్రశిష్యుడు తలనంచుకొనగా కర్ణాటకశిష్యు డందుకొనెను. 'అట్లుకాదు. గురుదేవా! ఆయన సంస్కృత

ములో కవిత్వము నిరర్గళముగా చెప్పగలడు. అనేకశాస్త్ర ములలో విద్వాంసుడు కూడ నట.'

'అనేకశాస్త్రములా? ఏమేమి శాస్త్రములు?'

'వేదము, శ్రౌతము–'

'సరిసరి. మీ పంచద్రావిడులకు వేదము శ్రౌతము నల్లించిన వారియందు గౌరవము విపరీతము. మాకును గౌరవమే. మా దర్శనమునకు వచ్చినచో యథోచితముగా సన్మానించి నగరములోని పెద్దలకు చెప్పించి దారిద్ర్యము తొలగింప జేసెదము.'

కర్ణాట శిష్యుడు తలవంచుకొనగా మహారాష్ట్రశిష్యుడందు కొనెను. 'అంతేకాదు, గురుదేవా, రాజకవినలె వచ్చినాడు కాని, శ్రీనాథుడు యాచకుడుగా రాలేదు. వ్యాకరణశాస్త్ర ములో నిపె యట!'

'ఆంధ్రభాషకు వ్యాకరణము కూడ నున్నదా?'

ఆంధ్రశిష్యుడు అభిమానముతో నందుకొనెను, 'లేకేమి? ఆంధ్రశబ్ద చింతామణి, అధర్వణకారికావళి, సంస్కృతభాష లోనే బహుకాలము క్రిందటనే పుట్టినవి. వానిలో సంస్కృత వ్యాకరణములో లేని విశేషము లున్నవి. శ్రీనాథుడు సంస్కృత వ్యాకరణముకూడ క్షుణ్ణముగా నభ్యసించెను.

'ఆతని సంస్కృత వ్యాకరణ పాండిత్యము మాట అటుంచి మీ ఆంధ్రవ్యాకరణవిశేషములు ఒకటి రెండు చెప్పు!'

ఎర్రవడిన ముఖముతో నాంధ్రశిష్యుడు 'విశ్వేశ్వరేయః కావ్యమ్, తదదోషౌ పరికృతౌ చ వాగర్థౌ, సిద్ధి ర్లోకాద్ధృశ్యా' అని విరమించెను.

అది విన్న యరుణగిరినాథుని ముఖము వినోదముతో వికసించి, అరుణగిరిపై బాలభాను డుదయించినప్పటివలె మనోహరమయ్యెను. 'కావ్యప్రయోజన స్వరూపములు చెప్పుటకు మాకు వేరుగా ఉద్భటశాస్త్ర మున్నది, అది ఆంధ్రభాషలో లేదు. కావున దానిని కలిపి కలగాపులగము చేయుట మీ ఆంధ్రభాషా శబ్దశాసనములో విశేషమే. ఇక రెండవది. పాణిని మహర్షి వైదిక లౌకిక భాషలకు రెండింటికి వ్యాకరణముచేసెను. ఆంధ్రములో వేదము లేనందున 'సిద్ధి ర్లోకాద్ధృశ్యా' అని సూత్రించిన మీ వ్యాకర్త కొంత బుద్ధినుంటుడే. మావ్యాకరణము వైదిక లౌకిక భాషలది. మీది కేవలము లౌకికభాషది. అదే విశిష్టతయా?-నీవు నీభాషాభిమానము వదలిననే గాని శాస్త్రమర్యాదలు తెలిసికొనలేవు.'

మరల నాంధ్రశిష్యుడు తలనంచుకొనగా ద్రావిడశిష్యుడందుకొని, శ్రీనాథుడు ఉద్భట శాస్త్రములోనను, ఇతర శాస్త్రములలో గూడ విద్వాంసుడట' అనెను.

అరుణగిరినాథుడు దర్పముతో 'ఉద్భటశాస్త్రమా, అది మా గొడులసొమ్ము. పూర్వము మా కాశీశ్వరమిశ్రులయొద్ద ఉద్భటశాస్త్రములో ఏ రహస్యలేశమో గ్రహించితి ననుగర్వముతో, విశ్వేశ్వరుడను ఆంధ్రుడు మాతో వాదింప సాహసించెను. ఆతడు మాచే పరాభవముపొంది పారిపోయి గాజాచల

గుహలలో తలదాచుకొని, అక్కడ తలయెత్తి ఇప్పుడు పండితు డనిపించుకొనుచున్నాడట. ఎరుగుదువా?' అనెను.

మరల కర్ణాటకశిష్యు డందుకొని 'శ్రీనాథుడు వచ్చినది రాజాచలమునుండి కాదు, సర్వజ్ఞచక్రవర్తి యగు కొండపేటి ప్రభువు ఆస్థానమునుండి' అనెను.

'డిండిముడు గొంతు సరిచేసికొనుచు సకిలించి, 'మీ కర్ణాటులకు బిరుదాటోపము లన్న భయము. ఇక్కడ పూర్వము వామనుడను కవిబ్రువు చుండెడివాడు. అతడు మా 'యోగానందప్రహసనము' ననుకరించి 'శృంగారభూషణ భాణము' వ్రాసి, విద్వత్సభలో ప్రదర్శించి మాయెమట తలయెత్త సాహసించెను. ఆ భాణములో నేము శబ్దశాస్త్రరీత్యా ఉద్భట - శాస్త్రరీత్యా నూఁదోషములు చూపి ఆ వామనుని సార్థక నాముని గావించితిమి. అతడు నూకు పాదాక్రాంతుడై త్రోక ముడిచి పారిపోయి, అల్పరాజ్యుడగు కొండపేటి ప్రభువును రఘుమహారాజు నంతవానిగా జేసి భట్టువలె పొగడుచు గద్య కావ్య మొకటి వ్రాసి, భట్టబాణుడని, గద్యకవిసార్వభౌముడని మరియు నేమేమో బిరుదనులు తగిలించుకొన్నాడట—మీరు మా కే నే డేదో అలజడిపడి నచ్చిన ట్లున్నారు. మా శక్తి మా కే ఎరుక. ఆ గంగాప్రవాహము మా సర్వాంగములలో ప్రచరించుచున్నవారము — మహేశ మకుటకోటీరకల్లోలినీ కల్లోలప్రతిమల్లసూక్తివిభవై ర్ద్వేషాన్ విజేష్యామహే! అలమలమ్!' అనెను.

శిష్యులంగరు నిర్వాకుర్వాలై నమస్కరించి సెలవుతీసికొనిరి. అంతలో నింటిలోనుండి కుమారుడు, రాజనాథకవి వచ్చి, తండ్రి పాదములకు నమస్కరించెను. రాజనాథుడు విద్వాంసుడు, కవి. తండ్రితరువాత నతడే వంశానుగతముగా నచ్చుచున్న డిండిమాది గౌరనములకు వారసుడు కానలసియున్నాడు. అతడు తండ్రికి ఇష్టములేని విషయములు శాంతముగా చెప్పగలడు. ఇప్పు డాతడిట్లు తండ్రికి విన్నవించెను.

'ఈ మధ్య విన్న విషయములు నా కించుక వెనుబొటు కలిగించుచున్నవి. తనకు పెద్దలైనారు. శరీర పాటవముతో పాటు జ్ఞాపకశక్తి మందగించుచున్నవి. పూర్వము సర్వము జిహ్వాగ్రమం దుండెడిది. ఇప్పుడు అధ్యాపనమునకు పూర్వము గ్రంథ మొకమారు చూచుకొనుచున్నారు. వెనుకటి ధారణా శక్తి ఇప్పుడును కల దను ధైర్యము కూడదు.

'ఈమధ్య దైవజ్ఞులను విచారించితిని. మీకు షష్టిపూర్తి అయినది. ఉగ్రరథశాంతి చేసికొనలేదు. ఆ కారణమున—నేను నా నోటితో చెప్పలేకున్న దోషము రానగునని దైవజ్ఞులు సూచించినారు.

'ఆ వచ్చిన శ్రీనాథభట్టు సామాన్యుడుగా తోచదు. విద్వాంసుడేకాక, నీతికోవిదుడుగా కూడ కనబడుచున్నాడు. ఏ శాస్త్రమూ క్షుణ్ణముగా అధ్యయనము చేయకున్నను, అన్నిటిలోనూ మిడిమిడిజ్ఞానము కలిగి ఏ భాషయు సరిగా రాకున్నను అన్ని భాషలు వచ్చినట్లు నటించుచు, ఈ నగరములోని బహుభాషాకవులను చేరదీసి రాజపురుషులను భ్రమ

కొల్పుచు గౌరవము సంపాదించిన మున్నుకవిని తమ రెరుగు దురుగదా! ఆతనికి తను యందుగల అసూయాద్వేషములు కూడ విదితమేకదా! తమకు శకాశ్వైభవముతో వీళ్ళిల్లో వెళ్ళుచున్నంతనే ఆతడు తన యింటి తలుపులు, కిటికీలు మూయించుట చూచుచున్నాను గదా! ఈ శ్రీనాథుడు ఇక్కడికి నచ్చిన మనునాడే మున్నుకవిని దర్శించి ఆతని యింట కలంజభక్షణ మొనర్చి నచ్చి ప్రాయశ్చిత్తాదులు చేసి కొన్నాడు-'

కుమారుని దీర్ఘోపన్యాసము విసుగుతో విని అడ్డువచ్చి, 'అయితే, మన కా కలంజభక్షకునితో వాదము భయకారణ మందువా?' అని తండ్రి పలికెను.

'కాదు కాదు. ఆంధ్ర బ్రాహ్మణులు కలంజభక్షకులుకారు. ఆతడు ఒంటరిగా రాలేదు, విద్వాంసుల నెందరినో తోడు తెచ్చుకొనినాడు. ఆతని విడిది ప్రభువు ఆస్థానమునలెనే యున్నది. మన మాతని నిర్లక్ష్యము చేయరాదు.'

'నాయనా, ఆ పండితు లందరు కలసి తమ తమ నేర్చిన శాస్త్రములు ఒకొక్కటే అందించి నాతో వాదముచేయింతు రందువా?-నీకొక రహస్యము చెప్పెదను వినుము. మీమాంస రానివారు వేదార్థనిర్ణయము చేయలేరు. అట్లే వ్యాకరణశాస్త్ర మేమి, ఉద్భటశాస్త్ర (అలంకార శాస్త్రమునకు ఉద్భట శాస్త్రమని నామాంతరము) మేమి, తక్కిన శాస్త్రము లేమి న్యాయవైశేషిక శాస్త్రసూక్ష్మములు తెలిసినవారితో ఇతరులు వాదింపలేరు. మనకున్న బలము న్యాయవైశేషికములలో!'

రా. నా. : నిజమే. ఆ శ్రీనాథుడు న్యాయవైశేషికములే కాక సాంఖ్యదర్శనముకూడ సంపూర్ణముగా అధ్యయనము చేసినాడట!

అ. గి. నా : ఈ దక్షిణదేశములో మేముగాక న్యాయ వైశేషిక దర్శనములు అభ్యాసనము చేయగలవా రున్నారా? ఈ పంచద్రావిడులకు అవి అబ్బవు. మన శిష్యులను చూచుట లేదా, అబ్బబ్బా!

రా. నా. : నిజమే! న్యాయవైశేషికములలో మన గౌడులదే పైచేయి. ఆమధ్య నవద్వీపమునుండి రామేశ్వర యాత్రకు వెళ్ళుచున్న హరిమిశ్రులను * కొండపీటిలో బహుకాలము నిలువ ప్రార్థించి, వారికడ శ్రీనాథుడు మరికొందరితో పాటు న్యాయ వైశేషిక సాంఖ్య దర్శనములను అధ్యయనము చేసినాడట.

ఆ మాటలు విని అయ్యణగిరినాథుడు ఆశ్చర్యముతో ఒక్కసారిగా నోరు కన్నులు పెద్దగా తెరచి 'హరిమిశ్రాచార్యుల వద్దనే? ఆఁ? నిజమే? ఆఁ-నాయనా! ఈ ద్రావిడులకు ఆ శాస్త్రములు ఎవరు చెప్పినా అబ్బకోయీ, భయపడవద్దు' అని తెప్పరిల్లుకొని పలికెను.

---

* హరిమిశ్రుడు జయదేవుని గురువు, పినతండ్రి. జయదేవుడు, అతని సహాధ్యాయుడగు వాసుదేవసార్వభౌముడును, వాసుదేవుని శిష్యులగు గౌరాంగ చైతన్యుడు మొదలగు నలుగురును, ఆ పిమ్మట కొలదికాలమునకే తత్త్వచింతామణిపై వ్యాఖ్యానము మొదలగు ప్రసిద్ధ న్యాయశాస్త్ర గ్రంథములు రచించిరి.

రా. నా. : నాకును భయము లేదు. తమకు కొంచెము తొందరపాటు. ఆ శ్రీనాథుడు తమరిని మోసగించుటకు కుటిలముగా ఏమి వలపన్నునో అని నా భయము. నేను మన కక్కడి యగ్రహారముల రాబడిభాగము తెచ్చుకొనుటకు కృష్ణాతీరమున మందడగ్రామాదులకు రెండు రోజులలో తప్పని సరిగా మీ కోడలిని బయలుదేరవలసి వచ్చినది. రెండు నెలలవరకు తిరిగి రాలేను. వచ్చిన వెంటనే ఉచితవైభవముతో తమకు ఉగ్రరథశాంతి జరిపించు యత్నములు చేసెదను. ఈ మధ్య తమరేమియు ఆ శ్రీనాథుని విషయము పట్టించుకొనక జాగరూకులై యుండవేడెదను

అరుణగిరినాథుని కోడలు అభిరాముకామాట్లు. కోడలి సంగతి చెప్పగనే అరుణగిరినాథునకు వాత్సల్యము కలిగినది. ఆమె రచించుచున్న అభినవరామాభ్యుదయమహాకావ్యమును గూర్చి కొంతతడవు ప్రస్తావించెను. ఈ సంభాషణము జరిగిన రెండురోజులకు రాజనాథకవి బయలుదేరెను.

ఆ తర్వాత రెణ్ణాళ్ళకే లింగన సోమయాజి అతిరాత్ర క్రతువు చేయనుండెను. దానికి అరుణగిరినాథునకు ఆహ్వానము వచ్చినది. లింగనసోమయాజి వృద్ధుడు. విద్యానగరమున విద్వల్లోకమునకే కాక, మహామాత్యాది రాజపురుషుల కందరికిని, మహాతపస్వి యని అతని యెడల పూజ్యభావము కలదు. పంచద్రావిడులు చేయు క్రతువులలో గొడుగులు బుత్విక్కులుగా నుండుటకాని, వారితో సహభోజనము కావించుటకాని ఆచారముకాదు. అదికూడ సమీపమునసే తుంగభద్రాతీర

మున జరుగుచున్నది. దానిని చూచుటకు నగరప్రముఖులందరు వత్తురు. విద్యానగర విద్యాధికారియైన తాను వెళ్ళకుండుట భావ్యము కాదు. అందువలన లాంఛనప్రాయముగా వెళ్లి యజ్ఞసంకల్పము చూచి రాదలచెను.

అదికాక ఇంతమంది ఇన్నివిధములవర్ణించుచున్న ఈ కొండవీటి శ్రీనాథుని యజ్ఞశాలకు రావచ్చునను, ఆతని వైఖరి ఎట్లుండునో చూడవలెనను కుతూహలము గూడ గలిగినది. దానితోపాటు తన వైభవాతిశయము ప్రదర్శించి, ఆతనిని బెదర గొట్టవలెనను కోరికకూడ పుట్టినది. యజ్ఞారంభమునాడు ప్రాతర్వేళకే తన పరికరాదులు బిరుదాదులు సిద్ధముచేయ పరిజనుల నియోగించెను.

వాకిట పల్లకి నిలిచియున్నది. బిరుదధ్వజములు ప్రాతఃకాల వాయువులలో రెపరెప లాడుచున్నవి. అరుణగిరినాథుడు విద్యాధికారివేషము ధరించినాడు. కుచ్చుల పట్టుదోవతి, జలతారు కూర్పాసము, పట్టు కాసె, శిరస్సుపై కిరీటమువంటి కుళ్ళాయి ధరించి, పైన ధళధళలాడుచున్న కాశ్మీరశాలువ వేసికొనెను. నొసట విభూతిరేఖలు తీర్చి, చేతులకు, దండలకు కంఠమున కంకణకేయూరతారహారములు, శ్రవణములకు రత్నకుండలములు అలంకరించుకొని మహేశ్వరధ్యానము చేయుచు అరుణగిరినాథుడు బయలుదేరుచుండెను.

లోపలనుండి ధర్మపత్ని గౌరీదేవి సర్వాలంకృతయై వచ్చి పాదములపైబ్రాలి, 'నేనుగూడ యజ్ఞశాలకు వత్తును-యజ్ఞపురుషుని దర్శింపబోవు చున్నప్పుడు ఈ డింభిమాడంబర మెందుకు?

వద్దు, నామాట వినుడు. మన కది శ్రేయస్కరము కాదు, విసీతులమై పాదచారులమై వెళ్ళి వత్తుము-నామాట వినుము-' ఈ విధముగా శివము పూనిన దానివలె చెప్పిమూచినది. ఆమె భర్తకు ఎదురాడ నెన్నడు సాహసింపదు-మధ్యమధ్య నెన్న డైన ఇట్లే శివము పూనిన ఆవేశసమయములలో తప్ప.

ఎంత చెప్పినను లాభము లేకపోయినది. తనదర్పము ప్రతి కక్షికి ప్రదర్శింపవలెనను నుబలాటము పోలేదు. ఆమె యావే శము శాంతించునరకు నాగి, "సరి, మనఇద్దరి బదులు నీవు పాదచారిణివై రా!" అని భార్యకు చెప్పి డిండిముడు పల్ల కిలో కూర్చుండెను. యథాచారముగా డిండిమోత్సవము యజ్ఞశాలవరకు సాగినది.

ఈయధ్వ నక్కడ కొండవీటి విడిదిలోనను, తుంగభద్రా తీరమునను కూశ్మాండహోమములు, క్షేత్రోపవాసములు తీర్థ విధులు మొదలగు కర్మ కలాపము లైపోయినవి. పూర్ణిమనా డందరు శ్రీ శ్రీ విరూపాక్షేశ్వరస్వామికి ఉదయవేళ నభిషేకా దులు, సాయంవేళ సహస్రనామార్చనాదులు వైభవముగా నిర్వర్తించిరి. శ్రీనాథుడు అక్షతలను, సువర్ణ తాంబూలములత్తో సంభావించెను.

ఆ యాలయ సమీపమునసే శ్రీ శృంగేరీ విరూపాక్ష శ్రీ పీఠాధిపతులగు శ్రీ శంకరానంద భారతీ స్వాముల ఆశ్రమ

మున్నది. శ్రీ విద్యారణ్యులు శ్రీ హరరాజధానిని శృంగేరి నుండి శ్రీ విరూపాక్షమునకు మార్చి శ్రీ విద్యానగరము ప్రతిష్ఠించిన దాదిగా, జగద్గురువు లాయాశ్రమమునందే నివాసము చేయ జొచ్చిరి. శ్రీ శంకరానంద భారతీ స్వామివారు శ్రీ విద్యారణ్యుల శిష్యుల ప్రశిష్యులు. వారిని ముందే శ్రీనాథుడు దర్శించి, వారికి పాదపూజచేయు భాగ్యము ప్రసాదింప నర్థించెను. వారును 'మేము సన్యాసులముగదా! మీబోటి గృహస్థ శిష్యుల భిక్షతోడనే ఈ ఉపాధిని పోషించుకొందుము. అభ్యంతర మేమున్నది' అని సెలవిచ్చిరి.

భోజ్యుణ బహుళ విధియనాడు శ్రీ గురుపాదపూజ నిర్ణీత మైనది. శ్రీనాథు డా యుత్సవమునకు శ్రీ విద్యానగరములోని విద్వాంసులను పెద్దలను చాతుర్వర్ణ్యశిష్యబృందమును ఆహ్వానింప దలచినందున, అంతమందికి తమ విడిదిలో చోటు చాలదని స్వామివారి యాశ్రమమునందే జరుపుటకు అనుజ్ఞ గ్రహించెను.

ఆనాడు వేలకొలదిమంది చాతుర్వర్ణ్యశిష్యులకు పంచ భక్ష్య పరమాన్నములతో విందు చేయుటకు శ్రీనాథుని పక్ష మున కొండపేటి స్థానాపతి శ్రీ పీఠాశ్రమమున సన్నాహములు చేయించెను. విద్వాంసులకు రాజపురుషులకు శ్రేష్ఠులకు శ్రేణీ పతులకు ఆహ్వానములు వెళ్ళినవి. అనుకొన్నట్లుగానే శ్రీ పీఠాధి పతుల తీర్థప్రసాదములు పొందుటకు పెద్దలనక పిన్నలనక గొప్పవారనక కొద్దివారనక అసంఖ్యాకముగా వచ్చిరి. బ్రాహ్మణులే వేయిమందికి పైబడిరి.

పూజామంటపమున సువర్ణసింహాసనముపై శ్రీ పీఠాధీశ్వరుడు లాసీను లైరి. శ్రీ పీఠ విన్యాసుడగు చంద్రభూషక్రియాశక్తి వారి సమీపమున కుశాసనాసీనుడై యుండెను. సుబ్రహ్మణ్యశ్రౌతి బ్రహ్మగా న్యనహరించెను. శ్రీదేవితోగూడి శ్రీనాథుడు భక్తితో శ్రీ పాదపూజ కావించెను. ఆ మంటపమునకు క్రింద దుగ్గన, పోతనలు భక్తియుక్తులై పూజాద్రవ్యము లందించుచుండిరి. విద్వద్వరేణ్యులును, మహామాత్యులును మంటపము క్రింద పరివేష్టించి యుండిరి.

అష్టోత్తర శతాధిక సహస్ర సంఖ్యాకమగు సువర్ణపుష్పములతో మహావైభవముగా శ్రీనాథుడు శ్రీ గురు పాదపూజ నిర్వర్తించుట చూచి శ్రీ విద్యానగరమహామాత్యులే విభ్రాంతులైరి.

పూజామండపము ధవళదుకూలములతోడను, శ్వేత పుష్పాదికములతోడను అలంకృతమై, కైలాసశిఖరమువలె శోభిల్లెను. పూజాసమయమున శ్రీ గురువులు బ్రహ్మనిష్ఠులై, సమాధిస్థితిలో నుండి మూర్తిమంతుడైన సాంబసదాశివుడుగా తోచిరి. ఒక పార్శ్వమున కూర్చుండియున్న చంద్రభూష క్రియాశక్తి ప్రమథగణాధిపుడగు శ్రీ మహాగణాధిపతివలె ప్రకాశించెను.పూజచేయుచున్న శ్రీదేవిశ్రీనాథులు శ్రద్ధాభక్తులు రూపుతాల్చినట్లును, లక్ష్మీనారాయణులే అక్కడ కూర్చుండి మహేశ్వరపూజ కావించుచున్నట్లును పొడగట్టిరి. బ్రహ్మస్థానమలంకరించిన సుబ్రహ్మణ్యశ్రౌతి సమస్త వైదిక కర్మ కలాపము జిహ్వాగ్రమందున్న కేనల చతుర్ముఖుడుగా భాసించెను.

వేల జనము కూడియున్న యీ మహాసభ నిశ్చల నీరవముగా నుండి సర్వాత్మనా పూజలో పాల్గొనుచుండెను. మంత్రపుష్ప సమయమున గాని, అందరికిని ఈ లోకములో నున్న భానము రాలేదు.

ఆ మహాజన మంతటికి పుష్పాక్షతలు పంచిపెట్టిరి. వేద విదులు ఏకకంఠముతో మంత్రపుష్పమంత్రములు పఠించు చుండగా, ఈ నగరమునకు శ్రీవిద్యానగర మని శ్రీవిద్యారణ్య ప్రతాపనామ భారులగు శ్రీ విద్యాశంకర భారతీగురుస్వాములు కావించిన నామకరణము సార్థకమను నిశ్చయభావము కలిగినది.

శ్రీ పాద పూజావసానమున తీర్థరాజపూజ జరిగినది. శ్రీపాద తీర్థమును శ్రీ గురువులు ముందు శ్రీనాథునకును, పిమ్మట శ్రీ దేవికిని ఇచ్చి తర్వాత సుబ్రహ్మణ్యశ్రౌతికిని చంద్రభూషక్రియాశక్తికిని ప్రసాదించిరి. అప్పుడు చిత్రముగా శ్రీ గురువుల అనుగ్రహదృష్టి పోతన దుగ్గనలపై ప్రసరించి నది. వారు ముందు పోతనకును, తర్వాత దుగ్గనకును సంజ్ఞ చేసి పాదోదక మొసంగిరి. అప్పు డా యిద్దరు బ్రహ్మచారుల ముఖములు ఆనందముతో వికసించి బాలసూర్యప్రభలను తలపింపగా చూపరులు మురిసిరి. అక్కడ కూడిన భక్తుల కందరకు శ్రీ గురుపాదోదకము ప్రసాదించిరి.

భిక్షాసమయమున శ్రీ గురువులకు శ్రీదేవి వడ్డన చేసెను. శ్రీనాథుడు హస్తోదక మొసంగెను. భిక్షానంతమున శ్రీ పీఠాధిపతులు తాంబూలము సేవించుచుండ, నా దంపతులు వందన మాచరించిరి. శ్రీ గురువులు నారాయణస్మరణ చేయుచు

'మేము ఆశ్రమస్వీకారము చేసిన తర్వాత ఇంత ఆప్యాయముగా భిక్షచేసినది అరుదు. శ్రీనాథభట్టా, నీవాంఛ సిద్ధింపగలదు!' అని తమపైనున్న పట్టుశాటిని శ్రీనాథుని కంఠసీమ సలంకరించిరి. అంతట వారు శ్రీదేవివంక తిరిగి 'అమ్మాయీ, నీ పేరు శ్రీదేవికాదూ, మీకు శీఘ్రముగా మన్మథమూర్తి ఉదయింపగలడు. ఈ ఫలము గ్రహింపుము' అని పచ్చగా పండిన చూతఫల మనుగ్రహింపగా, నామె మహాప్రసాదమని లజ్జావనతవదనయై స్వీకరించెను.

ఆ పిమ్మట మహావైభవముగా ననసమారాధన నియమముతో బ్రాహ్మణ సంతర్పణమును చాతుర్వర్ణ్య భక్తజన సంతర్పణమును జరిగినవి. ఆనాటి పూజావైభవము భోజన సంతర్పణము 'నభూతో నభవిష్యతి' యని శ్రీ విద్యానగరమం దంతటను మాకుమ్రోగెను.

తర్వాత రెండురోజులకే లింగన సోమయాజుల అతిరాత్ర క్రతు సంకల్పము జరుగనున్నదని శ్రీనాథాదులకు తెలియనచ్చినది. అంతవరకు వారి కెవ్వరికి లింగనసోమయాజిని చూచి వచ్చుటకు తీరిక కాలేదు, శ్రీనాథాదులకు యజ్ఞమునకు రమ్మని యాహ్వానము రాలేదు. యజ్ఞశాలకు వెళ్ళుటా, మానుటా, యను మీమాంసలో పడి శ్రీనాథుడు మిత్రులతో నాలోచించెను.

'మనకు లింగనసోమయాజులతో పరిచయములేదు. నూతనాగంతుకులము. ఆహ్వానములు పంపినను మన కంద

జేయుటలో పొరపాటు జరిగియుండవచ్చును. వెళ్ళుదమా, వద్దా?' అని యాత డడిగెను.

'మన మిప్పుడు క్రొత్తవారమా? పిలువని పేరంటమునకు పోరాదు' అని సుబ్రహ్మణ్యక్షౌతి నిర్ధారించెను. దానిని నృసింహభట్టు అనుమోదించెను. 'మహాప్రఖ్యాతి గల ఈ సోమయాజి అతిరాత్రవైభవము చూడవలెనని ఉత్కంఠ కలదు. అయినను పిలువనిది వెళ్ళుట మనబోంట్లకు గౌరవముకాదు' అని తక్కిన విద్వాంసు లనిరి.

విద్యానగరము వచ్చినప్పటినుండి ఈ యజ్ఞమునుగూర్చి అందరు గొప్పగా జెప్పుకొనుచుండుట పోతన చెవుల బడినది. ఆతనికి వెళ్ళిచూడవలె నని ఉబలాటముగా నున్నది. పెద్దల యాలోచనలు విని తన వేడుక భంగము కానున్న దను నైరాశ్యముచే కలిగిన సాహసముతో నాత డిట్లనెను.

'అనాహూతులైనను యజ్ఞము చూచిరావలెనని పెద్దలందురుగదా! పిలుపు రాలేదని సంకోచమేల? అక్కడ మన విశిష్టత ప్రదర్శించు నవకాశము కలుగవచ్చును.'

సాధారణముగా వినయము వదలని పోతన పలికిన ఈ సాహసవచనముల కందరు విస్మితులైరి. వారందరికి వెళ్ళవలె ననుఉబలాట ముండనే యున్నది, అందుచే 'బాలాదపి సుభాషితమ్' అనుచు ఒకరొకరే వెళ్ళుటకే మొగ్గుచూపిరి, పేరిశాస్త్రి యను మీమాంసకుడు ఒక్కడు తప్ప. శ్రీనాథుడు ప్రీతితో పోతనను తన బాహువులతో పొదివి, శిరస్సు, కపో

లములు, గడ్డమును దువ్వి పుణుకుచు 'నీది సహజ పాండిత్యమురా, అవతారమూర్తివి' అనెను.

అప్పటినుండి పోతనకు సహజపాండిత్యనామము నిలిచిపోయినది. ముఖ్యముగా దుగ్గన పరిహాసమునకేమి, ప్రేమతోనేమి, యాతని తరచుగా సహజపాండిత్యా అని సంబోధింప నారంభించెను.

ఆ మరునాడు లింగన సోమయాజి యజ్ఞము చూచుటకు వారందరు పోవుటకే నిశ్చయించిరి.

౯

లింగన సోమయాజి యజ్ఞవాటిక వాని విడిదికి సమీపమునే తుంగభద్రాతీరమున గలదు. శ్రీనాథబృంద మాయుదయమున సంధ్యోపాసనాది నిత్యకర్మకలాపము శీఘ్రముగా ముగించుకొని సిద్ధమయ్యెను. వారందరు వేదవిదుల శుద్ధశ్రోత్రియ వేషములతో ఎట్టి పటాటోపము లేకుండ యజ్ఞవాటము చేరిరి.

ఆ అతిరాత్రమునకు ప్రాగ్వంశమును యజ్ఞాయతనమును బహువిశాలముగా నిర్మించిరి. ప్రాగ్వంశములో యజమాని లింగనసోమయాజియు సోమిదేవియు ఋత్విక్కులును గాక కొలదిమంది శ్రోత్రియులే ఉపవిష్టులై యుండిరి. ప్రాగ్వంశమునకు ఒక ప్రక్కనున్న పెద్దపందిరిలో శ్రీ విద్యానగరములోని

మహామాత్యులు సామంతదండనాథులు కూర్చుండిరి. క్రొత్తవారింకను వచ్చుచుండిరి. రెండవప్రక్కనున్న పందిరిలోనికి వేనవిదులు పండితులు చేరుచుండిరి. సుబ్రహ్మణ్యశ్రౌతిని అగ్రభాగమున నుంచుకొని శ్రీనాథాదులు ఆ పందిరిలో నొకచోట గూర్చుండిరి. ఋత్విక్కులలో సదస్యుడుగా నుండుటకు నిరిషుడైన శ్రౌతి పూర్వపరిచితుడైనందున సుబ్రహ్మణ్యశ్రౌతిని గుర్తించి, ఆదరముతో ప్రాగ్వంశములోనికి రమ్మని యాహ్వానించెను. పందిళ్లు వచ్చుచున్న జనములతో సందడిగా నుండెను.

ఇంతలో అరుణగిరినాథుడు డిండిమాడంబరముతో యథాప్రకారముగా వచ్చి రాజోద్యోగులున్న ఆవలి పందిరిలో నాసన మలంకరించెను. ఆతనికి శ్రీనాథుడెట్లుండునో చూడనలెనను కోరిక కలిగినది. ఆత డుద్యోగి వేషముతో నగర సంచారము చేసియుండెనని విన్నందున, ఉద్యోగులతో తానున్న పందిరిలో క్రొత్తవారి ముఖములకై కలయజూచెను. అక్కడ నందరు నతనికి పరిచితులే కనబడిరి. ఇతరులను అడుగుట తన బెట్టుసరికి లోప మనిపించినది.

ఆనల శ్రీనాథుడు డిండిమునిని ఖరి తీక్ష్ణముగా క్రీగంట పరీక్షించుచు. ప్రక్కనున్న దుగ్గన, పోతనలకు యజ్ఞశాలా విశేషములు వరించుచుండెను.

సంకల్ప ముహూర్తమునకు ఐదుగడియల వ్యవధాన మున్నందున నందరు ఇష్టాగోష్ఠులు సలుపుచుండిరి. శ్రీనాథుని వివరణము వినుచున్న పోతన ఆకస్మికముగా పరధ్యానములో

పడి, 'ఇప్పుడు యజ్ఞశాలాప్రదక్షిణము చేయించినచో అరుణగిరినాథులు డిండిమనాదముతోడనే ఊరేగుదురుకాబోలు' అనెను. శ్రీనాథునకు మెరపు మెరసినట్లు ఊహ స్ఫురించి ప్రాగ్వంశమునలో చేరిన సుబ్రహ్మణ్యశ్రౌతిని రమ్మని కనుసన్న చేసెను. ఆతనితో రహస్యముగా, ఈ న్యూనధానములో యజ్ఞపురుషస్వరూపమైన యజ్ఞశాలకు ప్రదక్షిణము చేయింపుమని సూచనచేసి ప్రాగ్వంశములోనికి పంపెను.

ఆ శ్రౌతి సదస్యునితో, 'సంకల్పముచేయుటకు చాల వ్యవధి యున్నదిగదా! వృథాగా ఇట్లు లోకాభిరామాయణముతో కాలక్షేపము చేయుటకంటె యజ్ఞపురుషుని ప్రత్యక్ష స్వరూపమగు ఈ యజ్ఞశాలకు స్వస్తివాచనపురస్సరముగా మనమందరము ప్రదక్షిణించుట బాగుండదా? మా ఆంధ్ర దేశములో నిట్లు చేయుట ఆచారము' అనెను. ఆ మాటలు సదస్యునికి ప్రక్కనే యుండి పిన్న ఉపద్రష్టకు నచ్చినవి. వారిద్దరివి ఋత్విక్కులలో విశేష గౌరవ స్థానములు. వారు లింగన్నసోమయాజికి చెప్పిరి. పూజ్యుడగు సోమయాజి బాగున్నదనెను. యజమానియు సదస్యుడును ఉపద్రష్టయు అధ్వర్యుడు హోతలు ఉద్గాతలు ఉపగాతలు స్వస్తివాచన పురస్సరముగా యజ్ఞశాలా ప్రదక్షిణమునకు బయలుదేరిరి. సుబ్రహ్మణ్యశ్రౌతియు కొంద రితర శ్రౌతులును వెంట నడిచిరి. అది చూచి ప్రక్కపందిరిలోని ప్రధాని మొదలగు గొప్ప ఉద్యోగు లందరు చేతులు జోడించి, తమ తమ గౌరవ లాంఛనము లన్నియు నదలి వినీతులై అనుగమించుచుండిరి.

'ఎక్కడను చూడని ఈ క్రొత్త ఆచార మేమిటి?' అని చిరాకుతో పలుకుచునే, అహోబిలనాథుడు బయలుదేరక తప్పలేదు.

ఆత డిల్లు లేచి అడుగు వేయుటయే న్యవధానముగా, అనుచరులు డిండిమతాండవ మారంభించి బయలుదేరు చుండిరి. అది చూచి డిండినుభటు కరసంజ్ఞతో డిండిమ తాండవ మాపించి ముకుళితహస్తుడై మహామంత్రుల ననుస రించి యజ్ఞశాలాప్రదక్షిణము సాగించెను.

పోతన పొంగిపోవుచు, 'డిండిమ తాండవ మాగిపోయినది' అని శ్రీనాథుని చెవిలో నూదెను. శ్రీనాథుడు చిరునవ్వుతో యథాపూర్వముగా యజ్ఞశాలానర్తనము చేయసాగెను.

ప్రదక్షిణము చేసివచ్చి అందరు యథాస్థానములలో నుప విష్టులైరి. ఆనల కాలజ్ఞుడు ఘటికాయంత్రమునంకను, ఎండలో పాతిన కర్రచాయనంకను చూచుచుండెను.

లింగనసోమయాజి కర్ణాటకుడగుటచే, నిర్మితులైన బుత్విక్కులు ముప్పాతిక మువ్వీసము కర్ణాటదేశీయులే యైయుండిరి. ఆ నగరములో గొప్ప ద్రావిడశ్రోతులు కలరు. వారు తమకు బుత్విగ్వరణము నొసంగలేదను నసూయతో, యజ్ఞములో ఎక్కడ ఏలోపము జరుగునా, ఎప్పుడు దోషోద్ఘాటనము చేయుదుమా, యని వేయికన్నులతో కనిపెట్టి కాచుకొని, శ్రోత్రియులున్న పందిరిలో ముందుభాగమున నొకచో చేరియుండిరి. చూచుటకు వచ్చిన కర్ణాటశ్రోతు లింకొకచోటను, మహా

రాష్ట్ర లింకొకయెడను గూర్చుండిరి. స్థానికులైన యాంధ్ర శ్రోతులు ప్రాముఖ్యములేక కర్ణాటులలో గలసియుండిరి.

ఆవల కాలజ్ఞుడు సంకల్పసమయ మైనదని సూచించుచు ఘంటానాదము చేసెను. ప్రాగ్వంశములో లింగనసోమయాజి ఋత్విక్సహాయముతో సంకల్ప మారంభించెను. సంకల్పము సాగుచున్నది. అందులో 'షోడశీగ్రహ' (ఒకానొక యజ్ఞ పాత్ర పేరు) అనుమాట యజమాని ఉచ్చరించెను.

వెంటనే ఒక్కపెట్టున ద్రావిడశ్రోతులలో నుండి 'ఆగండి, ఆగండి'! అను కేకలు వినవచ్చెను. సంకల్ప మాగినది. 'నేమందరమూ చూస్తూ ఉండగానే సంకల్పములోనే లోపము చేస్తారా? 'నాతిరాత్రే షోడశినం గృహ్ణాతి' అని ప్రత్యక్ష ముగా శ్రుతినిషేధ ముండగా, 'షోడశిని గ్రహిస్తారా' అనుచు కోపముతో ఎర్రపడిన ముఖములతో పెద్దగా కేకలు వేయ సాగిరి.

ఆ సమీపమునసే యున్న కర్ణాట శ్రోతులు కల్పించు కొని పెద్దగొంతుతో, 'ఏమి టీయాగడము? 'అతిరాత్రే షోడశినం గృహ్ణాతి' అని ప్రత్యక్షశ్రుతి విధించుచుండగా, ఏమిటీ యజ్ఞభంగము చేయుట, రాక్షసులవలె; తెలియనివాళ్లు ఊరుకోక' అని కేకలు వేసిరి.

మరల ద్రావిడులు 'ఆగడము మీదా, మాదా! పాపము ఆ లింగనసోమయాజి శ్రద్ధగా అతిరాత్రక్రతువు సంకల్పిస్తూ ఉంటే అడుగులోనే హంసపాదు పెట్టిస్తారా? మేము చూస్తూ సహింపగలమా? విధివాక్యముకంటె నిషేధ వచనము బల

నత్తరమని తెలియని మూర్ఖులక్కో పని ఏమిటి? కావేరీతీరములో తామ్రపర్ణీతీరములో ఎన్నెన్ని అతిరాత్రములు చూచాము. ఎన్ని చేయించాము. భగవత్స్వరూపులగు శ్రీవిద్యారణ్య పూజ్యపాదులు మెట్టిన ఈ పావనతుంగాతీర ములో పావనచయనశాలలో ఇంత ఉద్వ్యత్తికి సాహసింతురా?' అని గర్జించిరి. కర్ణాట శ్రోత్రులు 'మేమును పరశ్శతముగా అతిరాత్రములు చేయించినవాళ్ళమూ, చూచిన వాళ్ళమే. అన్నింట పోడశీగ్రహము గ్రహించియే చేసినాము. కావలెనంటే ఈ మహారాష్ట్రుల నడగండి' అని అరచిరి.

మహారాష్ట్రశ్రోత్రులు జంకుచు, 'కొన్ని యెడల మా దేశములో గ్రహిస్తున్నాము, కొన్ని యెడల గ్రహించుటలేదు' అని తప్పించుకొన జూచిరి.

ద్రావిడశ్రోత్రులు 'నిషేధవచనములను ధిక్కరించు నాచారము నిషిద్ధాచారము' అని హుంకరించిరి.

లింగనసోమయాజి సంకల్పమాపి పెద్దల నిర్ణయమున కెదురుచూచుచుండెను

బుుత్విక్కులిద్దరు తత్తరముత్తో పరువున నరుణగిరినాథుల కడ కరిగి, 'తమరు నిర్ణయమేదో సెలవిత్తురా?' అని వేడు కొనిరి.

'నేము పంచగౌడులలోనివారము గదా! ద్రావిడులు చేయుచున్న ఈ యజ్ఞములో మాగౌడాచారములు ఎట్లు అన్వయింపగలము!' అని ఆమన బిగ్గరగా పలికి తప్పించు కొనెను.

సదస్యుని కేసియుత్రోపక సుబ్రహ్మణ్యక్షౌతినంక జూచెను. 'ఇట్టిచిక్కులు వచ్చినప్పుడు సరియైన దారి చూపగలవాడు, నే నెరిగినంతవరకు శ్రీనాథభట్టు ఒక్కడే! దైవనశాత్తుగా నాత డిక్కడే యున్నాడు' అని యాతడు శ్రీనాథుని జూపెను. శ్రీనాథుడు ఈ వివాదసేమియు పట్టని వాని వలె పరధ్యానముగా నేదో యాలోచించుచుండెను.

సదస్యుడును, సోమయాజియు తలలెత్తి శ్రీనాథుని వంక జూచిరి. నీకుకావిన స్త్రములు ధరించి యాతడు సామాన్యుడుగా కనిపించెను. నలుబదిఐదేండ్లయిన నిండినట్లు లేవు. ఇంత చిన్నవాడు వృద్ధవిద్వాంసులకు కలిగిన చిక్కేమి తీర్పగలడని వారికి తోచినది. వారిద్దరు మాత్రి విరిచి యేమియు పలుక కుండిరి.

పండితులలో విద్వద్వినాదము కోలాహలమై చెవులు దిబ్బెళ్ళుకట్టించుచుండెను. మరిమరి సుబ్రహ్మణ్యక్షౌతి శ్రీనాథుని యతిశయము చెప్పుచుండుటచే, విధిలేక సదస్యుడు లేచినచ్చి, శ్రీనాథుని ప్రాగ్వంశములోనికి గొంపోయి యజమానియెదుట నిలిపెను. సోమయాజిపట్టమున బుత్విక్కులాతనిని ఈ చిక్కుతీర్పుమని యర్థించిరి,

శ్రీనాథుడు నిలువున నిలుచుండి తనపై యుత్తరీయము నడుముకు చుట్టెను. వెలుతురులో నిప్పు డాతడు కట్టియున్న నీకుకావి పట్టు పుట్టములు ఆతని దేహచ్ఛాయలో కలసిపోయి అపూర్వశోభ చేకూర్చెను. ఆతడు యజమానికిని బుత్విక్కులకును, సభ్యులకును నమస్కరించి గొంతు సవరించుకొనుచు

సకిలించెను. ఆతని ధీర వైఖరికి విస్మితమై యజ్ఞశాల నిశ్శబ్ద మయ్యెను. ఆతడిట్లు నిర్ణయ మొనరించెను.

'ఇందరు మహాశ్రోతలున్న ఈ యతిరాత్రము దర్శించు భాగ్యముచే నేను ధన్యుడనైతిని. ఇందరు పెద్దలును యజ్ఞపురుషునియందలి భక్తిచేతను, శ్రుతివాక్యముల యందుగల ప్రమాణబుద్ధి చేతనే పలుకుచున్నారు. ఈ ద్రావిడశ్రోతులు చెప్పినది యథార్థము, కర్ణాటశ్రోతులదియు యథార్థమే. రెండు శ్రుతులును ఉన్నవి. ఇట్టిపెద్దల వివాదము తీర్చుటకే భగవాన్ గౌతములు 'తుల్యబలవిరోధే పికల్పః' అని సూత్రించి యున్నారు. ఇక్కడ సమానబలముగల రెండు శ్రుతివాక్యములకు విరోధము వచ్చినందున వైకల్పిక మైనది. అందువల్ల నే ద్రవిడదేశములో పోడశిని గ్రహించుట లేదు. కర్ణాటులు గ్రహించుచున్నారు. మహారాష్ట్రులు మా ఆంధ్రులవలెనే కొన్నిచోట్ల గ్రహించుట, కొన్నిచోట్ల గ్రహింపకుండుట ఆచారముగానున్నది. అన్నియు సదాచారములే! నిషేధవాక్యములు వ్యాకరణశాస్త్రములో బలవత్తరములుగాని, అది ధర్మశాస్త్రమునకు అన్వయింపదు. పోడశిని గ్రహించుటయు ఒప్పే!— గ్రహింపకుండుటయు ఒప్పే—'

అంతవరకు వినదించుచున్న శ్రోతులందరికి కన్నులు విప్పినట్లయినది. అందరు తృప్తిపడిరి. వివాద మడగినది. శ్రీనాథుడింకనుఇట్లనెను.

'ఇందుచే ఏమి చేసినను ఒప్పే. మీరు కర్ణాటులైన మీరు కర్ణాటదేశాచార మవలంబించుట యుక్తము. అంతేకాక,

యజమాని షోడశీనామోచ్చారణము చేసినాడు. గ్రహింపని పక్షమువారు ఆనామ ముచ్చరింపకుగదా? యజమానినోట ఆ శబ్దము వచ్చినంమన ఈ అతిరాత్రములో విధిగా షోడశీ గ్రహగ్రహణము చేయవలెను.'

ఇట్లు ముగించి మరల నందరకు నమస్కరించి ఆతడు పందిరిలో స్వస్థానమునకు బోయి కూర్చుండెను. సంకల్పము నిర్విఘ్నముగా పరిసమాప్తి నొందినది. ఆపైన కర్మకలాపము లారంభింపబోవుచు సోమయాజి శ్రీనాథుని నాదరముతో ప్రాగ్వంశములోనికి బిలిచి, 'నాయనా, యజ్ఞపురుషుడు నీకు కామితార్థములు ప్రసాదింపగలడు, ఈ క్రతువు పూర్తియగు నంతవరకు ఈ శాల విడిచిపోవ వీలులేదు. సదస్యులు, ఉప ద్రష్టతోపాటు నీవును సర్వద్రష్టవై యుండి నన్ను ధన్యుని జేయవలె' ననెను, శ్రీనాథుడు సమ్మతి సూచకముగా వినయ ముత్తో నోంకార మొనర్చెను.

ఆవల డిండిమభట్టుకు ఇప్పుడు శ్రీనాథు డెవరో తెలిసినది. విద్వత్తు ఎట్లున్నను యుక్తిశాలిగా నున్నా డనుకొనుచు, రొంతసేపటికి డిండిమతాండవపురస్సరముగా నిజగృహా న్మఖు డయ్యెను.

ఆ యతిరాత్రము జరిగిన పండ్రెండు రోజులును శ్రీనాథుడు సుబ్రహ్మణ్యశ్రౌతితో ఎక్కువభాగము ప్రాగ్వంశములోనే గడపెను. ఎవరికి ఎప్పుడు ఎట్టి సందేహము కలిగినను శ్రీనాథు నడిగి యాతడు చెప్పినట్లు నడచుకొనుచుండిరి. అతిరాత్ర

ప్రయోగమాతనికి కరతలామలకముగా నున్నదని విద్వాంసులు గ్రహించిరి.

అవభృథస్నానానంతరమున లింగనచయనులు శ్రీనాథుని కౌగిలించుకొని దుశ్శాలువలు కప్పి నిర్ణీతదక్షిణ యొసగెను. శ్రీనాథుడది యలకోకగా గ్రహించి దానికి చతుర్గుణితముగా సువర్ణములు యజ్ఞభిక్షగా- ఇప్పుడు ఈ క్రతువు చేయుటచే చయనులైన-లింగనచయనుల కర్పించెను.

౧౦

వసంతఋతువు ప్రవేశించినది.

ఫాల్గుణపూర్ణిమనుండియే శ్రీ విద్యానగరములో నసం ంభోత్సవములకు పూర్వాంగ మారంభమైనది. ఆనాడు హోళికోత్సవము, మన్మథ పూజాదికములు జరుగును. హోళి క్రోత్సవాడులు ముఖ్యముగా జాతరాహులే జరుపుట యాచారము. వసంతఋతువు వచ్చుటతో దాక్షిణాత్యులకూడ ఆ ఉత్సవములో కలసినందున ఉత్సవకోలాహలముతో విద్యా నగరము హోరుపెట్టుచున్నది.

సంవత్సరాది పాడ్యమినాడు హోళికకు వందన మాచరించి, చందనముతో కలపిన చూతపుష్పములను శ్రేయస్కామలు ప్రాశనముచేయుట విధిహితి మగుటచే, కొండవీటివిడిదిలో నందరు నట్లు కావించిరి.

మావు లప్పటికి పూర్వమే కొన్ని పూసి కాయలుకాసి పండ్లనుకూడ పండినవి. ఇప్పుడు మావులన్నియు చిగిర్చి, పూచి, కాయలు కాసినవి కోయిలల కూతలు గిరికందరము లలో వనాంతరములలో ప్రతిధ్వనించుచున్నవి.

అన్ని దేవాయతనములలో ఉత్సవములు జరుగుచున్నవి. ఆ నగరమునకు అధిష్ఠానదైవతము శ్రీ విరూపాక్షేశ్వరస్వామి యగుటచే, ఆ స్వామి వసంతోత్సవ మన్నిటికంటె అతిశయ శోభతో జరుగుచున్నది. ఆ వసంతోత్సవమును పురస్కరించు కొని ఎందరెందరో భాషాకవులు కన్నడములో, అరవములో, మళయాళములో, ఆరెమరాటీభాషలో, ఓఢ్రములో, ఆంధ్ర ములో ఎన్నెన్నో కావ్యములు రచించిరి.

శ్రీ విద్యానగరరాజ్య విద్యాధికారియైన 'అరుణగిరినాథ డిండిమభట్టు శ్రీ విరూపాక్షస్వామి వసంతోత్సవమును వర్ణించుచు 'యోగానంద ప్రహసనము' అను దృశ్యకావ్యమును సంస్కృతములో రచించియుండెను. దాని నిప్పుడు వాడవాడ లందును, ఎన్నెన్నో సమాజములవారు ఒకరి నొకరు మించ వలెనను స్పర్ధతో రాత్రింబవళ్ళు ప్రదర్శించుచున్నారు. కొంత మోటు హాస్యమే యైనను అది పండితపామరజనములకు ఎంతో వినోదము కలిగించుచుండెను. ఆయన డిండిమనాదము కంటె నిప్పుడు యోగానందప్రహసన ప్రదర్శనము సహస్ర గుణముగా డిండిముని కీర్తిని దిగంతరాళముల చాటించు చుండెను.

ఇది శ్రీనాథబృందమునకు అత్యాశ్చర్యము కలిగించెను. ఆయన డిండిమునాట్యము చూచి పండిత పామరు లసహ్యపడు చుండిరని వాకు భావించుచుండిరి. ఇప్పు డాకస్మికముగా నా ప్రహసనము సర్వజనాదరపాత్ర మగుట వారి కర్థము కాలేదు. మోటుహాస్యము పండితుల నెట్లు ఆకర్షించునని ఆశ్చర్య పడవలసిన పనిలేదు. సాధారణముగా విద్వాంసులు కర్మిష్ఠులై, విద్యావ్యాసంగములతో శ్రద్ధ పుచ్చుచు, శుచిగా నుండి, పవిత్రజీవితములు గడుపుచుండిరి. అట్టివారి కిట్టి ప్రహసన ప్రదర్శనములు ఆటవిడుపువలె నుండి, నిశితవ్రత జీవితములకు విశ్రాంతివంటిది కలిగించుచుండెను. ఉత్సన సమయములలో తప్ప వా రట్టి మోటుహాస్యము విన నిచ్చగింపకుండిరి.

డిండిముని పేరు ప్రతిష్ఠ లెక్కకురాకుండ జేయు నుపాయ మేమా యని యాలోచించి, శ్రీనాథాదులు వామనభట్టబాణుని శృంగారభూషణభాణమును దానికి ప్రతికట్టుగా ప్రదర్శింప నుద్యోగించిరి. అదికూడ శ్రీ విరూపాక్షస్వామి వసంతోత్స వములలో పుట్టిన యూపకమే.

భాణములో పాత్రధారి యొకడే. అది ఏకపాత్రాభినయము వంటిది. అతడు ఇతర పాత్రల వాక్యములను, 'ఓహో నీ విట్లనుచున్నావా?' అనుచు ఆవలిపాత్ర కంఠమును వైచిత్రిని అనుకరించి తన యుత్తరముకాని, భావముకాని చెప్పుకొనుచు పోవును. ఆవలివారు పండితులైనచో పండితుని వలెను, పామరులైనచో పామరునివలెను, స్త్రీయైన స్త్రీవలెను పలుక వలెను. నత్తి, నంగి, మాటమింగుట, ముక్కుతో మాట్లా

మంట, కూతలు, కేకలు, బొబ్బలు. పొట్టేళ్ళ ఢీకొన్న ఘాకలు ప్రదర్శింపవలెను. పాత్రధారి కెంతో నేర్పు కావలెను. వారి బృందములో గుళులింగమున కా నేర్పు కలదు. గుళులింగ మా భాగము ప్రదర్శింపసాగెను.

అందలి కథావస్తువిది. విలాసశేఖరుడు నాయకుడు. ఆతడు విద్యానగర వేశ్యావాటికలో ఉదయమున తన భోగిని యింటి నుండి బయలుదేరి సాయంకాలము వరకు ఆవీధిలోనే తిరుగుచు తుదకు కామమంజరి కూతురగు అనంగమంజరి ప్రథమ రజస్వ లోత్సవమున పీటపై కూర్చుండుట నేత్రానందముగా గాంచి ధన్యుడగును. దాసితో భరతవాక్యము. ఈ మధ్య మలయ వతితో సల్లాపముచేసి, ఇంటి యజమానురాలు గూర్చున్న కమల వతిని వర్ణించును. తర్వాతిఇంటిలో నున్న - మందారకుని అగ్గించును. ఆతడు యజ్ఞార్థము తండ్రి దాచిన ధనము దొంగి లించి, ఇక్కడ మన్మథయాగమునకు దీక్ష వహించినవాడు. అంతట పూర్వము తన ప్రియురాలగు రత్నావళి యొసగిన తాంబూలము గ్రహించి, కనకలతా కామందకులను ప్రోత్సాహపరచును. ఇందుమతి కంచుకక్రీడ తిలకించి, పిమ్మట తల్లి మేడమీద నిర్బంధించిన వాసంతికను పలుకరించి, ప్రియుని పుష్పమాలతో తాడనముచేయుచున్న కలకంఠిని మందలించును. గణవత్తునికడ నృత్యము నేర్చుచున్న బాల చంద్రికను వర్ణించును. అంతట మనోలోత్సవమున నున్న మందా రికా మకరందుల గాంచి మందారిక గానముచేయుచున్న హిందోలను శ్లాఘించును. విలాసవతి అక్షద్యూతము దర్శించి,

మధ్యాహ్నవేళ చంద్రవతి యుద్యాననమున విశ్రమించును. ఆ పిమ్మట పొట్టేళ్ళ పందెము, కోళ్ళపోరు, మల్లయుద్ధము ప్రియురాలికోరకై ఇద్దరు వీటులు ఖడ్గయుద్ధము చేయుట, దర్శించి, మంజుభాషిణిగాథను పాడగానాలకించి ఆనందించును. చిట్టచివరకు అనంగమంజరి పీటపై కూర్చుండుట చూచి, జన్మసార్థకత గాంచును. ఇది కథానస్తువు.

గుకులింగము నాట్యకుశలుడు. ముందిది కొండవీటి విడిదిలో ప్రదర్శించిరి. ప్రేక్షకు లెంతో సంతోషించిరి. మరునాడు పాన్పుపారీబజారులో రత్నాలచత్వారములో దీనిని ప్రదర్శింపగా, దశగుణముగా జనములు వచ్చి చూచి ఆనందించిరి. గుకులింగ మిట్లే ఎన్నో ప్రదర్శనములుచేసి, వినోదము కలిగించెను. అన్నియు జనుల నాకర్షించెను గాని, అది యోగానందప్రహసనముతో తులతూగలేకపోయెను. దానికి కారణములు రెండు. ప్రహసనమును ఎన్నెన్నో నటబృందము లెన్నెన్నో చోట్ల ప్రదర్శించుచుండ నిది రెండు-మూడే ప్రదర్శించుట ఒకటి. ఈ భాణములోని శృంగారము ప్రహసనములోని పచ్చిబూతుతో పోటీచేయలేక పోవుట రెండవకారణము.

శ్రీనాథాదు లాలోచించి పర్వతమల్లును ప్రయోగింపదలచిరి. ఆత డిక్కడికి వచ్చినప్పటినుండియు శిష్యులతో పాటు మల్లశాల లన్నియు చూచి వచ్చెను. ఆతని నెవ్వరు మల్లయుద్ధమునకు రమ్మన సాహసింపలేదు. కాని శిష్యుల నాహ్వానించి పెక్కుమం వారిచే నోడిపోయిరి. కొలదిమంది సములైరి. గెలిచినవారు లేరు. అన్నిమల్లశాలలు నాతని రానిచ్చెను,

గాని, విద్యామల్లు అనువాని గరిడీలోనికి రానీయలేదు. ఆ గరిడీలోనికి మల్లుల కెనరికి ప్రవేశములేదనియు, అక్కడ నాంత రంగికశిష్యులకు కొలదిమందికే మల్లవిద్యారహస్యములు ఉపదేశింప బడుచుండెననియు, తెలియవచ్చినది. నగరములోని మల్లులందరు ఎట్టి పర్వతమల్లుచే విద్యామల్లును సవాలు చేయించి ఓడింపజేసి పరాభవింప జేయవలెనను కుతూహలముతో పర్వతమల్లును ప్రోత్సహించుచుండిరి.

విద్యామల్లును, ఆతని శిష్యులును వీధులలో పోవుచుండగా, వారిని పర్వతమల్లు నిశితముగా పరీక్షించెను. విశేషమేమియు కనబడలేదు. ఐనను అన్ని మల్లశాలలలోనివారును విద్యామల్లు శిష్యులను గెలిచినవారు లేరని చెప్పువాడే. రహస్యముగా చిన్న ఆయుధములు దాచుకొందురో, ఏమైన మోసము చేయుదురోగాని, వారితో తలపడినవా రెంత బలవంతులైనను ఓడిపోవుటే కాక, మరల జన్మలో మల్లయుద్ధములకు పనికిరాకుండ బోవుచుండిరి. పోరికి పూర్వము వారి సర్వాంగములు పరీక్షించి మధ్యవర్తిక్షేత్రములలో జరిపినను లాభము లేకపోయినది.

అన్నియు నాలోచించి పర్వతమల్లు తన చివరి శిష్యునిచే విద్యామల్లును సవాలు చేయించెను. ఆతడు ముందు తన శిష్యుని జయింపు మనెను. ఇద్దరు శిష్యులకును చైత్రశుద్ధ సప్తమినాడు మల్లయుద్ధము నిశ్చయించిరి. ఏబది సువర్ణములు పందెము.

ఆ మల్లుసోదు మాచుటకు నగరములోని అన్ని గరిడీల వారు వచ్చిరి: వారే వేయిమంది యుగడిరి. ఇతర జనములు వేలకొలది వచ్చిరి. పర్వతమల్లు శిష్యునిముందు విద్యామల్లు శిష్యుడు ఏనుగుగున్న ముందు తట్టుగుఱ్ఱమునలె కనిపించు చుండెను. విరివిగా పైపండెములు కాయుట సాగుచున్నది. మల్లుర నిద్దరిని మధ్యనస్థులు పరీక్షించి గోదాలో వదలిరి. పోరుకు ఆజ్ఞ యిచ్చిరి. చేతులు కలసిన మరునిమేషమునలోనే విద్యామల్లు శిష్యుని పర్వతశిష్యుడు ఎత్తి గోదాలో పడవేసి, మీది కెక్కి పీటుచేయుటకు పెనగులాడు చుండెను. ఆకస్మికముగా పర్వతశిష్యుని కుడిబాహువులో నిపరీతమైన నొప్పి పుట్టి చచ్చినడుచుండగా గీపెట్టెను. తక్షణమే ఎడమచేయి అవశమయినది. ఆతడు గీపెట్టుచునే తన రెండు కాళ్ళతో నదిమి పట్టువదలక, భయంకరముగా చిత్తుచేయుటకు యత్నించు చుండెను. అంత్రములో నాశని ఎడమకాలు కూడ చచ్చు వారగా పట్టువదలి ప్రక్కకొరగెను. వెంటనే విద్యాముల్లు శిష్యుడు సింహముపలె పైకెగసి అవలీలగా ఏనుగుగున్నవంటి తన ప్రత్యర్థిని పీటుచేసెను. పర్వతశిష్యుడు గోదాలో మూర్ఛ నొంది మాటలేక పడిపోయెను.

ప్రేక్షకు లందరు 'అన్యాయము! మోసము! రహస్యాయుధములకై వెదకండి!' అని ఒక్కపెట్టున కేకలువేసిరి. విద్యాశిష్యుడు తనరెండు చేతులెత్తి చూపెను. తన టోపీలోనున్నదనగా అది తీసి చూపెను. కట్టిన దట్టిలో దాచినాడని కేకలువేయగా, ఆత డాదట్టియు నూడదీసి దిగంబరుడై నిలు

చుండి పరీక్షించుకొనుడనెను. గోదావట్లలో పారవేసినాడని ప్రేక్షకులరచిరి. మధ్యవస్తులకును ఆసందేహమే కలిగి, గోదావట్లు కుళ్ళగించి జాగ్రత్తగా వెదకిరి. ఏమీయు లేదు. అప్పుడు విద్యామల్లుశిష్యుడు న్యాయముగానేగెలిచినాడని ప్రకటించిరి. గరిడీలవారు తమ కన్నులు తామే నమ్మలేక 'ఎప్పుడూ ఇంతే' అనుచుండిరి.

పర్వతమల్లు నోట మాట పెకలలేదు. ఎట్లో ప్రయత్నించి ఈ మాసు తన పెద్దశిష్యునిచే సనాలు చేయించెను. ఈ మాసు విద్యామల్లు పెద్ద శిష్యుడు ప్రత్యర్థి. పణము మూసు సున్నములు. పోరికి తిథివారములు నిర్ణయించుకొనిరి.

మూర్ఛావశుడై యున్న మల్లుని బండిమీద విడిదికి తెచ్చిరి. తన శిష్యుని ఓటమి పర్వతమల్లు శ్రీనాథునకు చెప్పదలపలేదు. కొండపేటి వారి అతిశయము విద్యానగరములో ప్రకటించుటకు మల్లురను ప్రయోగింప దలచిన శ్రీనాథుడు వారలమూర్ఛ విచారణ చేయగా ఆ రాత్రికే ఆ అయశుభ వార్త తెలిసినది. వెంటనే శ్రీనాథుడు మల్లుర కొసగిన శాలకు స్వయముగా వెళ్ళెను.

తత్తరముతో పర్వతమల్లు వచ్చి నమస్కరింపగా, శ్రీనాథుడు మలుకులనంటి చూపులతో నాతని వేధించుచు 'మల్లూ! మందుగా నాకెందుకు చెప్పలేదు,' అని గర్జించెను.

'ఇది నావిద్యకు సంబంధించినది కనుక తమతో మనవిచేయ నక్కర లేదనుకొంటిని ప్రభూ!'

'నీకు దేహమే బలిసినది కాని, మతి శూన్యము. కండకావరము పనికిరాదు. ప్రాయశ్చిత్త మైనది. నీ శిష్యుని ఓటమితోనే నోడిన ట్లయినది. కొండపేటిరాజ్యమే ఓడినది. ప్రభువులు, సర్వజ్ఞ సార్వభౌములే పరాజిత్తు లైనట్లని గమనించినావా?'

'లేదు. క్షమింపనలెను.'

మూర్ఛనొందిన శిష్యుని శరీరమును శ్రీనాథుడు పరీక్షించి నాడులు చూచి, నే నిప్పుడు చూడనిచో, వీడు తెల్లవారు సరికి స్మరణించియుండును' అనుచు మరినురి చీవాట్లుపెట్టి తన మందిరమునుండి ఔషధము తెచ్చి పోతనతో నిచ్చి, అక్కడినుండి తక్కినవారిని పంపివేసెను. ముందొక ఔషధము వాడి ఆ మల్లునికి స్మృతి కలిగించెను. అతని కెక్కడెక్కడ ఎక్కువ బాధిగానున్నదో విచారించి అక్కడ పోతన అమృత హస్తములచే అంజన మొకటి మర్దింపజేసి, సుఖనిద్ర పోవుటకు ఔషధము ప్రాపించెను. అప్పుడు పర్వతమల్లును రానిచ్చి ఆరాత్రికి రోగి నెవ్వరు పలుకరింపనద్దని శాసించెను.

మరునాటి యుదయమున శ్రీనాథుడు రోగిని చూచుటకు రాగా, చిత్రముగా నామల్లుడు, 'నే నోడిపోలేదు. నిన్నిదిగో పీటు చేస్తాను' అని రోజుచు చివ్వున లేచి, ఎదుట వంగియున్న శ్రీనాథునిపై ప్రతిమల్లు డను భ్రాంతితో కలబడబోవుచుండెను. పర్వతమల్లు తనబాహుబంధములో నాతని దృఢముగా బంధించి పరుండబెట్టి ఏకధారగా కన్నీరు కార్చసాగెను. శ్రీనాథుడు పకపక నవ్వుచు 'ఇతని నేరోజు కడుపు నిండా గోక్షీరము,

పరిశుద్ధ జలము ఇక్కున్నది. రేపటి నుండి గోదావరికి పోవుటకు తయారు తినవచ్చును' అనుచు వెడలిపోయెను.

ఆ మల్లుడు నాలుగురోజులకే నగరములోని గోదాలను దర్శింపబోగా ప్రతిచోటను ఆతని నాదరించువారే. చనిపోయినవాడు బ్రతికినచ్చినట్లుగా నాతని జూచి వా రాశ్చర్యానందములు ప్రకటించిరి. అంతకుముందు విద్యాసుల్లుశిష్యులను పడవేసినవారే అనుచు. చచ్చుపడిన బాహువులు కాళ్ళ బాగు పడుటకాని, మూర్ఛనొందినవాడు బ్రతుకుట కాని, వారెరుగరు. ఓడిపోయినందుకు అనాదర మేమాత్రము చూపక స్వస్థుడై బ్రదికి నందుల కాతని వారభినందించుచుండిరి.

తన పెద్ద శిష్యునకు విద్యాసుల్లుశిష్యునకు మల్లయుద్ధము నిర్ణీతమైనదని పర్వతసుల్లు శ్రీనాథునకు ముందు చెప్పుటకు సాహసింపలేదు. పోకు దగ్గరపడుచున్నందున చెప్పక తప్పదని ఒకనాడుపోయి నివేదించెను. శ్రీనాథుడు చుండిపడి చీవాట్లు పెట్టెను. పదిరోజులు గడువు తీసికొన్నాని శ్రీనాథు డాదేశించెను.

'ప్రభూ, కుస్తీకి గడువుకోరినచో ఓడిపోయినట్లే-నాప్రాణము పోయినట్లే!'

'అయితే నీ శిష్యుని ప్రాణములు తీయింతువా?'

'మాగౌరవము ముందు నా శిష్యుల ప్రాణములును, నా ప్రాణములును తృణప్రాయములు.'

శ్రీనాథుడు : 'నీ ప్రాణములు, నీ శిష్యుల ప్రాణములు నీ చేతులలో లేవు. వేమప్రభువులు మా కప్పగించినారు.

నీవుగాని, నీ శిష్యులుగాని నా యాజ్ఞ లేనిది మన వసతి గడప దాటరాదు- నేను కబురంపు వరకు నీ ముఖము నాకు చూపకు పో!'

పర్వతమల్లు చిన్న పుచ్చుకొని తన శాలకు బోయి దీన ముగా శిష్యులకు ప్రభువుల యాజ్ఞ తెలిపెను.

ఇట్లే శ్రీనాథుని చైత్రశుక్ల మంతయు చిరాకుగా నుండెను. విసుగు, కోపము, తొందరపాటు ప్రదర్శించుచు చిర్రుబుర్రు లాడు చుండెను. నృసింహభట్టు తప్ప తక్కిన పండితులుకూడ నాతనికి దూరదూరముగా మెలగుచుండిరి.

ఆకస్మికముగా చతుర్దశినాటికి శ్రీనాథుని ముఖలక్షణము సౌమ్యత వహించెను. స్థానాపతి కరణము బొచప్పను పిలిపించి యాతడిట్లాజ్ఞాపించెను. 'రేపు మూడుజాముల వేళకు మన విడిదిలో కవితాగోష్ఠికి ఏర్పాట్లు చేయింపుము. శ్రీవిద్యానగరములో నున్న ద్రావిడ కర్ణాట మహారాష్ట్ర పారశీక మళయాళాంధ్రాది భాషాకవుల నందరిని రావింపుము. పండితులతో గాని, పండితకవులతో గాని, పనిలేదు. కేవలశాస్త్ర చర్చలతో తలలు పట్టుకొని రసము గ్రహింపలేని వారిని పిలువ వద్దు సుమా! మున్మోకనిని మాత్రము పిలు!'

బొచప్పను పంపివేసి పర్వతమల్లును రిమ్మని కబురంపెను. మల్లుడు చిన్ననోయినముఖమ తో వచ్చెను, ఆతడు దిగులుతో చిక్కి సగమై, రెక్కలు తెగిన కొండవీటి కొండవలెనే యుండెను.

'మల్లూ, నీ శిష్యుని కుస్తీకి గడువు ఎన్నాళ్ళున్నది?'

'నాలుగునోజులే ప్రభూ!'

'ఆ రోజాతనికి జ్వరము వచ్చినచో పోకు సాగునా?'

'నిజముగా జ్వరము నచ్చినదని మధ్యవర్తులు చూచి తృప్తి పడినచో, మల్లుపోకు గౌరవహాని లేకుండ వాయిదా పడ వచ్చును. మధ్యవర్తులు మల్లునకు తీవ్రమైన జబ్బుచేసినదని ప్రకటించిన తర్వాత, ప్రతివీడుకు కుస్తీ జరుగవలెనని పట్టు పట్టినచో, మధ్యవర్తులు ఆతనికి పందెపుధన మిప్పించి ఆతనిపై ఊమిసి 'నీవు గెలువలేవు' అని పంపివేయుదురు. ఆ పరాభవ మున కిచ్చగింపక వాడు వాయిదాకే అంగీకరించును.'

శ్రీనాథుడు: నీ పెద్దశిష్యుడనగా గండమల్లేనా? నాని కా నాటి మధ్యాహ్నమునకు గజజ్వరము వచ్చును, అర్ధరాత్రినరకు తగ్గదు. పదిరోజులు గడువు తీసికో? గెలుచునులే పో!'

పర్వతమల్లు తీరని హృదయవేదనతో సెలవుతీసికొనెను.

ఆ మరునాటి యపరాహ్ణవేళ శ్రీ విద్యానగరములోని కేవలకవు లందరు ఒక్కొక్కరే కొండపీటి విడిదికి చేరుకొన సాగిరి. వారెక్కువ భాగము యువకులు, శాస్త్రవాసనలు గిట్టనివారు. హృదయములో నుండి పొంగినచ్చు కవితావేశ మును అప్పటికి స్ఫురించినభాషలో వారు ప్రకటింతురు. వారి కావ్యములును, వారి వేషములు రూపములవలెనే, అన్యక మధురములై వింత పింత కుచ్చులీనుచుండెను. వారు ఎవరి కవనము వారే వందలపర్యాయములు పఠించి ఆనందించువారు కాని, ఇతరుల రచనలు పఠించిన పాపమున పోయినవారు కారు. ఇతర కవులు కావ్యగానము చేయునప్పుడు, హృదయమునకు

హత్తించుకొనకయే, అతిశయోక్తులతో శ్లాఘించుచుండుదురు. తమ కావ్యము పఠించునప్పుడు మాత్రము, శ్రోతలందరు దాని నిరుపమాన నిర్విశేష సౌందర్యమునకు ముగ్ధులై ఆలకించుచున్నారని తలచుచు, దాని రసమునకు తామే తన్మయులై, బహువిధాభినయములతో ఎడతెగకుండ వినిపింతురు.

ఆ కవి శ్లోకేలల కందరికి మున్నుకవి గురుతుల్యుడు. ఆతడు బహుశాస్త్రవాసనలు కలవాడైనను, సాహిత్యవ్యాకరణములలో తప్ప, గట్టి ప్రవేశములేదు. ఎక్కడ ఏమాత్రము గుణలేశము కానిపించినను, దానిని పొగడుట యాతని కభ్యాసము. తన కవిత్వ మెప్పుడో కాని వినిపింపడు. అతనిని పేరుకే కాని, వారు నిజమైన కవిగానే భావింపరు. ఐనను గౌరవముతో గురుదేవా, గురూజీ యని తప్ప సంబోధించరు.

ఇట్టి చిత్ర చిత్ర ప్రకృతులు గల బహుభాషాకవుల కవితా గానతరంగములతో ఆనాటి కవితాగోష్ఠి అపూర్వశోభత్తో రాణించెను. వారల కావ్యరసముకంటె, శ్రీనాథుని పరివారము మాటిమాటికి వారి కందించుచు వచ్చిన చెరకు పానకములును, చూతఫలరసములును, మధురతరములుగా నుండెను, నృసింహభట్టు తప్ప తక్కిన కొండపీటిపండితు లెన్నరు నక్కడ లేరు. పోతన దుగ్గన లుండిరి. ముమ్మకవితో నారనప్ప కూడ వచ్చెను.

చీకటి పడినది. దీపములు వెలిగించిరి. గోష్ఠి సాగుచునే యుండెను. ముమ్మకవి శ్రీనాథుని తనపద్యము లేమైనా క్రొత్త వున్నచో వినిపింపు మనెను.

గోష్ఠిలోని కవు లందరు నిట్టూర్చిరి. నోరు తిరుగని పద్యములు వినవలసి వచ్చినుగదా, భగవంతుడా, యనుకొనిరి. మధురపానీయము ఈచ్చినందుకు కృతజ్ఞతయైన చూపవలెగదా యనుకొనుచు, అవి విను దురవస్థకు సిద్ధపడిరి.

శ్రీనాథుడును వారితోపాటు యువకుడైనట్లు, ముగ్ధమనోజ్ఞ లజ్జతో ఎర్రవారిన ముఖముతో, సర్వాంగములు కుంచుకొనిపోవుచుండ ముందిట్లు ప్రారంభించెను.

'ఈమధ్య మా యాత్రాధ్యయములో ఉబుసుపోకకై విరూపాక్షదేవుని స్తుతించుచు, కావ్యమువ్రాసి, దానికి మానసోల్లాస మని నామకరణము చేసితిని. మీబోటి సహృదయులు విని ఆనందించినచో, కృతార్థుడ నగుదును. సంస్కృతభాష కనుక మీ కందరికి తెలియును.'

అంతట రంగురంగులతో నలంకృతములైన చెక్కలతో బిగింపబడి, మనోహర చిత్రములు చిత్రించియున్న తాళపత్ర గ్రంథ మాతడు మరింత సిగ్గుపడుచు చేతులలో గ్రహించి, వ్యాసపీఠమునై నుంచి పూజించి, వినిపింప నారంభించెను. పదములు సంగీతములో పరిసిపోవుచుండెను.

ప్రతిశ్లోకమును ఎనిమిది తొమ్మిది కవులు మెచ్చుకొనుచుండిరి. ముమ్మనికవి మాత్రము పూనుము నహించెను. వినుచున్న కొలదియు నాతని ముఖము వివర్ణ మగుచున్నదని క్రీగంట చూచుచున్న శ్రీనాథుడు గ్రహించి, మరి మరి పద్యములు వినిపిం చెను.

విని విని మున్నుకవి ఆనందము ప్రకటించుచు, 'శ్రీనాథ భట్టా, నీ తాళపత్ర శోశము ఎంత అందముగా ఉన్నదయ్యా! దాని కాపు చెక్కలు, దాని పత్రములు, అందులోని చిత్ర ములు, ముత్యాలకోవనంటి దస్తూరి, నీ మధురమనోజ్ఞకంఠమూ, అన్నీ నీ విచ్చిన పానీయములవలెనే హృదయంగమములుగా ఉన్నవయ్యా! నొంబ సంతోషమాయె. ప్రొద్దుపోవుచున్నది. సెలవు తీసికొందును' అనెను.

ఆయనతో తక్కినవానిను బయలుదేరిరి. శ్రీనాథు డందరికి వేరువేర విశేషాదరముతో కృతజ్ఞత తెలిపి తాంబూలమిచ్చి సాగనంపెను.

విడిదికి తమ మాటలు వినబడనంతటి దూరమునపోయిన తర్వాత ఆ యువకవి ద్రోకిలల నోళ్ళు ఒక్కటే విప్పుకొన సాగినవి. 'గురూజీ! శ్రీనాథభట్టు విద్వాంసు డంటిరే! అదే మిటి, అన్ని వ్యాకరణదోషములు చేసినాడు. నర్దయుక్క లను సరిగా ఉచ్చారణయే చేయలేకపోయెనే! ఇటువంటివాడేనా డిండిమములతో వాదించేది? సామాన్యజ్ఞానము గల మాకే ఇన్ని దోషములు కన్పించినవే-గురూజీ! ఆయన ఎన్నో శాస్త్ర ముల పండితుడన్నారు. గురూజీకూడ ఎన్నడు లేనిది పొరబడ ట్టున్నారే! ఇటువంటివాడు గౌడడిండిమములతో వాదానికి దిగితే పంచద్రావిడులకే తలవంపులు!—'

అంతలో ఒకరు పకపక నవ్వుచు 'శ్రీనాథభట్టుకు ఒక్క విషయములో పాండిత్యమున్నది' అనగానే ఒక్కొక్కరే అందుకొని 'గోష్ఠిమందిరము ఎంత చక్కగా అలంకరించాడు!

అక్కడ ఆసనాల ఏర్పాటు ఎంతబాగున్నది. మనకిచ్చిన ఫల రసాలు ఎన్నెన్ని చవులూరుతున్నవి-వాటిలోని మాధుర్యము లోని శతాంశమైనా ఆయన కవిత్వములో ఉంటే, ఎంత గాణించేది-' అని ఎక్కసక్కెము లాడసాగిరి.

ఆ పూర్ణిమ నాటి వెన్నెలలో శ్రీవిద్యానగరరాజవీథులలో వారావిధముగా బిగ్గరగా. శ్రీనాథకవి అపాండిత్యమును గూర్చి పకపక లాడుచు, పరిహాసము లాడుచుండగా. వయస్సు నలన హేళనలో కలియక పోయినను, ముమ్మనకవి కూడ మొత్తము మీద వారిలో నేకీభవించెను. ఆరాత్రి వీథులలో జరిగిన ప్రసంగముల నలన నేమి. మరునాటినుండి ఆ గోష్ఠిని గూర్చి తను మిత్రులతోడను, పరిచితులతోడను, వారు పలి కిన మాటలవల్ల నేమి, చైత్రబహుళారంభకాలమునకు శ్రీనాథుడు వ్యాకరణాలంకారశాస్త్రము లేమియు రాని నీరసకవి యను ప్రథ శ్రీవిద్యానగరపండితలోకమం డెల్లెడల వ్యాపిం చెను. లింగన చయనుల అతిరాత్రక్రతువులో ప్రథితమైన శ్రీనాథుని శ్రౌతపాండిత్యమువలన, ఇతడు 'నట్టి ఛాందసుడు' అనుపేరు కూడ ప్రాకి, ఆ ప్రథను బలపరచెను. 'పాపము, శ్రీనాథభట్టు నోరు మంచిది!-పాపము వేషము బాగుండును. పాపము, సుస్వరద్రూపి!-' అందరు నాతని కవితాప్రతిభపై జాలిచూపువారే! పాపము! పాపము! అని పాపము తలచు వారే!

८८

ఈవిధముగా చైత్రశుక్లములో శ్రీనాథునకును, పరివార మునకును నగరములో గౌరవప్రతిష్ఠలు అడుగడుగునను వెనుకబట్ట నారంభించెను. కృష్ణపక్షములో కూడ నట్లే సాగుచుండెను. ఒక్క విషయములో మాత్రము శ్రీదేవి తన భర్తకు అతిశయము సాధించి పెట్టినది.

వారి విడిదికి శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠాధిపతుల ఆశ్ర మము సమీపమునసే ఉన్నది. అక్కడ నిత్యముజరుగు సత్కథా కాలక్షేపములకు స్త్రీ పురుష భక్తబృందము బహుళముగా వచ్చుచుండిరి.

ప్రాతఃకాలమున వ్యాఖ్యానసింహాసనము నధిష్ఠించి, ప్రస్థాన త్రయ భాష్యాదికములు అంతేవాసుల కుపదేశించిన యనంత రమున, శ్రీ శంకరానంద భారతీస్వాములు స్వయముగా తన శ్రీ హస్తములతో శ్రీచక్రరాజపూజ కావించుచుండిరి.

ఆ శ్రీచక్రరాజము అపూర్వమైనది. శ్రీ విద్యారణ్య లను ప్రసిద్ధప్రతాపనామము ధరించిన శ్రీ విద్యాశంకర భారతీ స్వామివారు శ్రీ శృంగగిరిపీఠమున జగద్గురువులుగా పరమహంస సామ్రాజ్యమునకు అభిషిక్తులై శ్రీ విద్యాశంకరపదమావేశ ప్రకాశితులైరి. వారు కాలానుసరమునుబట్టి శ్రీపీఠరాజధానిని శ్రీ విరూపాక్ష క్షేత్రమునకు మార్చి, భారత ధర్మప్రతిష్ఠాప నార్థమై హరిహర బుక్కరాయాదులకు రాజగురువై, తమదివ్య నామమునసే శ్రీవిద్యానగరమును ప్రతిష్ఠ చేయించిరి. సరిగా

నడే శుభముహూర్తమున వాగీయపూర్వమగు శ్రీచక్రరాజమును పోతపోయించి ప్రతిష్ఠించిరి. అది మేరుప్రస్థము. అంతయు సుష్ఠుగా కూర్మపృష్ఠముపైనున్నది. కూర్మముపైన అష్టదిక్కులందును అష్టదిగ్గజములు రమ్యముగా నిలిచి యున్నవి. ఆ దిగ్గజముల అంతరాంతరములలో పడగలెత్తిన యష్టనాగములు తమ శిరోమణులతో శ్రీచక్రరాజభూస్థుమును భరించుచున్నట్లు మనోజ్ఞతరముగా మలచబడి యున్నవి.

అప్పటి నుండి తన శిష్యపరంపరలో జగదేక గురువులుగా నభిషిక్తులైనవారు మాత్రమే, ఆశ్రీచక్రరాజము నర్చించు నట్లు శ్రీ విద్యాప్రగరగురువులు శాసించి, రేణుకాతంత్రమున ఈ వృత్తాంత మంతయు అక్షరరూపమున నిబంధించి యుండిరి.

శ్రీ విద్యారణ్యుల యనంతరమున వరుసగా, వారి జ్యేష్ఠ శిష్యులగు శ్రీ నృసింహభారతులును. వారి పిమ్మట వారి శిష్యులు శ్రీ సుకేంద్ర భారతులును, వారి యనంతరమున వారి కరకమలసంజాతులగు శిష్యులు శ్రీ శంకరానందభారతీస్వామి పాదులును, శ్రీపీఠాధిపత్యమున కభిషిక్తులై, శ్రీ విద్యారణ్య పూజ్యపాదుల యాదేశమును మన్నించి, శ్రీ పీఠాధిపతులే సాయంకాలపూజయు, ప్రాతఃకాలపూజయు, నిత్యుల కప్పగింపక, స్వయముగా నిర్వర్తించుచుండిరి. ఈ కథాకాలమునకు బదేండ్ల క్రిందటనే శ్రీ శంకరానందభారతులు శ్రీ శృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠమున పరమహంససామ్రాజ్యమున జగదేక గురువులుగా నభిషిక్తులైరి.

ఈ శ్రీచక్రరాజపూజ జరుపుటకు ఏకాంత మందిరమేయైనను వారు శ్రీమద్రాజాధిరాజమహారాజగురుభూమండలాచార్యులైనందున, వారి గౌరవస్థానమునకు ఉచితమైనట్లు ఆమందిరము సువిశాలమై, శతసంఖ్యాకులగు స్త్రీపురుష భక్తజనులు సుఖముగా కూర్చుండి దర్శించుటకు అనువుగానుండెను. అధికశ్రద్ధాసక్తులు కల భక్తులకు మాత్రమే అందులో ప్రవేశముండెను. శ్రీదేవి కక్కడ మొదటినుండియు ప్రవేశ ముండుటచే, నిత్యము రెండువేళల నందులకేగి తీర్థప్రసాదములు గ్రహించి వచ్చుచుండెను.

చిత్రముగా నరుణగిరినాథులపత్ని యగు గౌరీదేవియు నక్కడికి తరుచుగా వచ్చుచుండెను. ఆ పండుముత్తైదువు గౌరీదేవికిని, శ్రీదేవికిని ప్రథమమునుండియు నొండొంపులపై గౌరవాదరము లుదయించి ప్రవృద్ధములు గాజొచ్చెను. ఒకరికి ఆంధ్రమును ఒకరికి ఓఘ్రమును రానందున, వారిద్దరును పూజాతూర్వాయును పూజానంతరమును ఆప్యాయముగా సంస్కృత భాషలో పలుకరించుకొనుచుండిరి. శ్రీగురువులు పూజాంతమందొసంగు తీర్థములో క్రమ మొకటి పాటించుచుండిరి. అందుచే పెద్ద ముత్తైదువ యగు గౌరీదేవికి ముందును, పిమ్మట చిన్నదగు శ్రీదేవికిని తీర్థము లభించుచుండెను.

శ్రీదేవి పుట్టింట ననూచానముగా శ్రీచక్రార్చన ముండెను. ఈ యాత్రకుముం దామె శ్రీనాథుని తనకు శ్రీవిద్యామంత్ర మిపదేశింపుడని వేడుకొనెను. శ్రీనాథుడు నవ్వుచు 'మన కల్యాణ మహూర్త వేళ నేను నీకు హస్తమస్తక సంయో

గము చేసినప్పుడే నన్ననుగ్రహించిన వేదమాత సంపూర్ణముగా నిన్నును ఆవహించి ధ్రువమై * యున్నది. మనము శ్రీ విద్యాపగరయాత్ర చేయబోవుచున్నాము గదా! అక్కడ శ్రీ పీఠస్వాములకడ నీవు శ్రీమంత్రోపదేశము పొందవలెనని నా వాంఛ. జగదాచార్యుల కటాక్షము మన కిదొకి శ్రేయఃకారణము కాగలదు' అనెను. అప్పటినుండియు శ్రీదేవి ఆ శుభముహూర్తమునకై ఎదురుచూచుచుండెను.

ఆమె కోరిక కనుగుణముగనే శ్రీ గురువుల పాదపూజ కావించిననాఁడే, శ్రీ గురువుల యనుగ్రహదృష్టి ఆ దంపతుల యెడ ప్రసరించినది. వారు చూతఫలప్రసాద మిచ్చి ఆశీర్వదించిన నాటినుండియు, ఆమె సర్వాంగకములలో ఒకానొక అననుభూతపూర్వమైన ఆనంద మావిర్భవించినది. ఆ యానంద మామెకు ఒకొక్కమారు హృదయముల్లోనుండియు, ఒకొక తరి గర్భాంతరాళమునుండియు, మరొకవేళ సర్వాంగముల నుండియు భాసించుచుండెను. అంతరంగమం దెల్లెడ శ్రీనాథుడు సూక్ష్మరూపమున ప్రవేశించి, పరిపూర్ణుడై యున్నట్లు చిత్రమగు ననుభూతి యామెకు కలుగుచు, మాటిమాటికి శరీరము పులకించుచుండెను.

శ్రీదేవిత్తో సర్వసాధారణముగా దుగ్గనయు, పోతనయు శ్రీ గురువుల యాశ్రమమునకు వెళ్ళుచుండిరి. శాంతాదేవి వెంట నరుగు రామలక్ష్మణులవలె వారు కనిపించుచుండిరి. శ్రీ గురువు

---

* ధ్రువ శబ్దము ఆద్యంతములందుగల వేదమంత్రము ఆ సమయములలో ప్రయోగింతురు.

లయు, ఆశ్రమవాసులగు పెద్దలయు దృష్టి వారిద్దరిపై కరుణా ర్ద్రమై ప్రసరించుచుండెను. ఆశ్రమములోని పుష్పములు, బిల్వదళములు, తులసీదళములు వారు కోసి, పూజ కందించు చుందురు. దుగ్గన చేతులలో బిల్వదళములును, పోతనగొంద తులసీ దళములును తరుచుగా కనబడుచుండును. అందుచే వాశ్రమవాసులు ప్రీతిలో దుగ్గనను 'బిల్వా' అనియు, పోతనను 'తులసీ' యనియు సంబోధించుట పరిపాటి యైనది. వారిలో నొకడు కనబడకున్న తులసి యేడి, బిల్వ నేడి యని యడుగు చుండిరి.

పూజామందిర సమీపమున వెనుకవైపున పెద్ద పగడ ప్రమాను కలదు. దాని నీడను చంద్రకాంత శిలావేదిక యున్నది. శ్రీ గురువులు పూజావసానమున నా శిలావేదికపై గడియ పాటు విశ్రాంతిగా కూర్చుందురు. అప్పుడు భక్తులును, భక్త రాంధ్రును వందనమాచరించి ఏవేని విన్నపములు చేసికొనుటయు, వారలను శ్రీ గురువులు కుశలప్రశ్నాదికము లొనరించుటయు పరిపాటి.

ఫాల్గుణ బహుళదశమినాడు, వారట్లు కూర్చుండియుండగా, శ్రీదేవి, దుగ్గన పోతనలు వెంటనుండగా వచ్చి, శ్రీ గురువు లకు వందన మాచరించి, ఏదో విన్నవింపదలచిన దానివలె దూరగా నిలుచుండెను. స్వామినారు 'అమ్మాయీ! శ్రీనాథభట్టు కనిపించుటలేదేమి? కుశలమేనా?' అని పలుకరించిరి.

'స్వామీ, తమ యనుగ్రహముచే కుశలమే. శ్రీ లింగన సోమయాజుల యాజ్ఞచే, వారి చయనములో రాత్రింబవళ్లు

నిమగ్నులై తీరిక లేకున్నాను. వారు నిత్యము తమపాదధ్యానమే చేయుచున్నాను.'

'పేరిదము నీ తమ్ములేనా, తల్లీ, గోత్రమేమి?'

ఆ ప్రశ్నకు శ్రీదేవి ముఖము వికసించెను. సూటిగా ను తర మెటులీయవలెనో తోపక, క్షణకాల మూగి ఇటనెను.

'చిత్తము స్వామీ. నాతమ్ములే. మా పుట్టింటివారిది శాండిల్య గోత్రము. వీడు నా కడగొట్టు తమ్ముడు దుగ్గన-'

'దుగ్గనా?-మా దుగ్గే? మీ తండ్రిపేరు?'

'తిప్పన స్వామీ!'

'తిప్పనా, సాహిత్యంగా మాత్రిపురా? మీయింటిలో అనూచానముగా శ్రీ విద్యోపాసన మున్నదా?'

'చిత్తము, తమము సర్వజ్ఞులు, మా మాతాతగారు శ్రీ విద్యారణ్య భారతీస్వాముల పాదము లాశ్రయించి, పాదు కాంతదీక్ష పొందినారు. అప్పటినుండి మా యింట శ్రీదేవి యర్చన మున్నది.'

'ఓహో! నీ వందువల్లనే సాహిత్య శ్రీదేవినామముతో వారి యింట వెలసినావా?'

'నామమాత్రమునకే, స్వామీ!'

'ఏమీ, మీ తండ్రిగాని శ్రీనాథభట్టు గాని, నీకు శ్రీమంత్రోపదేశము చేయలేదా?'

చిత్తము. వారి నర్థింపగా తమ పాదము లాశ్రయించి, శ్రీ విద్యాగ్రహణము చేయుట మా యిద్దరికి శ్రేయస్కర మని తెలిపిరి. తమ్ము ప్రార్థించుటకే నేడిటు వచ్చితిని.'

'సరి, భర్తయే ప్రథమాచార్యుడని సంప్రదాయవేత్తయైన మీ తండ్రి ఉపదేశింపలేదు. ప్రథమాచార్యుని ఆదేశించి జగద్గురువుల నొద్దకు పంపినాడా? మరి మాకు తప్పునా? సౌభాగ్యవతివి నీకే మంత్రదీక్ష కావలెనని యున్నది.'

'చిత్తము. తమరు సెలవిచ్చినట్లు సౌభాగ్యవిద్యయే.'

శ్రీ గురువు లెంతయు ప్రీతులై 'వసంతనవరాత్రములు త్వరలో రానున్నవి. కలశస్థాపన మొనర్తుము, విదియనాడు కటాక్షదీక్షగా శ్రీమంత్రోపదేశము చేసెదము. మంచిది' అనిరి. శ్రీదేవి వందన మాచరింపగా శ్రీగురువులు నారాయణ స్మరణము కావించిరి.

అప్పుడు భగ్గనయు, పోతనయు వందనములుచేసి, మాకును మంత్రోపదేశము చేయుడని యర్థించిరి. వారి సాహసమునకు స్వాములకు ప్రీతి యుదయించినది. 'బిల్వా, నీకు దుర్గామంత్ర ముపదేశింతుము. తులసీ !-అమ్మా యీ! ఈ తమ్మునిసంగతి చెప్పితివి కాదు' అనిరి.

'ఈ తమ్మునిది కౌండిన్య గోత్రము. అన్నగారిత్రోవ రాచకొండనుండి కొండపీడు వచ్చి మాతో శ్రీవిద్యానగర యాత్రకు బయలుదేరినాడు'.

'ఓహో! అయితే వీడు నీ పెంపుడు తమ్ముడా? మీతండ్రి పేరేమిరా?

'కేసన్న, స్వామీ!'

'మీ అన్నయ్య పేరు?'

'తిప్పన, స్వామీ!'

'ఓరి తలసీ, నీ కేమిమంత్రము అభిమతమురా?'

పోతనకు తండ్రియు, నన్నయు స్మరణకురాగా ఆవేశ పూరితుడై, 'గోపాలసుందరి, స్వామీ!' అనెను.

గోపాలమంత్రమును త్రిపురసుందరీ మంత్రమును జోడించిన యీ గోపాలసుందరీమంత్ర మాతడర్థించుటచే శ్రీ గురులకు అనన్యప్రీతి కలిగి 'ఓరి పిడుగా!' అని వారాతని నగ్గించుచు, 'పంచాక్షరీ జపపరా నితరాం తథాపి, చేతో మదీయ మతసీకుసుమానభాసమ్, స్మేరాననం స్మరతి గోపసతీ కిశోరమ్' అనిరి.

శ్రీ గురువులు శౌర్వారి చైత్రశుద్ధ విదియనాడు వారల మువ్వురకు మంత్రదీక్ష నొసంగిరి. వసంతనవరాత్రములలో శ్రీ గురువులు మహావైభవముగా రెండుపేళల శ్రీ చక్రరాజార్చనము చేయుచుండిరి. శ్రీమంత్ర దీక్షితురాలైన శ్రీదేవి కిపుడు పూర్వమునలెగాక, విధివిధానముగా అమృతపాత్ర ప్రసాదించుచుండిరి. ఒక్కసారిగా నిట్లు శ్రీనాథునిపత్నియగు శ్రీదేవి, గౌడడిండిముల పత్నియైన గౌరిదేవికంటె శ్రీ పీఠసన్నిధిని ఎంతో ముందైనది.

ఇందులో తప్ప మరి దేనిలోను 'శ్రీనాథుని ప్రయత్నములు చైత్రశుద్ధములోగాని, బహుళారంభములోగాని కలసిరాలేదు. అప్పటికి శ్రీనాథుని యాత్రోద్దేశము నగరమంతట తెలిసి పోయినందున, దాక్షిణాత్యులను తృణీకరించు నొత్తరాహా పండితులందరు కూడుకొని, గౌడడిండిమలకు అండగా నుండుట

కాయత్తపడుచుండిరి. వారు డిండిమునిపాండిత్యాతిశయమును కవిత్వమహత్వమును నగరమం దెల్లెడల శ్లాఘించుచు, తరచుగా నాయనను దర్శింప నేగుచుండిరి. డిండిమభట్టు జీవితముకో తన యుత్కర్ష ఇంత యతిశయముగా పండిత ముఖముస నెన్నడు వినియుండలేదు.

ఒకవంక నౌత్తరాహపండితు లిట్లు డిండిమునిపై అభిమానము ప్రకటించుచుండ, మరియొకవంక దాక్షిణాత్యులను సభలు చేయుచుండిరి. వారిలో నెక్కు-నసుందికి శ్రీనాథుడు జయింప వలెనను నభిలాషయున్నది; ఔత్తరాహులు పొందుచున్న గౌరవాతిశయము నరికట్టవలె ననియే యున్నది. ఐనను వారిలో జంకుత్రో కలసిన గుసగుస లారంభమైనవి. ఈ మధ్య నాతడు మానసోల్లాస మను చిన్న స్తుతికావ్యము కవితాగోష్ఠిలో వినిపించినాడట, దానికి పండితుల నెవ్వరిని పిలువక ఉత్సాహశాలురగు ఉల్బణ యువకవులనే సమావేశపరచినాడట. వారే అది విని అందలి వ్యాకరణదోషములకు ముక్కు-లపై వ్రేళ్ళు పెట్టుకొని అబ్బురపడుచున్నారట. వారితోపాటు విన్న ముమ్మన కవి మాతి విసుచుచున్నాడు. వ్యాకరణశాస్త్ర మధ్యయనము చేయని శ్రీనాథు డేమికవి! ఇట్టివాడు ఎంత వేదము వల్లించినను, శ్రౌతప్రక్రియ ఎంత నేర్చినను, శబ్దశాస్త్రమందును, అలంకారశాస్త్రమందును నిధియైన డిండిమునిని ఎట్లు జయింపగలుగును! అట్టి యపండితుని పక్షము నహించినచో, మనకును తలవంపు లగును. నవ్వుబాట్ల పాలగుదుము—ఈ విధముగా ననుకొనుచుండిరి.

అన్నిటికి తోడు రాజపురుషు లాతనిని కొండవీటి గూఢ చారి కావచ్చునని బహువిధముల సందేహించుచుండిరి. నుహా సేన తీసికొని, పెద్ద అట్టహాసముగా నారివాగుకడకు రాగా, వినుకొండ దుర్గాధిపతి ఇతని కుబుస మూడ్పించి తలకొట్టి పంపించినాడట. ఈ కొండవీటి విద్యాధికారి మన మహా సామ్రాజ్య విద్యాధికారిపై విజయయాత్ర సాగింప సాహసించుట మనము సహింతుమా!

చైత్ర బహుళ విదియ విధముగా శ్రీనాథునకు కష్టనష్ట బహుళమై యారంభమైనది.

౧౨

శ్రీనాథుడు ముందే చెప్పినట్లు, తదియనాటి మధ్యాహ్నము నకు గండమల్లుకు కొండలపెట్టున జ్వరము వచ్చినది. విపరీతముగా ఆవులింతలు, కళ్ళుమంటలు, తలనొప్పి వచ్చినవి. వెంటనే పర్వతమల్లు మధ్యవస్తులకు వార్త పంపెను. వారు వారు చూడగా గండమల్లు ఒడలు జ్వరముతో వేగిపడు చుండెను. వారు విద్యామల్లుకు కబురంపగా ఆతని పట్టము వాసును వచ్చిచూచి తృప్తిపడి, వీరోచితముగా మల్లయుద్ధ మునకు గడువొసంగిరి. అదే పర్వతమల్లుకు తలవంపులుగా నుండెను.

ఆవల మల్లుర పరీక్షలు గూడవ శాంతింపగనే, శ్రీనాథుడు గోష్ఠీమందిరమున తోడి విద్వాంసులను చేర్చెను.

ముం దాతడు శ్రీదేవి స్వహస్తమునుంో అందముగా వ్రాసి, చిత్రములుకూడ చిత్రించిన హరివంశోల్లాసకావ్యప్రతిని శ్రద్ధతో వ్యాసపీఠముపై నుంచి లఘువుగా గంధాక్షతలతో నర్చించెను. నృసింహభట్టుచే నిర్దిష్టముగా వ్రాయించిన ఇంకొక ప్రతిని వేరొక వ్యాసపీఠమున నుంచి యట్లే పూజించెను. ఆపిమ్మట నృసింహలిఖిత ప్రతిని అరుణగిరినాథులకు అభిప్రాయార్థము పంపుచు, వినయగౌరవములతో వ్రాసిన ప్రతికను చదివి వినిపించెను. వారందరు బాగున్న దనిరి.

'ఈ ప్రతిని, లేఖను అరుణగిరినాథులకు అందించుటకు ఎవరు వెళ్ళిన బాగుండును?' అని శ్రీనాథు డడిగెను, ఒకరి ముఖము లొకరు చూచుకొనిరి. తుదకు మహావైయాకరణుడును, కవీశ్వరుడును అగు నృసింహభట్టు తీసికొనిపోపుట యుక్తముగా నుండునని అందరు సూచించిరి. నృసింహభట్టు వల్లె యని దుగ్గనను తోడుగా తీసికొని పోవుదు ననెను.

కొద్దిసేపటికే వారిద్దరు కూర్చాసములు కుల్లాయిలు కోకలు ధరించి అశ్వములెక్కి డిండిముని యింటికి బయలుదేరిరి. అది ఎంతో దూరములేదు. గొడ్రబ్రాహ్మణవీధి మధ్యలో ప్రముఖముగా కనిపించు పెద్దభవంతి. సంపన్న నాగరక వేషములతో వచ్చిన వారి నిద్దరిని వెంటనే డిండిముని పరిచారకులు వినయ విధేయతలతో ఆయన సన్నిధికి కొనిపోయిరి.

డిండిము డంతకుముందే, మధ్యాహ్న విశ్రాంతి చాలించి లేచివచ్చి, గోష్ఠిశాలలో తనముందు వ్యాసపీఠమున గ్రంథ మించుకొని విప్పబోవుచుండెను. వచ్చినవారిని చూడగానే

ఆయన మర్యాదచేసి చక్కని రత్నకంబళముపై కూర్చుండ జేసి ఆదరముతో 'మీ దేయూ'రని ప్రశ్నించెను.

నృసింహభట్టు కొంచెము వడకుచున్న కంఠముతో 'కొండవీడు' అనెను.

ఈ వేషములో శ్రీనాథుని జూడనందున శ్రీనాథుడే తన దర్శనమునకై వచ్చెనని భావించి డిండిమభట్టు వికసించిన వదనముతో 'మీ నామధేయము శ్రీనాథులా?' యని ప్రశ్నించెను.

'కాదు. నృసింహభట్టు.'

'ఏమి పనిమీద దయచేసినారు?'

'ఏదో వ్యాకరణశాస్త్రము కొంత అధ్యయనము చేసితిని. ఏదో కొంత కవిత్వము కూడ చెప్పెదను. విద్వత్కవీశ్వరులగు తమ దర్శనార్థము వచ్చితిమి.'

"మీ రాజ్యములో మహాభాష్యము అధ్యయనము చేసిన విద్వాంసు లెవరైన నున్నారా?'

నృసింహభట్టు : ఇప్పు డొక్కరమంది లేరు. ఇప్పటి కొండ వీటిరాజ్యములో నూటయేబది మందియే ఈమధ్య లెక్క వేయగా తేలిరి.'

డిండిముడు నమ్మజాలక కన్నులు పెద్దవిచేసి కొంచెము తలయెత్తి 'అంతమంది యున్నారా? మీ రెంతనడకు అధ్యయనము చేసితిరి' అనెను.

'ఆ ఎంత ? నేనూ వారిలోని వాడనే'

'మీకు ఉపస్థితిలో నున్నదా?'

నృ. సి. : 'పెద్దల ఆశీర్వచనముచేత నా భాగ్యనిశమున తీయకుండ పదిచుంది శిష్యులైనా ఇంత వరకు చెప్పుకొను చున్నాను. మరపు రాలేదు.

డిండిమభట్టారకునకు విశ్వాసము కలుగక, ఆపైన సంభాషణము సంస్కృతభాషలో నారంభించి, వ్యాకరణశాస్త్రములో సూక్ష్మవిషయములపై ప్రసరింపజేసెను. నృసింహభట్టును అట్లే చేసెను. సందర్భనశముగా ప్రశంసలు చేయుచున్నట్లే, వారిద్దరు సగర్వముగా ఒకరినొకరు పరీక్షించుకొనిరి. తుదకు డిండిముడు తృప్తిపడి 'సంతోషమైనది. మీరేమి కావ్యములు రచించితిరి' అని అడిగి తెలిసికొని, కాదంబరీ నాటకము కొన్ని ఘట్టములు వినిపించుకొనెను.

డిండిమభట్టు అనుగ్రహబుద్ధితో నృసింహుని కవిత్వము బాగున్నదని శ్లాఘించి, 'మా దర్శనమునకు మీబోటి కవి పండితులు వచ్చినందుకు సంతోషము.' మాత్రో స్పర్ధపెట్టుకొని శ్రీనాథుడను శ్రోత కొండవీటినుండి వచ్చినాడట. ఆయనను ఎరుగుదురా?' అని ప్రశ్నించెను.

'ఎరుగకేమి? వారే తమ దర్శనమునకై తన బావమరదియైన ఈ కుర్రవానిని తోడిచ్చిపంపినారు.'

అంతవరకు కనబరచిన ఆదరము పోయి, ఆ మాటలు వినగానే డిండిమభట్టు ముఖము చిట్లించి, 'మావద్దకా, ఏమి పనిమీద?' అని గర్జించెను.

నృ. సి. : చిత్తము. వారు మానసోల్లాసమని క్రొత్తగా సంస్కృత కావ్యము వ్రాసినారు. తమగిలభిప్రాయ మర్థించుచు దాని ప్రతిని ఈ పత్రికలో పంపినారు.'

కవులు తమ కావ్యములు అభిప్రాయార్థము స్వయముగా వచ్చి వినిపించుటేకాని, ఇట్లింకొకరి కిచ్చి పంపుట డిండిమునకెరుగను. అందుచేత చిరాకు ఎక్కువై ఇట్లనెను. 'ఈమధ్య తప్పులతడక కావ్య మొకటి బాలకవులకు వినిపించినాడని విన్నాము. అదేనా ఇది?'

'ఆ బాలకవులు మాటలకేమిగాని, తమరుకూడ చిత్తగించండి!'

ఆ మాటలచే అది కొంచెము వినవలెనని డిండిమభట్టుకు కోరిక కలిగి, కొన్ని భాగములు వినిపింపుమనెను. గోష్ఠిలో శ్రీనాథుడు వినిపించినట్లుగానే సంగీతమిశ్రముగా నృసింహభట్టు కొన్ని శ్లోకములు వినిపించెను. అలనోకగా డిండిము డాలకించి వికృతముగా నవ్వుచు, 'నృసింహభట్టా, మీబోటి పండితులకు ఇటువంటి తప్పుల తడకను తెచ్చుట అగౌరవముగా తోచలేదా?' అనెను.

నృసింహభట్టు ఆవేగ మడచుకొనుచు, విసయముతో, 'ఇది వారి ప్రథము సంస్కృతకృతికదా? లోపము లేమైన ఉన్నచో చూపిన సరిచేసికొందుమని తమకు మనవిచేయుమని చెప్పిపంపిరి. తమరు గ్రంథము తీరికగా చిత్తగించి అభిప్రాయ మిప్పింపుడు. మరల వారమునాటికి తమదర్శనార్థము వత్తుము'

అని గ్రంథము డిండిముని చేతికిచ్చెను. డిండిమును విసుగుతో మగ్గనను పిలిచి కోశసంచయము లున్న దాకుఫలకములలో నొక దానిని జూపి, దాని నక్కడ పెట్టించెను.

౧౩

శ్రీనాథున కిప్పుడేమియు పనిలేదు. డిండిమునికి జవాబుకు వారమునోజులు గడువున్నది. ఈ మధ్య తానేమి చేయవలె? అంతరంగములో డిండిమునికి యుత్తరమునకై ఆరాట మున్నది. అసలు వచ్చునా, రాదా? ఏమని వచ్చును? ఎట్లు వచ్చినా, తానేమి చేయవలె? రాకున్న నేమి చేయవలె? ఆ సాయంకాల మాత డిట్లు మథన పడ నారంభించెను. అర్ధరాత్రమున మెల కువ వచ్చి ఆలోచనలతో నిద్దురపట్టలేదు. మునునాటి యుదయ మున నతడు చిరాకు పడసాగెను. శ్రీదేవి వెంటనే గ్రహించి యిట్లు చెప్పెను.

'వృథా మథన వలన శక్తి క్షీణించును. ప్రొద్దుపోవుటకై విద్యానగరము నాలుగు మూలల చూచిరండి, శ్రీగురువుల పాదసేవచేసిరండు. శ్రీ విరూపాక్షస్వామిని సేవించండి. పెద్దలను చూచిరండి. బలవంతులతో మైత్రిచేయండి. ఏదో ఒక వ్యాసం గము పెట్టుకోండి.'

శ్రీనాథున కామె సూచన నచ్చినది. ఒకనా డాతడు శ్రీ శంకరానంద భారతీస్వాముల చరణసన్నిధి కరిగి, వందనమాచ

రించెను. శ్రీవిరూపాక్షస్వామి నర్శించెను. లింగనచయనులను దర్శించి ఆయన యిష్టులు సరిగా జరుగుచున్నవిగదా యని ప్రశ్నించి, యజ్ఞయాగాదికగోష్ఠితో ప్రొద్దుపుచ్చి నచ్చెను. సంపన్న నాగరక వేషము ధరించి అశ్వారూఢుడై శ్రీవిద్యా నగర రాజవీథులలో నిరంతరభ్రమణ మొనర్చుచు చూడదగిన వింతలు చూచుచు, నానా దేశాగతులగు స్త్రీ పురుషులను వారి వేషభాషలను చేష్టలను గమనించుచుండెను. నగర మందలి దేవాయతనములను దర్శించుచు దేవరాయల సేనా విన్యాసములను తిలకించుచు నగరప్రాకారాదుల బలాబలా దులు పరీక్షించుచు తిరుగసాగెను. ఒకనాడు తుంగభద్రా నదిని నంతెన మీద దాటి ఆనెగొందివరకు పోయి పంపా సరోవరమును బుష్యమూకాద్రిని అక్కడి గోష్ఠములను అంజ నాద్రిని చూచినచ్చెను. మున్నాకవి యింటి చాయలకు గూడ బోకుండ తప్పించెను.

ఆతనివెంట తరుచుగా నెవరో ఒకరు, నృసింహభట్టో, దుగ్గనయో, పోతనయో అనుసరించు చుండిరి. ఎన్నడూ ఒక్కరినికంటె నెక్కువ తీసికొని పోలేదు. ఆతనిని రాత్రిం బవళ్ళు పసికట్టుచున్న రక్షకభటులు మాత్రము ఒకరో, యిద్దరో, తప్పక ఆతని ననుసరించుచు, పై యధికారులకు ఏనాటి సమాచార మానా డందించుచుండిరి. ముఖ్యముగా రాజప్రాసాద సమీపమునను, ప్రాకార రేఖల ప్రాంతము లను, ఆతని సంచారము లెక్కువైనచోటది రాజభటుల సంశ యమును ఎక్కువైనది. వారి గుసగుసలవలన తాను గూఢ

చాపుడను నిశ్చయభావము వారికి కలిగినదని యాతడు గను నించెను. అది త్రుంచివేయుక సాగనిచ్చినచో, తన్ను నిశ్శంక ముగా రాజపురుషులు బంధింప నాజ్ఞాపింతురు. రాజద్రోహు లని సందేహము కలిగినమాత్రమునన్నే కఠినబుద్ధి వహింతురు గదా! తాను తలపెట్టినకార్యము సాధించుట దుర్ఘటమగును. తానట్టి ప్రమాదావస్థలోపడకుండ వెంటనే జాగ్రత్తపడవలెను.

శ్రీనాథుడు తీవ్రముగా నాలోచించి వెంటనే కటక పాలుని దర్శింప నిశ్చయించెను. ఆతడు సాహిత్యాభి మానియు, కవి పండిత పక్షపాతియనియు, ఉద్యోగధర్మనిర్వ హణములో ఎంత సునిశితకఠినుడో, తక్కిన విషయములలో నంత సరసుడని సహృదయుడని కర్ణాకర్ణిగా తెలియనచ్చినది. రక్తకథలుల నడిగి కటకపాలుని ఊరు పేరు వంశాదికములు స్వభావాదికములు తెలిసికొనెను తాను వారిని దర్శించుటకు యోగ్యముగు వేళ యేదోకూడ నిచారించెను. ఉదయమున ఆరు గడియల ప్రొద్దెక్కినప్పటినుండి పదిగడియల ప్రొద్దువరకు దర్శింపవచ్చునని వా రెరిగించిరి. అంతేకాదు. 'కటకపాలుడే మిమ్ము చూడనలె ననుకొనుచున్నా'రని కూడ వారు తెలిపిరి.

డిండిమలకు పత్రిక పంపి సరిగా వారముగోజు లైనది. ఈగోజే వారి యభిప్రాయము తెలిసికొననలసి యున్నది. ఆనాటి యుదయమున ఐదు గడియలు ప్రొద్దెక్కినదని శ్రీ గురు వుల దివాణములో గడియారము * నుండి ఘంటాఘణా

---

* ఘటికాగారము—గడియలు తెలుపు ఘంటలు కొట్టు ప్రదేశము.

తాకారములు వినబడువేళకే శ్రీనాథుడు ముస్తాబై యుండెను. ఈనాడు మిక్కిలి విలువగల వేషము ధరించెను. కట్టిన ధోవతి బంగారుజరీతో నిండియుండెను. కూర్పాసము దట్టమైన మెత్తని కౌశేయముతో చేయబడి జరీకుట్టుచిత్రములతో ధగధగలాడు చుండెను. నడుమున చుట్టిన కోకకు రత్నములు పొదిగి యుండెను. మెడలో తారహారములేకాక, రత్నహారముకూడ వేసికొనెను. చేతుల సింహతలాటములు, దండల కడియములు ధరించెను. చెవుల పచ్చలకుండలములు మెరయుచుండెను. నొసట కస్తూరిబొట్టు పరిమళించుచున్నది. శిరస్సుపై నవరత్నములు పొదిగిన కలికితురాయి గల కుచ్చుల కుళ్లాయి పెట్టుకొనెను. పైని ఎఱ్ఱని కాశ్మీర శాలువ వేసెను. శ్రీనాథుడీ వేషముతో ఐదవ ఘంటానాదము వ్రేయగుచుండగనే అశ్వారూఢుడయ్యెను, ఆ యశ్వము చీనాపట్టాంశుకముతో నలంకృతమై యుండెను. ఆతడు కటకపాలుని మందిరమునకు దారితీయుమన్నంతనే, నగర రక్షకుడు భయభక్తులతో దారితీసెను.

కొండపేటి విడిదికి కటకపాలుని మందిర మెంతో దూరము లేదు. తలాడి గట్టుమీదనే మహోన్నతస్థానమున నది యుండెను. విలాసముగా, నెమ్మదిగా తన యశ్వమును నడిపించుకొనుచు ఆఱు గడియలు కొట్టుచున్న వేళకు సరిగా నాత డక్కడికి చేరికొనెను. కటకపాలుని దర్శనార్థమై శ్రీనాథభట్టు వచ్చియున్నాడని తెలిసినవెంటనే లోనికి రమ్మని యనుజ్ఞ వచ్చెను. వెళ్ళుచునే శ్రీనాథభట్టు మణికంకణవిరాజితమగు దక్షిణ హస్తము నెత్తి కటకపాలుని నిట్లాశీర్వదించెను:

'ధాటీ ఘోటక రత్న ఘట్టన మిళ ద్దార్ష్టీష్ట పల్యాణ ఘుం
టా టంకార విలుంఠలుంఠన నదోన్మత్తాహితక్ష్మోణిభృ
ద్గోత్రోటీరాంకిత కుంభినీశ్వర సమితూత్కూటాటోపీక్షూటి, క
ర్ణాటాంధ్రాధిప,సాంపరాయని కెలుంగా,నీకు బ్రహ్మాయువే!'

ఆ పద్యమును విన్నదే తడవుగా కటకపాలుడు నిలువున నిలుచుండి లేచినచ్చి వంగి శ్రీనాథుని రెండు పాదముల భక్తితో నంటి నమస్కరించి, సగౌరవముగా సుఖాసీనుడని గావించి ఆయన అనుమతితో తాను తన యాసనమున నాసీనుడయ్యెను.

కటకపాలుని పేరు తెలుగురాయడు, సాంపరాయని కుమారుడు. శ్రీ విద్యానగర రాజ్యములో, ఉదయగిరిసీమ, పెనుగొండసీను ఇత్యాది ప్రదేశములలో దుర్గాధిపత్యపదవి, మండలాధిపత్యమువంటి ఉన్నతోద్యోగములు నిర్వహించి, ఆతడు కొంతకాలమునుండి శ్రీవిద్యానగర కటకపాలక పదవి నధిష్ఠించి, శ్రీవిద్యానగర రాజ్యపతిమున త్వరలో దూరభూములలో విజయయాత్రలు చేయుటకు రహస్యముగా సన్నాహములు చేయుచున్నాడు. ఆతడు కర్ణాటాంధ్ర మధ్యస్థ సంధిదేశములో జన్మించినందున, సంస్కృతముతోపాటు, ఆ రెండు భాషలయందును సమానాదరము కలిగినవాడు. శ్రీనాథుని యెడ ఒకనంక భక్తిప్రపత్తులు కలుగుచున్నను, తన చారులు తెచ్చిన వార్తలనుబట్టి మరియొకనంక గూఢచరుడేమో అను సందేహముగూడ హృదయాంతరమున వేధించుచుండెను. ఈనాడది తన సంభాషణలో ఉపాయముగా కొంతవరకైనా తెల్సుకొనదలచెను. భక్తిభావము కలిగించు మూర్తి కల

శ్రీనాథుడు, నమ్ముచునే, తనకు సంగ్రామ విజయముతో బాటు దీర్ఘాయువు నాశీర్వదించుటచేత ముగ్ధుడై, తా నాతని మంచిమాటల వలలో పడిపోవుచున్నానా యని సందేహించు చుండెను. కుశలప్రశ్నాదికము కావించిన పిమ్మట శ్రీనాథుని యాశీర్వచనపద్యము లీలాపరిహాసము చేయుచున్నవానివలెనే, 'స్వామీ, మీ యాశీర్వచనముచే నే కృతార్థుడ నైతిని, సరే గాని, అది యేమిభాష, కవీంద్రా?' అని చిరునవ్వుతో ప్రశ్నించెను.

శ్రీనాథుడు హేళనగా మాటాడుచున్నట్లే ఈ పద్యమును చదివెను.

'ప్రౌఢి బలికింప సంస్కృతభాషయందు
పలుకు నుడికారమున నంధ్రభాషయందు
రెవ్వ రేమన్న నండ్రుగా కేమి కొరత?
నా కవిత్వంబు నిజము కర్ణాటభాష.'

సద్యఃస్ఫూర్తితో చెప్పిన యాపద్యము విన్నంతనే రాజనీతిధురంధరుడగు తెలుగురాయడు తికమకపడెను. ఆ పద్యములో వాచ్యముగా చెప్పకుండగనే, తన యభిమానములే ఈ కవి తనకుగూడ గలవన్నట్లు ప్రకటముచేయుచు, సూచనగా పొగడినాడు. 'ఇతడు కేవలకవి కాడు, మహాసామ్రాజ్యమునకు ప్రధానిపదవి నిర్వహింపగల సామర్థ్యము కలవాడు.' ఇట్లనుకొనుచు, ఈ మధ్య శ్రీనాథుడు శ్రీవిద్యానగర వీథులలో సంచారము చేయుచుండెనని చారుల వలన విన్నందున, ఇతడు రాజధానిని కవిదృష్టితో చూచుచున్నాడో,

చారదృష్టిలో పరికించుచున్నాడో ఎటుగదలచి యుక్తిగా నిట్లనెను:

'కవీశ్వరా, మా విద్యానగరములో మీకుకన్నుల పిందు గావించిన దృశ్యములను వర్ణించిన పద్యము లేవైన నున్నవా?'

శ్రీనాథుడు: 'అయ్యో! లేకేమి? ఎన్నెన్నో ఉన్నవి' అనుచు చిరునవ్వుతో ముందీపద్యము చదివెను.

పువ్వులు కొప్పునం దురిమి ముందుగ గొ నసియాడుచుండగా
జెవ్వున జంగసాచి, యొక చేతను గోకలిబూని యొయ్యనన్
నవ్వుమొగంబుతోడ దననందను బాడుచు, నాథు జూచుచున్
సువ్వియసువ్వి యంచు నొకసుందరి బియ్యమువం చెముంగిటన్'

తెలుగురాయడు సంప్రీతుడై, వెంటనే ఆ పద్యము నోట బట్టి ఆనందపారవశ్యముతో దానిని రెండు మూడు మారులు రెండు మూడు తీరులలో కవికి వినిపించి యర్థించెను.

ఇట్లే శ్రీనాథుడు తాను నగరములో చూచిన విచిత్ర వేషభాషలను, స్త్రీల అందచందములను వర్ణించు పద్యములు వినిపించెను. తెలుగురాయడా సమున్మత్తములు విని విని, 'మరి కవీంద్రా, మీ సీస పద్యములు ప్రత్యేక ప్రౌఢిత్వో నుండునని జనశ్రుతి వింటిని. మా నగరములో సీసపద్య మేమియు చెప్పలేదా?' అనెను.

'అయ్యా, చెప్పకేమి ఒకటి వినండి!'

'శ్రీరస్తు, భవదంఘ్రి చిరురంబులకు మహా
భూర్యబ్దములు సితాంభోజనయన!

వరకాంతిరస్తు, తావక ముఖనఖముల
కాచంద్రతారకం బబ్జవదన
మహిమాస్తు, నీ కటి మధ్యంబులకు మన్ను
మిన్ను గలనాళ్ళు మించుబోడి!
విజయోస్తు, నీ గానవీక్షుల కానీల
కంతహరిస్థాయిగా లతాంగి!
కుశలమస్తు, లసచ్ఛాతకుంభకుంభ
జంభభిత్కుంభికుంభాభిజృంభమాణ
భూరి భనదీయ వక్షోజములకు నేను
మందరము లుండుపర్యంత మిందునదన!'
విని విని తెలుగురాయడు, 'మీ కీ మహాసగరములో
భక్తురాండ్రగు సతినలే కనిపింపలేదా!' అని యడిగెను.
శ్రీనాథు డీ పద్యము చదివెను :
అభిషేక మొసరించు నలినీలకాంతుల
శంభు దుంగాసరిత్సలిలధార
నెలత యభ్యర్చించు నీలోత్పలంబుల
దరుణ నిర్మల సుధాధామమాళి
గరళకూటగ్రాస కల్మాష కంధరు
మేన గంద మలందు మీసనేత్ర,
యర్పించు దివ్యోపహారంబు లెలనాగ
కుటిలకుండలరాజకుండలునకు
నతివ తిరుగు బ్రదక్షిణం బభవ్రుగుడికి
గుచభరంబున నరగొను గూనుగిలగ

రవల మట్టెల మ్రోతల్తో రాయిడింప
జఘణ నూపుర ఝుళఝుళంఝుళరనంబు'

తెలుగురాయడు : ఋష్యమూకములో నేమే నాకర్షించినదా?'

శ్రీనాథు డీపద్యము చదివెను.

'ఆనందంబున ద్రుళ్ళ బుచ్చనులు పెల్లగ్గాక్కచున్ లేగ లకాఁనన్ గోకుల గోష్ఠదేశమున జంఘాలాఘనంబొప్ప హూమానుష్ఠాన విధిప్రకార పరతంత్రాత్మ ప్రసూ కామధు ధేనూత్థస్య సుధాప్రవాహలహరీ తృప్తాంతరంగంబులై'

తెలుగురాయ డావర్జనముచే అమృతాప్లావితుడై, పొగడుచు ఆకస్మికముగా, 'కవిసత్తమా, మాదేవరాయప్రభుస్వాములపై ఒక పద్యమైనా చెప్పలేదా?' అని యడిగి శ్రీనాథుని ముఖ మైఖరి క్రీగంట పరీక్షించుచుండెను.

శ్రీనాథుడు పద్యము చదువుటా వద్దా యని క్షణకాల మాలోచించి, విచారసూచకమగు ముఖమైఖరితో, ప్రభూ, ఆ మహాసార్వభౌముల దర్శించు మహాభాగ్య మింకను నాకు ప్రాప్తింపలేదుగదా!' అనెను.

దానివలన శ్రీనాథుడు రాజసందర్శనాకాంక్షయై యున్నా డని నిశ్చయించుకొని, తెలుగురాయడు, పరీక్షింపవలెనని, 'అయితే నావలన మీకు కానలసిన పనియేమిటి?' అని చప్పున నడిగెను.

వెంటనే శ్రీనాథు డిట్లర్థించెను.

"అత్యవ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ, కస్తూరికా
భిక్షూదానము చేయురా సుకవిరాడ్బ్రహ్మందారక స్వామికిన్
దక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
నక్షోజద్వయ కుంభికుంభములపై వాసించు దద్వాసనల్"
అది విని తెలుగురాయడు తెల్లనోయెను. తనకు కస్తూరి
యందుగల అభిమాన మీ కవి ముందుగా తెలిసికొనియే
నచ్చినాడు. ఇంత ధీమాగా తన్ను కస్తూరి అర్థించుకవి ఎక్కడ
నుండును? ఆతనిపై అంతరంగములో ప్రేమ ఉప్పొంగినది.
ఇట్టినానిని ఆదరింపకుండు టెట్లు? అతడు నెంటనే బంగారు
పళ్ళెరమునిండ ఆకులు పోకలు తెప్పించి, తన సమీపమునకే
గట్టి చందనపు పెట్టెలో గుప్తమైయున్న ఉత్తమ కస్తూరిలో
రెండు తులములు తీసి రెండు చక్కని దంతపు బరిణలలో
నుంచి, పళ్ళెములో పెట్టి లేచివచ్చి. శ్రీనాథునకు పాదాభివందన
పూర్వకముగా సమర్పించెను 'ధన్యోస్మి, శ్రీరస్తు!' అని
శ్రీనాథుడు ప్రతిగ్రహించెను.

కస్తూరీదాన ప్రతిగ్రహణములు గాఢమైత్రికి చిహ్నములు.
వారికి పరస్పరానురాగములో నిక నెన్నటికి భంగము వాటిల్ల
రాదు. కస్తూరి మంగళ ద్రవ్యము.

అంత కొంతపడికి తెలుగురాయలు గంభీరముద్ర నదలి
'శ్రీనాథభట్టా, ఇది ఎక్కడినుండి తెప్పించిన కస్తూరియో
చెప్పగలరా?' అని యడిగెను.

ఆ మాటలు వినగానే శ్రీనాథునకు అప్రయత్నముగా కన్ను
లొక్కించుక చెమరించి నట్లయ్యెను. ప్రీతిగద్గదమైన కంఠ

ముతో, 'ఇప్పటికి పాతికేళ్ళనాడు చవిచూచిన కస్తూరీపరిమళ ముత్తో మిళితమైన స్నేహసర్వస్వపరిమళము స్మరణకు వచ్చినది. ఇది స్వచ్ఛముగా చోడంగి కస్తూరి—సందేహము లేదు!' అనెను.

తెలుగురాయడు మరింత ఆశ్చర్యపడుచు, 'మీ రెట్లు గుర్తించితిరి?' అని యడిగెను.

ఇంకను శ్రీనాథుడు పూర్వస్మృతులతో పరధ్యానముగానే, తెలుగురాయా, నాకు సువాసనలును, ఆప్తుల ప్రేమార్ద్ర వచనములును స్థిరముగా స్మృతిలో నిలిచి యుండును. ఈ కస్తూరి తన పరిమళములతోపాటు, నా బాల్యసఖుడైన అవచి తిప్పయశ్రేష్ఠి మైత్రీస్మృతిని పరిమళింప జేసినది, ఆహా, ఆతనిని చూచి ఎంతకాలమైనది!' అనెను.

'శ్రీనాథభట్టా, అవచితిప్పయశ్రేష్ఠిని చూడవలెనని ఉన్నదా?—త్వరలో నాత డిక్కడికి రానున్నాడు. మా రాజ్యములోని ప్రాచీసముద్రపు రేవుల వ్యాపార మెక్కువ భాగము ఆయన కుటుంబమువారే చేయుచున్నారు. ఏదో పెద్ద వ్యాపార వ్యవహారముమీద దయచేయ నున్నారు.'

'ఎంతటి శుభవేళ మీ దర్శనమునకు వచ్చితిని! ఎంతటి కల్యాణవార్త వింటిని! ధన్యుడను—ఆత డెప్పుడు వచ్చునో తెలుపవచ్చునా?'

'అదేమీ రాజరహస్యము కాదు. వారు పరిపూర్ణ పరిషత్పరివారముతో యాత్ర చేయుచున్నారు. వైశాఖ పూర్ణిమకు వారిని సగౌరవముగా నెదుర్కొని తెచ్చుటకు రాజపురుషులు

నియుక్తులైనారు—మీ కింకొక శుభవార్తకూడ చెప్పగలను. రేయింబవళ్లు మీ పద్యములే మననము చేయుచుండు విను కొండవీటిరాజ్యభరాయలును, కంచికూరుమండలాధిపతి పంట మైలారరెడ్డియుగూడ నప్పటికి రానున్నారు.'

శ్రీనాథుడు మరింత ప్రీతితో మైలారరెడ్డి నిశేషములు తెలిసికొనెను. మరికొంత సేపటికి తెలుగురాయడు తన గొంతు బాగుగా తగ్గించి. 'కొండవీటి ప్రభువులుగాని, ప్రధానులుగాని శ్రీరాయలవారికి ఏమైన రహస్యసందేశము మీ ద్వారా పంపియున్నచో, రాజదర్శనమునకు అవకాశము కల్పింపగలను' అనెను.

శ్రీనాథుడు చిరునవ్వునవ్వుచు, 'అట్టి రాజకార్యము లేవైన నున్నచో ఆపని కొండపీటి స్థానాపతులది. విద్యాధికారికి రాజ కార్యభార మప్పగించుట అక్కడి యాచారము కాదు' అని సెలవు తీసికొని వెళ్ళిపోయెను.

శ్రీనాథుడు తన వసతికి వచ్చుచు, తాను కటకపాలుని దర్శింపబోయిన పని సఫలమైనట్లా కాదా యని తరచికొని చూచెను. అట్లే తెలుగురాయడును తన సంభాషణవలన శ్రీనాథుడు రహస్యచరు డవునో కాదో గ్రహించితినా లేదా యని తన్ను దాను మరల ప్రశ్నించుకొనెను.

ఇద్దరికిని సంపూర్ణముగా సందేహములు తీరలేదు. అయి నను వారిద్దరిమధ్య ఆనాడు దానప్రతిగ్రహణములు జరిగిన చోడంగి కస్తూరిగాఢపరిమళము పరస్పరయోగము నొంది వారి హృదయములకు హత్తుకొని నిలిచెను.

౧౪

డిండిమునకు మానసోల్లాసము పంపి ఆ నాటితో వారము దినము లైనది. ఈనాడు అభిప్రాయార్థము నృసింహభట్టు వెళ్ళ వలసిన రోజు. ఆయనతో మరెవరిని తోడిచ్చి పంపుట ఉచితము అని శ్రీనాథుడు మిత్రుల సలహా అర్థించెను. వారిలో పలు వురకు డిండిమభట్టుతో సంభాషించి రావలెనని ఉబలాట మున్నది. నలుగురు పండితులు వెళ్లుదు మనిరి. ఒకరు సుబ్రహ్మణ్య శ్రౌతి. రెండవవాడు సాంఖ్య న్యాయ వైశేషిక దర్శనములలో విద్వాంసుడగు తాతంభట్టు. మూడవవాడు ఉభయమీమాంసాకోవిదుడగు పేరిశాస్త్రి. నాలవవాడు అపాదశభాషాకవియగు లక్కనసూరి. లక్కనసూరి ప్రాకృత భాషాభేదము లన్నింటిలో ధారాళముగా సంభాషింప నభ్యాసము చేసినవాడు. ఆతడు కొంచెము వాచాలు డగుటచే శ్రీనాథుడు సందేహించుచు, 'లక్కనార్యా, అక్కడ మాన సోల్లాసము సంగతి నృసింహభట్టు తప్ప మరెవరూ ప్రశంస చేయరాదు. నీసోరు ఆవిషయములో కట్టివేసికొందువని వాగ్ద త్తము చేయనలె' అనెను.

లక్కనసూరి చేతిత్రోవ నోరు మూసికొనుచు, 'ఇదుగో ఇప్పుడే కట్టివేసికొంటున్నాను. అంతేకాదు. మీ నృసింహ భట్టు ఎప్పుడు కన్నెర్రజేసి అక్కడ నావంక చూసినా, నోరు కట్టివేసుకొంటాను, ఒట్టు' అనెను.

అందరును విద్యాసగరసంపన్నులట్లు కూర్చాసాచములు ధరించి హయాగూఢులై బయలుదేరిరి. వెనుకటివలెనే పరిచారకులు వారిని మర్యాదగా గోష్ఠీశాలలో డిండిముని సన్నిధికి గొంపోయిరి. డిండిముడు నృసింహభట్టును వెంటనే గుర్తించి ఆదరించి 'ఇందరు పెద్దలు దయచేసినారు. వీరిలో శ్రీనాథభట్టు ఎవరు?' అని సంస్కృతములో ప్రశ్నించెను. దానికి నృసింహభట్టు ఉత్తర మీయకముందే లక్కనసూరి అందుకొని ప్రాకృతభాషలో డిండిమభట్టును, యోగానంద ప్రహసనమును బహువిధముల శ్లాఘించి, తాను ప్రాకృతాది భాషలలో ఏ గొంచెమో పరిశ్రమ చేసితి నని, తాతంభట్టు సాంఖ్య న్యాయ వైశేషిక విద్వద్వర్యుడని, పేరిశాస్త్రి ఉభయ మీమాంసాకోవిదుడని, సుబ్రహ్మణ్యశ్రౌతి శ్రౌతములో నిధి యని అందరిని పరిచయము చేసెను. తనపేరు చెప్పలేదు. శ్రీనాథుడు రాలేదని చెప్పలేదు.

వెనుక దూరముననుండి శ్రోత్రియవేషముతో నున్న శ్రీనాథుని డిండిముడు ఒక్కమారే చూచి యున్నందున సరిగా గుర్తుకు రాక, ఒడ్డు పొడుగులనుబట్టియు, తన ప్రశ్నకు ఉత్తర మిచ్చుటనుబట్టియు ఇతడే శ్రీనాథుడైయుండవలెనను భ్రాంతిలో నాతడు పడెను. అందుచే ఆతనిపై వెంటనే ప్రతికూలభావ మంకు రించెను. దానికి తోడు అతడంతగా ప్రాకృత భాషనే పట్టు దలగా మాట్లాడుచుండుటచే చిర్రాకు కూడ కలిగినది. అదిగాక డిండిముడు ప్రాకృతభాషలు శూన్యముగా నేర్చినవాడైనను, ధారాళముగా సంభాషించుట అభ్యాసము చేసి యుండలేదు.

అందువలన సంస్కృత భాషలో లక్కససూరి నిట్లు ప్రశ్నించెను: 'ఎన్నో ప్రాకృతగ్రంథాలు రచించిన హరిభద్రసూరియే 'బాలస్త్రీ వృద్ధ మూర్ఖాణాం నృణాం చారిత్ర కాంక్షిణామ్, అనుగ్రహార్థం తత్త్వజ్ఞైః సిద్ధాంతః ప్రాకృతః స్మృతః' అని అన్నాడే, పండితవర్యా! ఉత్తమపురుషుల సంభాషణకు ఉచితమైన సంస్కృతభాషను వదలి, మీరు స్త్రీలకు, మందబుద్ధులకు విహితమైన ప్రాకృతభాషలో మాట్లాడుచున్నారేమి?'

లక్కసూరి: 'అహో త్రాహ్మీకృతం హరిప్రియా వక్త్రేందు సుందరమ్, సూక్తయో యత్ర రాజంతే సుధా నిష్యంద నిర్భరాః!' తమరు సెలవిచ్చినది సంస్కృత నాటక మర్యాద. మహాకవులగు కాళిదాసభవభూతులుకూడ వ్యవహారములో ప్రాకృతభాషలోనే సంభాషించుచుండి రనుటకు నిదర్శనములున్నవి. అందువల్ల వ్యవహారమునకు సంస్కృతము పనికిరాదని ప్రాకృతమే అవలంబించుచున్నాను.'

డిండిముడు: 'సంస్కృతం స్వర్గిణాం భాషా
పైశాచం ప్రాకృతం విదుః!'

లక్కసూరి: 'శ్రీ గురవః ప్రాహుః. అనుపాసిత సద్గురు కులస్య, అజ్ఞాతవాఙ్మాయతత్త్వస్య కస్యాపి ఇదం వచో భవేత్! యుగాదౌ ప్రథమపూర్వేణ ప్రప్రథమం మాతృకైవ ఉపదిష్టా, సాచ ప్రాకృత రూపా, తతః సంస్కారే కృతే సంస్కృతం జాతమ్, కస్యాపి జ్ఞానలవమర్విదగ్ధస్య ఇయం ప్రాకృతనిందా.- తమరు సెలవిచ్చిన వాక్యానికే ఈ విధంగా హేమచంద్ర

సూరిచే కుమారపాలప్రబంధములో ప్రత్యుత్తర మీయ బడినది గదా!'

ఆ మాటలచే తాను జ్ఞానలనదుర్వాదగు డయినట్లెగదా! డిండిమ:ని ముఖము జేవురించినది. ఆతడు సదర్పముగా నిట్లనెను : అవి 'అప్రామాణికులు అసంస్కృతులు ఐనవారి మాటలు. విద్వజ్జనుల జిహ్వాలలో నటించు సంస్కృతమును ఉజ్జగించి ప్రాకృతాభిమానము చూపుట వారి ప్రాకృతత్వమునే ప్రకటించును గదా!'

వెంటనే లక్కనసూరి వినయముతో నిట్లనెను : 'అజ్జ— కేవల ప్రాకృతభాషాకవు లెందరు లేరు! ఎందరెందరు మహా కవులు ప్రాకృతమయములైన సట్టకములు వ్రాయలేదు! ప్రవరసేనుని సేతుబంధమును దండ్యాచార్యులే ప్రస్తుతించిరి గదా! వాక్పతిరాజు రచించిన గౌడవహో (గౌడవధ) కంటె సంస్కృత కావ్యములలో గొప్పవి ఉన్నవా? హేమచంద్రసూరి 'సమరాయిచ్చ కహా' (సమరాదిత్యకథ) బాణభట్టు కాదంబరిని మించినది గదా! ఇంకా చంద్రప్రభ చరియం, జంబూచరియం, నేమి చరియం, నారాయణం, పంచమీకహా, లీలావయీ కహా—ఆహాహా, ఏమి మధురమైన ప్రాకృతకావ్యాలండీ! సంస్కృతము పురుషవాక్కువలె పరుషమైనదనీ, ప్రాకృత భాష సహజ మధురమైన యువతీజనవాక్కువలె అమృత మయమనీ పెద్ద లంటాయగదా! అలంకారశాస్త్రము ప్రపంచిం చేందుకు నాటికి తొంభైపాళ్ళు ప్రాకృతగాథలే ఉదాహ రిస్తున్నాయగదా!'

డిండిముడు అడ్డుతగిలి, 'మీ వాదము అపూర్వముగా ఉన్నది. మా బోంట్లము దానిని అంగీకరించినప్పుడో కదా దానికి ఆధారము దొరుకుట' అనెను.

లక్ష్మీనసూరి మరింత వినయముతో 'తమబోటి విద్వద్వరేణ్యులను ఒప్పించు కుతూహలము తోడనే నే నిక్కడికి వచ్చినాను, తమకు అనుగ్రహింపనిదో ప్రాకృత భాషకు దిక్కేమిటి? మరి! కొందరు సంస్కృత భాషా, కొందరు ప్రాకృత భాషా, మాట్లాడుట సంస్కృతనాటకములలో సంప్రదాయము కనుక చెల్లిపోతున్నది. ఒక సంగతి చిత్తగించండి! సత్యము విచారిస్తే అందులోని అనౌచిత్యమూ, అసందర్భమూ, తమరు తప్పక ఒప్పుకొంటారు. శ్రీరాముడు సంస్కృతములో భాషిస్తూఉంటే, పూజ్యురాంధ్రుడు కౌసల్యామాత, సీతామహాదేవి ఆభాష అవగాహన చేసికొనియే ప్రాకృతంలో మాట్లాడుతున్నారనుకొందాము. కాని అపండితులైన చేటీచేటవిదూషకాదులకు సంస్కృతము ఎట్లా అర్థమైనట్లు? ఒకరొక భాషలోనూ, ఇంకొకరు ఇంకొక భాషలోనూ పరస్పర సంభాషణము జరపడము ఎంత అసందర్భముగా ఉంటుంది ? ఎంత అనుచితము!' అనెను.

నృసింహభట్టు అందుకొని నవ్వుచు, 'మీ రిప్పుడు ప్రాకృతములోను, డిండిమభట్టారకులు సంస్కృతములోను మాట్లాడుచున్నారుగదా! ఒకరి మాటలు ఒకరికి అర్థమవుచున్నవి గదా! సందర్భశుద్ధి తప్పుట లేదే? సంస్కృతనాటకభాషామర్యాద కూడా అటువంటిదే అనుకోరాదా?' అనెను. ఈమాట లాతము

చమత్కారార్థము కొంతప్రాకృతము·లోను, కొంత సంస్కృతము·లోను మాట్లాడి అందరిని నవ్వించెను.

వెంటనే లక్కనసూరి కొంచెము ఆవేశముతో నిట్లనెను. ఇప్పుడు నృసింహభట్ట సంస్కృతప్రాకృతభాషామిశ్రిత వాక్కులు మిమ్ములను నవ్వింపలేదా! అట్లాగే మాబోంట్లకు సంస్కృతనాటకములలోని భాషల కలగాపులగము హాస్యాస్పదంగా ఉంటుంది. అందుకే జయవల్లభుడు 'నజ్జాలగ్గము' అనే కావ్యాలంకార గ్రంథంలో ఇట్లా అన్నాడు:

'పాయియ కవ్వస్స నమో పాయియ కవ్వంచ నిమ్మియం జేణ, తాహం చియ పణమామో పధిఢూణయజే విజాణంతి. పాయియ కవ్వులావే పడివయణం సక్కయేణ జో దేయి, సో కుసుమ సత్థరం పత్థరేణ అబుహో పిణాసేయి, ఉజ్జడ సక్కయ కవ్వం సక్కయకవ్వంచ నిమ్మియం జేణ, వంసవారం వ పలిత్థం తడయడ తడ్డత్థణంకుణయి!' * అందుకే హాలశాతవాహనప్రభువు ఇట్లా అన్నాడు: 'అమియం పాయియ కవ్వం పడిఢం సో ఢుంచ జేణ అణంతి కామస్స తత్తతంతిం కణంతి తేకవా ణ లజ్జంతి ♦ అందువల్లనే పలువురాచార్యులు కేవల

---

*ప్రాకృత కావ్యమునకు ప్రాకృత కావ్యనిర్మాతకు నమస్కారము. దానిని చదివి తెలుసుకొనువారికి గూడ ప్రణామము చేయుచున్నాము. ప్రాకృతకావ్యాలాపమందు సంస్కృతమున ప్రతివచన మొసగువాడు అబుధుడు. కుసుమ ప్రస్తరమును (కుసుమ శయ్యను) ప్రస్తరణుతో (రాతితో) వినాశము చేయు నట్టివాడు. మండుచున్న వెదుళ్ళనిటినివలె సంస్కృతకావ్యమును సంస్కృత కావ్యనిర్మాతను వదలిపెట్టవలె. ఆది తడతడ తట్ట ధ్వని చేయును.

♦ ప్రాకృతకావ్యము అమృతము. దానిని పఠించుట ఎరుగనివారు కామ తంత్రము నెట్లు చేయగలరు, ఎట్లు సిగ్గుపడ కుండగలరు!

ప్రాకృతమునే అవలంబించి గద్యపద్యకావ్యాలు సట్టకాలు రచించినారు. తమ రిందుకు సమ్మతింతు రనుకొందును!?

డిండిమునకు ఆగ్రహము పెరుగుచుండెను. ఏమని ప్రత్యుత్తర మీయవలెనో తోపక వికృతముగా పకపక నవ్వుచు. 'మీ వాదము మీ బుద్ధిసూక్ష్మతను సూచించుచున్నది. అదంతయు సంస్కృతమునకే వినియోగించిన చో ఎంత రాణించి యుండును, అయిన మీతో వచ్చిన ఈ పండితవరేణ్యు లందరు ఏమందురో విందము' అనెను.

నృసింహభట్టు అందుకొని 'ఆర్యా, వా రెప్పుడును ఇంతే. ఎప్పుడును మాతో ఇదే గొడవ. వక్రమైన పంథ. కవనములో గనుక ఏ భాష అయినా చెల్లిపోయినది గాని మనకు శాస్త్ర చర్చలలో ప్రాకృతముతో అడుగు సాగునా! ఈ ప్రాకృతా లకు ఏదో నామమాత్రమునకే గాని సగియైన వ్యాకరణమే లేదు. నోటికి వచ్చినట్లు ప్రేలి అష్టాదశభాషలలోనిది కూడా కాదు, మరొక దేశభాష' అనవచ్చును. దానిపేరే ప్రాకృతము, అపభ్రంశము, పైశాచి. కునయమూలాకక్షలో గొల్లభాష ఉక్కభాష * ఫారస్ భాషకూడా చేర్చినాడు- ఇట్టి ప్రాకృతా నికే వేదార్థము కాపాడుచున్న మునిత్రయ వ్యాకరణ మున్న సంస్కృతభాషకు సాపత్న్య మేమిటి!' అనెను.

అప్పుడు తాతంభట్టు కల్పించుకొని యిట్లనెను. 'ఏదో కవిగాళ్లకు కాబట్టి ఉక్తి విశేషమే కావ్యము, భాష ఏదైన

---

* ఉత్కళదేశభాష— గౌడభట్టు దేశభాషను ఎత్తిపొడుపు.

నవుగాక, అను మాటలు చెల్లిపోయిన చెల్లిపోనచ్చుగాక! మాకుగూడ వ్యాకరణశాస్త్రము ముస్నదని ఈ ప్రాకృతులు వ్యాకరణాభాసమైన చూపించగలుగుమను గాక! మన న్యాయ శాస్త్ర విచారణము ప్రాకృతభాషలలో అడుగు కదలగలదా!- ఇంత ప్రాకృతాభిమానము గల ఇతనిని ప్రాకృతములో సరిగా ఒక్క లక్షణము చెప్పగలుగు నేమో అడుగుదము. దీనిని ప్రాకృతభాషలో ఎట్లు చెప్పగలడు?—' ఇట్లనుచు న్యాయశాస్త్ర పరిభాషలో విచారణ మారంభించెను.

డిండిమభట్టు ప్రాకృతసూరి వితండవాదమునుండి బయట పడి, ఆనందముతో తాతంభట్టుతో న్యాయశాస్త్ర విచారణ లోనికి దిగెను. వారిద్దరు చాలసేపు గౌతముని న్యాయసూత్ర ములను, అందుపైన వాత్స్యాయన నామాంతరము గల పక్షిలస్వామి రచించిన భాష్యమును, దానిపై బౌద్ధదిజ్నాగులు చేసిన ఖండనములను ఉద్యోతకారు లెట్లు ఖండించినదియు, దానిని మరల ధర్మకీర్తి యను బౌద్ధాచార్యులు ఖండింపగా, శ్రీధరాచార్యులు న్యాయశాస్త్రగౌరవము నెట్లు ప్రతిష్ఠించి నదియు, ఆ తర్వాత వాచస్పతిమిశ్రులు తమ వార్తిక తాత్పర్య టీకలోను, అందుపై ఉదయనాచార్యులు తాత్పర్య పరిశుద్ధి లోను కిరణావళిలోను న్యాయశాస్త్రము నాస్తికదర్శనము కాదని సిద్ధాంతీకరించుటయు—ఇత్యాది విషయముల గూర్చి ప్రశంసలు చేసికొనుచు మధ్యమధ్య వైశేషికమును సాంఖ్య మును గూర్చియు ప్రస్తావించుకొనిరి. ఇద్దరును గంగేశోపాధ్యా యుని తత్త్వచింతామణి పేరెత్తలేదు. తాతంభట్ల న్యాయ

శాస్త్రపాండిత్యమునకు డిండిమభట్టు అద్భుతమంది 'కొండవీటి రాజ్యములో మీబోటి నైయాయికు లెంద రున్నారు?' అని ప్రశ్నించెను. 'డెబ్భె యిద్దరు లెక్క తేలినా' రని తాతం భట్టు చెప్పగా విని డిండిముడు తెల్లనోయి, అప్పుడు గంగే శోపాధ్యాయుల తత్త్వచింతామణి పేరెత్తెను. తాతంభట్టు దాని యతిశయమును శ్లాఘించి, తాను దానిపై 'దీధితి' యను వివరణగ్రంథము వ్రాయుచున్నా ననెను. దీధితిలో నక్క డక్కడ విషయములు తెలిసికొని డిండిము డందుపై పూర్వ పక్షము లారంభించెను. తాతంభట్టు వెంటనే వానిని ముక్కలు ముక్కలుగా ఖండించి తన ప్రతిభ ప్రకటించెను.

నృసింహభట్టు డిండిములను శాంతింపజేయనెంచి, పతంజలి మహాభాష్యాత్రిశయములోనికి సంభాషణము దింపుచుండెను. తాతంభట్టు వదలక న్యాయశాస్త్రములోనికే లాగుచుండెను.

పేరిశాస్త్రి ముక్కోపి. ఆతడు పూర్వోత్తరమీమాంసలు చక్కగా నధ్యయనము చేసినాడు. ధర్మనిష్ఠు డగుటచే జంకు కొంకులు లేనివాడు. ఆత డింతసేపును మౌనముగా నుండెను. మీమాంసాశాస్త్రము సాంఖ్యన్యాయనైశేషికములను ఖండించుటే కాదు, వ్యాకరణశాస్త్రమునకు తేనిపోని గొప్పలు ఆరోపించుట సమంజసము కాదని కూడ కుమారిలభట్టు తన తంత్ర వార్తికములో సిద్ధాంతము చేసి యుండెను. అందుచే వినివిని విసుగుచెంది, ఆతడు పర్వతము చాటుననుండి ఆకస్మికముగా పైబడి చెలరేగెడి తుపానుగాలివలె ఒక్కసారిగా అందరిపైన విరుచుకొని పడెను.

'అబ్బబ్బ, మా ఆంధ్రదేశము అనైదికమైన ఈ సాంఖ్య న్యాయవైశేషికములతో పాడైపోవుచున్నది అవి దర్శనములట! మరి ఈసుధ్య హరిమిశ్రులు మా దేశములో ఉండిపోయినప్పటినుండి ఈ న్యాయశాస్త్రపు వెర్రి మిన్నుముట్టుచున్నది. అది పైగా నవీననవ్యన్యాయమట! పూర్వమీమాంసాశాస్త్రమునకే కాని, 'న్యాయము' అను పదము ఈ కుతర్కమునకు చెల్లుబాటుకాగలదా! ఈ తర్కశాస్త్రముపై సభిమాన మెక్కువగుటచేత మా ఆంధ్రదేశము త్వరలో స్మృగాలములతో* నిండిపోవునేమో యని మాబోంట్లము భయపడుచున్నాము. శ్రీవిద్యారణ్యులు ప్రతిష్ఠాపించిన శ్రీవిద్యానగరరాజ్యములోనికి గూడ ఈ పాపము ప్రాకినదా?' అనుచు నతడు చెవులు మూసికొనెను.

ఆ మాటలకు డిండిమభట్టు త్రుళ్లిపడెను. ఆయనకు అభిమానపాత్రములైన శాస్త్రముల నీత డిట్లు తృణీకరించుటగుండెలలో గాలమునలె ప్రవేశించినది. వెంటనే ఏమి జవాబు చెప్పను తోచక వెకిలినవ్వు నవ్వుచు, 'మీతోవచ్చిన నృసింహభట్టు తాతంభట్టులే మీకు సదుత్తర మీయగలరు' అని ఊరకుండెను.

---

* కేవలతర్కశాస్త్రము చదువుకొనినవారు ఉత్తరజన్మలో నక్కలై పుట్టుదురని ప్రథకలదు. అందువలన తర్కశాస్త్రాధ్యయనము పూర్తిచేసిన వారు ఏకొంచెమైనను వేదాంతశాస్త్రాధ్యయనము తప్పకచేయుట నేటికిని ఆచారము.

నృసింహభట్టు : 'కుమారిలభట్టు చేసిన వ్యాకరణాధిక్షేపము ప్రత్యేకప్రయోజనమును ఉద్దేశించి చేసినది. అంతేకాని ఆయన వ్యాకరణశాస్త్రమును త్రోసివేయ మనలేదు.'

తాతంభట్టు : 'శ్రీవిద్యాశంకరులు తమ శారీరక మీమాంసలో న్యాయ సాంఖ్య వైశేషికములనే కాక పూర్వ మీమాంసకులనుకూడ ఖండించినారు. పరమార్థవిషయములో నది చెల్లునే కాని, వారు జైమినీయమును పూర్తిగా కాదనిరా? మీ పూర్వమీమాంసను ఉత్తరమీమాంసను బౌద్ధులు జైనులు ఖండింపమన్నప్పుడు మా న్యాయశాస్త్రమే మీకు శరణ్యము. మీకే ఏమి, ఆ జగన్నాథస్వామికే న్యాయ శాస్త్రము శరణ్యము. ఉదయనాచార్యులు తీర్థయాత్రలో జగన్నాథస్వామిని దర్శింపబోగా, తలుపులు మూసియుండెను. ఆచార్యులు కోపించి,

'ఐశ్వర్య మదమత్తోసి మా మవజ్ఞాయ నర్తసే
ఉపస్థితేషు బౌద్ధేషు మదధీనా తవ స్థితిః' *

అన్నంతనే తలుపులు తెరుచుకొనలేదా!'

పేరిశాస్త్రి ధిక్కరించుచు, ''పరమార్థమునకు విరుద్ధమైన సిద్ధాంతములు కలవి. న్యాయసాంఖ్య వైశేషికములు. పూర్వ మీమాంస పరమార్థమునకు సాధనమైనది. ఇక వ్యాకరణ శాస్త్రాన్నిగూర్చి ''ఏవం చా వేదమూలత్వా న్నధర్మ నియమార్థతా, యుక్తా శబ్దస్మృతే ర్వక్తుం న చాస్యాః

---

* ఐశ్వర్య మదమత్తుడవై నన్నవజ్ఞ చేసి వర్తించుచున్నావు. బౌద్ధులు వచ్చినప్పుడు నీ స్థితియే నా చేతిలో నుండును.

శాస్త్రతా స్వయమ్'' అని దానికి శాస్త్రత్వమే లేదని, వేద సిద్ధములైన శబ్దములకు లక్షణము వృథా యనియు, అవసర మైనంతవరకు సామవేదమందే లక్షణ మున్నదనీ,

'సహాధ్యాయిభి ర్వాత్రో వేదః కార్త్స్న్యేన రక్ష్యతే
స్వరాక్షర విసర్గోపి లోపా దన్యై ర్న మృష్యతే
తస్మా త్త్రిభిస్తు సోపాధ్యాయై ర్విప్రై ర్వ్యాకరణాదిభిః
న వినాశయితుం వేదో లభ్యశ్చే త్తేన రక్ష్యతే.' అని,

శత్రుకోటిలోనివారైన వైయాకరణులచే వేదరక్ష ఎంత మాత్రము జరుగదనీ, కుమారిలభట్టు సిద్ధాంతీకరించినారు. ఈ సుబ్రహ్మణ్యశాస్త్రులవంటి వేదవిదులు వేదరక్ష చేయువారు. అంతే కాని వైయాకరణు లెంతమాత్రము కారు. పదవాక్య ప్రమాణపారీణులగు శ్రీ విద్యాశంకరులు దిగ్విజయము చేయుచు న్యాయపరిభాష వాడినారా? వారి భాష్యములలో ఈ తర్కపు పడికట్లు ఉన్నవా? అందువల్ల వారి వాదమునకు బలమేమైన తగ్గినదా?''

గొడడిండిముడు కుమారిలభట్టు, విద్యాశంకరుల నామము లెత్తినంతనే వారికి భక్తితో నమస్కరించి, ''వారి కాలము లలో సంగతి సందర్భములు వేరు. అప్పుడు ఈ న్యాయ పరిష్కారపద్ధతి వాడుకలో లేదు. ఇప్పుడో, ఇతర మతముల కుతర్కముల నన్నిటిని ఖండించుటకు న్యాయశాస్త్రమే శరణ్యము!'' అనెను. తాతంభట్టు సాధువాద మొనర్చెను. సుబ్రహ్మణ్యశాస్త్రియు పేరిశాస్త్రియు ఏమో మాటాడబోవు చుండిరి.

అప్పటికే చాలసేపటి నుండియు డిండిముని విద్యార్థులు న్యాయశాస్త్రపాఠమునకే వేచియుండిరి. అందునలన డిండిముడు సగౌరవముగా నిట్లనెను: "మీబోటి విద్వాంసుల రాక మా కెంతయు ఆనందము కలిగించినది. ఆనల విద్యార్థులు పాఠమునకై వేచియున్నారు- ప్రత్యేకముగా మాత్యో మీకేమైన పని యున్నదా?"

అందరును ఉన్నదని తల ఊపిరి నుండ, నృసింహభట్టు అందుకొని 'నుకేమీ లేదు. గతవారము మా మిత్రులు శ్రీనాథుల మానసోల్లాసమునై తమ అభిప్రాయమును తమకు సూచించు సవరణలును నేను గ్రహించి వారి కందిచ్చుటకు వత్తు నంటినిగదా! ఆ పనిమీదనే వచ్చితిని. దయచేసి నెల విత్తురా?' అనెను.

లక్కనసూరి ఇట్లనందుకొనెను: 'చుఖ్కం కీరయి కవ్వం, కవ్వమ్మి కియే పయుంజాణా దుఖ్కం సంతే పయుంజమాణే సోయారో దుల్లహా హోంతి. *

నృసింహభట్టు కోపవీక్షణము చూచి ఆకస్మికముగా లక్కన సూరి మధ్యలో ఆగిపోయెను.

డిండిమభట్టు లక్కనసూరి ప్రాకృతముతో చిటచిట లాడు చుండెను. ఆత డది వినిపించుకొననివానివలె నృసింహభట్టు వైపు తిరిగి 'భట్టారకా, మీ రడిగినప్పుడు ఎట్లు కాదనగలను!

---

* కావ్యరచన దుఃఖము (తో కూడుకొన్నది.) కావ్యరచన పిమ్మట దాని ప్రయోగము దుఃఖము. ఒకవేళ ప్రయోగించినా శ్రోతలు దుర్లభు లవుతారు.

మీ రిచ్చి వెళ్ళిన శ్లోకము ఇంతవరకు విప్పి చూడనే లేదు. అదుగో, మీ రే తీసి అప్పుడు విన్నవి కాక మరి పది పది హేను శ్లోకాలు వినిపించండి, మా అభిప్రాయము తెలుపుదుము' అనెను.

నృసింహభట్టు సగౌరవముగా శ్లోకము గ్రహించి తన స్వచ్ఛమైన కంఠముతో సంగీతము కలిపి పాఠక శ్లోకములు వినిపించెను. ఈమాటకూడ డిండిమభట్టు శ్రద్ధగా నాలకింప లేదు. విని విని నిసిగి 'భట్టోజీ, మీబోంట్లు ఇది చదువుట కాని, మా బోంట్లము ఇది ఆలకించుట గాని వృథా కాలవ్యయము. మరి వారి మా యభిప్రాయము అర్థించుచున్నారు గనుక చెప్పుచున్నాము — ఈ మానసోల్లాసము తప్పులతడక, బూతులబుంగ, తుచ్ఛ కావ్యము. దిద్దుటకు కూడా సాధ్యము కానన్ని దోషము లున్నవి. దోషప్రకరణ మంతటికి ఉదాహరణ ప్రాయమైన దీ గ్రంథము—అని మా నిశ్చితాభిప్రాయ మని వారికి చెప్పుడు. దయచేసి యికముందు మీరు మానద్ద ఈ గ్రంథప్రస్తావము తేవద్దు!' అని నిష్కర్షగా చెప్పెను.

నృసింహభట్టు 'చిత్తము. శ్రీనాథభట్టుకు తమ యభిప్రాయము చేరవేసెదను' అనుచు శ్లోకము మురల యథాస్థానమున అలమరలో పెట్టి సెలవు తీసికొని తక్కిన పండితులతో వెడలిపోయెను.

ఆనాటి సాయంకాలము డిండివభట్టు న్యాయపాఠ మెక్కువ సాగలేదు. తన విద్యార్థులతో మధ్యమధ్య 'ఆంధ్రదేశములో కూడ కొంతకొంత న్యాయవ్యాకరణశాస్త్రములు అధ్యయనము

చేసినవాళు నొంతమంది ఉన్నట్లున్నారు. కాని అందరును చిత్రమైన వ్యక్తులు. ఒకరిత్తో ఒకరికి తలకూడదు' అనుచు ప్రస్తావవశమున పలుకుచుండెను.

పాఠమైన పిమ్మట శిష్యులు ఆ మానసోల్లాసము ఎట్లుం డునో తమ కన్నులత్తో చూచి చదుసవలెనను కుతూహలము ప్రకటించిరి. డిండిమభట్టు ఎర్రనడ్డ ముఖముత్తో 'దానిత్తో వృథా కాలవ్యయము చేయనద్దు!' అని నిషేధించుటచే వా రా క్రోశము స్పృశింప సాహసింపకయే వెళ్ళిపోయిరి.

ఆ రాత్రి డిండిమపత్ని గౌరీదేవి పూటిమూటికి నిదురలో నులికిపడి లేచుచు, 'అయ్యో, మన యింటిలో కాలసర్ప మేదో ప్రవేశించినది. శోధించండి!' అని పలవరింపసాగెను. ఆమె నారాత్రి శాంతింపజేయుట యింటిలోనివా రందరికి కష్టతర మయ్యెను.

త్తెల్లవారిన పిమ్మట గృహబాహ్యాభ్యంతరములలో పరిచారకులును, బంధువులును ఇరుగు పొరుగుల వారును మూల మూలల గాలించి వెదకిరి. ఎక్కడను సర్పము తిరుగాడిన జాడలుగాని, అది విడిచిన కుబుసపు గుర్తులుగాని, ఏమియు కనిపెంపలేదు.

గృహపురోహితుని, జ్యోతిష్కుని పిలిపించి ఈ విపరీత మేమని విచారించిరి, వారిద్దరు నాలోచించి 'ఉగ్రరథుడు కాల స్వరూపుడు. మీకు శీఘ్రమే ఉగ్రరథశాంతి చేసికొనుడు' అని సలసూ యిచ్చిరి.

గౌరీదేవి కూడ కుమారుని రాకకై పలవరింప సాగెను.

శ్రీనాథుడు తన మిత్రులు డిండిమభట్టుతో చేసిన ప్రసంగము శ్రద్ధగా నాలకించెను. వారి మాటలవలన డిండిమునకు ప్రాకృతభాషా వ్యాసంగము తక్కువయనియు, పూర్వోత్తర మీమాంసలు గట్టిలేవనియు, న్యాయశాస్త్రములో కూడ తాతంభట్టుకు తీసికట్టనియు గ్రహింపగలిగెను. మానసోల్లాసముపై నాతని యభిప్రాయము కోపముకలిగించుటకు మాకుగా నాతనికి విశేషముగా సమ్మోదమే కలిగించెను. ఆ రాత్రియు, మరునాడు దీర్ఘముగా నాలోచించి, డిండిములకు అభిక్షేపణ పత్రిక సిద్ధముచేసి మిత్రులకు వినిపించెను. దాని సారాంశ మిట్లుండెను.

'శ్రీ శ్రీ శ్రీ కవిసార్వభౌమాది బిరుదాంచితులును డిండిమ నామాంకిత కాంస్య ఢక్కా గౌరవ లాంఛనులు నగు అమణగిరినాథ భట్టాచార్యులకు శ్రీనాథభట్టు పంపిన అభిక్షేపణ పత్రిక.

'మీరు మహావిద్వత్కవు లను ప్రసిద్ధి విని. నేను మా శ్రీవిద్యానగరయాత్రలో విద్యావినోదముచేతను భగవద్భక్తివిశేషముచేతను మానసోల్లాసమను పేర సంస్కృతభాషలో రచించిన శ్రీవిరూపాక్షేశ్వరస్తుతికావ్యమును, ఆగంతుకులము గనుక, మీరు పెద్ద లనుదృష్టితో అభిప్రాయార్థము, మామిత్రులగు నృసింహ భట్టాచార్యుల ద్వారా పంపియుంటిమి. వారి ముఖమున

అందులోని శ్లోకములు కొన్ని విని, మీరు అందులో ఎన్నో దోషము లున్నవని చెప్పగా, అవి చూపినచో దిద్దుకొందు రని ఆకావ్యప్రతిని వారు మీయొద్దనే ఉంచినచ్చిరి. మరల వారము రోజులకు, మొన్నటి రోజున, మీఅభిప్రాయమును గ్రహిం చుటకు నృసింహభట్టాచార్యులు తమత్రో అనాదరభాషాకవిశ్వేసు లగు లక్ష్మనసూరిని, సాంఖ్య న్యాయ వైశేషిక విద్వ త్ప్రకాండులగు తాతంభట్లను, ఉభయమీమాంసాకోవిదులగు పేరి శాస్త్రిలను, వేదవేదాంగవిదులగు సుబ్రహ్మణ్యప్రభృతు లను తీసికొని తను దర్శనమునకు వచ్చిరి. వారందరి సమక్షమున మరల నేము రచించిన మానసోల్లాసమును మీకు వినిపించి అభిప్రాయ మర్థింపగా, మీరా కావ్యమును తప్పులతడక యనియు, బూతులబుంగ యనియు, తుచ్ఛకావ్యమనియు, దోష ప్రకరణ మంతటికి ఉదాహరణప్రాయ మైనదనియు, మీ నిశ్చితాభిప్రాయ మని మాకు తెల్పుమని పంపివిచ్చితి రని తెలియవచ్చినది.

'మీ మానసోల్లాసములో ఒక్క వ్యాకరణదోషముకాని రసభంగము కలిగించు ఒక్క అలంకారిక దోషముకాని మీరు విద్వత్సభాముఖమున నిరూపింప గలిగినచో మీ కావ్యమును అగ్ని కాహుతి చేసి మీకు పాదాక్రాంతులము కాగలము. అటు మీరు చేయనిచో, మీరు కవు లందరికంటె నధికుల మని ఆటోపముతో ప్రకటించుకొనుచు పీఠములవెంట ప్రలాపించు కొని పోవు మీ డింభిమమును మాకర్పింపవలయును. ఇది నిర్ణ యించుటకు శ్రీ విద్యానగరములో పండితపరిషత్తు చేయుటకు

పండ్రెండు దినములలో కలసి రానలసినదని మిమ్ముల గోరు చున్నాము. అట్లు కలిసిరానిచో మీ రోడినట్లు భావించెదము.

శార్వరి, చైత్ర బ. ద్వాదశి-శ్రీనాథభట్టు.

దానిని పంపవచ్చునని పండితు లనుమతించిరి. శ్రీనాథుడు పోతన దుగ్గనలను పిలిచి 'మీ రిద్దరు ఈపత్రికను నేటి సాయం కాలము డిండిమభట్టుకు చేర్చనలెనోయి!' అని అప్పగింపగా వారు సంతోషముతో పొంగి గంతులు వేసిరి.

ఈ పని ముగించుకొని శ్రీనాథుడు పర్వతమల్లును పిలిపించి 'మల్లూ, నాకు కొన్నాళ్ళు తీరిక. మల్లవిద్యావినోదముతో గడపవలెనని యున్నది. నీ గరిడీకి వెళ్ళుదమా?' అనెను. పర్వత మల్లు పొంగిపోయి పడేపడే దండములు పెట్టుచు నాతని తన గరిడీకోనికి తీసికొనిపోయి శిష్యుల పరిశ్రమ ప్రదర్శించెను. శ్రీనాథుడు మెచ్చుకొని పర్వతమల్లును నలుగురు శిష్యులను మాత్రము ఏకాంతముగా నుంచుకొని యిట్లు సంభాషించెను.

'ఇతడేనా నీ పెద్ద శిష్యుడు గండమల్లు? విద్యామల్లు శిష్యునితో ఇతని మల్లయుద్ధ మెప్పుడు?'

'చిత్తము. ఇక నాలుగు రోజులకు ప్రభూ!'

'ఇతని జ్వరము నయమైనదా? ఇప్పు డెట్లున్నాడు?'

'ఆ రాత్రికే నయమైనది. చిత్రమేమో కాని ఆ జ్వరము నయమైనప్పటి నుండి ఇతడు ఎక్కువ శక్తి చూపుచున్నాడు.'

'మల్లూ, సరేకాని, నీ చిన్న శిష్యుడు ఎందుకు ఓడినాడో తెలిసికొంటివా?'

పర్వతనుల్లు : మొనటి పోరుకు ముందే విద్యానులు సంగతి నగరంలో విచారించిరిని. ఆతని శిష్యు లెవ్వరు ఓడి పోలేదట. మొదటనే చేతులు కలిపి భుజబంధము చేయుటలోనే ఎదిరి బాహువులు చచ్చుపడునట. దానికి దీర్ఘముగా ప్రతిక్రియ ఆలోచించి, ఎక్కువబలము, చురుకుదనము గల నాశిష్యునికి గోదావరినికి దిగగానే అనతలినానిని ఎత్తి పడవేయుట నేర్పినాను. పడ్డపిమ్మట ఎదిరి నాపు పీటుకాక పెనగులూడి, క్రింపనుండియే మానాని బాహువులు కాళ్ళ నలిపి యోడించినాడు.'

శ్రీనా: 'ఈమారు సురల గండములకు అదే జరుగకుండుటకు ఉపాయము లేమైన నేర్పితివా?'

ప. ము: 'చిత్తను. తమనద్ద రహస్య మేమున్నది. నేర్పినాను. ఎదిరి కైండుచేతులు బంధించుట కూడా నేర్పినాను.'

ఆ మాటలు పర్వతమల్లు సగర్వముగా పలుకుట గమనించి శ్రీనాథుడు తీక్షణపు పరిహాసదృష్టి పరపి, 'ఇప్పు డిక గండమల్లు గెలువగల డనుకొనుచున్నావా?- విద్యానుల్లు నీ యంత మాత్ర మాలోచింపడా?- నాకెందుకు చెప్పలేదు?' అనెను.

పర్వతమల్లు చిన్నపుచ్చుకొని కొంతతడ వాగి శ్రీనాథుని పాదములు పట్టుకొని క్షమింపు డనెను.

శ్రీనాథుడు ప్రసన్నుడై ఆతని రెండవ శిష్యుని రమ్మని ఎనుట నిలిపి, యతని మోకాలు తన రెండు మోకాళ్ళ పట్టుతో ఒత్తిపట్టెను. దాని కా మహామల్లుడు గిలగిలలాడుచు తూలిపడ బోవుచుండెను. శ్రీనాథుడు పట్టు వదలివేసి, యాతని

బట్టకొని తన బొడ్డులో పదిలపరచిన బరణిలో నుండి అంజనౌషధము తీసి యచ్చటరాచి స్వస్థుని గావించెను. అది చూచి మల్లు లందరు ఒక్కపెట్టున శ్రీనాథుని పాదములపై వ్రాలి మల్లవిద్యారహస్యములు ఉపదేశింపుడని ప్రార్థించిరి.

శ్రీనాథుడు నవ్వుచు 'నేనా, పర్వతమల్లుకు, ఆతని శిష్యులకు మల్లవిద్యారహస్యాలు నేర్పుట? - మహాభాగవతములోను, హరివంశములోను, చాణూరముష్టికు లను పర్వతములనంటి ఆంధ్రమల్లురను పసిబాలురగు బలరామకృష్ణులు నిర్జించిన కథ వింటిరిగదా! బలరామకృష్ణులు ఏ విద్యతో గెలిచిరో మీ గురువులు మీకు బోధించిరా? అది తెలియనివాడు విద్యా మల్లు శిష్యులను గెలువజాలడు' అనెను.

వాడు తెలనోయి టీకనుక పదుచుండగా, కొంతవడి వానిని సంక్షోభపడనిచ్చి, రెండు సూత్రములు విసరించెను. 'మన దేహములో కొన్ని నరములను ఒత్తినచో వానికి సంబంధించిన యవయవములు చచ్చువాడును. చేతిపట్టు వీలు లేనిచో, మోచేతి మడతతోగాని, బాహుమూలముతోగాని మోకాళ్ళతోగాని, కాళ్ళ వెనుకకు వంచిగాని, కంఠబంధముతోగాని అది సాధింపనచ్చును. అట్టి ఆయువుపట్టులు మానవ శరీరములో ఏబదియొక్కటున్నవి.' ఇట్లనుచు విద్యుద్వేగముతో శ్రీనాథుడా స్థానములు తన దేహమున ప్రదర్శించెను.

ఆ మాటలు విని మల్లులందరు క్రుంగిపోయిరి. ఉన్న కొలదిన్యూనధలో వారా విశేషములు తెలిసికొనజాలరు.

బహుకాలము అభ్యసించినగాని అది యలవడదు. గండమల్లు కంట తడిపెట్టుకొనెను. అది చూచి శ్రీనాథుడు 'నీ విది స్థూలముగా నైన దెలిసికొనుటకు వ్యవధిలేదు' అనెను. దానితో గండమల్లు ఆశ అడుగంటెను, శ్రీనాథుడు మరికొంతసే పాగి, "మీ రిది ఎట్లో నేర్చినను ప్రయోజనము లేదు. విద్యామల్లు తనశిష్యులకు దాని ప్రతిక్రియ నేర్పియే యుండును" అనెను. ఆ మాటలు వినునప్పటికి మల్లు లందరు మరింత కలతనొంది దీనాననులై నిలిచిరి. తుద కాతడు తక్కినవారిని ఆవలకు పంపివేసి, గండమల్లును మాత్రము దగ్గర కూర్చుండబెట్టుకొని యాతని వీపు తట్టి, "భయపడకు. మల్లయుద్ధమునాడు ఏకాంతముగా మధ్యాహ్న వేళ నావద్దకు రమ్ము. నీ యాయువుపట్టులలో వజ్రలేపము మర్దించి నీ శరీరమును విద్యామల్లు శిష్యుని విద్యనుండి రక్ష చేసెదను, వజ్రలేపము గోదాచుట్టికి చెదర నిచ్చును. నీ శరీరమునకు మల్లాచారము ప్రకారము ఎర్రమృత్తు తాకనీయకుము. ఐనను నీవు మల్లయుద్ధములో చేతనైనంత వరకు నీ ప్రతిపక్షి చేతులకుగాని, బంధముల మడతలకు గాని, నీ బాహువులు, కాళ్ళు అందీయనద్దు. మొదటి ఊపులోనే ఎదిరిని క్రింద పడవేసి చిత్తు చేయుట నేర్చికొనుము" అని యుపదేశించి తన ఏకాంతమందిరమున కరిగెను.

మల్లయుద్ధము నిర్ణీతమైన నాటి మధ్యాహ్న వేళకు సరిగా గండమల్లు శ్రీనాథుని దర్శించి, దండప్రణామము మొనర్చి నిలుచుండెను. అతనిని తన యేకాంతమందిరమునకు గొంపోయి స్వహస్తములతో వాని ఆయువుపట్టులను మరికొన్ని స్థానము

లను, శ్రీనాథు డప్పటికే సిద్ధముచేసియుంచిన వజ్రలేపము పట్టించెను. అది యాతని చర్మపు వర్ణముతో కలసిపోవునట్లు చేసి, వీపుచరచి 'నేను ఉపదేశించినవి గుర్తుంచుకో! గెలిచి రా!' అని యాశీర్వదించెను. వాడు వినీతుడై శ్రీనాథభట్టుకు నమస్కరించి సెలవు తీసికొని పర్వతమల్లుకడకు జనెను,

ఆనాడు మల్లయుద్ధము మరల విద్యానగర మల్లులను అశేషనాగరకులను విశేషముగా నాకర్షించెను. కొండపీటి మల్లుడు అధిక బలాఢ్యుడని స్పష్టముగా నందరికి గనుపడు చుండెను. న్యాయముగా నతడే గెలువవలెనని నారికున్నది. ఐనను ఎక్కువ యూహలేదు. విద్యామల్లు శిష్యులను గెలువ గలవా రీలోకములో లేరు. ఈ భీమబలాఢ్యుని నెట్లు నేడు గెలుచునో చూచెదముగాక యనుకొనుచునే, అంతరంగము లలో కొండపీటి మల్లుడు జయింపవలెనని వాంఛించుచుండిరి.

మధ్యవర్తులు పండెపు సొమ్ము ప్రేక్షకులకు చూపి గోడాను, మల్లురను పరీక్షించిరి. అంతయు తృప్తికరముగా నున్నది.

విద్యామల్లు ఉత్సాహముకాని. జంకుకాని ప్రదర్శింపక నిర్లిప్తుడై మధ్యవర్తుల కెదురుగా దూరమున గూర్చుండెను. పర్వతమల్లు కంపించుచున్న హృదయముతో నాతని సమీపమునకే కూర్చుండెను.

పై పండెములు ప్రేక్షకలోకములో యథాప్రకారము విరివిగా సాగినవి. ముప్పాతిక ముప్పీసము విద్యామల్లు శిష్యుని పక్షమునకే ఆ పండెము లొడ్డుచుండిరి.

మల్లు రిద్దరు రంగములో ప్రవేశించిరి. గోదావరీ ఎర్రని మృత్తికను లీలగా చేతులలో గ్రహించి హనుమంతునికిని గరుడునకును, గురువులకును మ్రొక్కిరి. ఇతరమల్లురవలె విద్యార్థులు శిష్యుడు ఉత్సాహార్థము గోడానుటి ఒంటికి పులుముకొన లేదు. గండమల్లుడట్లు పులుముకొన లేదు. అది చూచి విద్యార్థులు ఊలికిపడి అనుదు కరచుకొనెను.

మల్లుడు ఒకరి నొకరు తీవ్ర దృష్టితో చూచుకొనిరి. గరుడ దృష్టి, గృధ్ర దృష్టి, శ్యేన దృష్టి, సింహ దృష్టి, శార్దూల దృష్టి, వృక దృష్టి—మృగాల దృష్టికూడ సమానముగానే వారొండొరులపై ప్రసరింపజేసిరి. తనశిష్యులకే కాని ఇతరులకు రాదనుకొన్న మృగాల దృష్టి గండమల్లుడుకూడ ప్రదర్శించుట చూచి, విద్యార్థులు మరల నప్రయత్నముగా నులికిపడిరి. పర్వతమల్లు సిగ్గుతో తల వంచుకొనెను.

ప్రేక్షకు లందరు ఎప్పుడు మల్లయుద్ధమునకు వేళ యగునా, ఎంతసేపు జరుగునా, ఎట్లు జరుగునా, ఏమగునా అని నిర్నిమేషనయనములతో వ్యగ్రమనస్కులై దడదడ లాడుచున్న హృదయములతో నిరీక్షించుచుండిరి

మధ్యవర్తులు వేళ కానున్నదని, సిద్ధముగా నుండుడని మల్లుర నిద్దరను హెచ్చరించిరి. అంతటి మహాజనమును చీమ చిటుకుమన్న వినుపించునంత నిశ్శబ్దముగా నుండిరి.

నిర్ణీత సమయము వచ్చినది. మల్ల యుద్ధము ఆరంభింపుడని సూచించుచు మధ్యవర్తులు గంట వాయించిరి.

రెండు సింహములవలెనే మల్లు రిద్దరు నొకరిపై నొకరు కుప్పించిరి.

కన్ను మూసి తెరచునంతలోపలనే విద్యార్థులు శిష్యుడు గోదాలో చిత్తయి పడియుండెను. గండమల్లు లీలగా నేక పిల్లను సింహము పడవేసి పట్టినట్లు, మధ్యవర్తులకు చూపుచు విజయ దృక్కులతో నిలుచుండెను.

ప్రేక్షకులు తమ కన్నులు తానే నమ్మలేకపోయిరి. పర్వత మల్లే తాను కన్నులార చూచినది తాను నమ్మలేకపోయెను. పడిపోయిన మల్లుడే నమ్మలేక మరల కలియబడుటకు లేన బోవు చుండెను. మధ్యవర్తులు గోదాలో ప్రవేశించి యాతని వారించి గండమల్లు జయించెనని ప్రకటించిరి. పందెపు మొత్త ములో మధ్యవర్తులు తమ భాగము గ్రహించి తక్కినది గండ మల్లుకు ఇచ్చివేసిరి.

అప్పుడు జరిగిన కోలాహలము ఇంతంత కాదు. ప్రేక్షకులు సంతోషముతో గంగవెర్రు లెత్తినట్లు కేకలు వేయసాగిరి. మల్లశాలలోని మల్లు లందరు ఆనందము పట్టలేక గంతులు వేయుచు, జయజయ నినాదములు చేయుచు, గెలిచిన మల్లుని కాలు నేలపై పెట్టనీయక భుజములపై నెక్కించుకొని, ప్రొద్దు లాడుచు నూరేగింపుకు బయలుదేరిరి.

అప్పుడు విద్యార్థుల్లును తనతో పోరికి పర్వతమల్లు సవాలు చేయునని యందరు తలచిరి. చిత్రముగా నాతడట్లు చేయలేదు. శ్రీనాథుని యనుజ్ఞ రాలేదు.

సాధారణముగా జయించిన మల్లుడు, సమయమునందు గురువు సమీపవర్తియై యున్నచో, గెలిచిన మొత్తము గురున కర్పించుట పరిపాటి. గండమల్లు ఈనాడట్లు చేయలేదు. గండమల్లు తనయూరేగింపును ముందు కొండవీటి వసతికి పోని మ్మనెను. అక్కడ నాతడు భుజములపైనుండి దిగి, లోనికి పోయి శ్రీనాథునికి నమస్కరించి తాను గెలిచిన మొత్తము నాతని పాదములకడ సమర్పించెను. శ్రీనాథుని యనుజ్ఞ తీసికొని యాతడుత్సవముతో కదలిపోయెను.

ఆ రాత్రి పండితగోష్ఠిలో నృసింహభట్టు ఎకసక్కెముగా 'శ్రీనాథభట్టా, డిండిమభట్లతో తలపట్లకు మల్ల యుద్ధమునకు గూడ సిద్ధపడుచున్నావా ఏమి?' అనెను.

'కామ. ఆప్తమిత్రుడవైన నీవుండగా ఆ పని నీకే అప్పగింప దలచితిని. నోరు తిరుగని నీ వ్యాకరణశాస్త్రపు తక్కు తప్పులతో సిద్ధపడుము.'

శ్రీనాథుడు డిండిమునకు పంపిన పత్రములోని గడువు లోననే విదియనాడు పరశురామ జయంతియు, వైశాఖ శుద్ధ పంచమినాడు శ్రీ విద్యాశంకర జయంతియు, మరి రెండురోజు లకు సప్తమినాడు శ్రీ విద్యారణ్యజయంతియు వచ్చెను. ఆ మహాపర్వములలో శ్రీ విద్యానగరములో, ముఖ్యముగా శ్రీ శృంగేరీ నిగమాంత శ్రీ పీఠాధిపతులగు శ్రీ శంకరానంద భారతీస్వాముల యాశ్రయమున పూజామహోత్సవములు వైదికవైభవముతో జరుగుచుండెను. ఆ పర్వములు శాంత ముగా గడచిపోవలె ననియే, శ్రీనాథుడు డిండిముల కంత

వ్యవహి యెుసంగెను. ఆ మూడు పర్వదినములంమును శ్రీదేవిత్రో గూడి శ్రీనాథుడే కాక కొండపీటి విడిదిలోని విద్వాంసులును, వారి స్త్రీ జనమును శ్రీ గుమువుల యాశ్రయమునకు వెళ్ళి పూజామహోత్సవములలో పాల్గొని జగద్గురువుల కటాక్ష వీక్షణములకు పాత్రులైరి.

ఆ పర్వదినములలో గాక తక్కినరోజు లన్నియు నాగరక వినోదములతో నాయ కాలక్షేప మెునర్చిరి. మల్ల యుద్ధములు, ఖడ్గ యుద్ధములు, మేష యుద్ధములు, కదంబ యుద్ధములు, కోడిపందెములు, గారడీలు తిలకించిరి. శ్రీ విద్యానగర గాయకులచే గానసభలు, నటునక త్తెలచే నాట్యప్రదర్శనములు చేయించి వినోదించిరి. త్రోలుబొమ్మలాటలు, ఆటగుర్రముల యాటలు, ఈత పందెములు, పగుపందెములు జరిపించిరి. వా రందరు పని-పాటలు లేని ధనిక నాగరికులవలెనే అన్నిటిని దర్శించి యానందించుచుండిరి.

౧౬

డీండిమముల కిచ్చిన గడువు తీరినది. ప్రత్యుత్తరము రాలేదు. పండితసభ చేయుట కెట్టిప్రయత్నములును జరుగలేదు, శ్రీనాథు నకు జ్యోతిషికులు వాదసభకు శుభమని సూచించిన దినము లాసన్న మగుచున్నవి. ఆత డిక శీఘ్రముగా వాదసభను ఒక కొలికికి తీసికొని రాదలచెను. గడువు తీరిన మరునాటి యుద

యమునతో మిత్రులతో సంప్రదించి డిండిమభట్టుకు చివరిపత్రము సిద్ధము చేసెను.

అందులో ముందు పూర్వము జరిగినదంతయు పూసగ్రుచ్చినట్లు వివరింపబడెను. పిమ్మట నిట్లున్నది.

'జరిగినదానిని బట్టి మీరు మా మానసోల్లాసములో ఎట్టి దోషములును చూపజాలరనియు, నృథా డిండిమాడంబరముతో పండితకవుల సత్కావ్యములను నిందించుచున్నారనియు, గ్రహింపబడినది. కావున నేను జయించినట్లు అంగీకార పత్రిక కణోపాటు మీ కంచుఢక్కను మా కర్పించుకొనుడు.

'అది సమ్మతముకాని యెడల మీ ధిక్కారము పండిత సభలో సమర్థించుకొనుటకు మరియొక యవకాశముకూడ మీ కనుగ్రహింపదలచితిమి. నృసింహజయంతిలోపల సభ ఏర్పాటుచేయుటకు కలసి వచ్చినచో మరికొంత వ్యవధాన మిచ్చుటకు గూడ సిద్ధముగా నున్నాము.

'ఇక దేనికి కలసిగానిచో, మేమే స్వయముగా కంచు ఢక్కనే కాక, బంగారు ఢక్కను, వెండి ఢక్కను ముందుంచుకొని, మీ ఓటమిని శ్రీ విద్యానగర వీధులలో వాడవాడలలో ఉద్ఘోషించుచు నృసింహజయంతి వెళ్ళిన మరునాడు మధ్యాహ్నమునుండి ఊరేగగలము.

'మేము తొందరపడలేదని అందరు తెలిసికొను నిమిత్తము ఈ పత్రిక ప్రతులను శ్రీవిద్యానగరములోని పండితప్రకాండుల కును కవిశ్వరులకును మాత్రమే కాక, కటకపాలునకు ప్రధాన

రాజపురుషులకును, పూజ్యులగు శ్రీపీఠాధీశ్వరుల పాద సన్నిధానమునకును గూడ పంపుచున్నాము.

'శార్వరి వైశాఖ శుద్ధ...శ్రీనాథభట్టు,'

ఆ పత్రిక ప్రతులు శత్రోత్తరముగా వ్రాయించి శ్రీవిద్యానగరములోని పండితులకును, కవీశ్వరులకును, రాజపురుషులకును, ఆనాడే అందజేసెను. కటకపాలుడగు సాంపరాయని తెలుంగురాయనికి కొండవీటి స్థానాపతియు, శ్రీపీఠాధీశ్వరులకు నృసింహభట్టును అందించిరి. డిండిమునకు పోతన, దుగ్గనలు వెళ్ళి యిచ్చిరి.

ఆ పత్రము చూచినదే తడవుగా అనుణగినాథ డిండిమభట్టు మండిపడి క్రోధోద్రిక్తుడై దానిని ముక్కలుముక్కలుగా చించి పారవేసి ద్వారపాలకుని పిలిచి, 'ఈ వెధవలను బయటికి గెంటివేయి, వీరల పీళ్ళను మన యింటిలో అడుగు పెట్టనీయకు' అని శాసించెను. ద్వారపాలకుడు సంభ్రమముతో వచ్చి, ఆ బ్రహ్మచారుల రెండు రెక్కలు మోటుగా పట్టుకొని వాకిటిలోనికి లాగికొనిపోవుచుండెను.

దుగ్గన బిగ్గరగా 'మా బావ మీ ప్రత్యుత్తరము తెమ్మన్నాడు' అని అరచుచుండెను.

పోతన 'నీ కంఠ బలిచక్రవర్తే నయమే. ఆతడు బ్రహ్మచారులను పరాభవింపలేదు. ఏమి కవిసార్వభౌముడవయ్యా నీవు! త్వరలోనే శాస్తి జరుగుతుందిలే, అందుకే ఈ దుర్బుద్ధి పుట్టింది!' అని కోపావేశముతో డిండిమునిని శపించుచు, క్రోయు

చున్న ద్వారపాలకుని త్రోపులకు ముందుకు గంతులు పెట్టుచు తూలుచు పోవుచుండెను.

ఆ గందరగోళము సని యంతలో గృహాభ్యంతరము నుండి గౌరీదేవి త్వరితగతి నచ్చి, శ్రీగురువుల యాశ్రమములో తాను తరచుగా సూచిన చిగ్గన పోతనలను గుర్తించి, నణకిపోవుచు భర్తకు దండము పెట్టుచు, 'అయ్యో, అయ్యో, ఎంత పనిచేయు చున్నారండీ! వాగిద్దరూ మానవమాత్రులుకారు, బలరామ కృష్ణులండీ, నరనారాయణఋషులండీ! కారణజన్ములు! అయ్యో వారిని ఆదరముతో పిలిపించండి! నేనైనా వారిని ప్రతి మాలుకొని ప్రసన్నులను చేసికొందును,' అనుచు నెత్తిన నోరు పెట్టుకొని విలపించెను. డింభకుడు వినిపించుకొనలేదు.

పోతన చిగ్గనలు ఆవేశముతో నడచుచు వీధిలోనికిపోయి బిగ్గరగా డిండిముని నిందించుచు, కందగడ్డలనలె ఎర్రపడ్డ ముఖములతో అన్నెములెక్కి, చబుకులతో చరచుచు క్షణ కాలములో విడిదికి చేరి పండితుల మధ్యనున్న శ్రీనాథుని ఎదుట నిలిచి, ఆవేశముతో నడకుచు తడబడుచు అర్థముకాకుండ ఏమేమో మాటలాడుచు కన్నీరు కార్చసాగిరి.

శ్రీనాథుడు దిగ్గన లేచి, ఇద్దరిని ఒక్కసారిగా ప్రేమాతిశ యముతో తన దీర్ఘబాహువులతో కౌగిలించుకొని, శిరస్సులు బుగ్గలు ముద్దుపెట్టుకొని, కన్నీరు తుడిచి, ఓదార్చి, 'అక్కడికి పసిపిల్లలను మిమ్మును పంపిన పొరపాటు నాది, ఆతడు దురు సుగా ప్రవర్తించునని ఊహించలేదు, నాయనలారా! అతనికి చేటు మూడినది' అనెను.

ఆ మాటలతో వారు తేరుకొని ఉత్సాహము తెచ్చుకొని 'ఆ మాటే మేమూ చెప్పినచ్చినాము' అనిరి. శ్రీనాథుడు వారి నిద్దరిని ఆదరపూర్వకముగా సర్వాంగకముగా కరములతో నిమిరి, 'లోపల మీ అక్క మీకోసము దిగులుపడుచున్నది. వెళ్ళి కనపడి రండి!' అని పంపివేసెను.

ఆక్షణమునుండి కొండపేటిబస మిక్కిలి సందడిగా నుండెను. చిత్రకారశిల్పి యొకడు వచ్చి మూడు ఫలకముల యాకారము లెట్లుండవలెనో నిర్ణయించెను. వెంటనే బంగారు పనివారు బంగరు ఫలకమును, వెండిపనివారు వెండి ఫలకమును, తయారు చేయ నారంభించిరి. సమ్మెటలపై సుత్తి దెబ్బలతో ఆ ప్రదేశము మారు మ్రోగుచుండెను. కంచుఫలక పోయుటకు మూస సిద్ధముచేసి ఆరబెట్టిరి. ముత్యాలపనివారు ముత్యాలచేరులు సిద్ధము చేయుచుండిరి. చర్మకారులు చర్మములు పదను చేయసాగిరి.

గారిమొక వంక వడ్రంగులు ఆ ఫలకములకు అనుకూలమైన ఆకారములలో మూడు శకటముల రమ్యోన్నతములుగా సిద్ధము చేయ నారంభించిరి. రంగులువేయువారు రంగులు వేయుటకును కమ్మరులు కమ్మీలు కూర్చుటకును సిద్ధమైరి. ఆ బండ్లలో నొకదానికి గుర్రములు, ఒకదానికి నృషభములు. కంచుదానికి కంచరగాడిదలు నియోగింపబడియుంచిరి. మేళతాళములవారు నిలువ నేర్పులు నిర్ణయింపబడిరి.

ఇక్కడ నిట్లుండగా శ్రీవిద్యానగరములోని కవిపండిత లోకము గగ్గోలు పడుచుండెను. పండితు లాకాన్యము చూడ లేదు. విన్న యువకవులు, 'ఏమిది! శ్రీనాథునికి ఏమి అహం భావము! మన బోంట్లకే అన్ని తప్పులు కనిపించినవే. మహా విద్వాంసుడగు డిండిమునకు ఒక్కతప్పుకూడ కనిపింపదా?' అనుకొనుచు రెండవనాటి సాయంకాలమున ముమ్మకవి యింటికి ఒకొక్కరే గోష్ఠికి చేరిరి. అందరు శ్రీనాథుని అభిక్షేపణ పత్రికను ప్రస్తావించువారే. కొంతతడవు ముమ్మకవి మౌనము వహించెను. కుశాగ్రబుద్ధియగు నా ద్రావిడపిండ మునకు సందేహ మొకటి కలిగి యిట్లనెను. 'మీరు అందరూ ఒకటి గమనించినారా? మన కవీనాడు ఏవో కొన్ని శ్లోక ములు వినిపించెనే కాని మనలో ఒక్కరికైనా ప్రాతఃప్రతి చేతి కీయలేదు. నామాత్రానికి నేను ప్రొద్దుపోవుటచేత యీదా లాపముగా విన్నాను. శ్రద్ధగా వినలేదు. మీ కెవరికైనా శ్లోకములు జ్ఞాపకమున్నవా?'

ఉన్నవని ఇద్దరు ముగ్గురు నాలుగైదు శ్లోకములు చదివిరి. ముమ్మకని ఒక్కొక్కటి రెండు మూడు మాటలు చదివించి వినెను. శ్రద్ధగా నాలకించి యాలకించి విరిసిన ముఖముత్రో 'అడా, అడా, ఎన్న తెలివి శ్రీనాథభట్టా! ఎన్నాళ్ళకు డిండి ముల వ్యాధికి చికిత్స చేయగలవైద్యుడు దొరికినాడు!' అనెను.

వాడు తెల్లనోయి ఏమిటని ప్రశ్నింపగా ముమ్మకవి, 'అవి నిర్దిష్టములు. ఆహా, శ్రీనాథుడు రొంబ ఉపాయశాలి' అని నిర్ధారించెను.

శ్రీ విద్యానగరవిద్వాంసు లెవ్వరు నా కావ్యము కని విని యుండలేదు. కనుక ఈ స్పర్ధాపర్యనసాన మెట్లుండునో యని వ్యగ్రతతో నిరీక్షించుచుండిరి.

గౌడపండితులును వారి యనుయాయులును శ్రీనాథుని నానేక విధముల నిందించుచు, తామ డిండిమునకు సర్వవిధముల బాసటగా నిలుతుమని ప్రకటించుచు, శ్రీనాథుడు తను గౌడ వీథిలో నూరేగ సాహసించినచో, ఆటంకము కలిగింతుమని ప్రగల్భములు పలుకుచు, శ్రీనాథుని శకటాదులు ధ్వంసము చేయుటకు విద్యానుల్లును ఆతని గరిడీవారిని, పూర్ణమనాటి మధ్యాహ్నమునకు గౌడవాటికలో సిద్ధముగా నుండ నేర్పాటు చేసిరి.

నృసింహజయంతి వచ్చినది. ఆనాటితో డిండిమున కిచ్చిన గడువు వైపోవును. ఆత్మాతిశయముతో పైత్యప్రభము కప్పి యున్న డిండిముడు తన అధిక్షేపణపత్రికకు ప్రత్యుత్తర మీయ డని శ్రీనాథు డెరుగును. దానికై యాతడు ప్రతీక్షింపలేదు.

ఆనాడు శ్రీనాథుడు శ్రీ లక్ష్మీనృసింహస్వామిని కలశములో నావాహనచేసి, భక్తిశ్రద్ధలతో పూజించెను. ఆ పూజ ప్రారంభించి నప్పటినుండియు పోతనకు చిత్రమైన యావేశ మావిర్భవింపసాగెను. ఆతనికి డిండిమునియింట జరిగిన యవజ్ఞకు కోపము పోలేదు. బలిచక్రవర్తి నానాడు తలపించినప్పటి నుండి త్రివిక్రమావతారమును ధ్యానింపసాగెను. ఈ నా డాతనికి నృసింహస్వామివిజృంభణము అంతరంగములో పొంగారుచుండెను. పూజావసానమున శ్రీనాథుడు, 'పోతా,

నృసింహమూర్తిని గూర్చి పద్యము లేమైనా చెప్పినావా?' అని ప్రశ్నించెను.

ఆ మాటలు విన్నదే వ్యనభానముగా పోతన ముఖము గూపాంతర మొందినది. హిరణ్యకశిపుని చెండాడుచున్న భీకర సింహాముఖ మావేశించినది. సింహాంద్ర మధ్యరాగమున ఒడలు తెలియని యవస్థలో నీ పద్యము చదివెను.

'చించున్ హృత్కులంబు శోణితము నించున్ధరామండలిన్
ద్రెంచున్ గర్కశనాడికావలులు భేదించున్ మహోవక్షమున్
ద్రుంచున్ మాంసముసూత్క్నిఖండములుగానుష్టాసురున్ ద్రచ్చిద
ర్పించుక్ బ్రేవులు కంఠమాలికలు గల్పించున్ నఖోద్భాసియై'

ఇట్లు చదువుచు, తన చెంపుచేతులతో వేళ్ళను వంచి నఖములు ప్రదర్శించి, ఆవేశముతో ననశుడై, దుగ్గన భుజములపై నొరగెను విద్వాంసు లందరు నిర్విణ్ణులై చూచుచుండిరి. శ్రీనాథుడును మొదట ఒక్కించుక విభ్రాంతుడై యుండి, వెంటనే స్మరించి నృసింహామూర్తిని బ్రహ్మాద్రములు చేసిన స్తవములతో స్తుతించెను.

"నతో స్మ్యనంతాయ దురంతశక్తయే
విచిత్ర వీర్యాయ పవిత్రకర్మణే
విశ్వస్య సర్గస్థితి సంయమాన్ గుణై ఃు
స్వలీలయా సందధతేవ్యయాత్మనే."

* * *

"కోపకాలో యుగాన్తస్తే
హాలోయ మను గోల్పకః
తస్మిన్కాలం పాహ్యుపస్తృతం
భక్తం తే భక్తవత్సల!"

శ్రీదేవి పూజాశంఖములోని అమృతతీర్థము గ్రహించి పోతన ముఖమున ప్రోక్షించి 'తమ్ముడా! లే!' అన్నది. సగము స్మృతి వచ్చి పోతన ఈ పద్యము చదివెను :

"ప్రాభవ మొప్ప నుత్కట కృపామతియై కదియంగ జేరి సం
శోభితదృష్టిసంఘముల జూచుచు బాలుని పాలియందు లో
కాభినుతుండు వెట్టె నసురాంతకు డుద్భట కాలసర్ప భీ
తాభయదానశస్తము ననర్గళ సంగళహేతుహస్తమున్"

ఆ పద్యము చదువుచునే పోతన శాంతముగా కన్నులు తెరచెను. వెంటనే శ్రీనాథుడు వెలిగించి యిచ్చిన కర్పూర హారతి శ్రీదేవి పట్టగా పోతన ఆనందము విరియుచున్న ముఖముతో ఆజ్యోతికిని అది పట్టిన అక్కకును నమస్కరించెను. ఆ పై నాతడే విశేషమును జరుగనట్లే స్వస్థుడై ప్రవర్తించెను.

శ్రీనాథు డానాడు సాయంకాలవేళ శ్రీవిద్యానగరములోని వేదవిదులను ఆహ్వానించి మహావైభవముగా వైశాఖపూజ నిర్వర్తించెను. వారల నాతడు స్వయముగా అష్టగంధములతో వాసించుచున్న శ్రీచందనముతోడను పుష్పమాలికలతోడను అలంకరించి, ధూపదీపములతో నర్చించి, చూతఫలములు సువర్ణములు గల కర్పూరతాంబూలము లర్పించి, నట్టివేళ్ళ

వీవనలతో విసిరి తాపోపశాంతి కావించి, శ్రీ లక్ష్మీ నృసింహా ప్రసాదమును నివేదించి నమస్కరించెను. వారందరు 'అభీష్ట ఫలావాప్తి రస్తు' అని శ్రీనాథుని నాశీర్వదించిరి.

నృసింహ జయంతితో డిండిమున కిచ్చిన గడువు తీరినది. మూడు ఢక్కలు శకటములు అశ్వాదులు మేళతాళాదులు సర్వము సమీచీన మైనవి. డిండిములు ప్రత్యుత్తర మీయ లేదు. రాజపురుషులు కల్పించుకొనలేదు. నిర్ణీతదినమున శ్రీనాథు డుత్సవము జరుపునెడల, తెలుగుగాయడు నగర భటు లను శాంతముగా జరుగుచున్నంతవరకు నూరకుండు డనియు, అల్లరి జరుగున ట్లున్నచో వెంటనే తనకు వేగరిచే వార్త పంపి, తాను వచ్చువరకు ఉభయపక్షములను తొందరచేయ వద్దనియు శాసించెను.

పూర్ణిమ వచ్చినది. శ్రీనాథు డా మధ్యాహ్నవేళ మహే శ్వరు నారాధించెను. మూడు ఢక్కలను పంచామృతములతో సంస్కరింపజేసెను. ఈశ్వరునకు ఆత్మప్రదక్షిణ నమస్కారము లొనర్చిన పిమ్మట రాజోపచారముల సమయములో 'వాద్యం సమర్పయామి' అనుచు వాదకులచే మూడు ఢక్కలు వాదింప జేసి ఆ విజయఢక్కానాదము మహేశ్వరున కర్పించెను.

అందరు సుష్ఠుగా భోజనములు కావించి యించుక తడవు విశ్రమించిరి.

అంతట ఊరేగింపు సాగినది. ముందు నట్టువకత్తెలు బలినిగ్రహము కీర్తించు గీతము లాలాపించుచు నృత్యము చేయుచు నడచుచుండిరి. వారి వెనుక ఆడగుర్రములు పూంచిన

శంఖాకారశకటముపై బంగరుషక్కు మోయించువారు తరలిరి. దానివెంట వృషభములు పూన్చిన చక్రాకృతికల శకటమున వెండిషక్కు మొరయుచుండెను. దాని తర్వాత ధనురాకారము గల శకటముపై కంచుషక్కు మోగించు చుండిరి. అది సరిగా డిండిముని కంచుషక్కు వలెనే ఉండెను. దానిని కంచర గాడిదలు లాగుచున్నవి.

ఆషక్కు లిట్లు మ్రోయుచుండ ఉద్ఘోషకులు సంస్కృత ప్రాకృత కర్ణాటాంధ్రభాషలలో శ్రీనాథుని విజయమును డిండిముని పరాజయమును బిగ్గరగా చాటుచుండిరి'-శ్రీనాథ భట్టు జయించినారు. షమ షమా! అరుణగిరినాథు లోడినాము షమషమా! గొడ డిండిమ డిండిమము శ్రీనాథహస్తగత మైనది షం షం!'-

ఆ వెనుక శ్రీనాథభట్టు పోతన దుగ్గనల కైదండ గొనుచు, మిత్ర పండితులతో వికసితముఖుడై సల్లాపించుచు పాదచారియై వెళ్ళుచుండెను. అందరు నాగరక వేషములు ధరించిరి.

అంతటికిని ముందు మహాగద ధరించి పర్వతమల్లును వెనుకను ఇరువైపులను ఆతని శిష్యులును నడచుచుండిరి. అశ్వారూఢులైన శ్రీ విద్యానగరరక్షకులు కూడ నా యుత్సవ మున కపూర్వశోభ చేకూర్చిరి.

అట్లు వారు నివసించుచున్న వీధిలోనను ప్రక్కవీధుల లోను ఉత్సవము శాంతముగా గడచినది. ప్రతివారును

ఇండ్లలోనుండి బయటికివచ్చి చూచి, ఆశ్చర్యవిభ్రాంతులై గుసగుసలాడుచుండిరి.

కర్ణాటబ్రాహ్మణవీధి చేరునప్పటికి ఇండ్లలోనుండి ఇంచుక కలకలము సాగినది. లింగనచయనుల మందిరము వచ్చెను. శ్రీనాథుడు లోని కేగి, చయనులకును, ఆయన భ్రాతాగ్నులకును వందన మాచరించెను. చయను లెంతయు సంప్రీతి నొంది, శ్రీనాథుని వీథిలో నిలిపి, తన చిన్నికుమార్తెలు స్వాహా, స్వధా యనువారిచే మంగళహారతి ఇప్పించెను. అది చూచి ఆ వీథి యంతట ఇంటింటను గర్ణాటకస్త్రీలు కన్నుల పండువుగా నచ్చి శ్రీనాథునకు మంగళహారతులు పట్టిరి.

ఇప్పు డాయుత్సవము గౌడడిండిము లుండు గౌడబ్రాహ్మణ వీథిని సమీపించినది. గౌడవీథిలోనుండి పెద్దగా కేకలు వినసాగినది. వెంటనే నగరభటులు కటకపాలునకు వేగరిచే వార్త నంపి శంఖనాదములు చేసిరి.

శ్రీనాథుడు శాంతముగా నడచుచుండెను. పోతన దుగ్గనలు ఉత్సాహముత్రోగ గంతులిడుచుండిరి. మేళముల వారు ఢక్కా శకటవాహులు వందిమాగధులు జంకుచుండిరి.

గౌడవీథిలో పర్వతమల్లు పది యడుగులు వేసినంతనే గదాధరులైన విద్యామల్లుడు నతని శిష్యులు గదల త్రిప్పుచు, నాటోపముగా నెదురైరి. అంతవరకు భుజమునైనున్న పర్వత మల్లు గదయు లేచినది. విద్యాపర్వతుల గదలు కలియుటకు సిద్ధముగా నుండెను. రెండువైపుల గందరగోళముగా కేకలు వేయుచుండిరి.

చప్పున శ్రీనాథుడు ముందుకు పరువెత్తి నల్లురమధ్య నిలిచెను. అతడు సామవాక్యములతో పర్వతనులు గదను నగరరక్షకుల కిమ్మనెను. అత డిచ్చిన పిమ్మట శ్రీనాథుడు విద్యామల్లువంక తిరిగి తన కాగద మియ్మని చేయిచాచెను.

విద్యామల్లు గదకూడ పర్వతమల్లు గదవలెనే మిక్కిలి బరువైనది. శ్రీనాథు డది మోయలేడను ధీమాతో విద్యామల్లు రెండుచేతులతో తన గదను శ్రీనాథున కందిచ్చెను. శ్రీనాథుడు దాని నవలీలగా ఒంటిచేతితో గ్రహించి రాజ భటుల కందించెను. అదిచూచి విద్యామల్లు నిర్ఘాంతపడి, శ్రీనాథుని పాదములంటి నమస్కరించి. తా నడ్డము తొలగి తన శిష్యులు నందరినిగూడ ప్రక్కకు తప్పుకొను డనెను. ఇప్పు డావల గొడబ్రాహ్మణులును వారి యనుయాయులునే మిగిలిపోయిరి.

మరల నట్టువకత్తెలు గీతనుందుకొని ముందుకు అడుగు పెట్టుచుండిరి. ఒక్కమ్మడిగా గొడులు వారిపైబడి మృదంగ ములు, తాళిములు, తిత్తులు లాగికొనబోవుచుండగా, నగర రక్షకులు అడ్డము వచ్చి, మేళముచుట్టును చక్రాకారముగా నిలిచి ప్రక్కకు తీసికొనిపోయిరి.

గొడు లంతట దారస్యముగా ఠక్కాశేకటములపై బడ బోవుచుండిరి. వెంటనే వెనుకనున్న ఆంధ్రపండిత బృందము వారి నడ్డగించెను. కొంత తడవు అటు వాటును ఇటు వీరును కేకలు పెట్టుచుండిరి. కోపావేశముతో వారు పలుకుచుండిన దూషణవాక్యము లేవో స్పష్టముగా తెలియరాకుండెను.

ఉభయపక్షములను చేతులనున్న కొమ్మ్నాచెంబులు హస్తము లతోపాటు పైకి లేచుచుండెను. లక్ష్మనసూరి తన కొమ్మ్నా చెంబును చేతనున్న సన్నని యంగవస్త్రమునకు ముడివేసి చక్రాకారముగా త్రిప్పుచు, ప్రాకృతభాషలలో నరచుచు ముందుకు దూకెను.

శ్రీవిద్యానగరములో బ్రాహ్మణు లట్లు కొట్లాటకు దిగుట యసుదు. అందును పండితుల కొట్లాట యశ్రుతపూర్వము. సాధారణముగా ఆ నగరమున రాజభటులు పై అధికారుల యాజ్ఞ లేనిది బ్రాహ్మణులపై చేయిచేసుకొనుటకు సాహసింప కుండిరి. భటు లుభయపక్షములను బ్రతిమాలుచుండిరి.

సరిగా చేతులు కొమ్మ్నాచెంబులు కొమ్మ్నాచెంబులు కలియుటకు సిద్ధముగా నున్న సమయమున మహావేగముగా కటకపాలు డాశ్వికభటులతో వచ్చి, గుర్రము దిగి, రెండు బృందముల మధ్యను దర్పముగా నిలిచి, రెండుచేతు లెత్తెను. అంతే! రెండు పక్షములు నిశ్శబ్దము లయ్యెను.

ముం దాతడు గౌడులవైపు తిరిగి, 'ఏమిటే యల్లరి?' అని ప్రశ్నించెను. వారిలో నృగ్ధుడు ముందుకువచ్చి, 'ఆహా! తమరే దయచేసినారు, ఎంత అదృష్టము! శ్రీ అరుణగిరినాథు లకు రెండుతరములుగా డిండిమము విద్యాతిశయగౌరవ చిహ్నముగా శ్రీ విద్యానగరప్రభువులు ప్రసాదించినారుగదా! అటుచూడండి ప్రభూ! ఆ కొండపీటి పండితమన్యుడు, వ్యాకరణములో అ ఇ ఉణ్ణులు రాని శుంఠ, డిండిమ భట్టారకు లను జయించినానని అవహేళనచేస్తూ మూడు ఢక్కలు

ప్రమోగించుకొంటూ, పీఠుల వెంట ఎట్లా ఊరేగుతున్నాడో చూడండి, ఈ ఖుజ్జాకోసు! వానికి ఇని ఎనరిచ్చాకో కను క్కోండి! వాటిని వెంటనే పగులగొట్టి పారవేయించండి: ప్రభూ!' అనెను. వెనుకనుండి గొడుగులు – 'అట్లా' 'అట్లా' అనుచు సంతోషముతో వెర్రికేకలు వేసిరి.

కటకపాలు డప్పుడు శ్రీనాథుని వంకకు తిరిగి 'ఏమి టీ డిండిమూడంబరము కవీశ్వరా?' అని ప్రశ్నించెను. శ్రీనాథు డలనోకగా, 'మీకు తెలియని దేమున్నది. మీకు ముందు గానే ఈ విధముగా డిండిముల ఓటమి చాటుచు ఊరేగుదు మని పత్రము ప్రతి పంపుకొంటిమి గదా! మామానసోల్లా సము తప్పులతడక బూతులబుంగ అని అధిక్షేపించి, పండిత సభలో నిలిచి సమర్థించుకొనలేనప్పుడు, నేము గెలిచినట్లు ప్రకటించుకొనుటకు మాకు అధికారము లేదా? ఇప్పటికైనను, డిండిములు పండితసభ కంగీకరించునెడ ప్రస్తుత మీయుత్త వము నిలిపి సభాపర్యవసానము నిరీక్షింపగలము!' అనెను.

తెలుగురాయడు, ఉభయపక్షముల పండితులకు నమస్క రించి, 'మీ బోంట్లు ఇట్లు చేతులు కలుపుకొని వీధిలో కొట్లాడుకొనుట ఎవ్వరికిని గౌరవప్రదముకాదు. క్షేమముకూడ కాదు' అని యాదేశించెను. అంతట తనభటుల నక్కడనే నిలిపి అశ్వారూఢుడై, డిండిముల మందిరమున కరిగి కొలది సేపు సంప్రదించి వచ్చి, శ్రీనాథునితో నిట్లనెను. 'మీరు కోరినట్లు త్వరలో పండితసభ చేయించుటకేర్పాటు చేయిం తును. శ్రీ దేవరాయచక్రవర్తుల సమక్షమునసే సభ జరిపించు

టకు యత్నించెదను. నియమములు, సభాసమయము, ప్రభువులతో విన్నవించిన పిమ్మట ఉభయులకు త్వరలో తెలిపెదను.'

'ధన్యోస్మి! మహేశ్వరుడు మీకు సర్వమంగళములు ప్రసాదించుగాక!' అని శ్రీనాథుడు తెలుగురాయని నాశీర్వదించి, తన యుత్సవజసమును నిశ్శబ్దముగా మరియొక వీథిని విడిదికి పోవ నాజ్ఞాపించెను. గౌడులు తమకు మహావిజయము చేకూరినదని సంతోషముతో పెద్దగా మాటాడుకొనుచు తమ తమ గృహాములలోని కేగిరి. అప్పుడు సూర్యుడస్తమింప బోవుచుండెను.

ఆ నాటి ఊరేగింపు పర్యవసాన మేమగునో తెలిసికొను తహతహతో. ప్రక్క వీథులలో చేరి యంతనంతకు తొంగి చూచుచున్న యునకవులు ఇప్పుడొక్కరొక్కరే శ్రీనాథుని విడిదికి చేరుకొన సాగిరి. కొంతసడికి నారణప్పతో కలసి ముమ్మనకవి వచ్చి శ్రీనాథుని నభినందించి, 'శ్రీనాథభట్టా, ఇప్పుడైనా మమ్ము ఆ మానసోల్లాసకావ్యము రెండు కళ్ళతో చూడనిత్తువా?' అనెను. శ్రీనాథుడు నవ్వుచు, 'అవశ్యము, మీ కెప్పుడు చూపనంటిని?' అనుచు ఒక ప్రతి దుగ్గనచే తెప్పించి ఇప్పించెను. అప్పటికి నూరు ప్రతులు విడిదిలో సిద్ధముగా నున్నవి.

ముమ్మనకవి శ్రద్ధగా చదివి, 'ఎంత నేర్పుగా డిండిమును మోసము చేసితివయ్యా!-ఒక్క-వ్యాకరణ దోషము లేదే.

అద్భుతము, హవుసు!' అని శ్లాఘించెను. యువకవులు సగౌరవముగా శ్రీనాథునకు నమస్కరించి సెలవు తీసికొనిరి.

ఆ సాయంకాలము నారణప్ప పోతన దుగ్గనలు కలసి తుంగభద్రాతీరమునకు వాహ్యాళి చనిరి. వా రా రాత్రి ప్రొద్దు పోయిన తర్వాతగాని విడిదికి రాలేదు. నారణప్ప తన క్రొత్త మిత్రద్వయముతోపాటు విడిదిలోనే భుజించెను. అర్ధరాత్రము దాటువరకు భావికవితా ప్రస్తావములతో వారు ఉత్సాహోనందములతో ప్రసంగించుకొనుచు గడపిరి.

ఆ సాయంకాలమునకే అరుణగిరినాథుని కుమారుడు రాజనాథుడు దూరదేశయాత్ర నుండి తిరిగి వచ్చెను. ఈమధ్య జరిగిన గందరగోళము తెలిసికొని, వెంటనే తండ్రినడిగి తీసికొని, మానసోల్లాస కావ్యము శ్రద్ధగా పఠించెను. అది చదువు చుండగనే ఆతని ముఖము వివర్ణము కాజొచ్చెను. అయ్యో, తాతపాములు తొందరపడిరి _ సరిగా నేను ఈసమయములో దేశాంతరము పోవుట ఎంత పొరపాటు! ఈ శ్రీనాథుడు మిక్కిలి కుటిలుడు. ఈ చిక్కులోనుండి బయటపడు టెట్లు? ఇట్టిమీమాంసలతో నాతడా రాత్రి సరిగా నిద్దుర పోలేదు.

ఆ రాత్రి పోతనకు శ్రీనాథుడు చమత్కారచంద్రిక చదివెనో లేదో యను ప్రశ్న యాకస్మికముగా తోచెను. ఆమునునాటియుదయమున శ్రీనాథుని నేకాంతమున దర్శించు నవకాశము లభించినంతనే, ఆతడు 'మీరు చమత్కార చంద్రిక చదివితిరా?' అని ప్రశ్నించెను. శ్రీనాథుడు పరాకుగా నుండి యాకోశ మింతవరకు విప్పలేదు. ఇప్పుడు పోతన స్మృతికి

తెచ్చినంతనే శ్రీకృష్ణభగవానుని ప్రబోధముగా భావించి, వెంటనే యాగ్రంథపఠన మారంభించెను.

౧౭

శ్రీ విద్యానగరము శ్రీ విద్యారణ్య భారతీస్వాముల నారాయణస్మరణముతో ప్రతిష్ఠింపబడిన దాదిగా సర్వవిద్యా నిలయమై విలసిల్లినది. సమస్త శాస్త్రములలోను, సర్వవిద్యలందును ప్రవీణు లందరు ఆ నగరమునకు దిగంతములనుండి వచ్చి స్థిరనివాసము లేర్పరచుకొనుటచేత నేమి, అట్టివారు తరచుగా వచ్చిపోవుచుండుటచేత నేమి, అది భారతీయ సంస్కృతికి అద్వితీయమగు స్థానమయ్యెను. ధర్మనిష్ఠగల తురీయాశ్రములు రాజగురువులై జగదాచార్యులుగా నుండి శాసించుచుండుటవలన, అక్కడి విద్వాంసులు జల్పనాదమును వితండవాదమును సహింపకుండు సదాచారమునకు అలవాటుపడిరి. దేశాభిమానములును, శాఖాభిమానములును, కులాభిమానములును వారిధర్మనిర్ణయములకు అడ్డు రానీయకుండుట అక్కడ సంప్రదాయముగా నిలిచినది. విద్వాంసులు ధర్మేతర సిద్ధాంతములు చేయ యత్నించుటకు సాహసింపకుండిరి. వివాదము తటస్థించినప్పుడు విద్వాంసులు నిష్పక్షపాతముగ నిర్ణయించుట పరిపాటి యైనది.

శ్రీనాథునితో చెప్పినట్లు, కటకపాలు డా మరునాటి యుదయమునసే శ్రీ దేవరాయ సార్వభౌములను దర్శించి, శ్రీనాథ

డిండిముల వివాదవిషయము మనవి చేసెను. దేవరాయలకు తన విద్యాధికారియగు డిండిములయందు నిశేష గౌరవప్రపత్తులున్నవి. అయినను శ్రీనాథుని విద్వదతిశయముగూడ కటక పాలనివాస దెలిసికొని, వారి వివాదనిర్ణయము తన సమక్షము నందే జరిపింప నాజ్ఞాపించెను. దేవరాయలు స్వయముగా సహృదయుడును, బహుభాషాసాహిత్యవేత్తయు, అనేక శాస్త్రములలో గాఢప్రవేశము కలవాడును కావున, ఈ విద్యా వినోదము దర్శించు నవకాశము సంభవించినందుల కెంతయు నానందించెను. డిండిములే తప్పక జయింతు రని యాయన విశ్వాసము. అయినను అంతకంటె నధికప్రతిభ శ్రీనాథుడు ప్రదర్శింపగలిగినచో నానందించుటకును సిద్ధపడెను.

శ్రీ దేవరాయలే సభకు సమ్మతించినందున సభాసన్నాహములు శీఘ్రముగా జరిగిపోయినవి. వైశాఖ బహుళ సప్తమి నాటి యుదయమున జాముపేళకు సభాప్రారంభమునకు నిర్ణయము జరిగెను. వెంటనే ప్రతికక్షు లిద్దరికి వార్త చేర్చిరి. ఆసభకు విద్యా వినోదులగు మంత్రి సామంత దండనాథులకే కాక, శ్రీ విద్యానగరములోని ప్రముఖ విద్వాంసులకును, కవులకును ఆహ్వానములు పంపిరి. శ్రీనాథునకు తనవెంట నిరునది మందిని సభకు తెచ్చుకొనుటకు అనుమతిపత్రములు చేరినవి.

సభాసమయమునకు రెండు గడియలు ముందుగనే శ్రీనాథుడు తనమిత్రులతో సభాస్థానమునకు చేరికొనెను. ఆత డాలోచించి తానుమాత్రము ఆంధ్ర శ్రోత్రియవేషముతోడనే సభకు పోవ నిశ్చయించెను. తక్కినవారు నాగరిక వేషములు

ధరించిరి. పోతనయు, మగ్గనయు తమ్ము తీసికొని పోవునో పోడో యని బిక్క మొగములతో అక్కడ నొద్దనుండిరి. వారిని సిద్ధము కండని శ్రీనాథు డన్నంతనే పొంగిపోయి అరగడియలో ముసాబె బయలుదేరిరి.

ఆవల నక్కే అకుణగిరినాథుడును, తనకుమారుడగు రాజనాథునితోడను, మిత్రపండితులతోడను ముందుగనే సభాస్థానము చేరికొనెను. ఆతడు యథాప్రకారము శ్రీవిద్యానగర రాజపురుషవేషము ధరించియుండెను.

ఆ విద్వత్సభ మహావైభవముతోపాటు మహోత్కంఠతో నుండెను.

నిర్ణీతవేళకు గడియముందుగా శ్రీదేవరాయలు సమస్త సార్వభౌమ లాంఛనములతో, వెండిబెత్తములవారు బారా బములు చేయుచుండ, నందివృాగధుల కైవారములతో, యవన యువతులు వింజామరలు వీన, ఛత్రగ్రాహి శ్వేతచ్ఛత్రము పట్టి నడువ, పగటి దివిటీలు ప్రక్కలను ముందును సాగగా, హెచ్చరికలు, చాంగు సాహులు, హసాదులు, పరిపాటిగా నడుచుచుండ, గజగమనముతో పురోహితపురస్సరముగా సభాస్థలి ప్రవేశించెను. సభాస్తంభము లందరు లేచి నిలువగా, దేవరాయలు భక్తిపూర్వకముగా నా విద్వత్సభకు నమస్కరించి, అనుజ్ఞ తీసికొని, పురోహితుడప్పటికే మంత్రసంస్కారములు చేసిన సింహాసనమునకు వందన మాచరించి, అందాసీను డయ్యెను. వేదవిదులు స్వస్తి పలికిరి. వెంటనే శ్రీ విద్యానగర సభాపతి సభాప్రారంభ మొనర్చెను.

'ఇది శ్రీనాథభట్టు రచించిన మానసోల్లాస కావ్య గుణ దోష మలు నిర్ణయించుటలో నచ్చిన వివాదము తీర్చుటకు కూడిన సభ కావున, దేవరవారి అనుమతితో గుణదోషనిర్ణయము చేయుటకు ఐదుమంది శబ్దశాస్త్రవేత్తలును, ఐదుమంది సాహిత్యవేత్తలును, సర్వతోముఖప్రజ్ఞ కల ఒక మీమాంసకుడు ప్రాడ్వివాకుడుగను, కలసి పరిషత్తుగా నేర్పడుట యుక్తమని తోచుచున్నది. అందులకు ఉభయవాదులకు అభ్యంతరము లేదుగదా!'

శ్రీనాథుడును అయ్యణగిరినాథుడును అభ్యంతరము లేదనిరి.

అంతట నక్కడనున్న పండితులలోనుండి ఐదుగురు వైయాకరణులయు, ఐదుగురు సాహిత్యవేత్తలయు, ప్రాడ్వివాకుడుగా నంద్రభూషక్రియాశక్తి యను మీమాంసకునియు నామములు సభాపతి సూచించెను. వా రందరు శాస్త్ర పారంగతులని ధర్మమూర్తులని ప్రసిద్ధికలవా రగుటచే డిండిములు ఎవరిపేరునకు అభ్యంతరము చెప్ప సాహసింపలేదు. శ్రీనాథు డప్పటికే శ్రీ విద్యానగరప్రముఖవిద్వాంసు లెన రెట్టి వానిం విచారించి తెలిసికొని యున్నందున, ఆతడును నిశ్శంకముగా సమ్మతించెను. వెంటనే సభాపతి ఆ పదునొకండు మందిని ధర్మసభకు నిర్మితములైన స్థానములలో నాసీనులు కండని ఆహ్వానింపగా, వారట్లు చేసిరి.

పురోహితుడు వారందరిముందు నగ్నిహోత్ర ముంచెను. ధర్మసభ్యులు వీరిహోత్రునకు నమస్కరించి, తా మీ వివాద

విషయములు సూక్ష్మముగా పరిశీలించి అగ్నిభట్టారకులు సాక్షిగా ధర్మనిర్ణయము కావింతునని ప్రమాణము లొనర్చిరి.

ఆ తర్వాత ప్రాడ్వివాకు డగు చంద్రభూషక్రియాశక్తి శ్రీనాథుని అనుణగిరినాథుని ఒకరి కొక రభిముఖముగా నుండు నట్లుల ప్రత్యేకాసనములలో కూర్చుండజేసి విచారణ ప్రారంభించెను.

'లేఖిక ప్రమాదములు లేని మానసోల్లాస కావ్యప్రతులు ఎన్ని యున్నవి?' అని ముందాతడు శ్రీనాథుని ప్రశ్నించెను.

శ్రీనాథుడు, 'నా వెంట రెండువందల ప్రతు లున్నవి. అవి యన్నియు నిర్దుష్టములని నా విశ్వాసము. ఐనను వానిలో నాలుగింటిని మాత్రమే నేను స్వయముగా శోధించితిని. ఈ నాలుగింటిలో ఎట్టి లేఖిక ప్రమాదములును లేవని నేను ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఇది నా స్వహస్తలిఖితము. దీనిని శ్రీవిద్యానగర సార్వభౌముల పాణిపద్మముల నుంచెదను.' సభాపతి యాప్రతి నందుకొని శ్రీదేవరాయల ముందున్న వ్యాసపీఠముపై నుంచెను.

"ఇది మా మిత్రులు నృసింహభట్ట లిఖితము" అని ప్రాడ్వివాకున కొక ప్రతి యందించెను. 'ఇది మా మిత్రుడు లక్కనసూరి లిఖితము. మేము అనుణగిరినాథులకు పూర్వము పంపిన ప్రతికి తోడుగా దీనినిగూడ వారుంచుకొనవచ్చును' అని సభాపతి కీయగా నాతడు దానిని డిండిమున కిచ్చెను. 'నాల్గనది నా యొద్ద నుంచుకొనుచున్నాను' అనుచు శ్రీదేవి స్వహస్తములతో లిఖించిన ప్రతి శ్రీనాథుడు తనయొద్ద నుంచు

కొనెను. మరి పదిప్రతులు పరిషత్సభ్యుల కిచ్చి 'వీనిలో నేమైన సందేహములు కలిగినచో ప్రాడ్వివాకుల కిచ్చిన ప్రతినిబట్టి సరిచేసికొన వేడెదను. సార్వభౌముల కర్పించిన ప్రతి యన్నింటికి మాత్రిక' అని శ్రీనాథుడు విన్నవించెను.

శ్రీనాథు డించుక సేపాగి నురల నిట్లనెను. 'మా యందలి అనుగ్రహాతిశయముచే ఇంతమంది విద్వాంసులు సహృదయులు నీ సభకు దయచేసి యున్నారు. వారిలో చూడ కుతూహల మున్నవారికి ఇవి యర్పించుచున్నాను' అనుచు తన వెంట నున్న ప్రతులలో నూరింటిని ధర్మనిర్ణేతల ముందుంచెను. చంద్రభూషక్రియాశక్తి సంతోషితస్వాంతుడై అవి ప్రధానులకును, విద్వాంసులకును, కవులకును 'సాధ్యపాలు'నిచే ♦ పంచి పెట్టించెను.

ఎన్నో విద్వత్సభలలో ప్రాడ్వివాకుడుగా వ్యవహరించిన వానివలెనేగాక, నిస్తంద్రుడుగను ప్రియభాషిగను ప్రవర్తించుచున్న శ్రీనాథునియెడ నక్కడ సమావిష్టులైనవారి కందరికి ప్రీతి యుదయించెను. ముమ్మొకవి సూక్ష్మముగా గనుని ంచుచు, డిండిమములతో పూర్వము వాదమునకు తలపెట్టిన వామనభట్టబాణాదుల తొందర సంభ్రమములతో పోల్చి చూచుకొనుచు నానందించుచుండెను.

ప్రతులందరికి పంచిపెట్టినవెంటనే, ప్రాడ్వివాకుడు శ్రీనాథుని ప్రతిజ్ఞ*ప్రారంభింపుమనెను. శ్రీనాథుడు లేచి భక్తితో ముందు

♦ సాధ్యపాలుడు ధర్మసభలో నిష్పక్షపాత ఇత్యాదులు పాలించు నుద్యోగి.

* ప్రతిజ్ఞ — ధర్మసభలలో ఆనాడు సాంకేతికపదము. నేడు వాది ప్రయింటుకు, ఫిర్యాది కంప్లెయింటుకు, పోలీసు చార్జిషీటుకు తుల్యము.

ఆగ్నిభట్టారకులకు అర్ధనిమీలితనేత్రుడై 'అగ్నిందూత' మిత్యాది వేదమంత్రముతో సుష్ఠుగా నమస్కరించి, పిమ్మట పరిషత్తునకు, ప్రభువునకును, సభకును నమస్కార మొనర్చి, ఇట్లు ప్రతిజ్ఞ చేసెను :

'నేను మా విద్వన్మిత్రులతో కలసి తీర్థయాత్రావినోదినై శ్రీ విద్యానగరమునకు వచ్చుచు, దారిలో ఈ నగరాధిష్ఠాన దైవతమైన శ్రీవిరూపాక్షేశ్వరస్వామి పాదపద్మములు హృదయ పీఠిలో ప్రతిష్ఠించి ధ్యానించి, మనస్సున నుల్లాసము కలిగి నప్పుడెల్ల శ్లోకములు చెప్పుచు, 'మానసోల్లాసము' అను స్తుతి కావ్యమును రచించితిని. ఇక్కడ విద్యాధికారులగు శ్రీ అరుణగిరినాథులు విద్వత్కవు లను ప్రశస్తి వినియున్న వాడ నగుటచే అట్టి పెద్దల పరిక్షోషము కాంక్షించియు, వారి గౌరవార్థమును, దాని ప్రతిగొకటి మామిత్రులు శ్రీ నృసింహభట్లచే అభిప్రాయార్థము వారికి సంపితిని. వారు కొన్ని శ్లోకము లాలకించి అందులో వ్యాకరణదోషము లున్నట్లు సూచించిరట. వ్యాకరణశాస్త్రనిధులగు శ్రీ నృసింహభట్టారకులు వినయ ముతో దోషములు చూపినచో దిద్దుకొందురని మనవి చేసి, తీరికగా చూచుట కా ప్రతి వారికడనే ఉంచి, తిరిగి వారము దినములలో అభిప్రాయార్థము నత్తుమని సెలవు తీసికొని వచ్చిరి.

'మరల వారమునకు నృసింహభట్లు, మరికొందరు ఉద్దండ విద్వాంసులతో కలసి అరుణగిరినాథులను దర్శించి మానసోల్లాసముపై నభిప్రాయ మీయ నర్థింపగా, వారు

మరల నెన్నో శ్లోకములు ఆలకించి, తుదకు బహుపండిత సమక్షమున ఈ మానసోల్లాసము తప్పులతడక, బూతులబుంగ, దోషప్రకరణమునకు ఉదాహరణప్రాయముగా నుండ దగిన కావ్యము అని మా నిశ్చితాభిప్రాయ మని శ్రీనాథ భట్లకు తెలుపుడు అని సెలవిచ్చిరట.

'అందుపై నేను ఆశ్చర్యచకితుడనై విద్వత్సభకు కలసి రావలసిదని యర్థించుచు, వరుసగా రెండు అధిక్షేపణపత్రములు పంపితిని. వాని పత్రులు నాకడ నున్నని. ఇవిగో!' అని వాని నొక్కటొక్కటే చదిని వినిపించి ప్రాడ్వివాకున కిచ్చి మరల ప్రతిజ్ఞ సాగించెను.

'రెండవదానికిగూడ ప్రత్యుత్తరము రానందున దానిలో తెలిపినటు ఊరేగింపు సాగించితిని. అరుణగిరినాథుల పక్షీయులు ఉత్సవమును మోరకులై యడ్డగించినందున కొల్లాట కానున్న సమయమున సరిగా శ్రీవిద్యానగర కటక పాలుర జోక్యము కల్పించుకొని, ఉభయ పక్షీయులను నియమించి ధర్మప్రభువులగు దేవరవారికి విన్నవించి, ఈ సభ జరుగుట కవకాశము కల్పించినారు.

'ఇప్పటికైనను మించిపోయినది లేదు. అరుణగిరినాథులకు నా చిన్న కావ్యమును పరిశీలించుటకు పుష్కలముగా వ్యవధి నొసంగితిని. వా రందులో దోషములు లేవని ఈ సభాముఖ మున ప్రకటించినచో ఈ యధికరణమును * ఉపసంహరించు కొనుటకు సిద్ధముగా నున్నాను.'

---

* దావా - కేసు -వ్యవహారము.

ఇట్లని శ్రీనాథుడించుక తడవాగెను. ప్రౌఢ్వీవాకుడు డిండిమునివంకజూచెను. ఆతడు మౌనముగానుండెను. శ్రీనాథుడు మరలసాగించెను.

"అట్లుకానిచో నాప్రతిజ్ఞ ఇది. నేనురచించిన మానసోల్లాస కావ్యములో అమణగినాథులు ఒక్క వ్యాకరణదోషముకాని, రసభంగము కలిగించు ఆలంకారికదోషముకాని, చూపి బుజువు చేయగలిగినచో, ఈ కావ్యప్రతులు ఈ సభాముఖమున నగ్నిభట్టారకుల కర్పించి అమణగినాథుల పాదములకు ప్రమొక్కెదను. వారట్లు ఒక్క దోషమైనను బుజువు చేయలేనిచో, తమ కవితాతిశయమును ప్రకటించుకొను కంమఠక్కను నా కర్పించుకొనవలయును!"

శ్రీనాథుని ప్రతిజ్ఞ విని సభ దద్దరిల్లెను. ముందు శ్రీదేవరాయసార్వభౌములే తమ పూర్వులు వారి కుటుంబమునకు ప్రసాదించిన గౌరవచిహ్నమును అర్థించుచున్న శ్రీనాథుని పణమునకు చకితులైరి. మరల వెంటనే అందలి సూక్ష్మధర్మము గ్రహించి గాంభీర్యముద్ర వహించిరి.

ప్రౌఢ్వీవాకుడు అమణగినాథుని మీ సమాధానమేమని యడుగగా, "మానసోల్లాసకావ్యము దోషభూయిష్ఠమని బుజువు చేయుటకు సిద్ధముగా నున్నాము. కోరిన పణమునకును సంసిద్ధులమే" అని ఆయన ప్రకటించెను.

ప్రౌఢ్వీవాకుడంతట ప్రమాణనిర్ణయమున కుపక్రమించెను. 'వ్యాకరణశాస్త్రవిషయములలో ఉభయులు మునిత్రయ

మతమే అంగీకరింతురు గదా! లేక అనవసరమును అనుసరించి అన్యమతవ్యాకరణముల నాశ్రయింతురా?' అని యడిగెను. ఉభయులు మునిత్రయప్రోక్తవ్యాకరణశాస్త్రమే పరమ ప్రమాణముగా నంగీకరింతు మనిరి.

అలంకార శాస్త్రవిషయములో ప్రమాణగ్రంథ మేది యని పరిషత్తులోని సాహిత్యవేత్తలతో కొంతవడి సంప్రదించి ప్రాడ్వివాకు డిట్లనెను. 'అలంకారశాస్త్రిమలో ఆచార్యులనేకు లున్నారు. వారందరు పూజ్యులే యైనను, వారిలో తీవ్రమతభేదము లున్నవి. కావ్యాత్మ ఏది యను విషయమే వివాదాస్పదము. గుణములు, దోషములు, అలంకారములు, ఇత్యాదులలో కూడ భిన్నభిన్న మతము లున్నవి. అందు వలన నిష్కర్షగా ప్రమాణభూత మగు గ్రంథ మిది యని నిర్ధారింపలేకున్నాము. సహృదయులే ప్రమాణము అనుట యొకటి మాత్రమే పెద్ద లంగీకరించుచున్నారు. ఈ పరిషత్స భ్యులను ప్రమాణభూతులగు సహృదయులనుగా ఉభయ వాదులు నంగీకరింతురా?'

అరుణగిరినాథుడు తన వాగ్ధారతో శ్రీనాథుని బెదరగొట్ట వలెనని యుద్దేశించి. భరతమునినుండి ఆచార్యదండి భామహుడు వామనుడు ఆనందవర్ధనుడు ఉద్భటుడు మమ్మటుడు రాజశేఖరుడు రుద్రటుడు ఇత్యాదులను, అగ్ని పురాణమును వేరొకని మధ్యమధ్య వారివిశేషము లుపన్యసించుచు, 'మేము నైయాయికులము, శబ్దమునకు వ్యంజనాశక్తినే అంగీకరింపము, దోషములు నిర్ణయించుటకు న్యాయ

శాస్త్ర విచారణ కూడ అనవసరము' అన్నట్లు సూచించెను. ఆయన చెప్పినదానికంటెను చేసిన సూచనలకంటెను, దడదడ లాడించు వాక్ప్రవాహమే ప్రధానముగా కనిపించెను. శ్రీనాథుడా ధాటికో మునిగిపోయి, ప్రత్యుత్తరమే చెప్పజాల డని యాతడు తలంచెను. పలువురు సభాసదులుకూడ భావించిరి.

అంచుకు తగినట్లే శ్రీనాథుడు నట్టునట్టుగా ప్రారంభించి మాటలు తడవుకొనుచున్నవానివలె సాగించెను. మాట నెమ్మదిగా నున్నను భాషలో నెట్టి పొల్లుమాటయు రాలేదు. ఆయన ప్రసంగ సారాంశ మిది.

'అనుణగిరినాథులు ఉదాహరించిన సాహిత్యాచార్యులేకాక నేటివరకు మరియెందరో ప్రామాణిక గ్రంథకర్తలున్నారు. సర్వజ్ఞసింగభూపాలకృత రసార్ణవసుధాకరము, సర్వజ్ఞసార్వభౌమ పెదకోమటి వేమభూపాల రచిత సాహిత్యచింతామణి, కాళీశ్వర మిశ్రుల రసమంజరి. వారి శిష్యులగు విశ్వేశ్వరదేశికుల గ్రంథముకూడ నేము చూచి యున్నాము. అంతేకాదు, స్వతఃప్రమాణమైన శ్రుతియందే సాహిత్యసిద్ధాంతములు సూచించు వాక్యము లున్నవి. ఇట్లనుచు శ్రవణరసాయనముగా శ్రుతివాక్యములు పఠించి సభవారిని పులకింపుల గావించెను. నేమును న్యాయవైశేషికసాంఖ్యశాస్త్రములు ఎరుగని వారము కాము. అవి ఆస్తికేతరుల చేతులలో బడి నాస్తికదర్శనము లను నప్రతిష్ఠ పాలైనవి. కావున పూర్వోత్తరమీమాంసలలో నిధి యైన శ్రీచంద్రభూషక్రియాశక్తుల వారు ప్రాధ్వనాకులై

నడుపుచున్న ఈ విద్వత్పరిషత్తుకు ధర్మనిర్ణయము చేయుట కష్టముకాదని భావింతును. శ్రీఅరుణగిరినాథులు ఉద్ఘాటించిన కేవల నైయాయికమతమే ప్రమాణముగా నంగీకరించు నైడల వైయాకరణుల స్ఫోటవాదమునకును, పలువురు సాహిత్యాచార్యులు అంగీకరించిన రససిద్ధాంతమునకును, ధ్వని ప్రస్థానమునకును స్వస్తిచెప్పనలసి వచ్చును. అందునల్లనే-'

శ్రీనాథుని మాటలు పూర్తి కావింపకయే, డిండిముడు హుంకరించుచు 'మా గౌడులకు ప్రాణపదమైన న్యాయమునే కాదందువా?' అనుచు, ఇతరమతములను ఖండించు న్యాయ శాస్త్ర సిద్ధాంతములను, హిమాలయములలోని అలకనందా ప్రవాహవేగము గల వాక్కులతో నుద్ఘాటించెను.

శ్రీనాథు డది చిరునవ్వుతో నాలకించి, ఆత డాగినదే తడవుగా, న్యాయశాస్త్రమును నిరాకరించిన వ్యాసభగవానుల బ్రహ్మసూత్రభాగమును అందుపై శ్రీ శంకరభగవత్పాదుల భాష్యములోని యుక్తులను ఉటంకించి 'ప్రామాణికులందరు న్యాయశాస్త్రమును ఖండింతురు. తన్మతఖండనమునకే నే నా శాస్త్రము ఆమూలాగ్రముగా పఠించితిని. మా యాంధ్ర దేశములో న్యాయశాస్త్రము నేర్చినవాడు ఉత్తరజన్మలో సృగాలములై జన్మింతు రని శిష్టులు విశ్వసించి ఉత్తర మీమాంసాధ్యయనముతో తద్దోషశాంతి చేసికొనుచున్నారు. ఈ పరిషత్తులో పుణ్యమూర్తు లున్నారు. సుష్ఠుగా శబ్దస్వరూప మెరిగి ప్రయోగించి కామదోగ్ధుల పొందగల శబ్దశాస్త్ర వేత్తలు, అఖండ స్వప్రకాశానందచిన్మయ రసస్వరూప

మాకళించుకొన్న సాహిత్యవిదులు వేదవేదాంతసత్య విచారణ మెరింగిన మీమాంసకులు నై, వీకాదశరుద్రులవలె ప్రకాశించుచున్న ఈ పరిషత్సభ్యులతో పాటు అపవిత్ర జన్మాంతరములు గల నైయాయికులను గూడ కూర్చుండ బెట్టనలె నని అహోబిలనాథుల యాశయమా? సభాపతులు పరిషన్నిర్ణయము చేయునప్పుడు అభ్యంతరము చెప్పక ఇప్పుడీ నవీనతర్కము చేయువారి న్యాయజ్ఞానము నేమనవలెనో తోపకున్నది'-ఈ తాత్పర్యముగల వాక్యజాలము శ్రీనాథుడు పలికెను. అందులో ఖండనబలము ఎత్తి పొడుపులకంటెగూడ ఆతడీ మారు ప్రదర్శించిన వాగ్వైఖరి అందరిని ఆశ్చర్యచకితుల గావించెను.

కొంతతడ వీలు, కొంతతడ వలు, అహోబిలనాథ శ్రీనాథుల వాగాడంబరము రెండు చోట్ల స్పర్ధతో పలికించు ఆవృత్తములు వలెనే మొరసెను.

డిండిముడు రోషించి భుజంగమువలె రోజుచు, మరింత తొందరగా మాటాడబోయి అలసి మధ్యమధ్య నట్టుపడుచు దూషణమున కుపక్రమించెను.

'దూషణనే అహోబిలనాథులు వాంఛించునెడల నాకును చేతకాకపోలేదు. అట్టిదానితో నేను దేవభాష నపవిత్రము చేయను' అనుచు శ్రీనాథుడు ఇంతవరకు ప్రయోగించుచున్న సంస్కృతభాషను ఉజ్జగించి, శౌరసేనిలో కొంతసేపు, మహారాష్ట్రి ప్రాకృతములో కొంతతడవు, మాగధి మొదలగు వివిధప్రాకృతములు కూడ నెత్తుకొని సంస్కృతములో వలెనే

ధారాళముగా నుపన్యసించి, తుదకు నురల సంస్కృత మందు
ఱొని, 'ఈ సభ న్యాయశాస్త్రచర్చకు సమావేశను కాలేదు.
నూనసోల్లాస మను స్తుతికావ్యములోని గుణములుశుష్కతర్క
ముఖ్ అనుణగిరినాథులు ఖండింప దలంతురా? అంచుల కే
కాశ్మీరమహాకవి శిల్హణభట్టు నైయాయిక నైషేషికులను
గూర్చి యిట్లన్నాడు:

"నైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం న భ్రాతరం ఛాందసమ్
దూరాత్ సంకుచితేవ గచ్ఛతి పుమాఁ చండాలవత్ తార్కికమ్
కావ్యాదే నిపుణం నపుంసక మితి జ్ఞాత్వా నిరస్తాదరాత్
కావ్యాలంకరణజ్ఞ మేవ కవితాకన్యా వృణీతే స్వయమ్."

అనుచు శ్లాఘ్యముగా చదివి శ్రీనాథుడు విరమించెను.
బిల్హణుని శ్లోకముల్లో నాతడు చేసిన కొలదిమార్పులు పలు
వురు గమనింపలేదు. గమనించినవారు ఆతని సమయస్ఫూర్తికి
సంతోషించిరి.

రోషారుణనేత్రుడై డిండిము డందుకొన బోవ్రచుండెను.
ప్రాడ్వివాకుడగు చంద్రభూషక్రియాశక్తి సింహతిలాటములతో
మనోజ్ఞుడగు తను దక్షిణకర మెత్తి ఉభయబాహులపై రూక్ష
దృష్టి ప్రసరింపజేసెను. ఆ సంజ్ఞ యంకుకొని సాశ్వపాలుడు
డిండిమునిని శ్రీనాథుని సూనాము నహింపుడని పెద్దగా నుద్ఘో
షించెను, అంతట ప్రాడ్వివాకు డిట్లు పలవించెను:

'ఇక్కడ మేము ఈ ధర్మాసనము తీసినది మీ మీ
వాగ్గాకలు పరీక్షచేయుటకు కాదు. అవి ప్రాకృతులయెడ
ప్రదర్శింతుము గాక! మీ కెక్కువ తీసికలేదు. మా ముందు

ఈ మానసోల్లాసకావ్య మున్నది. దీని గుణదోషములు మే మిప్పుడు నిర్ణయింపవలె! న్యాయవైశేషికముల ప్రసక్తి ఇక్కడ లేదు. మీ యుభయులను ఇకముందు దారితప్పి ప్రసంగింప వద్దని ప్రస్తుతము వేడుకొనుచున్నాము. ఈమారు శాసింప వలసినచ్చును. ఈ కావ్యగుణదోషములగూర్చి ఈ ధర్మ పరిషత్తుచేయు నిర్ణయము సమగ్రులగు సహృదయులు చేయు నిర్ణయముగా మీరిద్దరు నంగీకరింపదలచితిరా, కాక ధిక్కరించెదరా?'

శ్రీనాథుడు వెంటనే యంగీకారము తెలిపి, ప్రతికక్షి త్రీసిన యపమార్గములలో పడినందులకు చింతవ్యక్తము నానెను. అరుణగిరినాథు డించుక తటపటాయించెను గాని పరిషదాదేశ మును ధిక్కరించు సాహసము లేక అంగీకరించుట నసక తప్ప లేదు. అప్పుడు చంద్రభూషక్రియాశక్తి ఇట్లు నిర్ణయించెను :

'మా పరిషత్సభ్య లింకను ఈ కావ్యము పఠింపలేదు. అందులకు రేపటి యుదయమువరకు మాకుగూడ వ్యవధాన మనసరమే. రేపటి సభకు వచ్చినప్పుడు శ్రీ అరుణగిరినాథులు ఈ కావ్యములో దోషము లేమున్నవో, వరుసగా సంఖ్యలు వేసి సంగ్రహముగా వ్రాసిన పత్రము మా కందించి, సభవారికి వినిపించి దాని ప్రతి యొకటి శ్రీనాథుల కిప్పించవలెను. అట్లే శ్రీనాథులు వారి సమాధానములు వ్రాసి యిచ్చుటకు మరు నాటివరకు వ్యవధాన మిత్తుము. ఆ పిమ్మట నేటికి మూడవ నాడు ఎవరి వాదపత్రికను వారు సమర్థించుకొనుచు ఉభయు లును వాదించుటకు అవకాశ మిచ్చెదము. మీ వాదములు

తీరికగా వింధుము. వాదములో పూర్తియైన మునుపాటి యుదయమున శ్రీ ప్రభువువారికి మా పరిషన్నిర్ణయము నివేదింతును. ఉభయవాదులను పత్రికలలోగాని వాదములలో గాని కేవలవాగాడంబరము పరిత్యజించవలెనని మరియొక మాట హెచ్చరిక చేయుచున్నాము!'

దేవరాయలు ఇతర సభాసదులతోపాటు అరుణగిరినాథ శ్రీనాథుల వాగ్వాటికి వినోదించినట్లే, శ్రీ చంద్రభూషక్రియా శక్తి సూక్ష్మ నిశ్చలబుద్ధికిని ఎంతయు సంతసించిరి. శ్రీ విద్యా నగరరాజ్య చక్రవర్తుల రాజలాంఛనములతో మర్యాదలతో నానాటి సభ ముగిసెను.

శ్రీనాథుడు తన మిత్రులతో రాజవీథిలోనికి రాగానే ఇతరమిత్రు లెందరో ఎదురైరి. మున్నాకవి శ్రీనాథునివైపు ప్రీతివిలోకనముతో చూచి పలుకరించి వెళ్లెను. ఒక ప్రక్క నుండి వినుకొండ నల్ల భరాయడు తనవెంట పంట మైలారు రెడ్డిని తీసికొనివచ్చి, 'శ్రీనాథభట్టా, మా విద్యానగరములోని పరిషద్భవనము మీకు నచ్చినదికదా! నాకంటెగూడ ఎక్కువగా మీ శృంగారనైషధమును సప్తశతిని అభిమానించు మా మిత్రుడు పంటమైలారురెడ్డి ప్రభువు లిటుగో! మీ కావ్యములు మూలములకు మెరుగు పెట్టిన వని వాదించుచు వానిపై ఈగ వాలనీయరు. వీరు ప్రబంధపరమేశ్వరుల ప్రాణస్నేహితులగు మల్లారెడ్డి సంతతిలోనివారు' అనుచు పరిచయ మొనర్చెను.

'అటయినచో, 'ఆత్మానై పుత్రనామాసి,' యందుకు కావున పేరే నేటి మల్లారెడ్డి ప్రత్యక్ష స్వరూపులు. మా పితామహులగు కమలనాభులకుగూడ పూర్వకాలపు మల్లారెడ్డి ఆప్తమిత్రులు!' అని శ్రీనాథుడు ప్రాతచుట్టుగికము తిరుగవేయుటచే మైలారుకెడ్డి మరింత సంప్రీతచిత్తుడయ్యెను.

మానసోల్లాస కావ్యము పరిషద్విచారములో వివాదాంశముగా నున్నందున నా రాజపురుషులు దాని ప్రస్తావము తేలేదు.

ఇంతలో బాల్యసఖుడైన అవచిదేవయత్రిపురారి యక్ష రాజు శ్రీనాథుని సమీపించి, 'ఓయి శ్రీనాథా! అప్పుడు రెబట వలె ప్రేలె డుండేవాడవు. ఎంతవాడ వయినావయ్యా!' అని ఆపాదమస్తకము పరీక్షించి గాఢాలింగనము చేసికొనెను. శ్రీనాథుని కానందబాష్పము లంకురించెను. శ్రీనాథుని శరీరమున కస్తూరీ పరిమళము నాత డింతలో గుర్తించి, 'ఏమిటి! నే నియ్యనిదే మా చోడంగి కస్తూరి ఎక్కడ సంగ్రహించినావయ్యా!' అని యడిగెను.

'మీరు వచ్చుచున్నారన్న వార్త ముందు నా కెరిగించిన మీవంటి యాప్తమిత్రమే దీని ననుగ్రహించినాడు!'

విడిదికి రాగానే లక్కనసూరి, 'అయితే మా ప్రాకృతము తిట్లకు వినియోగమని తేల్చినావా!' అని శ్రీనాథు నగ్గించెను. తాతంభట్టు, 'అయ్యయ్యో, మా న్యాయ వైశేషికసాంఖ్యము లను ఈ పేరిశాస్త్రులకు ధారాదత్తము చేయుమందువా?' అని వ్యాజనింద చేసెను.

౧౮

శ్రీచంద్రభూషక్రియాశక్తి ఆధ్వర్యమున జరిగిన యీ యధికరణ విచారణలో, ఆపై నటు డిండిమునకు గాని, ఇటు శ్రీనాథునకుగాని, పామరజనవినోదము కావించు నప్రస్తుత ప్రసంగములు చేయుటకు అనకాశము చిక్కలేదు. ఉత్తమోన్నత న్యాయస్థానమున జరుగు విచారణవలెనే పరమ శాంతముగా సాగిపోయినది.

రాజనాథుని పితృపాదుల తోందరపాటు కెంతయు చింతిల్లినను వారి గౌరవ మెట్లయిన నిలునబెట్టనలె ననునుత్కంఠతో మానసోల్లాసకాన్యము బహుపర్యాయములు పఠించెను. అందలి భక్తిభావ మాతని హృదయమును స్పృశించెను. 'అయ్యో, ఇందులో దోషములు నెనుకనలసినచ్చెను' అను చింతించుచునే గాలించెను. వ్యాకరణదోషములు కనబడలేదు. ప్రమాణగ్రంథము లున్న వ్యాకరణములో లేని దోషములు చూపి సమర్థించుట యసాధ్యము. కనుక, వ్యాకరణదోష ములమాట యెత్తగూడదని తండ్రి కుమారుడు నిశ్చయించిరి. నిర్ణీతప్రమాణములేని ఉద్భటశాస్త్రమే- అలంకారశాస్త్రమే- శరణ్యమని నిర్ధారించుకొనిరి. రాజనాథుడు వెదకి వెదకి కొన్ని దోషముల పట్టిక సిద్ధముచేసి అవి యే యే శ్లోకముల కన్వయించునో వివరించెను. డిండిము డది పరీక్షించి తాను మరికొన్ని చేర్చి, దోషనావములు ప్రసిద్ధగ్రంథములలో

నున్నవిగా గాక మూకుమూల గ్రంథములలోనివి పెట్టి దోషపట్టిక సిద్ధముచేయించి నుకునాథు పరిషత్తు కర్పించి సభలో చదివెను.

శ్రీనాథుడు దాని ప్రతి తీసికొని తన పండిత బృందము ముం దుంచి వారి సాహాయ్యముతో క్లుప్తముగా సమాధాన పత్రిక సిద్ధము చేసెను. బుద్ధి సర్వత్రోముఖముగా చెరచెర ప్రసరించు లక్ష్మీనసూరి ఇందుల్లో శ్రీనాథున కెంతయు నుపకరించెను. మూరుమూలగ్రంథములు తమకు అజ్ఞాతములు కావనుటకై, వానిని ప్రసిద్ధులగునాలంకారికులు ఏనామాంతరము లతో వ్యవహరించిరో ఆ పత్రికలో సూచించిరి. సమాధాన పత్రిక ప్రతులు బహుశతములుగా సిద్ధము చేయించి, శ్రీనాథు డవి శ్రీ దేవరాయప్రభువులకును పరిషత్సభ్యులకును అరుణగిరి నాథులకును మాత్రమే కాక, ప్రేక్షకులకుగూడ నిప్పించెను.

నాలవనాడు వాదసభ జరిగెను. అనాడు డిండిమభట్టు కేసల వాగాడంబరము పరిత్యజించి, తన తర్కకర్కశ సూక్ష్మ బుద్ధి నంతయు ప్రదర్శించి, శ్రీనాథుని సమాధానముల ననేక మార్గములలో ఖండించి, దోషనిరూపణమును సమర్థించెను. సభకు వచ్చిన విద్వద్వ్యులందరు డిండిమభట్టారకు లానాడు విశ్వరూప ప్రదర్శనము కావించిరని వేనోళ్ళ శ్లాఘించిరి.

శ్రీనాథునకూడ ముందు అరుణగిరినాథుల విద్వత్తిశయ మును బుద్ధినైశిత్యమును శ్లాఘించి, అంతటివారిత్తో తన శ్రుతికావ్యమును సమర్థించుటకై వాదింపవలసివచ్చినందు లకు తనచింత ప్రకటించెను. 'అరుణగిరినాథులు మొదటి

దోషముగా తెలిపినది- ఇది క్షుద్రకావ్య మనుటే. ఆలం కారికపండితభాషలో మానసోల్లాసము క్షుద్రకావ్య మను మాట నేనును అంగీకరింతును. క్షుద్రకావ్య మనగా మహా కావ్యము కాదనియే గాని, దోషములు కలదని కాదు. మహాకవి కాళిదాసు మేఘదూతమును క్షుద్రకావ్యమే. ఆలంకారికులకు అభిమానపాత్రములైన శాలివాహన సప్తశతి మొదలగు ముక్తక కావ్యము లన్నియు క్షుద్రకావ్యములే. అధమశృంగారవర్ణనము గల యోగానంద ప్రహసనము కూడా దృశ్యకావ్యకోటిలో క్షుద్రకావ్యముగానే పరిగణనము చేయనలె. స్తుతికావ్యము లన్నియు, మానసోల్లాసమునలెనే క్షుద్రకావ్యములే. అదే మొదటి దోషముగా నెత్తి చూపులలో వారి తొందరపాటు వ్యక్త మగుచున్నది. అయ్యో, వారు తొందరపాటున నోరుజారి యన్నదానిని సమర్థించుకొనుటకు ఎట్టిపాట్లు పడనలసి వచ్చినదో, ఈ మొదటి దోషమే వ్యక్తము చేయుచున్నది. వారు చూపిన తక్కిన దోషములుకూడ నిట్టివే.

ఇదే విధముగా దోషములన్న తక్కిన వానినికూడ దోష ములు కానని శ్రీనాథుడు నిరూపించెను. ఆ నా డాతడు తన వాదములో శ్రీ విశ్వేశ్వరుల చమత్కారచంద్రికలోని యుక్తు లెక్కినగా నుపయోగించుకొనెను. పరిషత్తునకును, సభవారికిని ఆ గ్రంథము అజ్ఞాతపూర్వ మగుటచే, ఆ యుక్తులు వారికి అభినవరమ్యములుగా తోచి ఆశ్చర్యావిష్టుల గావించెను. రస మన్నను, ధ్వని యన్నను, రీతి యన్నను, ఔచిత్య మన్నను-ఏది కావ్యమునకు ఆత్మభూత మైనదని చెప్పుకొన్నను,

రమణీయార్థమును ప్రతిపాదించుచు లోక్తోత్తరచమత్కార ముతో సహృదయహృదయానురంజనము కావించు శబ్దమే కావ్య మని ఒత్తి చెప్పెను. దోషైకదృక్కులకు దోషములుగా భాసించు భాగములలో నెల్ల, గుణవిశేషము లెత్తి చూపి, తనకు విరూపాక్షస్వామియెడ గల భక్తిభావమే తనచే నట్లు పలికించిన దని నిరూపించెను. 'ఈ న్యథావివాదములో చిక్కు కొనకుండి యున్నచో, సహృదయచక్రవర్తియగు అసుణగిరి నాథునకే మానసోల్లాసకావ్యములోని భక్తిభావావేశము హృదయస్పష్టమై యుండెడిది' అనుచు తనవాదము పూర్తి కావించెను.

పరిషత్తువారు వారిద్దరికి మరల మరల వాదించుట కనకాశ మిచ్చిరికాని వారు అనసరము లేదనిరి. వారి వాదములలో మధ్య మధ్య పరిషత్సభ్యులు ఇద్దరిని ఎన్నో ప్రశ్నలువేసి సమాధానము లాలకించిరి. ఉభయవాదులు తాము చెప్పుకో వలసినది పూర్తియైనదని తెలిపిన పిమ్మట పరిషత్సభ్యులలో వైయాకరణసార్వభౌముడు తుదకు శ్రీనాథు నిట్లు ప్రశ్నించెను.

'శ్రీనాథభట్టా, ఈ మానసోల్లాసము అశ్రద్ధగా నాలకించిన వారికి వ్యాకరణదోషములని భ్రాంతి కలిగించు భాగములు కొన్నియున్నవి'—అని కొన్ని చదివి వినిపించి మరల నిట్లనెను. 'అవి శబ్ద దోషములు కావు. అయినను అట్టి దోషాభాసములు కావ్యములో నుండుట కావ్యగుణమునకు ఉత్కర్ష దాయక మనియే మీ యుద్దేశమా?'

ఆ తుదిక్షణమున నడిగిన యీ ప్రశ్న విని శ్రీనాథుడొక్క క్షణకాలము స్తబ్ధుడయ్యెను. యాత్రారంభమున కొంత పీటిలో పదునొకండు దినములు దీక్షగా ఉపాసించిన బ్రాహ్మీ మూర్తిని భక్తిభావముతో ధ్యానించెను. తన కెమరుగా కూర్చున్న పోతన రూపమున వ్యక్తమగు బాలకృష్ణుని దర్శించెను. శ్రీనాథుడు అర్ధనిమీలితనేత్రుడై భక్తితత్పర భావముతోడనే ఈ ప్రత్యుత్తర మొసగెను.

'చిత్తము, ఆర్యా! పండితంమన్యులు అపశబ్దములని భ్రాంతి పడు శబ్దములు విద్వాంసులకు చనుత్కారముగా నుండును గదా! అట్టిది గుణమే యగునుగాని దోషము కానేరదు. అదియు గాక, సర్వజ్ఞుడగు శ్రీ విరూపాక్షేశ్వరస్వామికి భక్తుడ నగు నాబోటి యల్పుడను, ఏనో ఒకటి రెండక్షరములు నేర్చిన గర్వముతో, తగుదు నని స్తోత్రము చేయ సమకట్టితినిగదా! తమ పసిబిడ్డల నచ్చియు రాని తొక్కుపలుకులే, తల్లి దండ్రులకు, పెద్దలకు ప్రీతియే కలిగించునట్లు, జగజ్జనకుడగు శ్రీ విరూపాక్షస్వామియు ఈ శిశువు రచించిన కావ్యమునకు సంప్రీతుడగు నని వ్యంగ్యవిధానమున సూచించితి నని కూడ భావింపదగును.'

ఆ మరునాటికి పరిషత్తు వారి నిర్ణయమునకు సభ వాయిదా పడెను.

తమ యిండ్లకు బోయినప్పటి నుండియు అటు డిండిమునకు తాను గెలువవచ్చునను నాశాలేశమును, ఇటు శ్రీనాథునకు వైయాకరణసార్వభౌముని కడపటి ప్రశ్నకు తా నిచ్చిన

సమాధానము తృప్తి కలిగించెనో లేదో యను భయశేష మును, ఆనహించెను. డిండిమభట్టు బరువు తీరిపోయినవానివలె ఏమైన కానిమ్మనియు, డిండిమము వదలిపోయినచో. ఇంటిలో తనభార్య నిత్యము చేయుచున్న గోలయైన శాంతించు ననుతృప్తితో, నిర్భయముగా నారాత్రి సుఖనిద్రపోయెను.

శ్రీనాథుని కట్టు కాదు. ఆ నిర్ణయముపై తాను బహుసంవత్సరములనుండి చేసిన ప్రయత్నమేకాక, తన ప్రభువు పెదకోమటి వేమభూపాలుడును, సింగనప్రధానియు కనుచున్న కలలును, కొండవీటిరాజ్యము పొడవున తన్ను పూజించి పంపిన మహాజనముల యాశలును, తన ప్రియమిత్రమగు వానున భట్టబాణుని ప్రాణములును, రాజకొండలో విశ్వేశ్వరకని చంద్రుల మానమును, తాను తనపండిత మిత్రులతో ఈయాత్ర చేసి యింతనరకు కావించియున్న పన్నాగములును–సమస్తము నాధారపడి యున్నవి. అది యాతనికి జీవన్మరణసమస్య కంటె గుతరమై హృదయభారము కలిగించెను.

శ్రీనాథు డానా డుపనసించి రాత్రి జాగరణ మొనర్చెను. ఆతి డానా డహోరాత్రము వేదపారాయణము చేయుచు భారతీధ్యానముతో గడపెను. ఆతని ముఖభంగి చూచి ఎవ్వరు పలుకరింప సాహసింపలేదు. ఇన్నాళ్ళును విద్వజ్జనముల ప్రసంగ సల్లాపములతో మాసుమోయుచుండిన కొండపేటి విడిది నిర్మానుష్యమైనట్లు నీరనమై యుండెను.

పరిషత్తు నిర్ణయము ప్రకటింపబోవుచున్న నాటి ప్రాతఃకాలమున, శ్రీనాథుడు సంధ్యోపాసనాదులు ముగించుకొని

గృహదేవతాయతనములో మహాదేవుని యెదుట వినమ్రుడై ధ్యానముచేయుచు నిలుచుండెను. చల్లని యడుగులతో శ్రీదేవి వచ్చి ఓరగా నిలిచెను. శ్రీనాథు డామెను ప్రశ్నించు చున్నట్లు తల యెత్తిచూడగా, నామె వినయముతో నిట్లు ప్రార్థించెను.

'మీ విద్యావిజయ వేళలో మి మ్మొకవరము అర్థింప వచ్చితిని. అరుణగిరినాథుల డిండిమము మీరు గెలుచుకొన్న పిమ్మట, దానినిమాత్రము మన వసతికి తేవద్దు. దాని నేదో పిశాచమో, భూతమో, ఆవేశించియున్న పని పూజ్యురాలగు వారి పత్ని గౌరీదేవి గోలపెట్టు చున్నది.'

శ్రీనాథుడు ప్రేమార్ద్రమైన చూపు ప్రసరింప జేసెనేకాని బదులు చెప్పలేదు. మహేశ్వరునకు ప్రణామ మాచరించి మహేశ్వరధ్యానపరవశుడై యాతడు మిత్రులతో సభా స్థానము చేరికొనెను.

ఆ నాటి సభ, ఆహూతులైన పెద్దలతోడనేకాక, ఇతర ప్రేక్షక జనముతోగూడ కిటకిటలాడు చుండెను. ఆసభ ముఖ్యాధికరణస్థానము * వంటిదగుటచే, ఎవ్వరైనను వచ్చిచూచుటకు ప్రత్యేకస్థానము కలదు. సభామందిరము వెలుపల ఇసుక వేసిన రాలకుండునట్లు జనములు గుంపులుకూడి యుండిరి. ఏమగును, ఏమగును? అని యందరు తహతహలాడుచుండిరి.

---

* అధికరణస్థానమనగా నేటి న్యాయస్థానమువంటిది. ఆ కాలమున నవి రెండు విధములు. ముఖ్యాధికరణస్థానములో ప్రభువే తీర్పరి. అముఖ్యాధికరణస్థానములో రాజోద్యోగులు తీర్పరులు.

అందరికంటె శ్రీనాథుడెక్కువ తహతహతో నుండెను. ఆతడు తన యుత్కంఠ నంతటిని మహేశ్వరార్పణము కావించుచు ధీరనిశ్చలముగా స్థాణునినలెనే సభలో గూర్చుండెను.

శ్రీ దేవరాయసార్వభౌములు రాజమర్యాదలతో సింహాసనాసీను లైరి. పరిషత్సభ్యులు ప్రభువుల సెలవు తీసికొని ఆవలనున్న యేకాంతమందిరమునకు వెళ్ళిరి. గడియపాటు ఎవరి సంశయములు వారు తెలుపుచు సంప్రదించుకొనిరి. తుదకు వా రేకగ్రీవముగా నొక నిర్ణయమునకు వచ్చిరి. అది ప్రౌఢ్వాకుని పత్రముపై వ్రాసి వారికి చదివి వినిపించెను. అందరు సమ్మతించిరి. అంతట వారు సభాస్థానమున ప్రవేశించి పరిషదాసనముల నలంకరించిరి. ప్రౌఢ్వాకుడగు చంద్రభూషక్రియాశక్తి పరిషన్నిర్ణయమును శ్రీ దేవరాయల కిట్లు వినిపించెను.

'శ్రీ దేవరాయప్రభూ, నే మందరము శ్రీనాథభట్ట విరచితమైన మానసోల్లాసస్తుతికావ్యమును నిశితముగా పరీక్షించుచు పఠించితిమి. దాని గణదోషములగూర్చి శ్రీ అరుణగిరినాథులయు, శ్రీనాథులయు వాదములు శ్రద్ధగా నాలకించి పిమర్శించితిమి. ఈ మానసోల్లాసస్తుతికావ్యము ఎట్టిదోషమును లేని ఉత్తమస్తుతికావ్య మని మే మేకగ్రీవముగా నిర్ణయము చేయుచున్నాము. దీనిని ప్రభువులు శ్రీ విరూపాక్షేశ్వరుని స్తుతికావ్యరాజములలో నొకటిగా పరిగ్రహించి, స్వామి గ్రంథభాండాగారమునను ప్రభువుల కోశాగారము

నను పూజ్యస్థానమున ప్రతిష్ఠించ దగునని మా పరిషత్తు నిశ్చయము!

'పరాకుగా నున్న సమయములలో శ్రీ అరుణగిరినాథులు వినుటచే, వ్యాకరణదోషము లున్నని భ్రాంతిపడి కొంత యమాయికముగా తొందరపడి యన్నమాటలచే, ఈ వినాదము సాగినదికాని, లేకున్నచో వారు కూడ మాఅభిప్రాయముతో నేకీభవించియుండెడివారని మా విశ్వాసము!— ఆపైన దేవరవారి చిత్తము!'

పరిషన్నిర్ణయమును శిరసానహించుటకై శ్రీనాథుడు లేచి తూలి ఆసనమున కూలబడెను. ఆసనమునుండి లేనలేకయే అరుణగిరినాథుడు మూర్ఛిల్లెను. వా రిరువురు కొలదిసేపటిలోనే తేరికొనిరి. శ్రీ దేవరాయసార్వభౌముల నిర్ణయమును సభాపతి యిట్లు ప్రకటించెను.

'పండితపరిషత్తు నిర్ణయించిన ప్రకారముగా శ్రీనాథభట్ట విరచిత మానసోల్లాసకావ్యము నిరుష్టమైనదని యంగీకరించుచు దానివి యథార్థముగా పూజింపవలెనని శ్రీ దేవరాయ ప్రభువులు శాసించుచున్నారు. ఇక ఈ వాదారంభమున ఉభయవాదులు కావించుకొన్న ప్రతిజ్ఞాపణముల ననుసరించి, విద్యాధికారులు శ్రీ అరుణగిరినాథులు తమ పీఠమమును శ్రీనాథభట్టుకు సమర్పించుకొనవలెను. జయపత్రిక * శ్రీనాథభట్టుకు ఇప్పించుచున్నారు!'

---

* నేటి న్యాయస్థానములో జడ్జిమెంటు, డిక్రీవంటిది.

నెంటనే రాజలేఖకుడు జయపత్రిక లిఖించి దేవరాయల వానికి చూపెను. రాయల యనుమతితో రాజముద్రాధికారి దానిపై రాజముద్రిక వేసి సభాపతి కీయగా, అత డది శ్రీనాథునకు ప్రసాదించెను. శ్రీనాథుడు దానిని వినయముతో నందుకొని కన్నుల కద్దుకొనగా, రెండు కన్నీటిబొట్లు దానిని ఆర్ద్రమొనర్చెను.

అంతట రాజనాథుడు తండ్రి పక్కమున లేచి సభాంగణము బయట శకటములపైనున్న కంచుశకట్రను తెప్పించి, శ్రీనాథ భట్టు ముందున్న పీఠముపై పెట్టించి సమర్పించెను. శ్రీనాథు డది చేతులతో స్పృశింపనైన లేదు. దానిని చూచినంతనే అతనికి జుగుప్స కలిగినది. శుచియైనవాడు సమీపమునన్న యమంగళవస్తువును చూచినట్లు, అసహ్యము కనబరచుచు ప్రభువుల కిట్లు విన్నవించెను.

'ఈ వాదారంభమున చేసిన ప్రతిజ్ఞ పరిషదనుగ్రహమున ప్రభువుల కటాక్షమువలన, నేను నిర్వహింప గలిగితిమి. అది విరూపాక్షస్వామి కృపయే. మీ నగరము చేరిన మునాటి యుదయమునసే ప్రథమపర్యాయము ఈ శకట్రను దానివెనుక శ్రీ అరుణగిరినాథులను చూచుట తటస్థించినది. అప్పుడే శ్రీ అరుణగిరినాథులపై గౌరవభావమును, ఈ డిండిమముపై నసహ్యమును యుగపద్యముగా సంజాత మైనవి. శ్రీ విద్యా నగరములో విచారించగా, మాకేకాక ఇక్కడ ప్రసిద్ధులగు కవిపండితుల కెందరకో, ఈ డిండిమవాదనతాండవనములు అవమానకరముగా నున్నవని తెలియవచ్చినది. కవిపండితుల

నా యవమానమునుండి తప్పించుటకే, మా వాదమున కీ పణము పెట్టితిమి. ఇప్పు డీ డిండిమవాదనముతో మేము కవి పండితుల నవమానించుట కెంతమాత్రము నిచ్చగింపము. ఈనాడు సభ కరుదెంచుచు మహేశ్వరధ్యానము చేయు చుండగా, ఈ డిండిమమును తాకనద్దనియు, విడిదికి వేవల దనియు మాకు శ్రీ శివాజ్ఞ ఉపశ్రుతమైనది. అప్పైని దేవరవారి చిత్తము!'

ఆ మాట లాలకించి సభ ఆవేశపూరితమైనది. వాదములో నాతడు ప్రదర్శించిన ప్రతిభనలన కంటె శతగుణముగా, నీ మాటలవలన నాతని మహత్వము వారికి ద్యోతమయ్యెను. వాదములో సాధించిన విజయముకంటె ఈ డిండిమనిరాకర ణము, అరుణగిరినాథునిలోకంటె శ్రీనాథునిలోనున్న అతిశ యము నిప్పుడు ధ్రువపరచినది. రాజసభలో నున్నామను మాటకూడ విస్మరించి, కొందరు పండితులు సాధువాద మొనర్చిరి. ఇంతలో వారికి రాజాజ్ఞాప్రసాదితమైన కంచు ఢక్కను శ్రీనాథుడు స్వీకరింపకుండుట రాయలు అనజ్ఞగా భావింతురేమో యను భయ మావహించినది.

దేవరాయలు కూడ శ్రీనాథుని మాటలకు ఆగ్రహింప నలెనో సంతోషింపనలెనో తోపక, కొంతసేపు తటపటాయిం చెను. అది తన తాతగారగు బుక్కరాయలవారు అరుణగిరి నాథుల తండ్రి శోణాద్రినాథులకు అనుగ్రహించిన గౌరవ లాంఛనము. అట్టిదానిని శ్రీనాథుడు వాదముతో జయించియు గ్రహింపక నిరాకరించుట ప్రభుధిక్కారముగానే భావింప

నగును. అయినను అతడు వినయముతో చెప్పిన సమాధానము కూడ సమంజసముగానే ఉన్నది. వారందువలన కర్తవ్యమును పరిషత్తునే నిర్ణయింప నానతిచ్చిరి.

పరిషత్తుకు ధర్మనిర్ణయము చేయుట కెక్కువకాలము పట్టలేదు. 'ప్రతిగ్రహీతకు ఉద్దేశించి ఉంచబడిన వస్తువును ప్రతిగ్రహీత గ్రహించ నిరాకరించినచో, అది యెంతటివిలువగలదైనను దానిని శత్రువులుకూడ గ్రహింపరాదు. అట్టిది కోటిగుణితమగా అనుంగళకరము. ఈ కంచుఫక్కును వెంటనే పగులగొట్టింప నాజ్ఞాపింపవలయునని ప్రభువర్యులకు నివేదించుచున్నాను' అని ప్రాజ్ఞవాకుడు తెలిపెను.

రాయలవారి యాజ్ఞ సభాపతి యిట్లు ప్రకటించెను.

'జగద్వంద్యులైన బుక్కరాయనృపాలుని శ్రోణాద్రినాథులకు మహాసభాసమక్షమున ఇప్పటికి ఏబదియేండ్లక్రిందట బహూకరించిన ఈ కంచుఫక్కును శ్రీశివాజ్ఞాప్రేరితులమై వెంటనే పగులగొట్టింప నాజ్ఞాపించుచున్నాము — ఈ వివాదమువలన మాకు విద్యాధికారులగు శ్రీ అరుణగిరినాథుల యందుగల విద్యాగౌరవ మేమాత్రము తగ్గలేదని ఈ సభాముఖమున ప్రకటించుచున్నాము. మరియు వారికి వంశానుగతముగా వచ్చుచున్న డిండిమభట్ట బిరుదము * దీనిచే పోలేదని ఉద్ఘాటించుచు మరల వారికి స్థిరపరచుచున్నాము!'

---

* అరుణగిరినాథుని కుమారుడును, మనుమడును, మునిమనుమడును అగు రాజనాథుడు. శ్రోణాద్రినాథుడును, రాజనాథుడును వరుసగా డిండిమభట్టు బిరుదము ధరించినవారే.

సూక్ష్మమైన దేవరాయల శాసనమునకు సభవారు ఆనంద పులకితులైరి.

వెంటనే ఇద్దరు భటులు కంచుపెక్కును దూరముగా తీసికొని పోవుచుండిరి. అప్పుడు దానిలోనుండి స్పష్టముగా పిశాచముల యార్తనాదమునంటి భయంకరశబ్దము వినసై సభాసదులను చకితుల గావించెను. భీమదండములతో భటులిద్దరు ఒక్కపెట్టున కొట్టిన దెబ్బతో, ఆ కంచుపెక్క, శూలాఘాతము మర్మస్థానమున తిన్న రాక్షసునివలె బొబ్బ పెట్టి ఘూర్ణిల్లుచు, శకల శకలములుగా చిదికిపోయినది.

వెంటనే ఒకప్రక్క శ్రీనాథుడును, ఆ ప్రక్క అరుణగిరి నాథుడును తమయొద్దగల బంగరుకొమ్మ్నచెంబులనుండి గంగను గ్రహించి ఆశౌచనివృత్తికొఱకై ఆచమించిరి. సభలో నుత్పన్నమగుచున్న కలకలము రాజపురోహితుడు గ్రహించి, వెంటనే యక్షరాక్షస పిశాచోపద్రవశాంతికై రక్షసత్రాకములగు నాథర్వణమంత్రములు పఠించుచు, మంత్ర పూతోదకమును కూర్చుతో రాయలసింహాసనమునను సభాంత రాళమునను సంప్రోక్షించెను. దానితో రాజసభ శాంతించెను.

దేవరాయలవారు సభ చాలించుటకుముందు మరల సరిగా ఆనాటికి వారమురోజులకు తమ యాస్థానములో విద్వాన్వినోద గోష్ఠికి రావలెనని శ్రీనాథభట్టు నాహ్వానింపగా, నాతడు వినయముతో నంగీకరించెను. రాయలసభ ముగిసినది.

మానముద్రాంకితులై శ్రీనాథుడును అరుణగిరినాథుడును ఆసనములనుండి లేచి ఒకరినొకరు సమీపించి ఎదురై, గంభీర

వదనములతో దోసిలు లొగ్గి, ఒకరినొకరు భావములతో నాలింగన మొనర్చికొనిరి. ప్రక్కనున్న రాజనాథుడు 'ఈ కంచు ఢక్కను బలవంతముగా నదలించినందులకు మా తాతపాదులు మీకు కృతజ్ఞతాభావముతో నున్నా'రనెను.

౧౯

విజేదికి చేరినంతటనే శ్రీనాథుని ఆజ్ఞ గొని కొండపీటి కరణము మాచప్ప శ్రీనాథవిద్యావిజయవార్త పత్రికపై లిఖించి సర్వజ్ఞ సార్వభౌము పెదకోమటి వేమారెడ్డి భూపాలు నకును సింగనప్రధానికిని అంచెగుర్రమువీడ కొండపీటికి చేర్చుటకు స్థానాపతి కప్పగించెను. అట్లు పంపినవార్త ఐదవ నాటికి చేరగలదు.

అంతట శ్రీనాథుడు లేచి భక్తిప్రపత్తులతో ఈశ్వరారాధన మొనర్చి, మహేశ్వరనివేదితములైన పంచభక్ష్యపరమాన్నము లతో మిత్రులతో గలసి విందారగించెను. లక్కనసూరి నో రా నాడు అనిదంపూర్వముగా వాచాల మయ్యెను. భోజనానంతరమున శ్రీనాథుడు సుఖముగా కొన్ని నెలల నిద్ర తీసెను.

ఆత డాసాయంకాలమున శ్రీదేవితో కలసి శ్రీ పీఠమునకు బోయి, శ్రీ శంకరానంద భారతీస్వాముల శ్రీ చక్రరాజార్చ నము దర్శించి, శ్రీదేవీ తీర్థప్రసాదములు గ్రహించి, పూజావ సానమున వ్యవధానములో శ్రీ గురువులకు వారి యమో

ఘూశీర్వచన వాక్కు ఫలవంతమైనదని విన్నవించెను. ఆ పిమ్మట వారు (శ్రీ విరూపాక్షస్వామిని గూడ దర్శించి తీర్థప్రసాదములు గ్రహించి వచ్చిరి.

వారు విడిదికి చేరునప్పటికి ప్రొద్దు పోయినది. విడిదికి ముంగుభాగమున గల విశాలప్రదేశములో తీవ్రముగా వివాద పడుచున్న దుగ్గన పోతనల కంఠములు వారికి దూరమునుండి వినవచ్చినవి. దుగ్గన తనబావ డిండిమవిజయమును బహువిధ ముల నగ్గించు చుండెను. పోతన దానిని నిర్లక్ష్యముగా నీసడించుచుండెను.

'బావ దీనిలో సాధించిన ఘనవిజయ మేమిటి? ఎన్ని నెలల శ్రమ! ఎన్నివిధాల డిండిమములను, పాపము, మోసగించి తప్పు దారి త్రొక్కించినాడు! నిన్న బావ పడిన యయుయాతన యేనా?- ఈ పరిశ్రమ ఏ మహాకావ్యము వ్రాయడానికో వినియోగిస్తే ఎంత బాగుండేది?'

అది విని శ్రీనాథుడు శ్రీదేవితో 'విన్నావా, మీ తమ్ముని లిద్దరి వివాదము?-నీవు ఏ తమ్ముని పక్షము ఇందులో?' అనెను.

శ్రీదేవి నవ్వుచు 'నేనా? నేనా?-మీకు కోపము రాకుంటే, పెంపుడు తమ్ముని పక్షమే. మరి మీరో?' అనెను.

శ్రీనాథుడును నవ్వుచు, 'నేనా? నేనా?-ఈవేళ ప్రొద్దుటి నరకు నీ సొంతతమ్ముని పక్షము. మధ్యాహ్నమునుండి నీవలెనే నీ పెంపుడుతమ్ముని పక్షము. మరల రేపటినుండి దుగ్గనవైపే. ఆ పోతన వట్టి సన్యాసి!' అనెను.

విద్యావినోదసభ కున్న వ్యవధిరోజులలో శ్రీనాథుని విడిదికి శ్రీ విద్యానగరములోని పండితులు కవులునే కాక, గొప్ప రాజోద్యోగులును వచ్చి, ప్రీతిపూర్వకముగా సంభాషించి ప్రశంసలుచేసి పోవుచుండిరి. సాయంకాలము మూడు జాముల వేళనుండి రాత్రి ప్రొద్దుపోవునరకు అట్లు నమ్మచున్న పెద్దలను గౌరవించుటతోడనే శ్రీనాథునకు సరిపోవుచుండెను.

విద్వాంసులలో ముంచునచ్చినవాడు ముక్కవి. డిండిముని వ్యాధికి చికిత్స చేసినందుకు శ్రీనాథుని శ్లాఘించెను.

అనచిదేవయ త్రిపురారి, పంట మైలాసుడెడ్డి, వినుకొండ వల్లభరాయడు, కటకపాలుడను తెలుగురాయడును వచ్చి వెళ్ళిరి. ప్రసిద్ధ దండనాయకులు, మంత్రులు, సామంతులు కూడ స్వయముగా నచ్చియో, వార్తాహరులను పంపియో, శ్రీ విద్యానగరము విడిచి వెళ్ళిపోవల తప్పక తమ మందిరములకు వచ్చిపోవలెనని శ్రీనాథు నాహ్వానించుచుండిరి.

ఒకవంక పెద్దల మర్యాదలు సలుపుచునే, మరియొకవంక దేవరాయ లాహ్వానించిన విద్యావినోదసభ యెట్టిదై యుండునా యని శ్రీనాథు డాలోచించుచుండెను. తోడి విద్వాంసులతో సంప్రదించెను. నవ్యచు లక్కనసూరి ఇచ్చిన సలహా యిది:

'అబ్బాయిగారండీ, శ్రీనాథమ్యగారూ, నన్ను ప్రాకృతుడనని మీ రందరు అవహేళనచేస్తున్నారు. నావాక్కు మీ వేదవాక్కువంటిది కాకపోయినా, అధమపక్షము ద్రావిడ వేదవాక్కు వంటిది. నిన్ను ఆకస్మికంగా విద్వాంసులనుచేతను. అవధానులచేతను, అనేక భాషాకవులచేతను, నీకేదో ప్రజ్ఞ

లున్నవని పేరుపడ్డ బండారమంతా బయటపడేటట్లు నిశితంగా పరీక్షిస్తాను సుమా! ఈ వచ్చే పోయే పెద్దల మర్యాదలతో మనస్సు వికలం చేసుకోక ఉన్న బండారము కాస్తా పదిల పెట్టుకో, ఉపస్థితిలో ఉంచుకో!'

సుబ్రహ్మణ్యశ్రోత్రి కల్పించుకొని 'అప్రాకృతుడైన మా వేదపురుషునకూడ ఈ ప్రాకృతుని మాటలనే ఓంకారము చేయుచున్నాడు' అనెను.

శ్రీనాథుడిద్దరి మాటలును తనయూహనే బలపరచినందున నిశిత విద్వాపరీక్షకు సన్నద్ధుడగుచుండెను. వేదవిదులతో పన్నములను శాస్త్రవేత్తలతో విద్యాసూత్రములను ప్రస్తావించి కంఠస్థములును, బుద్ధిస్థములును చేసికొనుచు, ఆత్మను బ్రహ్మశక్తి కల్పించి చిత్తము నేకాగ్రముగా నిల్పునొను చుండెను.

ఐదవనాటిరాత్రి నాతడు నిద్రించుటకుముందు ప్రొద్దుగన్నతో నున్నతరి, నావల పోతన దుగ్గనలు ఉత్కంఠితులై చేయుచున్న సంభాషణ మాతని చెవ్వులబడెను. పోతన తాను ప్రాయదలచిన మహాభాగవతములో అభిమానఘట్టములకు పద్యములు చెప్పుచుంటినని వామనవిజృంభణము వర్ణించు రెండుపద్యములు దుగ్గనకు వినిపించెను. అవి వినుచునే శ్రీనాథుడు పోతన ప్రతిభకు విస్తుపోవుచుండెను. హృదయ మానందమునో పొంగిపోయెను.

ఆ వామనస్తుతోపాటు తన ప్రాణమిత్రము వామనభట్ట బాణుడు జ్ఞప్తికి వచ్చెను. ఇప్పటికి తన విజయవార్త చేరి

యుండును. దానికి వానును డెంత సంతోషించు మండునో గదా యను తృప్తి కలిగెను. తన విజయమునకు ప్రధానకార ణులు వానునభట్టబాణుడును, చనుత్కారచంద్రిక పంపిన విఘ్నేశ్వరుడును. వాచకొండకుకూడ ఈ వార్త త్వరలో చేర్ప వలెనని యూహ డనుకొనెను. వానుసాన్యముచేత వాను విఘ్నేశ్వరులతోపాటుగా త్రిభువనములు తనపదములచే నాక్ర మించిన త్రివిక్రముని, సకలవిఘ్నములకు నీశ్వరుడైన విఘ్నేశ్వరుని ధ్యానము చేయుచు నాత్రడు నిదురించెను.

నిర్ణీతమైన దినమున శ్రీనాథుడు దేవరాయల విద్వా వినోదగోష్ఠికి తోడిపండితులతో బయలుదేరెను. ఈ నా డందరు శ్రోత్రియవైభవముగల వేషమును దాల్చిరి. ఊర్వా సములులేవు. కుల్లాయిలు లేవు. పట్టుధోవతులు, పైన రంగు రంగుల కాశ్మీరశాలువలు, ఫాలము మొదలుగా పంచావ యవములను పంచబ్రహ్మసూత్ర పూత విభూతి రేఖలు, చెవులకు కుండలములు, కరముల కంకణములు, కంఠములలో బంగారు పూదివిన స్ఫాటికమాలలలో రుద్రాక్షమాలలలో ధరించిరి. చేతు లలో కమండలువులు పూనిరి. శ్రీనాథుడుమాత్ర మీనాడు పైని శాలువ వేసికొనక, శ్రీగురుపూజనాడు జగద్గురువు లనుగ్ర హించిన పట్టుశాటి వేసికొనెను. అందరును వేదపురుషుని ధ్యానించుచు పాదచారులై సభాస్థానము చేరికొనిరి.

దేవరాయప్రభువు రాకముందే ఆనాడు సభామందిరములో అపూర్వవిధముగా నాసనములు వేయబడి యున్నవి. సింహా సనమున కెదురుగా పదివిండ్ల దూరమున స్వలంకృతమైన

ప్రత్యేక సుఖాసన మొకటి యున్నది. సింహపీఠికి దిగువను రెండుప్రక్కల రెండున్నత కుశాసనములును, వానికిని ఆనలి ప్రత్యేకాసనమునకును మధ్య రెంతఖాళీ నడలి, రెండుప్రక్కలను మూడు మూడు నగుసలుగా నూట యెనిమిది యాసనము లున్నవి. సభామధ్యమున నున్న యీ నూటపదునొకండగు నాసనములను ఖాళీగా నుంచి, భటులు నచ్చుచున్న పెద్దలను వారి వారి మర్యాదల ప్రకారము ఇతరాసనములపై నాసీనుల గావించుచుండిరి.

యథావైభవముగా దేవరాయలు, సింహాసన మలంకరించిన వెంటనే సభకు శ్రీనాథభట్టు నచ్చినారా యని యడిగి వచ్చినట్లు తెలిసికొనిరి. అంతట సభాపతి శ్రీనాథభట్టు నుద్దేశించి రాయలవారి యిచ్ఛ నీవిధముగా ప్రకటించెను.

'శ్రీనాథభట్టా, మీ బహుముఖవిస్తృత కవితాప్రతిభ ధారణాపటిమ ఎందరెందరో చెప్పగా రాయలవారు వినియున్నారు. ఈమధ్య మీకు విజయపత్రిక ప్రసాదించబడిన వ్యవహారములో, మీరు పన్నాగము పన్ని భ్రమపెట్టి సులభముగా విజయము సాధించితిరేకాని, అందులో మీ విద్వదతిశయము ప్రకటము కాలేదను నపప్రథకూడ కొంత శ్రుతమైనది.

'మీరు వేదవిదులని, శ్రౌతస్మార్తకర్మనిపుణు లనియు, యోగ న్యాయ వైశేషిక సాంఖ్య వ్యాకరణ సాహిత్యశాస్త్రములలో నిధులని, సంస్కృత ప్రాకృతాంధ్రకవిత్వ విశారదులు నద్భుతధారణాశక్తికలవారు నని, సంగీతము, ఆయుర్వేదమా,

మల్లవిద్య, ఖడ్గవిద్య, గజశాస్త్రము, అశ్వశాస్త్రము, హస్తలాఘవము, ఇంద్రజాలము మొదలగు చతుష్షష్టి కళలలో ప్రవేశము కలవారనియు, రాయలవారు విని యానందించి యున్నారు. మీరీ గోష్ఠి నలంకరించు మహాభాగ్యము ప్రాప్తించినందున, మా విద్యానగరములోగల తత్తచ్ఛాస్త్ర విద్వాంసులతో మిమ్మును ప్రసంగింపజేసి, వినోదింపనలె నని రాయలవారు కుతూహలాయత్తచిత్తులై యున్నారు. ఇప్పటికి ఏబదిసంవత్సరములక్రిందట మా విద్యాధికారుల పితృపాదులగు శోణాద్రినాథ కవిసార్వభౌములచేత శతావధానము చేయించి దర్శించు మహాభాగ్యము ప్రభువుల పితామహులగు శ్రీ బుక్క-రాయప్రభువులకు ప్రాప్తించినదని ఐతిహ్యము పెద్దలవలన వినుటయే కాని, ప్రత్యక్షముగా దర్శించు నవకాశము తటస్థింప లేదు. అట్టి శతావధాన వినోదమును ప్రదర్శించి రాయమహాచక్రవర్తులను ఆనందింపజేయుట మీ కంగీకారమగు పక్షమున మీ రా ప్రత్యేకాసన మలంకరింప నలెనని ప్రభువువా రానతిచ్చుచున్నారు.'

ఆ మాటలు విని శ్రీనాథభట్టు ధీరగంభీరముగా లేచి, జగద్గురువులు ప్రసాదించిన శాటి కన్నుల కద్దుకొని, శ్రీ సుహృద్గణాధిపతిని భారతీదేవిని స్మరించి, మహేశ్వరధ్యానము కావించి, 'దేవా, భవదీయానుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నా నేర్చువిధంబున నీ శతావధానంబు నిర్వహింప పూనుకొందు'నని ఓంకారపురస్సరముగా నా ప్రత్యేకాసనమువద్దకు జని నిలిచి,

'జోటీ, భారతి, యూర్భటిన్నిరయుమీ! చోద్యంబుగా నేను క
ర్ణాటాభీశ్వరు దేవరాయన్నృపతిన్ నాసీరధాటీచమూ
కోటీ ఘూోటకధట్టికా ఖురపుటీ కుట్టాక సంఘట్టన
స్ఫోటీభూతధరారజస్సులుకితాంభోటిన్ బ్రశంసించెదన్!'

అని ప్రార్థనాప్రశంసలు చేసి, సభకు నమస్కరించి, ప్రత్యేకాస
నమున నిష్కంపనుుగా నాసీనుడయ్యాను. సభ్యుల ఆశ్చర్య
సంభావనా ప్రశంసారవములు, బంగారు చిరుమువ్వల మంజు
శింజితమునలె సభలో కలకలలాడెను. శ్రీనాథుని ధీరగంభీరా
కారము సభ్యులను ముగ్ధుల గావించెను.

ముందుగా దేవరాయలు తమసమీపమున కుడిప్రక్క
నున్న యాసనమున చంద్రభూష క్రియాశక్తిని, వామభాగ
మునన్న యాసనమున విద్యాధికారి డిండిమభట్టారకులను
ఆహ్వానించి కూర్చుండజేసెను. అంతట సభాపతి అప్పటికే
నిర్ణీతమై సిద్ధముగా నుంచిన పట్టిక చదివి పండితులను సభలో
నుండి పిలిచి, ఖాళీగా ఉంచిన మూటఎనిమిది యాసనములపై
కూర్చుండజేసెను. అందులో కొండవీటిపండితులకును పోతన
దుగ్గనలకునుగూడ స్థానము లీయబడెను.

వారిలో వేదవిదులు పదినుంది, శ్రౌత స్మార్తవిదులు
పదిమంది; వైయాకరణులు ఉద్భటనౌస్తర్కోవిదులు
చెరిపదిమంది; యోగ న్యాయవైశేషిక సాంఖ్యవేత్తలు చెరి
యైదుగురు; పౌరాణికు లైదుగురు; శైవ వైష్ణవాగమప్రవీణులు
నలుగురు; సంస్కృతప్రాకృతాంధ్రకవులు చెరి పదిమంది;
తక్కినవారు ద్రావిడ, కర్ణాట, మళయాళ, ఉత్కళ, ఘూర్జర

మహారాష్ట్ర, అరబీ, పారశీక, తురుష్కభాషాకవులు భాషలొకొక్కరు-ఈవిధముగా నాయాసనము లలంకరించిరి.

'సభ సందడితగ్గి సావధానముగా నున్నంతట, 'ఈ శతావధానగోష్ఠిని చంద్రభూషక్రియా శక్తులవారిని డిండిమభట్టారకులను నడిపింప శ్రీ దేవరాయప్రభువు లర్థించుచున్నాడు' అని సభాపతి విరమించెను.

చంద్రభూషక్రియాశక్తి ప్రారంభించుచు 'ఈశతావధానము నేడే పూర్తికావలె ననుక పృచ్ఛకులను పొడుగుపాటి ప్రశ్నలు వేయనద్దని మనవి చేయుచున్నాను. ముందు వేదవిదులు ప్రశ్నింతురుగాక!' అనెను.

వేదవిదు లొకరొకరే వారికి నోచిన భాగములలో మొదటి నుక్క లందించి. ఆమంత్రములు చెప్పి మనిరి. శ్రీనాథుడు శ్రావ్యమైన కంఠముతో సుష్ఠుగా చెప్పెను. అంతట శ్రౌత స్మార్తవేత్తలు శ్రౌతస్మార్తకర్మకలాపములు సూక్ష్మముగా ప్రశ్నించి, కొన్నిమంత్రము లందించి, అవి యేయే కర్మలలో నెక్కడ వినియోగ మగునో అడుగగా, శ్రీనాథుడు శాంతముగా చక్కని సమాధానము లిచ్చెను. అంతట విద్యాధికారిపురస్సరముగా వ్యాకరణశాస్త్రపరీక్ష ప్రారంభ మయ్యెను. నోము తిరుగని సూత్రములతో భాష్యవిచారణము లతో వైయాకరణులను శ్రీనాథు డానందింపజేసెను. అతనువాత సూక్ష్మ భేదములు గల అలంకారవిచారణలు జరిగినవి. ఆపిమ్మట సాంఖ్య న్యాయ వైశేషిక యోగదర్శనములలో వరుసగా పరీక్ష జరిగెను. యోగశాస్త్ర ప్రశ్నలు సమా

భాషములు నీవిషముగా నుండెను. ఒకొక్కరు ఒకొక్క ప్రశ్న వేసిరి.

ప్రశ్న : కిం నాను మహావ్రతమ్?

శ్రీనాథుడు : అహింసాదయః పంచయమాః. తే జాతి దేశ కాల సమయ అనవచ్ఛిన్నాః సార్వభౌమాః. యమవ్రత మేవ మహావ్రత మితి కథ్యతే.

ప్రశ్న : ఆసనవిధిః తత్ర్పయోజనం చ కథ్యతామ్!

శ్రీనాథుడు : స్థిర సుఖ మాసనమ్. యదేవ స్థిరం సుఖకరం చ తదేవాసనం కార్యమ్. సిద్ధాసన భద్రాసన పద్మాసన సింహాసనా న్యుత్తమ త్వేన పరిగణితా న్యాసనాని, స్థిరత్వాత్ సుఖత్వాచ్చ. నతు కూర్మాసన, కుక్కుటాసన, మయూరాస నాదీని హఠయోగ ప్రసిద్ధాని, అస్థిరత్వా దసుఖత్వాచ్చ.

ప్రశ్న : సర్వరత్నలాభః కథం వా సిధ్యతి?

శ్రీనాథుడు : అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానం సిధ్యతి.

ప్రశ్న : కిం నామ అహింసావ్రత ఫలమ్?

శ్రీనాథుడు: అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః శాశ్వతికవిరోధినా మపి సర్వేషాం ప్రాణినామ్.

ప్రశ్న : కి మీశ్వర స్వరూపమ్, కిం వా తద్వాచకమ్?

శ్రీనాథుడు : క్లేశకర్మవిపాకాశయై రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః, తస్య వాచకః ప్రణవః.

యోగులతర్వాత పౌరాణికులు ఆగమవేత్తలును ప్రశ్నలు నర్పించసాగిరి. శ్రీనాథుని సమాధానములు పరీక్షాధికారులకు తృప్తి కలిగించినవి.

అప్పుడు మధ్యాహ్నవేళ సూచించు ఘంటారవములు శ్రవణపర్వముగా వినవచ్చినవి. సభాపతి లేచి, 'దేవరాయప్రభువులు పరీక్షకులను శ్రీనాథులను ఈ పూటకైపను తమయాతిథ్యము స్వీకరింప నర్థించుచున్నారు. అందరికిని నుజ్జనానంతరమున ధరించుటకు నూతన కౌశేయవస్త్రములు సిద్ధముగానున్నవి. అవి గ్రహించి సుఖభోజనములు గావించి ప్రభువులను ధన్యుల గావింప వేడుచున్నారు. తక్కిన సభాసదులకు గూడ వేరుగా మజ్జనభోజనాదులు సిద్ధముచేసి యుంచినారు. వారలు కూడ ప్రభువుల యాతిథ్యము స్వీకరింప నర్థించుచున్నారు- సరిగా మూడు జాముల వేళకు ఈ సభ మరల నారంభమగును!' అని నివేదించెను.

ప్రభువులు కొలువు చాలించిరి. భోజనశాలలో ప్రభువులచే నియుక్తులైన ఉన్నతోద్యోగులు వారికందరికి పట్టుపుట్టములు కట్టబెట్టి, సుష్ఠుగా భుజింపజేసిరి. చిత్రముగా శ్రీనాథునకు మాత్రము అందరితోగాక ప్రత్యేకముగా నొకమందిరము చూపిరి.

మరల మూడు జాములకు దేవరాయలవారు కొలువుతీరి విద్యావినోదసభ ఆరంభింపజేసిరి. నయసగా సరస్కృతకవులు, ఆంధ్రకవులు, సమస్యా పూరణములు, వర్ణనలు మొదలగునవి

చేయించి వినోదించిరి. ఒక తెలుగు కవి 'ఏకులు వడుకుట చూచితిరా?' యని ప్రశ్నించెను.

శ్రీనాథుడు :

"ఆ కదుసున బికరవమును
నాకడురున భృంగరవము నాత్మరవంబున్
ఏకీకృతముగ నేకు ల
నేకులు విన వడికె ముదిర యే కులముదిరా!'

ఇంకొకరు 'మీ కవితాప్రౌఢివైవిధ్యము ఎట్టిదో. సీసపద్యములో వర్ణింతురా?' అని ప్రశ్నించిరి.

శ్రీనాథుడు :

వచియింతు వేములవాడ భీమనభంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరునితేవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు
ప్రౌఢి బలికింప సంస్కృతభాష యంద్రు
పలుకు నుడికారమున నాంధ్రభాషయందు
రెవ్వరేమన్న నంద్రుగా కేమి! అస్మ
దాస్య శృంగాటి గాణి కర్ణాటవాణి."

మరియొక యాంధ్రకవి 'మా రీ విద్యానగర యాత్రా మధ్యములో చేసిన సుఖభోజనమును నిర్ణించుచు శ్రీకృష్ణుని సంబోధించి పద్యము చెప్పుము' అనెను.

శ్రీనాథుడు :

"పుల్లపరోజ నేత్ర, యలపూతనచన్నుల చేదు ద్రావి, నా
డల్లన దవాగ్ని క్రుంగితి నటంచును నిక్కెద వేల? తింత్రిణీ
పల్లవయుక్తసూనుకు బచ్చలిశాకము జొన్నకూటితో
మెల్లన నొక్కముద్ద దిగమ్రింగుము, నీపస కాననయ్యెడిన్."

ఆ పద్యము విని సభ యంతయు నవ్వుతో వికసించెను. శ్రీనాథుని యాత్రా విశేషము కొంత వారి కవగతమైనది.

పోతన నానునవటుని విజృంభణము వర్ణింపు డనెను.

శ్రీనాథుడు :

ఇంతింతై వటు డింతయై మరియు దా నింతై నభోపీఠిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహార్ణవిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై.'

ఈ పద్యము నాతడు రెండుచేతులతో నభినయించుచు పఠించెను.

పోతన తనపద్యము నెట్లు చదువుచున్నాడని యాశ్చర్య ముతో చూచుచుండగా, దగ్గన లేచి 'ఆసమయమున సూర్య బింబ మెట్లుండెనో వర్ణింపుము' అనెను.

శ్రీనాథుడు :

"రవిబింబం బుపమింప బాత్ర మగు ఛత్త్రంబై శిరోరత్నమై
శ్రవణాలంక్రియలై గళాభరణమై సౌవర్ణ కేయూరమై
ఛవినుత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్."

పోతన దుగ్గనలు పెల్లగోవుచు ఒకరిమొగము లోకరు చూచుకొనుచు గుసగుసలాడుట విని ప్రక్కనున్న వల్లభ రాయడు 'శ్రీనాథభట్టా! ఈ రెండును మీపద్యములుగా లేవే? ఎక్కడ సంగ్రహించిరిరి?' అని ప్రశ్నించెను.

శ్రీనాథుడు : 'అవి నా వని చెప్పితినా? మొన్న రాత్రి నిద్రాసహాయమున ఒక బాలబ్రహ్మచారి కవి తన వయస్యునికి వినిపించుచుండగా కలలోనవె నాకు శ్రుతమైనవి. వానివి కావచ్చును' అని పోతనను నిర్దేశించెను.

అద్భుతావిష్టులై ఒక్కసారి సభలోనివారు పెద్దలు పిన్నలు పోతనవంక మెప్పులచూపులు ప్రసరింపజేసిరి. పోతన ముఖము సిగ్గుతో మరింత ఎర్రనై కోకనదమువలె మురిపెము గొలిపెను.

శ్రీనాథునికి రాని భాషల కవులవంతు రానుండెను. ఒక్క యాంధ్రకవి ప్రశ్నముండెను. అత డుత్తమకవిగోష్ఠిని నిర్ణయింపగోరెను.

శ్రీనాథుడు :

'అరబీభాష తమష్క భాష గజ కర్ణాటాంధ్ర గాంధారభూ
ర్జరభాషల్ మళయాళభాష శకభాషా సింధు సౌవీర బ

ర్బరభాషల్ కరహాటభాష మరియున్ భాషావిశేషంబు ల
చ్చెరువైమెచ్చులుగూర్చుచుమ్మకవిగోష్ఠిసంప్రయోగంబులన్.

ఇక శ్రీనాథునికి రాని భాషల కవులు మిగిలిపోయిరి. వారు తమ తమ భాషలలో, కొంత పద్యము కొంత గద్యము చదివి, శ్రీనాథుని అప్పగింపుచునిరి. శ్రీనాథుడు సోలగా ద్రావిడము, కర్ణాటకము, మళయాళము, పారశీకము, అరబ్బీ మొదలగు భాషలు ఉచ్చరించుచుండగా సభ పొందిన ఆనందమునకు మేరలేదు.

అంతట ప్రచ్ఛకులస్థానములలో కూర్చుండని ఇతరులు ప్రభువుల యానతిగొని కొంద రెదుటికి వచ్చి నిలిచి ప్రశ్నింప సాగిరి. వైద్య డిట్లు ప్రశ్నించెను.

ప్రశ్న : కామజ్వరాభి తప్తానాం వద పథ్యం కి మూషధమ్?

శ్రీనా: దృష్ట మాలింగనం పథ్యం క్వాథశ్చాధరచుంబనమ్.

అంతట విద్వాంసుల్లు వచ్చి నిలిచి యిట్లు ప్రశ్నించెను.

ప్రశ్న : మల్లవిద్యలో జయమునకు అద్వితీయమైన దేది? దానికి ప్రతిక్రియ ఏమి?

శ్రీనాథుడు : శ్రీకృష్ణభగవానుల ప్రేరేపణచే ధర్మరాజు క్రీడాంగణములలో నిషేధించి నిష్కాసన మొనర్చినట్టియు, ఈనుధ్య పారశీకమునుండి దిగుమతియైన గోపవిద్య. దాని ప్రతిక్రియ వజ్రలేపము.

ఆ ప్రత్యుత్తరముతో విద్వాంసుల్లు త్రుళ్ళిపడి తూలుచు ఆవలి కెట్లో వెళ్ళగలిగెను.

గజశాస్త్రము, అశ్వశాస్త్రము, ఖడ్గవిద్య, గదాపరిఘుల ప్రయోగములు, గృహాలంకరణము, వాస్తు, దండనీతి, సంగీతము మొదలగువానిలో నెందరెందరో చిత్రచిత్రములైన ప్రశ్నలు వేయగా, శ్రీనాథుడు నిత్యనూతనమైన ఉపజ్ఞ ప్రదర్శించుచు ప్రత్యుత్తరము లిచ్చెను.

హస్తలాఘవవిదుడు వచ్చి కర్రముక్కనలె నున్న దానిని చేతితో క్రిందికి పట్టి చూపి 'ఇది ఏమి?' అని ప్రశ్నించెను. శ్రీనాథుడు 'నీ హస్తము సంచిలోనికి పోనీయక, పైకెత్తుము- అది కత్తి!' అనెను. వినోదకు డట్లే చేయి పైకెత్తగా నది యందరికి కత్తిగా కనబడెను.

తుదకు ఐంద్రజాలికుడు వచ్చి 'శ్రీనాథభట్టా! మీ రాయాస నములో నుండియే అదృశ్యాలు కాగలరా?" అనెను.

శ్రీనాథుడు : శ్రీ దేవరాయలవా రానతిచ్చినచో తప్పను!'

దేవరాయలవా రానతిచ్చిరని సభాపతి ప్రకటించెను. శ్రీనాథుడు సుబ్రహ్మణ్యశ్లోకికి ఏదో సంజ్ఞచేసి 'చిత్తము!' అనుచు కన్నులు మూసెను. ఆతని దేహము మంచు క్రమ్మినట్లగుచు కానిపించి కానిపించి, గట్టి తెర వేసినట్లు అదృశ్యమయ్యెను. వెంటనే సుబ్రహ్మణ్యశ్లోకి కర్పూరసుధారతి వెలిగించి, మంగళమంత్రములు పఠించగా, మరల తెర పోయి మంచు క్రమ్మినట్లయి, అది విరిసిపోయి, తుదకు శ్రీనాథమూర్తి శ్రీనాథతేజస్సుతో సభవారికి వెలుగుచు దివ్యదర్శన మొసంగెను. సభ అద్భుతావిష్టమై జయజయనినాదములతో సందడించెను.

ప్రశ్నలైపోయినవి. 'పరీక్షకులు పూగోత్తర మీమాంసలలో ప్రశ్నలు వేయకుండుట కొరవగా ఉన్నది' అని శ్రీనాథుడు పలికెను. వెంటనే చంద్రభూషక్రియాశక్తి అందుకొని 'గోష్ఠీ వినోదములలో పూగోత్తరమీమాంసలు ప్రశ్నించుట శ్రీ విద్యానగరాచారము కాదు. రాజగురువులు తుంగీయాశ్రమము లైనందున, పూర్ణాధికారులు కాని గృహస్థులు ఉత్తరమీమాంస శ్రీగురువుల సన్నిధానమునగాని చర్చింప రాదని నిషేధించిరి మిమ్మును తృప్తిపరచుటకై పూర్వమీమాంసలో చిన్నప్రశ్న వేసెదను.' ఇట్లనుచు ప్రశ్న వేసెను. అది భాట్ట ప్రాభాకర మతములను అన్యోన్యము వివదింపజేయున దైనందున, సూటిగా నుత్తరమిచ్చుటకు శ్రీనాథుడు చిక్కులో పడి, ఎట్లో బుద్ధి కుదుటబరచుకొని తృప్తికరముగా నుత్తరమిచ్చెను.

అంతట చంద్రభూషక్రియాశక్తి చిరునవ్వు ముఖమున దాండవించుచుండగా నిట్లనెను. 'శ్రీనాథభట్టా, ఇంతవరకు మీరు ప్రదర్శించిన వైదుష్యమునకు, ప్రతిభకు, ప్రభువులు సంప్రీతులైనారు. ఈ వినోదసభానియమములలో చివరకు జరుగవలసినదానిని సభారంభమునందే ప్రకటింపక మా సభాపతులు పరాకుపడినారు. అవధానావసానమందు పృచ్ఛకులెవరైనను, తా మడిగిన ప్రశ్నయు దానికి మీరిచ్చిన సమాధానమును చెప్పుడని యడుగుట పరిపాటి. అది లేనిది అవధానము పూర్తికాదు. మందే మీ కావిషయము తెలుపనందున, ఇప్పుడాకస్మికముగా మిమ్మడుగుట ధర్మముగా

తోచుట లేదు. కావున మీకు జ్ఞాపకమున్నని ఏనో పది ప్రశ్నలు, వానికి మీ రిచ్చిన సమాధానములు, చెప్పినచో ఈ వినోదసభకు పరిపూర్ణత చేకూరును.'

వెంటనే శ్రీనాథు డిట్లు ప్రత్యుత్తర మొసగెను: 'అయ్యయ్యో, ఎంతమాట! సభాపతులు పరాకుపడినారని పెద్దలగు మీ రన్నచో అనవచ్చుగాని, మాబోంట్లము అంగీకరింపదగినది కాదు. పృచ్ఛకులు 'నా ప్రశ్న యేమి? మీ సమాధానమేమి?' అని యడిగినచో నేను సరిగా చెప్ప వలెనుగదా! దానితోడనే గదా అవధానసంపూర్తి! ముందుగా నా నియమము చెప్పలేదని వంకపెట్టి, ప్రభువుల వినోదము కొరతపెట్టుట భావ్యమా?-ఇంకొక్క మనవి! శ్రీ పీఠాధిపతులు నాకు ప్రసాదించిన ఈ శాటిని కన్నులకు కట్టుకొందును. అది నాకు దివ్యదృష్టి ప్రసాదించగలదు,' ఇట్లనుచు భక్తి తాత్పర్యములతో నా శాటిని కన్నుల కద్దుకొని కన్నులు కనబడకుండ గంతగా కట్టుకొని యిట్లనెను. 'ఇప్పుడు పృచ్ఛకు లెవరైనను ఆ ప్రశ్న వేయవచ్చును. శ్రీ గురువుల యనుగ్రహమున సరిగా చెప్పుటకు యత్నింతును. దయచేసి ఎవరును కంఠము మార్చి యడుగవద్దని ప్రార్థించుచున్నాను.'

ఆ మాటల కందరు విభ్రాంతులైరి. దేవరాయలు పరమానందభరితుల మైతిమని సెలవిచ్చి, ఇకనదినుండిని మాత్రమే ప్రశ్నింపుడని యానతిచ్చిరి. వేదమంత్రము, శ్రౌతను, వైశేషికము, సాంఖ్యము, యోగము, పురాణము, శైవాగ

మము, •వైష్ణవాగమము—నీనిలో చెరివొకటి చొప్పున పండ్రెండు ప్రశ్న లైనవి. శ్రీనాథుడు సరిగా సమాధానము లిచ్చెను.

అప్పుడు సంస్కృతకవులలో నున్న నృసింహభట్టు లేచి లక్కనసూరి కంఠ మనుకరించుచు ప్రాకృతభాషలో 'నే నడిగిన ప్రశ్న లేమి? మీ సమాధాన మేమి?' అనెను. వెంటనే శ్రీనాథుడు 'నృసింహభట్టా! కంఠము మార్చనవద్దని నియమము చేసితిని గదా! మీరు సామాన్యముగా పెద్ద మనుష్యులే! మరి లక్కనసూరి కంఠమును అనుకరించి మాట్లాడవలెనని బుద్ధి మీకే స్వయంబుద్ధ మైనదా?—ధూర్తులైన లక్కనసూరి ఉపదేశమా?-మీరు ప్రాయశ్చిత్త ముగా ముం దా ధూర్తసూరి ప్రాకృతప్రశ్న, సమాధానము చెప్పి, తర్వాత మీ సంస్కృతప్రశ్నకు సమాధానము 'చెప్పెదను' అనుచు రెండును చెప్పెను. ఆ పండితమిత్రుల ప్రేమపూర్వక సల్లాపమునకు శ్రీదేవరాయలముఖము వికసిం చెను. సభ్యులు పలువురు నవ్వాపుకొనలేక పోయిరి తక్కిన ఆరు ప్రశ్నలకును గూడ శ్రీనాథుడు ఉత్తరములిచ్చి అనధానపని సమాప్తి కావించెను.

అప్పుడు విద్యాధికారి అమణగినాథ డిండిమభట్టు శ్రీదేవ రాయలవారిని మహాసభను ఉద్దేశించి ఇట్లు పలవిచ్చిరి.

'మా పితృపాదులు సోణాద్రినాథులు అద్వితీయ మేధా సంపన్నులై శ్రీ బుక్కరాయప్రభువుల సభలో ఇట్టి శతా వధానపినోదమునే ప్రదర్శించి విద్వద్వరేణ్యుల నాశ్చర్యచకి

తుల గావించిరని పిలియన్నాము. నేము ఆ ఇద్దుణ్ణులో ప్రారంభించిన కాలమది! అప్పుడు ముందుగానే వినోదనిర్ణయ విషయములు నిర్ధారింపబడినవి. ఈనాటినలె ప్రశ్నోత్తరములు చెప్పవలెనని సభాంతమం దాకస్మికముగా ప్రకటింపలేదు. ఆనాడు పృచ్ఛకుల ముఖములు చూచుకొనియే గుర్తించి మా పితృపాదులు చెప్పియుండిరి. ఈనాడు శ్రీనాథభట్టు ఆకస్మికముగా తుదకు తెలిపిన నియమ మంగీకరించుటయే కాక, పృచ్ఛకులను చూడకుండ నేత్రపట్టమిత్రో కంఠధ్వని గుర్తును బట్టి చెప్పి ద్విగుణముగా ప్రతిభను ప్రదర్శించిరి. అంతేకాక, మా పితృపాదులు వేదము, శ్రౌతస్మార్తములలో పరీక్ష యిచ్చియుండలేదు. అందుచే మాయూహకందని మా పితృపాదుల మహాత్వమును శ్రీనాథభట్టు ఈనాడు శతగుణముగా మహత్వము ప్రదర్శించి నుసకు కలిగించిన ఈ విద్యావినోదము అశ్రుతపూర్వను, నభూతో న భవిష్యతి! వాకుముండే సెలవిచ్చినట్లు సర్వవిద్యాస్వరూపులైన శ్రీ శంకరానంద భారతీస్వాముల కటాక్షమును, ఆ వేదపురుషుని అనుగ్రహమునే, ఇందుకు కారణములు. ఇకముందుకూడ నిట్లే వారలయనుగ్రహమునకు పాత్రులై వగిల్లుదురుగాత!'

ఇంత నిర్నిబంధముగా డిండిమభట్టారకు లితరుల శ్లాఘించుట పిని యెరుగని విద్యానగరపండితులందరు నాతనిలో వచ్చిన మార్పుకు సంతోషించిరి.

దేవరాయలు ఆనందము పట్టలేక ఈ రీతిగా సెలవిచ్చిరి. 'శ్రీనాథభట్ట, ఇటటి సర్వతోముఖప్రతిభాశాలిని తమ

విద్వాన్నికారిగా లభించిన సర్వజ్ఞసార్వభౌమ పెదకోమటి వేమ భూపాలుర యాస్థానమే ధన్య మైనది ఈ మా ప్రశంస మీ స్థానాపతి మీ ప్రభువునారికి తెలిపివిడిచేయుగాక! ఇక మీకు మాకు కలిగించిన ఈ అప్రతిద్వంద్వమైన విద్వాన్వినోదమునకు మిమ్మెట్లు గౌరవింప నిచ్చగింతుమో సెలవిత్తుసుగాక!,

శ్రీనాథుడు వినయముతో నిట్లు విన్నవించెను.

"జననాథోత్తమ, దేవరాయనృపతీ, చక్రేశ, శ్రీనత్సలాం ఛనసంకాశ, మహాప్రభాన, హరి రక్షోదక్షు, నాబ్జోద్భవికిన్, కుసృపస్తోత్రసముద్భనం బయిన వాగ్గోషంబు శాంతంబుగా కనకస్నానముచేసి కాక పొగడంగా శక్యమే దేవరన్"

వెంటనే దేవరాయలంగీకరించి ఆస్థాన దైవజ్ఞులను శుభ లగ్నము నిర్ణయింపుడన వా రాలోచించి ఆ నాల్గవనాటి యుదయమునకు లగ్నముపెట్టిరి.

అప్పుడు దేవరాయలు బంగారు పొదిగిన స్ఫటికాక్షమాల యొకటి తెప్పించి, వామన మూర్తిని వర్ణించిన బాలవటుక కవికి సభాపతిముఖమున కర్పూర తాంబూల పురస్సరముగా సర్పింపజేసెను. సభాపతి దాని నాతని మెడలో సలంకరింపగా పోతన దానిత్రోతవిబింబము గళాభరణ మైనప్పటి వామన రూపమునే తలపించెను, పోతన భక్తిత్రోసభకు నమస్కరింపగా, సభ్యులు 'నీ కవితాతిశయము కూడ తిక్కనవారి తారమువలెనే ప్రవర్తిల్లుగాక!' అని యాశీర్వదించిరి.

సభ చాలించుటకు ముందు సభాపతి శ్రీ దేవరాయప్రభువుల నూతనశాసన మొకటి ప్రకటించెను.

'ఇక ముందు శ్రీవిద్యానగరాస్థానములో ఆంధ్రభాషాకవులకు కర్ణాటభాషాకవులతోపాటు సమానగౌరవాదరములు లభింపగలవని శ్రీ దేవరాయ ప్రభువులు ప్రకటించుచున్నారు.'

౨౦

దక్షిణాధీశ్వరుని ముత్యాలశాలలో శ్రీనాథభట్టుకు కనకాభిషేక సన్నాహములు కావించిరి. దేవరాయలు సింహాసన మధిష్ఠించెను. రాయల సమ్ముఖమున ఐదు విండ్లు దూరమున, ముత్యాల ముగ్గులు తీర్చిన మండపముపై ఆసంది * వేసిరి. ఆ మండపమునకు మూడు వైపుల బారున మెట్లు కలవు. దానిప్రక్క మరియొక మండపముపై దీనారటంకాలు రాశిపోసియున్నవి. అభిషేకలగ్నమునకు గడియ ముందుగా సభాపతి దేవరాయల యనుజ్ఞ గొని శ్రీనాథుని తోడుకొనివచ్చి ఆసందిపై నాసీనుని గావించెను. స్వస్తివాచనమైనది. సభాపతియు రాజపురోహితుడును సుబ్రహ్మణ్యక్షౌతిని కలుపుకొని శ్రీనాథభట్టారకుల సామ్రాజ్యాభిషేకమునకు సంకల్పముచేసి, ఐదు బంగారు కలశములలో సామ్రాజ్యదేవతను ఆవాహన మొనర్చిరి. లగ్నవేళ సమీపించగానే, 'కవి సార్వభౌమ

---

* వైదికమైన అభిషేకము చేయుటకు వేసెడి మంచమువంటి పవిత్రాసనము.

శ్రీనాథభట్టు' అను నక్షరములు నవరత్నములతో మనోజ్ఞముగా పొదిగియున్న కనకపట్టును శ్రీనాథభట్టు పాలభాగమున రాజపురోహితుడు కట్టెను. విద్యాధికారి అరుణగిరినాథ డిండిమభట్టును, ప్రాడ్వివాకుడు చంద్రభూషక్రియాశక్తియు, పరిషత్సభ్యులు పదిమందియు, సామ్రాజ్యకలశోదకములు ప్రోక్షించిన దీనారటంకాలు తను దోసిళ్ళలో గ్రహించి, శ్రీనాథుడున్న మండపమునకు మూడు ప్రక్కల గల మెట్లపై సిద్ధముగా నిలుచుండిరి. శ్రీనాథుడు లేచి రాజపురోహితునకును, సభాపతికిని, సుబ్రహ్మణ్యశ్రోత్రియుని పాదాభివందన మాచరించి మరల నాసందిపై గూర్చుండెను.

లగ్నవేళ సూచించు శంఖారావము మ్రోయుచుండగనే రాజపురోహితుడు దోసెడు టంకాలు దేవరాయప్రభువుకడకు కొంపోయి, తనదోసిలిని స్పృశింపజేసికొని శీఘ్రముగా వచ్చి, శ్రీనాథుని ముందు నిలిచి, సామ్రాజ్యమంత్రము ఓంకార పురస్సరముగా నందుకొని, తన దోసిలిలోని దీనారములతో శ్రీనాథు నభిషేకించెను. సభాపతియు, సుబ్రహ్మణ్యశ్రోత్రియుడు తక్కినవారును పురోహితునితో బాటు సామ్రాజ్యమంత్రము నందుకొని, దీనారటంకాల నభిషేకించిరి. ఆతర్వాత పరిషత్సభ్యులు ఖాళీచేసిన మెట్లనూడికి శతావధానసభలో పృచ్ఛకులుగా నున్న నూటఎనిమిదిమందియు పదులు పండ్రెండ్లుగా వచ్చి దోసిళ్ళతో రాశిలోని దీనారటంకాలు తీసికొని సామ్రాజ్యమంత్రశ్రుతికి తోడుపలుకుచు నభిషేకించిరి.

ఆనాఁడు శ్రీనాథుఁడు ధౌతవస్త్రములు ధరించి యుండెను. బంగారుచాయగల ఆతని శిరస్సునుండి పాదములవరకు సువర్ణ దీనారములు ధారలు కట్టుచుండ, చూపరులకు మేరునగమువై కనకధారాభిషేకము జరుగుచున్నట్లే నేత్రపర్వము కావించెను. శ్రీనాథుని ముఖమున గర్వముగాని, సంతోషము కాని కనిపించలేదు. ఆతడు సర్వాత్మనా బ్రాహ్మీధ్యాన తత్పరుడై ఆ కనకాభిషేకము తన ధ్యేయమూర్తియగు భారతీదేవతకు జరుగుచున్నట్లే భావనచేసెను,

కనకాభిషేకానంతరమున దేవరాయల యనుజ్ఞతో రాజపురోహితుడును, సభాపతియు, అరుణగిరినాథ డిండిమ భట్టును, చంద్రభూషక్రియాశక్తియు ఒక్కొక్కరు మున్నగువారు వరుసగా 'శ్రీనాథభట్టు కవిసార్వభౌముడుగా నభిషిక్తుడయ్యెను' అని సభలో నుద్ఘోషించిరి. పురోహితాది వేదవిదులు పృథివిని అంతరిక్షమును, దినమును, దిక్కులను, అప్పులను, ఓషధులను వాక్కును, ఋగ్యజుస్సామములను, సమస్తదేవతలను సంబోధించుచు శ్రీనాథుని కవిసార్వభౌమునిగా నభిషేకించితి మని సమస్తలోకములకు ప్రకటించు వైదిక మంత్రములతో కలశోదకముల నాతని నభిషేకించిరి. వేదవిదుల యాశీర్వచనములతో కనకాభిషేకము పరిసమాప్తమైనది. శ్రీనాథుఁడు దేవరాయల నిట్లు కీర్తించెను.

'ఖండేందుమౌళిపై గలహంసపాళిపై
గర్వారభూళిపై గాలు ద్రవ్వ

మిన్నేటి తెరలపై మించు తామరలపై
మహిమ మించు నుగులపై మల్లరించు
జంభారిగజముపై జంద్రికారజముపై
జందనధ్వజముపై జొకళించు
ముత్యాల సరులపై మొల్ల క్రొవ్వాకులపై
ముదికల్పతరులపై మోహరించు

వెండిసులయెక్క శేషాహి వెన్నుదన్ని
తొడరి దుగ్ధాబ్ధి తరగలత్రోడ నడరి
నిరతనంబాడి నీకీర్తి నిండె నహహా,
లక్ష్మణోపేంద్ర, దేవరాయక్షితీంద్ర !''

అంతట సభికేకించిన దీనారటంకాల నన్నిటిని ముత్యాల శాలమునింగిట కాచుకొనియున్న అశేష దీనానాథజనములకు రాజసేవకులు వెదజల్లి పంచిపెట్టిరి.

* * *

నూతుదినముల పిన్నట రాయలు కవిసార్వభౌముని వేకాంతమందిరమునకు పిలువనంపెను. అప్పుడు ప్రధానితప్ప మరి ఎవ్వరు నక్కడ లేరు. సంభాషణము ముఖ్యముగా ప్రధానియే సాగించెను. పెదకోమటి వేమప్రభువును యువరాజు రాచవేమనను సింగనప్రధానిని గూర్చి ప్రస్తావించి, అక్కడి విద్వాంసులనుగూర్చికూడ ప్రశ్నించిరి. వేమప్రభువులు తమ కేమైన ప్రత్యేకసందేశము పంపియున్నచో ప్రభువు లాలకించ

సావధానచిత్తులై యున్నారనిరి. శ్రీనాథుడు తనచే నట్టి సందేశ మేదియు పంపలేదని సూచించి, 'తమరు గహస్యసందేశ మేమైన పంపదలచినచో నందీయగల' ననెను.

ప్రధాని కొంత తటపటాయించి రాయల కనుసన్న గ్రహించి ఇట్లనెను—"మీబోటి విద్వాంసుల నభిమానించు చున్నందున రాయలవారికి వేమప్రభువులపై సదభిప్రాయ మతిశయించినది. వారి రాజ్యము అన్నివైపుల ఒత్తిడిపడు చున్నది. వాను నామకఃరాయలవారి సామంతులగుటకు అంగీకరించునెడల, వారి ప్రస్తుత రాజ్యమునకు వినుకొండ కందుకూరు రాజ్యములు కూడ కలిపి, కొండవీటిరాజ్యమును వృద్ధిచేయుటకు రాయలవారు సుముఖులుగా నున్నారు. మరి వారి కిది రుచించునో లేదో! మీరే ఇట్టి శుభవార్త చేర్చుటకు యోగ్యులని తోచినది."

శ్రీనాథుడు గంభీరముగా 'దేవరవారి సందేశము పరమ గోప్యముగా మా ప్రభువులకు స్వయముగా గాని సింగన ప్రధాని ముఖమునగాని చేర్చెద' నని మాటయిచ్చెను.

పిమ్మట రాయలే సంభాషణ మారంభించెను. 'కవి సార్వభౌమా! విద్యానుల్లకు పర్వతమల్లకు మల్లయుద్ధ మేర్పాటుచేసి, వినోదింప మాకిచ్చ గలిగినది. మీరు అవధానములో విద్యానుల్లు కిచ్చిన సమాధానమువలన ఏదో విశేష మున్నదని గమనించి, అప్పుడాప్రస్తావమునుండి విరమించితిమి. అరిదమలోని శృంగారరహస్యము మేము వినదగునా?'

వెంటనే శ్రీనాథుడిట్లనెను. 'మహాప్రభువులకు తనుకు తెలుపగూడని ధర్మమేమున్నది! తనుకంటె దేహబలము ఎన్నో రెట్లు అధికముగా నున్నవారిని జయించుటకు పూర్వకాలమున గోపవిద్యాసంప్రదాయము వెలసియుండెను. ఆ రహస్యము గర్గాచార్యులవలన బలరామకృష్ణులు గ్రహించి, అవలీలగా కువలయాపీడమును చాణూరముష్టికులను సంహరించిరి. ఆ రహస్యము మరి ఎవ్వరికి నుపదేశింపగూడదని బలరామకృష్ణులు శపథములు చేసికొనిరి. దుర్యోధనమహారాజు బలరాముడు మదిరాపానమత్తుడైయున్న సమయమున, మోసముచే ఆ రహస్యము సంపాదించెను. కురుక్షేత్రసంగ్రామములో దుర్యోధనుడు బహూపర్యాయములు గోపవిద్య ప్రయోగించినను, వెంటనే భీమసేనుని వజ్రకాయమును నొప్పించలేక పోయెను. తుదిగదాయుద్ధములో భీమసేనుని వజ్రకాయము జముకుచుండుట గమనించియే, శ్రీకృష్ణుడు ఊరుభంగము సూచింపచేసెను. ఆగ్రహించిన బలరామునికి దుర్యోధనుని మోసము తెలిపి, శ్రీకృష్ణుడాతని శాంతింపజేసెను. యుధిష్ఠిరుడు చక్రవర్తియై శ్రీకృష్ణోపదేశమున గోపవిద్యను నిషేధించుచు శాసనము చేసెను. తదాది భరతఖండములో నీ విద్య విస్మృతప్రాయమైనది. అప్పుడు నిష్కాసితులైనవారివలన విదేశములలో నక్కడక్కడ నిలిచి, ఈనుధ్య పాగశీకాగతుల నుండి విద్యామల్లులకు సంక్రమించినది.

'ఈ గోపవిద్యలో మల్లవిద్యానైపుణ్యము లేదు. ఏదో విధముగా ప్రత్యర్థి ఆయువుపట్టు నొక్కి మూర్ఛిల్లజేయుటే

దాని రహస్యము. దీనికి ప్రతిక్రియగా దేహమునకు వజ్రలేపము పూసికొనుటకూడ అధర్మమే. గోపవిద్యచే మల్లక్రీడ మల్లులకు ప్రాణాంతక మగును.'

దేవరాయ లాలకించి విద్యామల్లులతో మల్లయుద్ధము ప్రస్తావన వదలి పర్వతమల్లు విద్యాప్రదర్శనము చూడవలెనను కోరిక కలదనెను. అంచులకు శ్రీనాథుడు, 'పర్వతమల్లునంటి భీమబలులు లోకమ్ములో అరుదుగా జన్మించుచుందురు. అతనిని ప్రతిఘటింపగల మల్లులు ఉండరు. అతని బలప్రదర్శనము చూచి తాము వినోదింపనచ్చును' అనెను.

దేవరాయలు త్వరపడుచుండగనే పర్వతమల్లు బలప్రదర్శనసభ కావించెను. దానికి పెద్దలతోబాటు విద్యానగరములోని ప్రధానమల్లు లందరు సాహూతులైరి. విద్యాస్థుల్లుకూడ వచ్చిరి.

ఆ సభలో రంగములోనికి వచ్చి పర్వతమల్లు ముందు శ్రీనాథుని ప్రస్తావనసమయమున వేమప్రభువుకు చూపిన ప్రదర్శనము లన్నియు ప్రదర్శించెను. ఆ పిమ్మట బండి యొకటి తెప్పించి, యందులో పట్టినంతమంది బలాఢ్యులను కూర్చుండ జేసి, దానికి బలిష్ఠములగు నాలుగునృషభములు పూన్చిరి. దాని వెనుకపట్టుకు కట్టిన త్రాళ్ళు పర్వతమల్లు నడుముకు కట్టుకొని, చేతులతో పూని నిలుచుండెను. ఎంత అదలించి తోలినను ఆరెండుజతల యెడ్లును అడుగైన ముందుకు వేయ లేకపోయెను. కొంతవడికి నవ్వుచు ఆ బండిని పర్వతమల్లే వెనుకవెనుక కీడ్చుకొని పోయెను.

ఆత డంతట ఏనుగుపాలెము దారిలో పట్టిన ఎలుగుబంట్లను తెప్పించి రెండుచేతులతో రెంటిని పిల్లికూనలను పట్టినట్లు పట్టి, రెండు బాహువులు చాపి నిశ్చలముగా నిలిచెను. అది చూచి మల్లురందరు విభ్రాంతి నొందిరి.

ఆతడు చివరకు కావించిన ప్రదర్శనము విద్యానగర ప్రజలు కొన్ని తరముల వరకు మరచిపోలేదు. పర్వతమల్లు నేలపై బోర్లపండుకొనెను. వీపున మెడవద్ద మూరెడు మేర బలిష్ఠమైన పలకయు, దానిపై మెత్తలును పెట్టించుకొనెను. ఆ మెత్తలమీద సూటిగా నడచుటకు సుశిక్షితమైన గజ మెంతటి దైనను నడిపింపు డనెను. దేవరాయలది ప్రాణాంతక మగునని అనుమతించుటకు ముందువెనుకాడెను. అడుగు ప్రక్కకు తప్పనిచో ప్రమాదమురాదని పర్వతమల్లు ప్రతిజ్ఞ చేసిన మీదట చిన్న గజమును పోనిచ్చుటకు రాయలు సమ్మతించెను. రాయల గజశిక్షకుడు ముందొకచిన్న గజమును నడిపించెను. ప్రమాదము రాలేదు. రెండవసారి అంతకంటె పెద్దగజమును నడిపించెను. పర్వతమల్లు చెక్కు చెదరలేదు. మూడవమారు మహాగజమును తెచ్చిచూపగా పర్వతమల్లు నడిపింపుమనెను. చూచువారికి కన్నులు తిరిగెను. అప్పుడు రాయల రాజదూత ప్రభుశాసన మీ రీతి ప్రక టించెను.

'ఈ మహాగజమునుగూడ దూదిపింజెనలె ఈ మల్లుడు భరింపగలడు. ప్రేక్షకులకు మూర్ఛరాగలదు గనుక దీనిని రాయలవారు నిషేధించుచున్నారు. పర్వతమల్లు నేడు చూపిన

శక్తిప్రదర్శనములతో సమానముగా మరి ఎవరైన ప్రదర్శింప గలనా రున్నారా?'

ఎనమ ముందుకు రాలేదు. దేవరాయలు పరమానంద భరితుడై పర్వతమల్లు నగ్గించి, 'అప్రతిమల్ల మల్లశేఖర' అను బిరుదము సభాముఖమున ప్రకటించి, పట్ట పత్రికలు ఆ మనుజాడే ప్రసాదింతుమని తెలిపి పుష్కలధన మొసగి సంభావించెను.

౨౧

శ్రీనాథ కవిసార్వభౌముడు కొండపీటికి తిరుగు ప్రయాణమునకు తొందరపడుచుండెను. విద్యానగరములో నాతని నందరు సపరివారముగా విందులకు పిలుచువారే, వస్త్రాదులతో సమ్మానించువారే. అందరు కాదనుటకు వీలులేనంత ప్రముఖులే. కటకపాలుడును, వల్లభరాయడును, ఒకనాడు వచ్చి, తనతో ముందు చెప్పనిది, ఆతని తిరుగుప్రయాణము చేయవద్దనిరి.

అనచిదేవయత్రిపురారి రాయలవారికి కాంభోజాశ్వములు కొప్పించిపెట్టు బేహారము సందర్భమున నచ్చెను. అది ముగించుకొని వెళ్ళచు, నాతడు శ్రీనాథుని జూడవచ్చి, పుష్కలముగా చోడంగికస్తూరి, పంజార కర్పూరము, గోవాసంకుమదము, కాశ్మీరకుంకుమరజము ఇత్యాది సుగంధ

ద్రవ్యములు బహూకరించి, ఇంతవాడైనందుకు ప్రేమ పూర్వకమగు తన యానందము తెలిపి, కొండవీడు చేరిన తర్వాత వీలైనంత శీఘ్రముగా తప్పక కాంచీనగరము వచ్చి తనయొద్ద కొంతకాల ముండవలె నని యాహ్వానించి మాట తీసికొని వెళ్ళెను.

పంట మైలాకుదెడ్డి కందుకూరుకు వెళ్ళుచు, శ్రీనాథుని తనయాస్థానమునకు వచ్చి తప్పక ధన్యుని గావింపవలెనని ప్రార్థించెను. మున్నుకవియింటిలో గోష్ఠికి చేరు బహుభాషా కవుల ప్రసంగములతో విసిగి నారణప్ప తరచుగా కొండ వీటి విడిదికి వచ్చి దుగ్గన పోతనలతో జట్టుకట్టుచుండెను. వారికి ఒండొరులయందు ప్రేమ యతిశయించుచుండెను. త్వరలో ఎడబాటు రానున్నదని నా రెరిగినందున ఎక్కువ కలసి మనసార మాటాడుకొనుచుండిరి. వారిలో వయస్సులో మూడు నాలుగేళ్ళు నారణప్ప పెద్దవాడు. తన బావ యొద్ద వ్యాకరణాలంకారశాస్త్రములు అధ్యయనము చేయుచున్నం దున దుగ్గన ఎక్కువపాండితికలవాడు. పోతన ఊహలు హృదయ ములో నాటునట్టి వగుటచే, ఆతని మాటలకు శక్తి ఎక్కువ. వారి ప్రసంగము లెప్పుడును కవిత్వమునకు సంబంధించినవే. ఒకనాటి అపరాహ్ణవేళ వారు ముగ్గురు విడిది ముందున్న ఆవరణలోగల చల్లని మామిడిగున్న నీడలో కూర్చుండి ఉత్సాహముతో ప్రసంగించుకొనుచుండిరి. పోతన తాను చెప్పిన ఈ పద్యము చదివెను.

"కొందరికి తెనుగు గుణముగు
కొందరికిని సంస్కృతంబు గుణముగు రెండున్
కొందరికి గుణములగు నే
నుదర మెప్పింతు గృతుల నయ్యిద్దరలన్"

నారణప్ప ఆహా యని మెచ్చుకొనెను. దుగ్గన వెంటనే ఆపద్యము దుయ్యబట్టెను.

'సహజపాండిత్యా, నీ పద్యము ఎంత పేలవముగా ఉన్నదో చూడు! సరిగా ఇదే భావము బాన ఎంత ప్రౌఢిగా ఎంత హృదయంగమముగా చెప్పినాడో చూడు!' అనుచు 'ప్రౌఢి బలికింప సంస్కృతభాషయండ్రు—' ఇత్యాది పద్యము చదివి రెండింటిని పోల్చి, ఒకే భావము విద్వాంసులు చెప్పు పద్ధతికి, అవిద్వాంసులు చెప్పుపద్ధతికి, భేద మిట్లే యుండునని వివరించెను. నారణప్ప విని 'నిజమే' అనెను. పోతనకూడ ఒప్పుకొనక తప్పలేదు కాని, అతనికి మనస్సు నొచ్చినది. ఉడుకుబోతుదనము నచ్చినది.

దుగ్గన శ్రీనాథుడు డిండిమభట్టు పైని సాధించిన విజయము ప్రస్తావించి పొంగిపోవుచుండెను. వెంటనే పోతన అందుకొని 'దుగ్గా, కవిత్వము యుద్ధమునంటి దనుకొన్నావా, గెలుపోటములకు! డిండిమభట్టు ఏమంత కవి యేమిటి? ఒక్క ప్రహసనకర్త. అదీ విరూపాక్షస్వామి ఉత్సవాలను వర్ణించి నవ్వే బూతుల ప్రహసనము! ఇక బాన మహావిజయము స్తుతికావ్యముతో! అది క్షుద్రకావ్యమని బావే ఒప్పుకొన్నాడు గదా!' అనెను.

నారణప్ప ఏకీభవించి 'మహాకావ్యములు వ్రాసినవాళ్ళేకదా మహాకవులు!' అనెను.

దుగ్గన చిన్నపుచ్చుకొని, 'బాన శతావధానముచేసి కనకాభిషేకము పొందలేదా! అంత గౌరవము ఎవరికి కలిగినది!' అనెను.

పోతన 'పగటిమాటికే శతావధానము సంగతి ఎత్తబోకు! అందులో బాన శాస్త్రపాండిత్యమూ, అద్వితీయమైన జ్ఞాపకశక్తీ ప్రదర్శించినాడు. దానికీ కవిత్వానికీ సంబంధమేమిటి? మనము కవిత్వము సంగతి మాట్లాడుతున్నాము.'

నారణప్ప అందుకొని 'శతావధానమునాడు యోగశాస్త్ర ప్రస్తావనలో 'అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వరత్నోపస్థానం సిధ్యతి' అని కవిసార్వభౌములు ప్రవచించినది ఎంతోనచ్చినది. పతంజలియోగసూత్రములోనిదట. నేను యోగసూత్రము చెప్పుకొనదలచినాను. ఏకోరికా లేనివారికి అన్ని కోరికలూ సిద్ధిస్తవని నా బుద్ధికి తోస్తున్నది. దాని విషయమే మననము చేస్తున్నాను. శ్రీనాథభట్లు ఇంత కష్టపడి డిండిమములను ఓడించి దుష్కరమైన శతావధానము చేసి, ప్రభువులను అడిగి కనక స్నానము చేయించుకొన్నారు. మన పోతన్నకు కోరికేలేదు. భగవంతుడు శ్రీనాథభట్లచేత ఆ పద్యాలు చదివించడమేమిటి? ఈ అమూల్యమైన స్ఫాటికమాల దేవరాయలు పోతనకు

అర్పించడమేమిటి? నాకాశ్చర్యము కలిగిస్తున్నది. కనకస్నానము కంటె ఇదే నాబుద్ధికి గొప్పగౌరవంగా కనిపిస్తున్నది' అనెను.*

పోతన సిగ్గుతో, తలవంచుకొనెను. దుగ్గన శ్రీనాథుని యందు అభిమానముతో 'అంతమంది విద్వాంసులు కలసి భావను కవిసార్వభౌము డైనాడని ప్రకటించి, ముల్లోకముల లోని దేవతలకుకూడ తెలిపినారు గాదా!' అనెను.

నారణప్ప నవ్వుచు, 'అది గొప్పగౌరవమే కాని, కవితాశక్తికీ గౌరవాలకూ, సంబంధ మేమున్నది. వాల్మీకికి వేదవ్యాసులకు బిరుదము లేమున్నవి!- ఐనా ఇంకొక విశేషము గమనించావా? ఇంత మంది కలసి కనిసార్వభౌముడు చేసిన మీ బావే పోతన్నను సహజపాండిత్యబిరుదముతో గౌరవించ లేదా! నా దృష్టిలో ఈ బిరుదమే గొప్పది' అనెను.

మరల పోతన లజ్జావిష్టుడై మిన్నకుండెను. దుగ్గన హేళన చేయుచు 'మన సహజపాండిత్యుని పద్యము బండారము ఇందాక బయట పెట్టినాను గదా! పండితుల మార్గము వేరు. సహజపాండిత్యులది వేరు. బావ రచనావైవిధ్యము ఎంత గొప్పది' అనెను.

---

* ఈ సందర్భములో నారణప్ప ఆతర్వాత సుమారు పది సంవత్సరములకే కర్ణాటభాషలో భామినీషట్పదీ వృత్తమున వ్యాసభారతము పది పర్వములు వ్రాసి కుమారవ్యాసుడని గౌరవనామ మందె నని గుర్తించుకొనవలెను. ఆంధ్రులకు పోతనవలెనే ఆతడును కన్నడులకు ప్రీతిపాత్రుడు. ఇద్దరు తమ మహాగ్రంథములను భగవదంకితముగా చెప్పినవారే.

పోతన కిప్పుడు మాట పెకలినది. 'దుగ్గా, బావ మనో విచ్ఛాంసుడు ఆయన కవిత్వము నానద్ది అంతగా పొగడవద్దు.'

దుగ్గన కోపముతో వినక్షనదనుడై 'పోతా, నీకుకూడా బావకవిత్వమంటే ఈర్ష్య కలిగిందా' అనెను. నారణప్ప వినోదముతో నాలకించుచుండెను.

పోతన వెంటనే జవాబిచ్చెను. 'చనటా, బావమీద నాకు ఈర్ష్యా? సమాచులలో ఈర్ష్య ఉంటుంది. పసివాణ్ణి నాకు ఈర్ష్య ఏమిటి? బావకవిత్వములో ఆయన భాషాపాండిత్యమూ, శాస్త్రపాండిత్యమూ తప్పితే, కవిత్వ మేమున్నదో చెప్పు, చూతాము!'

దుగ్గన, "నచియింతు వేములవాడ భీమునభంగి" ఇత్యాది సీసపద్యపాదాలు చదివి, 'భీమునవలె వ్రాయగలడు. నన్నయ వలె చెప్పగలడు, తిక్కనవలె కూర్చగలడు. ఎఱ్ఱయవలె గూడ సంబంధింపగలడు – ఇంత కవి ఆంధ్రభాషలో పుట్టలే దిప్పటికి!' అనెను.

'అదే బావ లోపము! వారినవలె వీరి నవలె చెప్పగలడు— తనవలె చెప్పలేడు! ఆయన విద్వత్తు కవిత్వాన్ని హరించి వేసింది' అనెను పోతన.

దుగ్గన: 'కవిత్వములో విద్వత్తుకంటె ఏముంటుందో?'

పోతన: 'నారణప్పా, నీవన్నా వీడికి కవిత్వమంటే ఏమిటో కాస్త చెప్పరాదూ! పాండిత్యము లేనివాడు ఎంత మంది ముచ్చటగా కవిత్వం చెప్పడము లేదు?'

నారణప్ప : 'నిజమే, పాండిత్యాలూ, లోకానుభవమూ కవితకు మెరుగులు పెట్టగలవు. అది వ్యుత్పత్తి. అసలు కవితకు మూలకారణము ప్రతిభ, పూర్వపుణ్యమునల్ల జన్మతఃి పుట్టేది. అది కవితకు ఆత్మను ఇస్తుంది. వ్యుత్పత్తి శరీరసౌష్ఠవము వంటిది– అబ్బా, మా బావ ముమ్మనకవికి ఎంత శాస్త్రజ్ఞానము లోకజ్ఞానము ఉన్నవి. ఒక్క–పద్యం బాగుంటే ఒట్టు కదా !'

పోతన : 'వింటున్నావా దుగ్గన్నా, నారణప్ప బంగారు మాటలు !— కుమారవ్యాసుడవుతావు.'

దుగ్గన : 'నాకు ప్రతిభా వ్యుత్పత్తుల సంగతే తెలియదంటావా ? – ముమ్మనభట్టు–'

పోతన : 'అబ్బా, ఈ పుస్తకాల మాటలు అప్పగించేనాళ్ళ కర్మమింతే ! తీర్థానికి తీర్థమే, ప్రసాదానికి ప్రసాదమే – ఎప్పుడైనా పంచకోశాలసంగతి విన్నావా ? తైత్తిరీయములో ఆనందవల్లి భృగువల్లి ఎన్నడైనా నిన్నావా ?'

దుగ్గన : 'నేనా, నీవా ? ఆ ఉపనిషత్తు అంతా నోటికి వచ్చు. అది వేదాంతవిషయము. దానికీ కవిత్వానికీ సంబంధ మేమిటి ?'

ఇట్లనుచు అప్పచెప్పటకు ముందు ఆనందవల్లి శాంతి ప్రారంభించెను.

పోతన : 'చాలు చాలు ! వింటున్నావా, నారణప్ప మన దుగ్గన తెలివితేటలు !'

జన్మతఃి కవియైన నారణప్పకు ఆకస్మికముగా గ్రుడ్డిమెరపు వలె పోతనభావము స్పష్టాస్పష్టముగా స్ఫురించినది. అత

దుర్గతో పోతన నివరణమునకు ఎదురుచూచుచుండెను. దుర్గన కొంత కోపముత్రోను, కొంత వికటముగాను, 'నీ కొత్త వ్యాఖ్యాన మేదో వెలిగించు, విందాము' అనెను.

పోతన స్వప్నావస్థలోనుండి పలవరించుచున్న వానివలె పలుకసాగెను. 'ఈ సాహిత్యవేత్తలు రీతులు, అలంకారాలు, గుణాలు, దోషాలు, అనే మాటలకంటె నన్ను రాత్రింబవళ్లు, రసము, రసము అనే మాట కలత పెట్టుచున్నది. రసము కూడా స్థాయిభావమూ సంచారీభావమూ అంటూ ఏమేమో సూక్ష్మంగా, కసాయివాళ్ళు మేకపిల్లను ఖండించి నట్లే, ముక్కలుముక్కలుచేసి వివాదపడు తూంటారు. ప్రసిద్ధమైన రామాయణాది మహాకావ్యాలకు ఈ రసవాదాలు, ధ్వనిభేదాలు అన్వయించడానికి నానాయాతనలు పడతారు—'

దుర్గన అడ్డువచ్చి, 'ఏమిటీ ఉపన్యాసము! పంచకోశాలకూ దీనికి సంబంధమేమిటి?' అనెను.

పోతన: 'నిజమే దుర్గా, మనస్సు ఎందుకో చలించింది. కొందరు కవులకు శబ్దశక్తి మాత్రమే ఉంటుంది. వారి కవిత అన్నమయకోశానికే అంటుతుంది. కొందరికి అర్థశక్తికూడా ఉంటుంది. వారిది ప్రాణమయకోశానికి వ్యాపిస్తుంది. మరి కొంతమందిది శబ్దార్థాల జోడింపుతో సూక్ష్మమైన నేర్పుచూపి మనోమయకోశానికికూడా ప్రవర్తిస్తుంది. భావకవిత సాధారణంగా అన్నమయ, ప్రాణమయకోశాలు దాటదు. ఎప్పుడో మనోమయకోశంలోనికి వెళ్ళి, వెంటనే వెనక్కు గిలుక్కున మళ్ళుతుంది.'

దుగ్గన నారణప్పలు ఆలోచనలో పడిరి. పోతన కన్నులు మూసికొని ప్రస్తావింపసాగెను. 'పూజ్యుడగు తిక్కనసోమ యాజికి అభిమానమైనది మనోమయకోశము, అప్పుడప్పుడు విజ్ఞానమయకోశమును స్పృశించును. అంతకంటె నన్నయ విజ్ఞానమయకోశములో ఎక్కువ విహరించును. ఎర్రయ విజ్ఞానయోగి. సర్వసాధారణముగా ఆయన విహారప్రదేశము విజ్ఞానమయకోశము. తన కావ్యము నందుకే విజ్ఞానాత్మక వాఙ్మయమన్నాను - ఆనందమయకోశములో విహరించి విహరింపజేయగలవాడు మహర్షులు - వాల్మీకివ్యాసులే!'

దుగ్గనయు నారణప్పయు పోతనవలెనే స్వప్నలోకములో విహరించుచున్నట్లు మౌనముద్రాంకితులై యుండిరి.

ఇంతలో విడిదిలో సందడియైనది. రాజనాథకవి భార్యతో కలసి వచ్చి, ఆ మునునాడే తమ పిత్రపాదులు ఉగ్రరథశాంతి ప్రారంభించుచున్నారని శ్రీనాథునితో పండితులను ఆహ్వానించెను. పత్నిలోనికి జని శ్రీదేవిని స్త్రీజనమును బొట్టుపెట్టి పిలిచెను. రాజనాథు డందరిని తప్పక రానలెనని మరిమరి చెప్పి, ఎవరికొరకో వెదకుచున్నట్లు దిక్కులు చూచుచుండెను. శ్రీనాథు డెనసు కానలెనని ప్రశ్నించగా, నాతడు 'ఆర్యా, మా నాయనగారు, అమ్మగారు, మీ బ్రహ్మచారి శిష్యులను ప్రత్యేకాదరముతో పిలిచి రమ్మన్నారు. ఒకప్పుడు పిత్రపాదులు తోందరపడి ఆగారవించినారట, ఏరీ వారు?' అనెను.

'వాళ్ళు కుర్రవాళ్లు, అగౌరనించు టేమిటి! ఏదైనా పెద్దల అనుగ్రహమే. ఆ మానిడిచెట్టు నీడను కూర్చుండి నా కవిత్వాన్ని దయ్యబట్టుచున్నారు. – పోతనా, దుగనా!' అని శ్రీనాథుడు పిలిచెను. పోతన దుగ్గనలును వారితో నారణప్పయు వచ్చిరి.

రాజనాథకవి పోతన దుగ్గనలను రెండు బాహువులతో పొదివి శిరస్సులు మూర్కొని, 'మా పితృపాదులు ఉగ్రరథ శాంతి చేసికొనుచున్నారు. వెనుక జరిగినది విస్మరించి మీరు తప్పక రావలె సుమా!' అనెను. వా రిద్దరికి కన్నులలో నీరు తిరుగుచుండుట గమనించి, వెంటనే తన యుత్తరీయపు చెరగుతో వారి కన్నులు తుడిచి చెరియొక చేతితో ఇదరి గడ్డములు పట్టి ముఖములు పైకెత్తి 'నాన్నగారి కోపము ఆశీర్వాదమువంటిగి. మీరు తప్పక వృద్ధిలోనికి వచ్చెదరు. మా అమ్మగారు కూడ ఆదేశించినది. తప్పక రావలె!' అనుచు మరల శిరస్సులు మూర్కొనెను. వారిద్దరు శ్రీనాథుని వంక చూచుచు సరే అనిరి. రాజనాథుడు నారణప్పనుకూడ ఆహ్వానించెను.

స్త్రీజనము నాహ్వానించుటకు లోనికేగిన రాజనాథుని పత్ని అభిరామకామాక్షి ఎంతసేపటికిని బయటికి రాలేదు. రాజనాథు డించుక తొందరతో నిరీక్షించుచుండెను. శ్రీనాథు డాలకింపగా నొక క్రొత్తకంఠము, తా నంతకుమున్ను విని యుండని గ్రంథస్థశ్లోకములు చదువుట వినవచ్చుచున్నది. అవి రామకథను వర్ణించుచున్నవి.

'అపూర్వాభిరామముగా నున్న యాశ్లోకము లే గ్రంథములోనిని?' అని శ్రీనాథుడు ప్రశ్నించెను.

'ఓహో! డిండిమభట్టారకుల కోడలిగారిని ఎవరో చదువమని అడిగినట్లున్నారు. ఆమె తాను రచించుచున్న అభినవ రామాభ్యుదయ కావ్యము వినిపిస్తున్నట్లున్నది. ఈనాడు మేము ఇక పిలుపులకు వెళ్ళినట్లే!—' అనెను రాజనాథుడు. తన భార్యకు వినిపించుటకై చివరిమాట లాతడు బిగ్గరగా పలికెను.

ఆ తర్వాత రెండు మూడు శ్లోకములు మాత్రమే చదివి ఆమె ముగించి స్త్రీ జనమునొద్ద సెలవు తీసికొని బయటికి వచ్చినది.

ఆ మరునాటినుండి అరుణగిరినాథ డిండిమభట్టు పంచాహ దీక్షగా షష్టిపూర్తి శాంతి చేసికొనెను. జపములు, హోమములు, పూజలు, దానములు, స్నపనము, బ్రాహ్మణభోజనము మహావైభవముగా జరిగెను. శ్రీనాథాదులు విద్యానగర విద్వాంసులు, కవులు, ఉద్యోగులు అందరు వచ్చి ఆక్రతువుకు శోభ చేకూర్చిరి.

౨౨

ఒకనాడు సింగనప్రధాని పంపిన పత్రము అంచెగుర్రముల మీద శ్రీనాథునకు వచ్చినది. అందులో నిట్లున్నది :

'శ్రీనాథభట్టా, మీ విజయము, కనకాభిషేకము మా కందరికి అమండానందము చేకూర్చినవి. వేమప్రభువులు విజయోత్స

వములు చేయించి, కులదేవత యగు నందికంత పోతరాజుకు ప్రత్యేకోత్సవములు కావించుచున్నాను. ప్రభువులు మిమ్ము చూచుటకు తహతహ లాడుచున్నాను. వెంటనే బయలుదేరి రావలసినది. వామనభట్టబాణుల ఆనందము విపరీతముగా నున్నది. మతిభ్రమణము కలుగునేమో యని భయమగు చున్నది.—మీవిడి సింగన ప్రధాని.'

అది యందిన వెంటనే శ్రీనాథుడు తెలుగురాయని దర్శించి, తన తిరుగు ప్రయాణమునకు ఏర్పాట్లు చేయ వేడెను. నాటి నుండి మూడవనాడే వల్లభరాయడు వినుకొండకు ప్రయాణ మగుచున్నాడని, ఆయనతో కలసి వెళ్ళుట క్షేమమని, కటక పాలుడు తెలిపెను. ఆ వ్యవధానములో శ్రీనాథుడు దేవరాయల దర్శించి అనుమతి పొంది, మున్నీకవిని, లింగనచయనులను, డిండిములను, కవులను, విద్వాంసులను, ఉద్యోగులను దర్శించి, సెలవు తీసికొనెను. విరూపాక్షేశ్వరుడు మొదలుగా విద్యా నగరములో వెలసియున్న ప్రధానదైవతమూర్తులను దర్శించి వచ్చెను.

శ్రీదేవి యిప్పుడు వేవిళ్ళులలో బాధపడుచున్నది. ఆమెతో కలసి శ్రీనాథుడు శ్రీ శంకరానందభారతీస్వాముల దర్శించి, వారి నారాయణ స్మరణపూర్వకమగు ఫలప్రసాదము ప్రత్యక్ష సిద్ధమైన దని నివేదించి, మొక్కి సెలవు తీసికొనెను. అక్కడికి దుగ్గనయు, పోతనయు, రాగా, శ్రీ గురువులు వా రిరువుర శిరస్సులపై తమ అమృతహస్త ముంచి 'మీరు చెప్పికొన్న

మంత్రములు ఎంత ఎక్కువ స్మరించిన, మీకంత ఎక్కువ అతిశయము చేకూరునని ఆశీర్వదించిరి.

శ్రీనాథుడును, మిత్రులును తిరుగు ప్రయాణము చేయు రోజు వచ్చినది. వారికందరికి నా నగరము విడిచి వచ్చుట భారముగా నున్నది. స్వస్థలమునకు వచ్చి, కొలది దినములకే మరల పరస్థలమునకు వెడలుచున్న వారికినలెనే వారి కున్నది. ఈ పుణ్యనగరమే వారి కాత్మీయముగా నున్నది.

వారి ప్రయాణవేళను నారణప్ప వచ్చి దుగ్గనను, పోతనను గాఢాలింగనము చేసికొనెను. వారల మువ్వురకును కన్నుల నీరు గ్రక్కున తిరిగినది.

తిరుగు ప్రయాణములో కవిసార్వభౌముడు పటాటోపము లన్నియు పరిత్యజించెను. శ్రీదేవియు శ్రీనాథుడును నేనా పల్లకులు వదలి తక్కిన స్త్రీ పురుషులతో పాటు బండ్లలో ప్రయాణము సాగించిరి. మధ్య మధ్య శ్రీనాథుడును, మిత్రులును మాక్పుకు అశ్వముల నధిరోహించుచుండిరి. దారిలో సమస్త సౌకర్యములు వినుకొండ దుర్గాధిపతియే కల్పించుచున్నందున ప్రయాణము సుఖముగా నుండెను. అది శ్రావణ మాస మగుటచే వర బాధవలన మందముగా సాగుచున్నది. విద్యానగర సర్వతోముఖవైభవ స్మృతులే ఇష్టకథావినోదములలో వారికి ప్రస్తావనవస్తువు లగుచుండెను.

విశ్రాంతి చిక్కినప్పుడెల్ల అప్పటికి పూర్తిచేసిన క్రీడాభిరామమును వల్లభరాయడు వినిపించి శ్రీనాథుడు సూచించిన సవరణలు తరచుగా గ్రహించు చుండెను. విశేషసంఘటన

లేమియు లేకుండ పది దినములకు వాని కర్మాలు చేసుకొనిరి. అక్కడికి అంచెటపాలో సింగన ప్రధాని పంపిన లేఖ శ్రీనాథునకు వేగరి అందించెను. అందులో నిట్లుండెను :

'శ్రీనాథ కవిసార్వభౌమా, మన మిత్రుడు, మన ప్రభువు, మన బంధువు, పెదకోమటి వేమభూపాలుడు పరలోకగతు డైనాడు. నందికంతి పోతరాజును కృష్ణానదీ స్నానము చేయించుటకు దన్నడకోట * వద్ద విడిసియుండగా, ఆకస్మికముగా రాచకొండసేన యాత్రికతండమువలె కృష్ణదాటివచ్చి మీద బడినది. వీరనారాయణుడు వీరోచితముగా యుద్ధము చేసెను. ప్రయోజనము లేకపోయినది. ప్రభువులు వీరశయన మలంకరించిరి. రాచకొండ సైనికులు నందికంతి పోతరాజును గ్రహించి, తాము వచ్చినంత ఆకస్మికముగా కృష్ణ దాటి పలాయితులైరి. మన సేనలు కూడుకొని వెన్నంటి పోయినను లాభము లేకపోయినది. సూరాంబా మహాదేవి ప్రభువులతో కృష్ణవేణీతీరమున సహగమన మొనర్చినది. వారి యవశేషములు పవిత్ర కృష్ణవేణీ జలములలో లీనమైనవి. వేయి వరహాలు పంపుచున్నాను. ఇక మీ కెట్టి ధనమును పంపలేను. ప్రోలయ వేమారెడ్డి ప్రభుత్వముతోపాటు అవతరించిన నంది కంతి పోతరాజు కఠారి రెడ్డి రాజుల కులదైవము! దానిత్రోక్కొండవీటి రాజ్యలక్ష్మియే వరహస్తగత మైనదని నగర మంతయు విచారసాగరమున మునిగియున్నది-మామిడిసింగన.'

---

* ధరణికోట – అమరావతికి ఒక మైలులో కృష్ణాతీరమున నున్నది.

వీరనారాయణుని వీరశయనవార్తను శ్రీనాథుడు ప్రకటించినంతనే, కొండవీటివారందరు దుఃఖవివశులైరి. శ్రీనాథునకును, పండితబృందమునకును కులభేదమతో నిమిత్తము లేకుండ, తమకు ఆశౌచము వచ్చినదను భావము కలిగినది. వారందరు సంప్రదించుకొని ఆనాడు ప్రభువుల మృతికి మైల పట్టవలెనని నిర్ణయించుకొనిరి. వెంటనే అందరు తుంగభద్రకు పోయి సచేలస్నానము లాచరించి ప్రభువుకు ఉదకప్రదానము లొనర్చి ఆనాటికి నిత్యకర్మకలాపము లుజ్జగించిరి.

పర్వతమల్లు కన్నీరు ఏకధారగా గార్చుచు తుంగభద్రా నదిలో స్నానముచేసి ప్రభువునకు అశ్రుతర్పణము కావించెను.

ఆనాడంతయు కోమటివేమప్రభువు వితరణమును గూర్చియు వైదుష్యమునుగూర్చియు, యుద్ధపరాక్రమమునుగూర్చియు, సద్గుణగణముల గూర్చియు వారు ప్రస్తావించుచు గడపిరి.

అర్ధరాత్రి యందరు నిదురించినపిమ్మట శ్రీనాథభట్టు ఒంటరిగా బయలుదేరి తుంగభద్రాతీరమున కేగి యొక కొండరాతిపై గూర్చుండి పెదకోమటి వేమారెడ్డి గుణములనే శ్లోకములతో ధ్యానించుచుండెను. కొలదిసేపటికే అక్కడ నెవ్వరిగా వచ్చుచున్న మానిసిసడి యయ్యెను.

"ఎవరది"

"శ్రీనాథభట్టా!"

"నృసింహభట్టా, రా!" అనెను శ్రీనాథుడు.

వారిద్దరిని ప్రభువియోగముచే గలిగిన దుఃఖముతోబాటు మరేదియో వ్యథకూడ బాధించుచున్నది. కొంతవడి ఒకరి

మనస్సులోనిమాట, ఒక రవగతము చేసికొన్నట్లు మౌనముగా కూర్చుండి దుఃఖించుచుండిరి.

కొంతవడికి నృసింహభట్టు "శ్రీనాథా, దేవరాయలను అట్లు స్తుతించితివేమి ?-" అని యడిగెను.

"నృసింహా, ఈయాత్రలో నా నోరు తడబడినది ఆ ఒక్క మాటలోనే!- మాట యన్నతర్వాత వెంటనే తెప్పుతోచినది. ఏమి చేయగలను? నేమదయము ఈ దుర్వార్త విన్నదాదిగా నా తడబాటుకు పశ్చాత్తాప మెక్కువైనది- ఏమిచేయుదును?"

'మనమిత్రులుకూడ గమనించినట్లు లేదు. ఐనా అది నీబోటి వాని నోటరావలసిన మాటకాదు.'

'నృసింహా, నిజమే - ఏమి చేయగలను! నాకు తెలియకుండ నాచే నేదో శక్తి పలికించినది. కునరస్తోత్ర మనబోయి నాను. నృపునితో సామాన్యనరులను ఎత్తుపెట్టుట అనుచిత మనిపించినది. కుమారగిరి నృపాలుడు - ఆతని చిన్ననాట నేను స్తోత్రము చేసినది, స్మృతిలో గారినది. 'కునృపస్తోత్ర సముద్భవం బయిన వాగ్దోషంబు శాంతింపగా' అన్నాను. అది అప్రయత్నముగా మిత్రుడు గుణనిధియైన ప్రభువుపై పడ్డది - ఏమి చేయగలను!'

నృసింహభట్టు : మనకు కొండపీటికి పోయినచో మర్యాద దక్కదు. ఈ కొంచెము తడబాటే కొండంత చేయబడును.

వారిద్దరు కొంతసేపట్లే ఏకాంతగోష్ఠి జరిపి చింతావదన ములతో నర్ధరాత్రమునకు విడిదలకు చేరిరి.

మరునాటి యుదయమున వా రందరు మరల తుంగభద్రా నదిలో శుద్ధిస్నానము లొనర్చిరి. శ్రీనాథుడు నిత్యకర్మ కలాపములు పూర్తి కావించుకొని వల్లభరాయని జూడ బోయెను. అంతకుముందే వల్లభరాయనికి వేమప్రభువు నిర్యాణ వార్త తెలిసియుండుటచే, శ్రీనాథునిత్తో ఓదార్పు వచనములు పలికెను. 'వృద్ధుడైనను. వీరనారాయణప్రభువు వీరోచితముగా పోరాడి శరీరత్యాగము చేసినందున వీరస్వర్గము నలంకరించు టచే ధన్యుడు!'

శ్రీనాథుడు: "వారు ధన్యులే. ఈ విజయయాత్రకు వారు సన్నెంత ప్రేమాతిశయముతో పంపిరో నాకే ఎరుక. వారిని దర్శించి ఈ యాత్రావిశేషములు నివేదించు భాగ్యమైనను నాకు ప్రాప్తించియున్నచో, నేనును కొంతనరకైన ధన్యుడ నైనట్లే భావించియుందును. ఇప్పు డీ యాత్ర నాకు నిస్సారముగా తోచుచున్నది."

వ. రాయడు: "కాదు, కాదు, మీ విజయవార్త వారికి చేరెను. తమ విద్యాధికారి శ్రీనాథభట్టు, శ్రీ విద్యాసగర సార్వభౌముల విద్యాధికారి డిండిమభట్టారకుని జయించి, కంచుఢక్క పగులగొట్టించి, అద్వితీయముగా శతావధానము కావించి, ముత్యాలశాలలో వైభవముగా కనకాభిషేకము పొంది, కవిసార్వభౌమపట్టాలంకృతు డయ్యె ననువార్త వారు శ్రవణపర్వముగా నాలకించిన పిమ్మటనే, ఆ యానందము తోడనే దేహత్యాగ మొనర్చిరి. మీ విజయయాత్ర వారి ధన్యతను ద్విగుణీకరింప చేసినది."

శ్రీనాథుడు: "వల్లభరాయా, నిస్సందేహముగా వారు ధన్యులే. వారు నాకు యాత్రారంభమున ప్రసాదించిన కవిసార్వభౌమ బిరుదలాంఛనము నారివాగుకడ విడిచి రావలసి వచ్చినది. దానికంటె ఈ కవిసార్వభౌమపట్టము నా దృష్టిలో ఎక్కువ ప్రియతమమైనది కాదు."

వెంటనే వల్లభరాయ డడ్డునచ్చి విచారముతో, 'కవిసార్వభౌమా, ఆ బిరుదలాంఛనము వినుకొండలో భద్రముగానున్నది, మీ కక్కడ సగౌరవముగా నర్పించెదను" అనెను.

శ్రీనాథుడు: "నేను వినుకొండ రాదలచలేదు. రాచకొండ వెళ్ళ నిశ్చయించితిని."

పిమ్మట వా రిద్దరికి కొంతతడవు మంతనములు జరిగినవి. రాజపరిహాస్యములు బయలుపడుపకుండ వల్లభరాయ డిట్లనెను. "దేశమంతయు నిప్పు డల్లకల్లోలముగా నున్నది. వెనుకటివలె నిర్భయముగా ప్రయాణములు చేయుట కనకాశము లేదు. రాచకొండ ప్రయాణ మిప్పుడు నిరపాయము కాదు. మీరు రాచకొండకు వెళ్ళదలచినచో, ఒకటి రెండు వారము లిక్కడనే యుండవలెను. తుంగభద్ర దాటరాదు సుమా!- నేను విచారణలు చేసి ఒక మార్గము నిర్ణయించి మీకు వార్తాహరునిచే తెలియజేసెదను. ఆ మార్గమే మీరు తు. చ. తప్పకుండా అనుసరించి రాజాచలముచేరుకొనవలెను. నావా రచ్చువరకు మీరు ఇక్కడ తుంగభద్ర దాటి ఆవల అలంపురము కూడ వెళ్ళరాదు. మీరు కోరినట్లు దుగ్గనను అప్పగారితో దగ్గుబల్లికి క్షేమముగా చేర్పింప సర్వయత్నములు

చేసెదను. తక్కినవారిని శ్రీ విద్యానగరరాజ్యపు సరిహద్దులు క్షేమముగా దాటించగలను. మీ కొండవీటి కరణమునకు వినుకొండలో భద్రపరచిన మీ బిరుదులాంఛనము లప్పగిం చెదను.''

లోకజ్ఞుడగు శ్రీనాథభట్టు వల్లభరాయని వాక్కులలో సూక్ష్మరహస్య మేదో ఉన్నదని గ్రహించి, 'వల్లభార్యా, నేను మీ యాజ్ఞలకు కట్టువడి యుండెదను. సెలవు!' అనెను.

రాచకొండ సేనలకును బహమనీరాజ్య సేనలకును, విద్యానగర సేనలకును, కొండవీటి సేనలకును పలుతావులలో సంఘర్షణములు జరుగుచుండెనని స్పష్టమైనది. విశేషములు వల్లభరాయడు తన కెంత యాప్తుడైనను వివరింపడు. తనకు తెలిసియు ప్రయోజనము లేదు. భయపడి విద్యానగరమునకు తిరిగి పోయినచో వేమప్రభువుల యానతి ధిక్కరించినవా డగును. సమస్తమును వల్లభరాయని సామర్థ్యమునకు, సద్బుద్ధికి వదలి ప్రవర్తించుట క్షేమకరమని శ్రీనాథుడు నిశ్చయించెను.

రాచకొండకు తనతో పోతనను, నృసింహభట్టును, సుబ్రహ్మణ్యశ్రేష్ఠిని మాత్రము కొంపోదలచెను. లక్కనసూరి కూడ వారిత్రోవ వత్తునని ప్రయాణమయ్యెను. వంటలవారి నిద్దరిని పరిచారకు నొకనిని శ్రీనాథుడు తమతో నుంచుకొని తక్కినవారి నందరిని వల్లభరాయనితో పంపివేసెను.

శ్రీదేవిభర్తకు నమస్కరించి సెలవు తీసికొనుచుండగా అతడు, ''ప్రద్యుమ్న కుమారుని నామకరణమహోత్సవము

నకు దగ్గుబల్లి వచ్చి మా గృహమహారాజ్ఞి దర్శనము చేసి రొందును' అనుచు చలోక్తిగా నాశీర్వదించి పంపెనేకాని, తన హృదయభార మేమాత్రము ప్రదర్శింపలేదు.

పోతన శ్రీదేవిపాదములు మరల మరల కన్నులార నద్దు కొనుచు, "అక్కా, నిన్ను ఈ జన్మలో మళ్ళీ ఎన్నాళ్ళకు దర్శింతునోకదా!" అని కన్నీరు కార్చెను.

దుగ్గనయు, పోతనయు ప్రేమమూర్ఛ నాలింగన మొనర్చు కొని కన్నీరు విడిచుచు విడిపోయిరి.

శ్రీనాథుడు తనకు సింగనప్రధాని తుదకు పంపిన వేయి సువర్ణములను, తనయొద్ద మిగిలియున్న తక్కిన ద్రవ్యము సమస్తమును కొండపేటి కరణము మాచయ కప్పగించి, "ఈ ద్రవ్యముత్తో మీ యందరి యాత్రలు పూర్తిచేసికొనవలె" నని యాదేశించెను.

13

వారందరు వెళ్ళిన తర్వాత రెండువారములు వల్లభ రాయుని వార్తాహరుని కొరకై కనుపాలులో శ్రీనాథు డాగ నలసివచ్చెను. తన యాత్రకై ద్రవ్యము కూర్చుకొనుటకును, భారము తగ్గించుకొనుటకును, తనకు విద్యానగరములో పెద్దలు కట్టబెట్టిన నూతనవస్త్రము లన్నియు, కనుపాలు శ్లేష్మని పిలిచి అమ్మించెను. తారహారముకూడ నక్కడే యమ్మివేసెను.

వల్లభరాయని వార్తాహరుడు తెచ్చిన యుత్తరములోని సూచనలు ప్రకారం చ. తప్పకుండ శ్రీనాథుడు రాచకొండ ప్రయాణము సాగించెను. ఆసమీపమునసే యున్న అలంపురపు జోగులాంబను దర్శించి వచ్చు భాగ్యము వారి కబ్బలేదు. శ్రీశైలప్రదక్షిణము సంప్రాప్త మవుచున్నదను తృప్తితో, వల్లభరాయలు నిర్దేశించిన విధముగా కృష్ణదాటి, నెల రోజులకు వారు రాచకొండ సమీపించిరి. వారి దారి, సూటిగా లేక వంకరటింకరగా నుండెను. చిత్రమేమో కాని, కొంతవరకు శ్రీవిద్యానగర రాజపురుషులును, ఆపైని దేవర కొండవారును ఆ పిమ్మట రాచకొండవారును వారి క్షేమ సమాచారములు ప్రతి మజిలీయొద్దను శ్రద్ధగా విచారించు చుండిరి. అది వల్లభరాయని ప్రయత్నమే యని స్పష్ట పడినది.

శ్రీనాథ కవిసార్వభౌముడు విద్యానగరమున ముత్యాల శాలలో కనకాభిషేకగౌరవ మంది, తమనగరము దయ చేయుచున్నా రనువార్త ముందుగానే రాజాచలము చేరినది. కవిసార్వభౌముని గౌరవించుటకు మహానగర మంతయు నలంకరించిరి. శ్రీనాథుని చివరి మజిలీ నారాయణపురము. అక్కడికి రాజాచల దుర్గము కనుచూపుమేరలో నున్నది. నారాయణపురములో విడిసినంతనే రాజాచలప్రభువు దూతలు శ్రీనాథుని దర్శించి తమ ప్రభువులయానతిప్రకారము వారిని రాజమర్యాదలతో తమ నగరమునకు గొంపోవుటకు వచ్చితిమనియు, ఎప్పుడు సెలవైన నప్పుడు బయలుదేరుటకు

సిద్ధముగా నుండమునియు నివేదించిరి, శ్రీనాథు డానాడు మూడుజాముల వేళకు బయలుదేరెద నని వారికి తెలిపెను.

శ్రీనాథుడు నారాయణపురము మజిలీలో మహేశ్వరు నర్చించి, నిత్యము హృదయస్థయై యున్న శారదాంబ నిష్టుని భక్తితో స్తోత్ర మొనరించెను.

'దీనారటంకాల తీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథ సందర్భమునకు
పగులగొట్టించి తుద్భట వివాద ప్రౌఢి
గౌడ డిండిమభట్టు కంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తి రాయలయొద్ద
బాదుకొల్పితి సార్వభౌమ బిరుద
మెటుల మెప్పించెదో నన్ను నింకమీద
రావు సింగ మహీపాలు ధీవిశాలు
నిష్ఠుకొలువున నెలకొనియుండు నీవు
సకల సద్గుణ నికుంబ శారదాంబ.

సరిగా మూడుజాములకు శ్రీనాథుడు శుద్ధక్షోత్రియ వేషముతో తన మిత్రులతో ప్రయాణమునకు సిద్ధమై రాజా చలదూతలకు తెలిపెను. అప్పటికే వారు అయిదు వెండి పల్లకులను, మేళతాళములను, నర్తకులను, వివిధ వినోదకులను సిద్ధము చేసిరి. మేళ తాళములు మొరసినవి. శ్రీనాథుని నృసింహభట్టును సుబ్రహ్మణ్యక్షేత్రిని లక్కనసూరిని పోతనను

చెరియొక పల్లకిలో కూర్చుండజేసిరి. వంటవారికిని పరిచారకు నకును మూడు గుఱ్ఱము లిచ్చిరి.

రాజాచలములోని ప్రసిద్ధనర్తకుల మేళము స్వాగత సంగీతము పాడినది, ప్రధాన నర్తకి శ్రీనాథులకు మంగళ హారతి పట్టగా, శ్రీనాథుడు పదునారు సువర్ణములు పళ్ళెర ములో నుంచెను. బోయీలు పల్లకు లెత్తిరి. కొండపీటిలో గాని, విద్యానగరములోగాని, చూడనంతటి మహావైభవముతో మేళతాళాదులతో నారాయణపుర మంతట నూరేగించి ఊరుదాటిరి.

కవిసార్వభౌముడు దయచేయుచున్న వార్త అప్పటికే రాజాచలనగరమున ప్రకటింపబడి యుండుటచే, అక్కడినుండి జనులు తండోపతండములుగా కొందరు అశ్వాదివాహనము లెక్కియు, పల్లకులలో కొందరు, మేనాలలో కొందరు, మర్కి కొందరు కాలినడకను ఎదుకు వచ్చిరి. నారాయణపురము నుండి రాచకొండ వరకుగల మూడుకోసుల మార్గమును ఆ జనములతో నిండిపోయినది. స్వాగత గీతములు పఠించు వారు, జయజయఘోషలు చేయువారు, హారతులు పట్టువారు కవిసార్వభౌముని నమస్కరించువారు ఆయన దర్శనమునకై త్రోపులాడు వారుగా మహోత్సవము తరలినది.

కచేరికొండ అను నామాంతరము కల రాచకొండ దుర్గద్వారములు పుష్పపల్లవాలంకృతములై స్వాగతమొసగు చున్న తోరణములతో తీర్చియున్నవి. మహాప్రభువుల నెదుర్కొనుచున్నట్లు, కవిసార్వభౌముని ద్వారపాలకులు ఎదు

కొఱని నమస్కరించి దుర్గములో ప్రవేశపెట్టిరి, రాజ మార్గము పొడవునను స్వాగతతోరణములతో పందిళ్ళు వేసి యున్నవి. దారిలో జనసమ్మర్దము త్రోపులాడకుండ జేయుటకు మూడువందల మంది భటులు నియుక్తులై యున్నను వారి కాపని సాధ్యపడుట లేదు. రాజమార్గమునకు ఇరువైపుల గల మేడల యన్ని యంతస్తులనుండియు, జనములు, కిట కిటలాడుచు, శ్రీనాథదర్శనార్థము వేచియుండిరి. కొందరు చెట్లెక్కిరి.

పల్లకు లైదును సరాసరి పోయి సింగభూపాలుని సభా మండపద్వారమున నిలిచినవి. రావుసింగమహీపాలుడు రాజ బంధువులతో, సామంతదండనాథప్రధానాదులతో, రాజ పురోహిత పురస్సరముగా శ్రీనాథుని కెదురునచ్చి గౌరవించి, సేవకులు అడుగులకు మడుగు లొత్తుచుండ, సభామండపము నకు కొనిపోయి ఉన్నతాసనమున కూర్చుండజేసి, అర్ఘ్య పాద్యాదులతో పూజించెను. ఆనాడు రావుసింగమహీపాలుడు ప్రదర్శించిన భక్తి ఏప్రభువు ప్రదర్శించుటయు చూడలేదని యద్భుతావిష్టులై జనమందరు చెప్పుకొనిరి. ఆ స్వాగతసభలో ప్రభువు, రాజబంధువులు, ఉద్యోగులు, పెద్దలు, నాగరకులు, శ్రేణీపతులు, శ్రేష్ఠులు బహువిధముల కవిసార్వభౌముని యెడల తమకు గల ప్రేమయు, భక్తియు ప్రకటించిరి.

శ్రీనాథబృందము విడిది విశ్వేశ్వరకవి భవనమున నేర్పాటు చేసిరి. వా రక్కడ నున్నన్నినాళ్ళు వారి కేప్పు డేమి యవసర

మగుకో తెలిసికొని తీర్చుటకు, ఉన్నత రాజోద్యోగులు నియుక్తులై, ఆ భవనము మిగింట పడికాపులు కాయుచుండిరి.

ఆ రాత్రి భోజనానంతరమున తాంబూలసేవకు ముందు, శ్రీనాథుడు లేచి నడుమునకు ఉత్తరీయము బిగించి, వృద్ధులును, పూజ్యులును అగు శ్రీ విశ్వేశ్వరుల పాదములకు అభినందన మాచరించి, 'ఇదియంతయు మీ యమోఘశీర్వచన ప్రభావమే' అనెను. విశ్వేశ్వరుడు ప్రేమతో లేసనెత్తి 'నాయనా, ఆ డిండిమునిని జయించి నా హృదయశల్యము నుద్ధరించినావోయి! ఇన్ని సంవత్సరములకీనాడు నేను సుఖనిద్ర పోగలను!' అనెను.

'చివరి క్షణములో నన్ను ఆదుకొన్నది మీ రనుగ్రహించిన చమత్కారచంద్రికయే. దానికి నన్నుద్బోధించినవాడు ఈ కృష్ణ పోతరాజు!' అనుచు శ్రీనాథుడు పోతనను చూపి ప్రేమతో శిరస్సు మూర్కొనెను. నృసింహభట్టు సభావిశేషములన్నగారికి నివేదించెను.

శ్రీనాథు డేమి పనిమీద దయచేసెనో, ఏ మడుగునో, ఎట్లు గౌరవింపవలయునో, తెలియక రావుసింగమహీపాలుడు తహతహ లాడుచుండెను. సర్వజ్ఞ బిరుదాంచితులమైన మనము కవిసార్వభౌములకెట్టి లోపము చేయరాదని వారి ప్రతిజ్ఞ.

ప్రసన్న గోపాలస్వామి యాలయప్రాంగణమున రంగశ్మ్మ నివాసు డను సూత్రధారుని యధ్వర్యమున నడుచుచున్న నాట్యమండలివారు శ్రీ సర్వజ్ఞవిరచితమగు రత్నపాంచాలిక యను నామాంతరముగల 'కునలయావలి' యను నాలు గంక

ముల నాటికను ప్రభుసమక్షమున శ్రీనాథబృందము నెమట, రోజు కొకయంకము చొప్పున నసుసగా నాలుగురోజులు ఉదయవేళల ప్రదర్శించిరి.

ఒకనాడు ఆస్థానగాయకుని సంగీతవిద్యావినోదము, ఒక నాడు ఆస్థానన ర్తకి నృత్యవినోదము, ఒకనాడు విద్వాంసుల విద్యావినోదములు, ఒకనాడు కవీశ్వరుల కవితాగోష్ఠియు జరిగినవి. అట్లే ఇంద్రజాలము, మల్లవిద్య, ఖడ్గవిద్య మొదలైన వెన్నో ప్రదర్శించిరి. సరిగా నవి శరన్నవరాత్రోత్సవదినము లగుటచే ఉత్సవశోభ ద్విగుణీకృత మయ్యెను.

రాచకొండప్రభువు ఒకవంక నిట్లు వినోదములతో శ్రీనాథుని హర్షింపజేయుచుండ, నాగరకు లింకొకవంక తమలో తాము పోటీలుపడుచు, నాతని పిలుచుకొనిపోయి సాయంవేళలను, రాత్రులందును రామనాటకములు, శ్రీకృష్ణలీలలు, యక్ష గానములు, తోలుబొమ్మలాటలు, పసుగుపందెములు, ఈత పందెములు, పొట్టేళ్ళ పోరులు, కోడిపుంజుల పోరులు కోలాట ములు, విదూషకవినోదములు, రకరకములుగా ప్రదర్శించు చుండిరి.

ఇంద రిన్నివిధములు గౌరవించి పూజించుచున్నను, శ్రీనాథున కేమాత్రము ఆనందము కలుగుట లేదు. మర్యాదకై చిరునవ్వు తెచ్చుకొనుటకే కష్టసాధ్యముగా నున్నది. పెద గోమటి వేమప్రభువుల వియోగక్లేశము ఆతని వేధించుచున్నది.

శ్రీనాథుడు వచ్చిన పనియేమో తెలిసికొనవలెనని రావు సింగమహీపాలుడు ఎంత ప్రయత్నించినను సాధ్యపడకుండు

టచే, తుదకు ప్రత్యక్షముగా నడిగి తెలిసికొన నిశ్చయించి, విద్వత్సభ చేసి శ్రీనాథుని రావించి పూజించెను. శ్రీనాథునకు చూచాయగా మహీపాలుని యింగితము స్ఫురించినది. ఆత డీ పద్యము చెప్పెను:

"సర్వజ్ఞ నామధేయము
శర్వాణికే రావుసింగ జనపాలున కే
యుర్వీం జెల్లును దక్కొఱు
సర్వజ్ఞుం డనుట కుక్క సామజ మనుటే!"

కొంతసేపు ఇష్టకథాగోష్ఠి జరిగినది. అంతట మహీపాలుని వందియగు భట్రాజు ప్రభువుల యనుమతిగొని, కవిసార్వభౌముని సమస్యాపూరణము చేయుడని యర్థించి చివరిపాద మిాయగా నాత డీవిధముగా పూరించెను.

'తక్కక రావుసింగవసుధావరు డక్కుల కర్థి మిచ్చుచో
దిక్కులలేని కర్ణుని దధీచిని ఖేచరు వేల్పు ప్రాకు బెం
పెక్కిన కామధేనువు శిబీంద్రుని నెన్నెదు భట్ట దిట్టవై
కుక్కవొ నక్కనో ఫణివొ క్రోత్తివొ పిల్లివొ బూతపిల్లివో!'

ఆనా డంతకు పూర్వము వంది తన ప్రభుస్తుతిలో కర్ణాదుల దానమును ప్రశంసించియుండుటచే, శ్రీనాథుని పూరణము సభ్యుల కెల్లరకు విశేషామోదకారి యయ్యెను.

సరిగా నిప్పుడు రావుసింగమహీపాలున కవకాశము చిక్కినది. ఆత డిట్లనెను: "కవిసార్వభౌమా, మీరు దక్షిణాధీశులగు దేవరాయలవారి యాస్థానములోనే ఏమియు

నర్థింపక, సార్వభౌములవలెనే అభిషేకము పొంది వచ్చితిరని వినవచ్చినది. అట్టి మీరు మా నితరణమును నేడు ఉటంకించుచున్నారు. మీబోటి కవిసార్వభౌములు అర్థించునది శాసనముగా గ్రహించి తీర్చినప్పుడేగదా మాపేరు నిలుచునది! మీ రే క్షోరికత్తో ఇక్కడికి దయచేసితిరో సెలవీయవేడెదము.

శ్రీనాథుడు కన్నులలో నిండుచున్న యశ్రుపూరమును నిరోధించుటకు కన్ను లరమోడ్చి, ఎలుగువాచుచున్న కంఠమును ప్రయత్నపూర్వకముగా సరిచేసికొనుచు ఇట్లు పలికెను. 'సర్వజ్ఞ సింగభూపాలశేఖరా, రసజ్ఞశిఖామణులగు మీకు తెలియని దేమున్నది! మేము వీరనారాయణుల వితరణముచే వైభవముగా శ్రీవిద్యానగరయాత్ర చేసి రాగలిగితిమి. వారుండగా మా కే కొదవయు లేదు. వారి ఋణము తీర్చుకొనుటకు వారిని కన్నులార దర్శించు భాగ్యమైన మాకు ప్రాప్తింపలేదు. వీరోచితముగా వీరశయన మలంకరించి వీరస్వర్గము చూరగొన్నవారు ధన్యులే. వారి నెనరము పునర్జీవితుల గావింపజాలము కదా! వారి కుల దేవతయగు నందికంత పోతరాజు కథారిని మగల కొండవీటికి కొంపోయి ప్రతిష్ఠింపగలిగినచో, మా ఋణము కొంతవర కైన తీరగలదేమో యని యాశించుచున్నాము. దీనివలన కొండవీటికిని రాచకొండకును వైరము కొంతకాలమునకైన శాంతింపగలదేమో యని కూడ ఆశగా నున్నది.

శ్రీనాథుడు ప్రత్యక్షముగా నర్థింపలేదు. ఆయన దర్పము, సింగమహీపాలుని కాయనయెడ గల గౌరవ మినుమడింప

జేసినది. "కవిసార్వభౌమా, మీరు సర్వవిధముల మా కారాధ్యనీయులు. ఇట్టి విషయమున మీరు మమ్ము ఆజ్ఞాపింప వచ్చును. మాకు వేనుభూపాలురతో శత్రుత్వ మున్నమాట సత్యమే. అది తరతరములుగా వచ్చినది. అయినను వారి కులదేవతను మే మేమాత్రము అగౌరవింప లేదు. మా రాజ్యములో వారి కులమువారికే దాని నప్పగించి యథావిధి పూజలు చేయించుచున్నాము. మీ రెప్పుడు తీసికొని పోదలచినను, దానిని సగౌరవముగా మీ కర్పించెదము."

శ్రీనాథు డామాటలు విని నిశ్వసించి ఆశీర్వదించి తన రాక సఫలమైన దని తెలిపెను.

ఆ తరువాత మూడు దినములకే శ్రీనాథుడు కొండవీటికి బయలుదేర నిశ్చయించెను. బయలుదేరుటకు ముందు నిశ్వేశ్వర సన్నిధానమున పోతనను అతని యన్న తిప్పనార్యుని కప్పజెప్పి యిట్లనెను.

'తిప్పనార్యా, వీడే నాకు సందిగ్ధసమయములలో జయమూర్గము నిర్దేశించిన బాలకృష్ణుడు! వీనికి గొప్ప కవితాయోగ మున్నది. వీని ప్రతిభ యనన్యసామాన్య మైనది. శ్రీ విశ్వేశ్వరుల కటాక్షయోగముచే వ్యుత్పత్తి నతిశయింప జేసి కొనవలసి యున్నది.

అంతట పోతనను దగ్గరకు తీసికొని యిట్లనెను. 'నాయనా, నీవీది ప్రేమాతిశయముచేత మాబోంట్లము నీ యెదుట నెనో్న భూషణవాక్యములు పలికితిమి. గర్వించి తలతిరిగి చెడిపోకు, తండ్రీ! చెప్పిన నాలుగైదు మంచి పద్యములు

తడవుచు నానందించుచున్నచో, వానిత్రోనే కవిత పరిసమాప్తి నొందునురా! సుశ్రూగ్రంథము చెప్పనలచినవారికి, 'చెప్పినదానిని చదువుకొనుచు ఆనందించు త్రీరిక యుండను-'బాలాదపి సుభాషితమ్' అని నేనుకూడ ఇకమునను భగవద్విషయముల గూర్చికాని మహాకావ్యములు చెప్పరాదని నిశ్చయించితిని. శ్రీగురువులు ప్రసాదించిన యిష్టదేవతను హృదయములో పదిలముచేసికొని వృద్ధిలోనికిరా! దీర్ఘాయుష్యమస్తు!"

అంతకు ముందే తనపాదములు రెండును కౌగిలించుకొని యశ్రువులతో నభిషేకించుచున్న పోతనను శ్రీనాథుడు బాహువులతో పొదివి, తన అమృతహస్తముతో శిరస్సును బాహువులను, పృష్ఠమును, హృదయమును స్పృశించుచు ఆశీర్వదించెను.

ఈమధ్య రాజ్యముల స్థితిగతులు సరిహద్దులు, మారిపోయినవి. వల్లభరాయని సేనలు కొండపీటి రాజ్యములోని పల్నాటిసీమ నంతటిని ఆక్రమించినవి. దక్షిణమున కందుకూరి నుండి విద్యానగరసేనలు పంట మైలాసురెడ్డి యాధిపత్యమున కొండవీటిరాజ్యములోనికి చొచ్చుకొనిపోవుచున్నవి. కొండపల్లిసీమ రాజమహేంద్రవరరాజ్యములో లీనమైనది. రాచకొండ, దేవరకొండ ప్రభువులు శ్రీవిద్యానగర ప్రభువునకు సామంతతుల్యులగు మిత్రులైరి. రాజమహేంద్రవర పాలకులు నక్కలయైరి. కొండవీటి రాజ్యము క్షీణించి బహమనీసుల్తానుతోనే మైత్రికి యత్నించుచున్నది. ఈసూక్ష్మములన్నియు శ్రీనాథునకు స్పష్టముగా తెలియవు.

రాచకొండ ప్రభువులు శ్రీనాథబృందమునకు తమభటులను కాపుగా నిచ్చి నందికంత పోతరాజుతో సురక్షితముగా దన్నడకోటకు ఎదురుగా ఆనలనున్న కృష్ణానది రేవుకు చేర్పించిరి. అక్కడ శ్రీనాథుని సపరివారముగను నందికంత పోతరాజుతోడను తరణి నెక్కించి, ఆనలియొడ్డుకు పోవు నేర్పాట్లు చేసి, రాచకొండ పరివారము శ్రీనాథునికడ సెలవు తీసికొనెను.

౨౪

రాచవేమారెడ్డి పెద్దసేనతో దన్నడకోటలో విడిసి యుండెను. రేవులోనున్న యాతని రక్షకభటులు శత్రుపక్ష మునుండి వచ్చుచున్న వారి పడవను పట్టుకొను ప్రయత్నములో నుండిరి. పడవ ప్రవాహమధ్యమునకు వచ్చినప్పటికి, వాము కులదైవతమగు నందికంత పోతరాజును, శ్రీనాథాది పండితులను గుర్తించి ఎత్తిన యాయుధములు దింపిరి. పడవ రేవులో నాగినంతనే, భటులు వినీతులై శ్రీనాథాదులకు నమస్కరించి, రాచవేమారెడ్డి ప్రభువు దన్నకోటలో నున్నాడని నివేదించిరి.

కతారిని కొనివచ్చుచున్నవారిని ప్రభువులకు కతారి నర్పింపుడని నియోగించి, శ్రీనాథుడు వీరనారాయణులను దహనము కావించిన ప్రదేశ మెక్కడ నున్నదో అడిగి తెలిసి కొని, సరాసరి అక్కడి కరిగెను. ఆ తావున సూరాంబకు

పేరంటాలుశిల ప్రతిష్ఠితమైయుండుట కనబడినది. శ్రీనాథుడును, మిత్రులును, అక్కడ పరలోకగతులకు అశ్రుతర్పణము కావించి కృష్ణాస్నానము చేసి సత్రమునకు వెళ్ళిరి. వారక్కడ మూడు దినములు విడిది చేసిరి. రాచవేమారెడ్డి యొద్దనుండి వారికి పిలుపురాలేదు. విచారింపగా కఠారినీ శత్రువుల నర్థించి తెచ్చినందులకు, ప్రభువు సంతోషింపలేదని తెలియ వచ్చినది. మద్యపాన పారవశ్యమున ఎక్కువ కాలము గడచు చున్నదనియు శ్రుతమైనది. నూతనప్రభువు పిలుపనంపనిది శ్రీనాథుడాయనయొద్దకు పోవ నిచ్చగింపలేదు.

మూడుదినములు నిరీక్షించి శ్రీనాథుడు విచారముతో సపరివారుడై అటనుండి ప్రయాణమై మూడవనాటికి కొండపీడు చేరుకొనెను. శ్రీశైలప్రదక్షిణము పూరియైనది.

కొండపీటికి వెనుకటికళ లేదు. వీరనారాయణుడు లేని యానగరము శూన్యగృహము వలెనే శ్రీనాథునకు పొడకట్టెను. ముందాతడు సింగన ప్రధానిని దర్శించి యాత్రావిశేషములు తెలిపి దన్నడకోట వృత్తాంతమును చెవిని వేసెను. సింగన యిట్లనెను:

'శ్రీనాథభట్టా, నీవు బయలుదేరునపుడు ఒక లోకములో నుంటివి. ఇప్పుడు మన మున్న దింకొక లోకము! కొండపీటి రాజ్య మింకను క్షీణించినది. అనుభవము లేని నూతనప్రభువు యుద్ధవ్యయములకై క్రొత్తక్రొత్త పన్నులు విధించుచున్నాడు. పుట్టిపన్ను కూడా విధించినాడు! నేను వద్దని వారింపగా చెవినిపెట్టక, మద్యపు మైకముతో నోటికి వచ్చినట్లు పలికెను.

వృద్ధుడై మతిభ్రమణము కలిగిన పెదకోమటి ప్రభువును, మన మందరము కుట్రపన్ని విద్యావిజయమను వంకతో భ్రమపెట్టి వారిచే రాజకోశము నంతటిని శూన్యముచేయించి యుండుట వలననే, ఈ పన్నులు వేయవలసి వచ్చినదని చెప్పెను. మరియొక నెలరోజులపాటు మాత్రము చూచి, నే నీ యుద్యోగమునుండి విరమింపదలచి యున్నాను.'

అంతట శ్రీనాథుడు దేవరాయలనాకు తనతో నేకాంతమున కొండవీటి రాజ్యమును గూర్చి పంపిన సందేశము తెలిపెను. ప్రధాని యాలకించి, 'పీరనారాయణు లున్నచో ఇందుకు సన్మతించి యుందురు. నీవు విద్యావిజయముతోపాటు రాజ్య విజయముకూడ సాధించితివని సంతసించి యుందురు. క్రొత్త ప్రభువుకు తెలిపి చూచెదను. ఆ పండితమాని చెపిని బెట్టునని తోపదు. మీ బావమరది అప్పగారితో దగ్గుబల్లికి చుట్టు ప్రయాణముచేసి, క్షేమముగా చేరుకొన్నవార్త నేడే వచ్చినది. నీవు ముందు పంపిన పరివారముకూడ యిప్పటికి పదునైదు దినముల క్రిందట ఎట్లో ప్రాణములతో ఇక్కడికి చేరుకొన్నది. శ్రీనాథా, నీవు పోయి వెంటనే వామనభట్ట బాణుని చూచిరావలె. అయనకు మతిభ్రమణము కలుగునేమో యని నాకు భయమగుచున్నది. జాగ్రత్తసుమా! అనెను.

వెంటనే శ్రీనాథుడు బయలుదేరి వామనుని చూడ బోయెను. శ్రీనాథుని రాక తెలియగనే, భట్టబాణుడు పరు గెత్తుకొని గుమ్మములోనికి వచ్చి, శ్రీనాథుని గట్టిగా కౌగిలించుకొనెను. అది గాఢమైన కౌగిలి. సామాన్యమైనచో

ధానికి నలిగి ప్రాణములు సదలి యుండును, శ్రీనాథుడు ఊపిరి బిగబట్టి ఎట్లో ఓర్చుకొనెను.

కొంతవడి కా కొగిలి వదలి, యాతడు శ్రీనాథుని రెండు పాదములు చుట్టవేసికొని, మరల మరల ముద్దు పెట్టుకొనెను.

ఆపై నాతడు లేచి, శ్రీనాథుని శిరస్సును, ఫాలమును, చెక్కిళ్ళను, కంఠమును మరి మరి ముద్దులతో ముంచివేసెను.

శ్రీనాథు డంతసేపును శాంతముగా నోర్చుకొని, నడిలి పోయి యున్న భట్టబాణుని శరీరమును ప్రేమత్రో నిమురుచు నెమ్మదిగా చేతులు పట్టుకొని లోనికి తీసికొనిపోయెను.

'అన్నా, డిండిమలు చేసిన పరాభవను నిన్నెంత వ్యథ పెట్టినదో, ఇప్పుడు నాకు ప్రత్యక్షమైనది. నీబోటి సహృదయ శ్లేఖుని, విశ్వేశ్వరులనంటి మహాతపస్విని, వృథ చేసిన పాపము ఫలించుటవలననే, ఆతడు నాకంత సులభముగా చిక్కినాడు. నా విజయకారణము మీ యిద్దరి బలమే కాని, అందులో నా పురుషకారము ఏమాత్రము లేదు నీవిక విశ్రాంతుడవై యుండవచ్చును.'

శ్రీనాథుని జూడగనే కలిగిన ప్రథమావేశము శాంతించిన పిమ్మట, చిత్రముగా వామనభట్టబాణుడు ఒక్కసారిగా మంత్ర బలముచే రుగ్మతపోయి స్వస్థుడైన రోగివలెనే ప్రకృతికి నచ్చెను.

వీరనారాయణుడు పూర్వను శ్రీనాథునికి నివాసార్థమిచ్చిన మందిరము వ్యర్థముగా నున్నదని ప్రస్తుతప్రభువు భావించు

చున్నాడని వారించి, సింగన ప్రధాని శ్రీనాథుని తనయింటనే అతిథిగా నుండ నర్థించెను.

ఆపిన్నాట వారమునోజులకు రాచవేమారెడ్డి కొండవీటికి వచ్చి నందికంత పోతరాజును కులదేవతాస్థానమున పునఃప్రవిష్ఠించెను.

దేవరాయల సందేశము సింగన ప్రధాని నివేదింపగా రాచవేమారెడ్డి ముఖము చిట్లించి, 'నేను ప్రాణములైన త్యజింతుము కాని పరరాజులకు దాస్యము చేయము' అని ఖీరముగా ప్రత్యుత్తర మిచ్చెను.

కొండపేటిలోగూడ శ్రీనాథునకు నూతనప్రభువుకడనుండి రమ్మని పిలుపు రాలేదు. శ్రీనాథుడు చూడ బోలేదు. సింగన యాతనికి చూడబొమ్మని సలసూ ఈయలేదు.

నృసింహభట్టుకు గాని, లక్కనసూరికి గాని, సుబ్రహ్మణ్య శ్రౌతికినిగాని, అంతకుముందే కొండవీడు చేరుకొన్న తాతం భట్టాదులకు గాని రమ్మని యాహ్వానములు రాలేదు. వారును ప్రభుదర్శనమునకు తనంతట తాము పోలేదు. ఎవరి దారి వారు చూచుకొన నాలోచనలు చేయుచుండిరి. రాచవేమన మద్యపానము నానాటికి అతిశయించు చుండెను.

వామనభట్టబాణుడు మరల నెట్టి మహాప్రభుణమును ప్రదర్శింప లేదు. ఆతడు సన్యాసాశ్రమము స్వీకరించి, తుంగభద్రా తీరమున జీవితశేషము వెళ్ళబుచ్చ నూహతో, శ్రీ విద్యా

నగరమునకు జగద్గురు శ్రీ శ్రీ సచ్చిదానంద భారతీస్వాముల పాద సన్నిధికి జేరికొనఁ బయలుదేరెను.

సింగన ప్రధాని నూతనప్రభువుకు తన యధికారభార మప్పగించి సెలవు తీసికొని, తన నివాస గ్రామమగు మామిడి పల్లికి పోవ గుంటూరు మండలములోని తుంగభద్రా* తీరమునకు బయలు దేరెను.

శ్రీనాథుడును ఒంటరిగా కొండపేటి నుండి బయలుదేరెను. ఎక్కడికి? క్రోశము దాటినతర్వాత గాని ఎక్కడి కను నాలోచన పోలేదు. దగ్గుబల్లి కిప్పుడే పోవ నిచ్ఛ కలుగలేదు. ఆకస్మికముగా నాతనికి అనచిదేనయ తిప్పన ప్రేమపూర్వక ముగా చేసిన యాహ్వానము స్మృతికివచ్చినది. కాంచీ పట్టణమున కాతఁడు ప్రయాణమయ్యెను. మరల శ్రీదేవిగాని, సుఖగాని కొండపీటిలో నడుగు పెట్టలేదు.

మూడు మజిలీలు దాటు నప్పటికే, శ్రీ విద్యా ధనము గ్రహించి, మోటుగా తమ ని. అదృష్టనశమున నాతడు పంట ముందలించి, శ్రీనాథుని గౌర పుత్నములలో నున్నందున

చేకుటకు సర్వసన్నాహములు చేయించెను. దారి పొడుగునను శ్రీనాథుని నోక దుగ్గానియు ఖర్చుచేయనీయక తనతోడనే నుండియే దినవెచ్చము తీర్చినట్లు ఆతడు కట్టడి చేసెను. భటులు తీసికొన్న శ్రీనాథుని ద్రవ్యము తిరిగి ద్విగుణముగా నాత డర్పించెను.

కాంచీనగరము అనాదిగా సర్వవిద్యలకును సర్వదేవతలకును నిలయమై దక్షిణకాశి యని ప్రసిద్ధి గాంచినది. ఆ నగరము కామాక్షీశక్తికి అవతార క్షేత్రము.

కతిపయదినములు సుఖముగా ప్రయాణము చేసి, శ్రీనాథ కవిసార్వభౌముడు కాంచీపట్టణము చేరికొనెను.

కథ కంచికి పోయినది.....

306

నోరి నరసింహశాస్త్రి

జననము : 6-2-1900

తల్లి : మహాలక్ష్మి తండ్రి : హనుమచ్ఛాస్త్రి

దీక్షాగురువులు :

జగద్గురు శ్రీ కల్యాణానంద భారతీస్వామివారులు.

1919 : బి. ఏ.. 1925 : బి. యల్.

1947 : కవిసమ్రాడ్బిరుదము.

సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలు అభ్యసించెను.

ప్రచురణములు

21 : గీతమాలిక ... [19 ఏండ్ల లోపున వ్రాసిన కావ్యముల సంపుటి]

24 · సోమనాథ విజయము ... [వచన నాటిక]

33 : భాగవతావతరణము ... [పద్య నాటిక]

)9 : నారాయణభట్టు ... [నన్నయనాటి నవల]

తెలుగు భాషా సమితి బహుమానము నందినది.

50 : శ్రీ దేవీ భాగవతము ... [1, 2, 3 స్కంధములు]

)0 : వేన పాత్ర ... [నాలుగు నాటికల సంపుటి]

)1 : ఘా దేవి ... [తిక్కనాటి నవల]

సాహిత్య అకాడెమివారు భారతీయ భాషలలోనికి అనువదించుచున్నారు.

)4 : కర్పూర ద్వీప యాత్ర ... [పిల్లల నవల]

)5 : వాఘిరా ... [అజంతా నవల]

)8 : మల్లారెడ్డి ... [ఎఱ్ఱనాటి నవల]

)0 : సప్త సత్రము ... [నాటిక]

)0 : శోభా భిక్షువు ... [బుద్ధునినాటి నాటిక]

)0 : శబ్దశేష ... [నాటిక]

)2 : కవి సార్వభౌముడు ... [శ్రీనాథుని నవల]

వెలువడనున్నది : సహజ పాండిత్య [పోతన నవల]

నోరి వారు, రేపల్లె. (గుంటూరు జిల్లా)

+
o

308

Check List

Book Number	AN02A144	Date	04/06/22
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, B, 305, 307		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	3/3